



క్రొత్తయుగానికి
సరిక్రొత్త రేడియో

Cossor

కొస్సార్

జగద్విఖ్యాత రాడర్
యంత్ర నిర్మాతలైన
ఎ. సి. కొస్సార్ లిమిటెడ్
వారిచే
తయారుచేయబడి సరిక్రొత్త
పరిశోధనలను కలిగియున్న
అద్భుతమైన రేడియోలు

5 వాల్వులు
ఎ. సి.
మోడల్సు
మావద్ద
దొరకును



7 వాల్వులు ఎ సి మోడలు

గుంటూరు, కృష్ణా,
తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, విశాఖజిల్లాలకు

సోల్ డిస్ట్రిబ్యూటర్లు :

బెజవాడ ఎలక్ట్రిక్ కార్పొరేషన్

గవర్నరుపేట : బెజవాడ

ముఖ్యపట్టణములలో అనుభవముగల డీలర్లు ఏజన్సీకై వ్రాయుడు

అభ్యుదయ

సచిత్ర సాహిత్య మాసపత్రిక

★

సంపాదకులు :

చదలవాడ పిచ్చయ్య

ఆంధ్ర సాహిత్య పాఠశాలా సంచిక

సం. ౧, సంచిక ౧. అక్టో. 46.

వెల : రూపాయి

విషయసూచి

ముఖచిత్రం : శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మగారు

అభ్యుదయం

శర్మగారి జీవితం విజ్ఞానానికి వెలుగుబాట!

"ఈనాడు నా ఆశలు ఫలిస్తున్నాయి. నా మనస్సు నిండుగావుంది.

"ఈ విద్యాలయం అభివృద్ధి చెందుతుంది. రెండు మూడేళ్ళలోనే ప్రజా విశ్వకళా పరిషత్తుగా పెంపొంది తీరుతుంది.

"ఇది ఆంధ్రదేశ చరిత్రలో అపూర్వమైనసంస్థ ...మనకు సంస్థయే ప్రధానం. మనం ముందుకు నడుద్దాం!"

అని ఆంధ్ర సాహిత్యపారశాలా ప్రధానాధ్యాపకులు శ్రీ మల్లంపల్లి సోమ శేఖరశర్మగారన్నారంటే అది అకస్మాత్తుగా అన్నమాటకాదు. శ్రీ శర్మగారు తమ జీవితాన్ని ప్రజా విజ్ఞానాభివృద్ధికోసం అంకితంచేశారు. చిన్ననాటినుంచీ కటికదారి ద్ర్యంతో బాధపడుతూ కూడా, ఆంధ్ర జాతీయ విజ్ఞానాన్ని పెంపొందించడంకోసం తమ సర్వశక్తుల్నీ వినియోగించారు. జీవితంలోని ఒడుదుడుకులను పాటించే స్వభావంకాదు శర్మగారిది; జీవితాన్ని ఎప్పటికప్పుడు సరిదిద్దుకొని ముందడుగు వేయడమే శర్మగారి స్వభావం. ఆయనది ఎప్పుడూ ముందుచూపే. ఆయన జీవితమే నేటి యువరచయితలకు ఆదర్శం; ఆయన సందేశమే విజ్ఞానజ్యోతి!

శ్రీ శర్మగారు 1891 లో మినుమించిలిపాడు అగ్రహారంలో ఒకసామాన్య కుటుంబంలో జన్మించారు. ఆంగ్లవిద్య నభ్యసించాలనే కోరికవుండేది. కాని డబ్బు లేదు. కనుక మొదట ఉచితంగా సంస్కృత విద్యనే అభ్యసించారు.

అయినా శర్మగారు తమ కోరికను చంపుకోలేదు తమ మేనమామ శ్రీ అయ్యగారి ఉమామహేశ్వరరావుగారి వద్దవుంటూ, ఆంగ్లవిద్యాభ్యాసం మొదలు పెట్టారు. మేనమామగారు ప్రభుత్వోద్యోగి - మాటిమాటికీ ట్రాన్స్ఫర్లు - ఒక ఊరు కాదు, ఒక పేటకాదు ... ఇలా మేనమామగారితోపాటు ఊరూరూ తిరుగుతూ, తమ విద్యాభ్యాసానికి కలుగుతున్న విఘాతాలనన్నిటినీ ఎదుర్కొన్నారు శర్మగారు. ఆయన పట్టుదలకు పట్టు విడుపులులేవు. తమ 16 వ సంవత్సరానికల్లా స్కూల్ఫైనల్దాకా నెట్టుకొచ్చారు.

అవి 'వందేమాతరం' ఉద్యమ ప్రభావం దేశాన్ని ముంచెత్తిన రోజులు. బిపిన్చంద్రపాల్ చిలకమర్తి లక్ష్మీనరసింహంగార్ల దేశభక్తి సందేశాలు ప్రతి చెవిలోను గింగురుమన్న రోజులు. భారతజాతి ఒక్కసారిగా జాగృతిచెందిన రోజులు,....

ఈ జాతీయోద్యమ ప్రభావం శర్మగారిలో నూతన శక్తులను ప్రకోపింప జేసింది. ఆంధ్రప్రజల విజ్ఞానాన్ని పెంపొందించడం ద్వారానే, దాస్య శృంఖలాలను పటాపంచలు చేయగలమనీ; అన్ని విషయాలూ ప్రజలకు తేటతెల్లంగా చెప్పి ప్రజల్లో చైతన్యం కలిగించాలనీ శర్మగారు అనుకొనేవారు.

ఎన్నో ఊహలు వుండేవి. కాని దారిద్ర్యం వెన్నాడుతూనే ఉండేది. స్వతంత్ర జీవనోపాధి ఏదైనా చూసుకోవలసిన అవసరం వచ్చింది. ఉద్యోగం కోసం శర్మగారు దిక్కులు పట్టుకు దేవులాడారు. తిరిగి సన్నాళ్ళుకూడా నిలవని చిన్నచిన్న ఉద్యోగాల్లోచేరి పనిచేశారు. కాని ఎప్పటికప్పుడే నిరుద్యోగం, ఎప్పటి కప్పుడే దారిద్ర్యం... ఏది ఏమైనాసరే, శర్మగారు గుండెచెదరని మనిషి! ఏమీ నిరుత్సాహపడలేదు. నిరుద్యోగ బాధనూ, దారిద్ర్యబాధనూ ఎదుర్కొన్నారు; తమ ఆశయాన్ని మననం చేసుకుంటూనే వున్నారు. దారిద్ర్యపాశాలు ఆయనను ఎక్కడి కక్కడ వెనక్కు గుంజుతూనే వున్నాయి; కాని ఆయన ముందుకు ఉంకిస్తూనే వున్నారు.

పెద్దాపురం జమీందారుగారి పనిమీద 1911లో శ్రీ శర్మగారు మద్రాసువెళ్ళి, అక్కడ 'ఆంధ్రుల చరిత్ర' వ్రాస్తున్న 'చరిత్ర చతురాననులు' శ్రీ చిలుకూరి వీర భద్రరావుగారితో పరిచయం చేసుకున్నారు. ఇక తమ జీవితాన్ని చారిత్రక పరిశోధ నకు అంకితం చేయడానికి నిశ్చయించుకున్నారు. వీరభద్రరావుగారివద్దనే వుండి, 'ఆంధ్రుల చరిత్ర'కు సంబంధించిన పరిశోధనల్లో కృషిచేయ బూనుకున్నారు. 'కన్నమరా'లైబ్రరీలోని అముద్రిత గ్రంధాలను ఎత్తివ్రాయడమే అప్పుడు శర్మగారి నిత్యకృత్యం. ఉదయం లగాయతు రాత్రిదాకా, ఆ పుస్తకాలు చుట్టూ వేసుకొని, ఏసుగూ విరామం లేని ఒకటే పని దీనికిగాను ఆయనకు నెలకు రు 15 లు జీతం.

కాని, వీరభద్రరావుగారు కూడా ధనవంతులుకారు. తాము దారిద్ర్యంతో క్రుంగి కృశించిపోతున్నప్పటికీ, ఆంధ్రజాతి చరిత్రను త్రవ్వి తలకెత్తుదామనే మహా దాశయంతో తమ సర్వస్వాన్ని బలిదానం చేసిన మహనీయుడు. ఆ రు 15 లయినా శర్మగారికి ఆయన ప్రతినెలా ఇవ్వగలిగేవారు కాదు. ఈ విషయంలో శర్మగారికి కూడా అటే బాధకలిగేదికాదు; రాత్రి భోజనానికి హోటలుకు వెళ్ళక పోయినా, ఉదయం మాత్రం లైబ్రరీకి తప్పక హాజరయ్యేవారు.

అప్పట్లో 'ఆంధ్రవిజ్ఞాన సర్వస్వం' కోసం పరిశోధనలు సాగిస్తున్న శ్రీ కొమర్రాజు లక్ష్మణరావుగారు శర్మగారి కృషినీ, కార్యదీక్షనూ గమనించారు. ఆయనే శర్మగారిని పలకరించారు.

ఆ వ్యక్తి లక్ష్మణరావుగారని తెలియగానే శర్మగారి హృదయం ఆశ్చర్య సంభ్రమాలతో నిండిపోయింది. ఆంధ్రవిజ్ఞాన సర్వస్వాన్ని తన హృదయ సీమలో కుదురుకొల్పిన ఆ కొమర్రాజు పండితుడేనా? తనప్రక్కన కూర్చొని,

తండ్రిలాగా కష్టసుఖాలడుగుతున్నాడు! మహా మహుల మన్ననలందుకొన్న ఆ మహనీయుడేనా? తనతో స్నేహంగా సమభావంతో సంప్రదిస్తున్నాడు!

ఆయన ఎక్కమంటే మాత్రం? తాను ఆయన ప్రక్కన గుర్రపుబగ్గీలో ఎక్కడమెలాగు? ఆయినెక్కడ? తానెక్కడ? ఎలాగయినా తప్పలేదు శర్మ గారికి. ఆయనకు లక్ష్మణరావుగారు బగ్గీలోనే కాదు, ఆంధ్ర వైజ్ఞానికరంగంలోనే అర్ధాసనం ఇచ్చారు. తన తర్వాత తనంత విజ్ఞానవేత్తను ఆంధ్రజాతికి సమర్పించారు.

1912 సరికల్లా శ్రీ వీరభద్రరావుగారు తమ 'ఆంధ్రుల చరిత్ర'ను ముగించుకొని రాజమండ్రికి వెళ్ళిపోయారు. కాని శర్మగారు మాత్రం లక్ష్మణరావుగారి ప్రోత్సాహంవల్ల స వత్సరంపాటు 'ఆంధ్ర విజ్ఞాన సర్వస్వం'లో పనిచేశారు.

1913 లో మళ్ళీ రాజమండ్రివచ్చి, శ్రీ చిలుకూరి వీరభద్రరావుగారితో కలిసి శర్మగారు చరిత్ర పరిశోధన సాగించారు. నాటకాలూ, నవలలూ, కథలూ వ్రాయ నారంభించారు.

అవి కథలతో కడుపునిండే రోజులుకావు. ఏదైనా ఉద్యోగం చెయ్యాలి. "ఏదో గవర్నమెంటు ఉద్యోగం ఇప్పిస్తాం. చేస్తావా లేదా" అని బంధువులు పోరుపెడుతున్నారు. కాని గవర్నమెంటు ఉద్యోగం చెయ్యకూడదని శర్మగారి పట్టుదల. గవర్నమెంటు ఉద్యోగం పనికిరాదు. ఇతరత్రా పనికావాలి. ఏదన్నా పుస్తకాల షాపులో...పత్రిక ఆఫీసులో....జీతాలమాట . ఇస్తేసరి, ఇవ్వకపోతే అదీలేదు. ఇలా శర్మగారు కొంతకాలం గడిపారు.

కాలం గడ్డుగానే వుంది. శర్మగారు జీవితంలో అనేక కఠోరఘట్టాలను చవి చూసారు. అవన్నీ ఆయన జీవితానుభవాలు. అవే ఆయన మేధస్సుకు పరిణతినీ, హృదయానికి వైశాల్యాన్నీ కలిగించాయి.

మళ్ళీ, ఎలాగయితేనేం, రు 15 ల ఉద్యోగం దొరికింది. 1914 నుంచీ 1918 దాకా శ్రీ చిలకమర్తి లక్ష్మీనరసింహంగారి 'దేశమాత' పత్రికా సంపాదకులుగా శర్మగారు పనిచేసారు. ఈ కాలంలోనే శర్మగారు తమ పరిశోధకవ్యాసాలను వెలువరించ నారంభించారు.

తరువాత, ఆయన ఆంధ్రాభ్యుదయ గ్రంథమాలను స్థాపించి. తమ 'ఆంధ్ర వీరులు' శ్రీ చిలుకూరి నారాయణరావుగారి 'ప్రాచీన విద్యాపీఠములు' శ్రీ భావరాజు వెంకటకృష్ణారావుగారి 'ప్రాచీనాంధ్ర నౌకాజీవనము' మున్నగు ఉత్తమ చారిత్రక గ్రంథాలను ప్రచురించారు. ఒక్కొక్క గ్రంథాన్నే ప్రచురించడమూ; మళ్ళీ మద్రాసువెళ్ళి, కొత్తకొత్త పరిశోధనలుచేసి రావడమూ; మళ్ళీ గ్రంథప్రచురణా... ఇదీ కార్యక్రమం! ఇందువల్ల వారు ఆర్జించిందేమీ లేదు. ఈనాటికీ మనం ప్రథమ శ్రేణిలో లెక్కించే ఆ గ్రంథాలకు ఆనాడున్న చందాదార్లు 180 మంది అని చెబితే చాలు, నాడు వారి ఉత్తమాదర్శ కృషికి ఎంత ప్రోత్సాహం వుండేదో తెలుస్తుంది.

వారు ఎన్ని కష్టాలకోర్చి, ఎంతనష్టపడి, ఆంధ్ర జాతీయ విజ్ఞానాభివృద్ధికై కంకణం కట్టుకొని పనిచేశారో తేటతెల్లమవుతుంది.

ఇది ఇలా వుండగా, 1922 లో చిత్రాడలో జరిగిన ఆంధ్ర పరిశోధక మహా మండలి సభకు అధ్యక్షులుగా వచ్చిన శ్రీ కొమర్రాజు లక్ష్మణరావుగారు శర్మగారిని మద్రాసు వచ్చి 'ఆంధ్రవిజ్ఞాన సర్వస్వం'లో పాల్గొనవలసిందిగా కోరారు. శర్మగారు కూడా సమ్మతించారు. కాని 1923 లో తీరా, శర్మగారు మద్రాసు వెళ్ళేసరికి ఆ మహాపురుషుడు మరిలేడు. తాను కొనసాగించిన ఆంధ్ర విజ్ఞాన సర్వస్వాన్నీ, తన ఉత్తమాదర్శాలనూ ఆంధ్రజాతికి సమర్పించి ఆయన అస్తమించాడు

శర్మగారి హృదయం బరువెక్కింది. ఆ గురుమూర్తి వదలిన కార్య భారం తమదే, ఆయన బాధ్యతలు తమవే-నని స్వీకరించారు. ఆ ఆశయ సిద్ధికోసం దీక్షవహించారు.

విజ్ఞాన చంద్రికా గ్రంధమండలి తరఫున 'లక్ష్మణరాయ వ్యాసావళి'ని ప్రచురించారు. 1924 నుంచీ 16 సంవత్సరాలు 'ఆంధ్రవిజ్ఞాన సర్వస్వం' కోసం ఎడతెగని కృషిచేసారు. కాని, ఆయన మేధస్సుకరగించి వెలువరించిన అమూల్య రత్నాలు ఇంకా ఆంధ్రప్రజలకు అందకుండా, ఏ పత్రికా కార్యాలయపు బీరువాల్లోనో మూలుగుతున్నాయి.

1940 నుంచీ ఆంధ్ర విశ్వవిద్యాలయంలో చారిత్రక పరిశోధక పండితులుగా పనిచేస్తూ, శ్రీ శర్మగారు (1) Forgotten Chapter of Andhra Country (2) History of the Reddy Kingdoms అనే గ్రంధాలు వ్రాసారు.

ఆయన చదువని గ్రంథంలేదు, సాధించని శాసనంలేదు; పరిశోధించని చారిత్రక రహస్యం లేదు.

ఆయన ఇప్పటికి 30 శాసనాలదాకా టీకా టిప్పణులతోసహా ప్రకటించారు. చారిత్రక విశేషాలను వివరిస్తూ ప్రజలకు అర్థమయ్యే భాషలో రెండు మూడువందల వ్యాసాలు వ్రాసారు. ఇప్పటికి వీరు ప్రచురించిన చారిత్రక గ్రంధాలు : 1. ఆంధ్ర వీరులు, 2. అమరావతీ స్థూపములు, 3. చారిత్రక వ్యాసములు, 4. Forgotten Chapter of Andhra Country. 5. History of the Reddy Kingdoms

నేటి మన చారిత్రక పరిశోధకుల్లో శర్మగారు అగ్రగణ్యులని అందరికీ తెలుసు. కాని ఆయనే నాటకాలూ నవలలూ, కథలూ కావ్యాలూ, పాటలూ పద్యాలూ వ్రాసారంటే ఏదో కొత్తగావుంటుంది. ఇందుకు కారణం - ప్రఖ్యాత చారిత్రక పరిశోధకులైన శర్మగారు తమలోని కవినీ, కథకుణ్నీ మరుగుపరచడమే ననిపిస్తుంది.

కాని, 1914 లోనే ఆయన 'పాదుకాపట్టాభిషేక' నాటకాన్ని ప్రదర్శించుకొన్న ఆంధ్ర దేశం ఆయనలోని కవినీ కథకుణ్నీ సందర్శించింది. ఆరోజుల్లోనే ఆయన వ్రాసిన 'రోహిణీ చంద్రగుప్తము' అనేనవల, 'చిన్నకథలు', 'వివేకము

గలమంత్రి', 'దేశోద్ధారకులు' మొదలైన గ్రంథాలు వెలువడ్డాయి. ఆయన పద్యాలూ, పాటలూ 'భారతి' మొదలైన పత్రికల్లో అనేకం ప్రచురించబడ్డాయి.

శ్రీ శర్మగారికి సంస్కృతాంధ్రాంగ్లేయ భాషల్లోనేగాక, ప్రాకృతాది భాషల్లోను అఖండ పాండిత్యం వున్నది. ఆంధ్రదేశచరిత్రనుగూర్చి ఆయన తరిచని విషయంలేదు- ఆంధ్రులవర్తక వ్యాపారాలు, ఆంధ్రప్రజాజీవితం, ఆంధ్రుల శిల్ప వాస్తుకళా విశిష్టత, ప్రదర్శనశాలలు, అనాదృతవాఙ్మయము.... ఒకటేమిటి-ఆంధ్ర జాతీయ విజ్ఞాన సర్వస్వానికి ఆయన పట్టుగొమ్మ. ఆంధ్ర జాతీయాభ్యుదయానికై ఆయన దీక్ష అచంచలం.

ఆయనది వజ్రసంకల్పం; కాని, హృదయం నవనీత కోమలం. "నిండు మనమ్ము నవ్యనవనీత సమానము, పల్కు దారుణాఖండల శస్త్రతుల్యము" అనే మాట ఆయనకే వర్తిస్తుంది.

ఆయన తారామండలాన్ని అధిష్టించిన మహా పండితుడు. కాని, ప్రజల్లోకి వచ్చి ప్రజా విజ్ఞానాభివృద్ధికై నిరంతరం కృషిచేస్తూ, ప్రజాభిమానాన్ని చూరగొన్న దేశసేవకుడు.

ఆయనను ఎరిగినవారిలో ఆయన ప్రేమ చూరగొననివారూ లేరు; ఆయనను ప్రేమించనివారూ లేరు. ఆయనలో మానవత్వం, సజీవ చైతన్యం తొణికిసలాడుతూ వుంటాయి.

అనేక అగ్నిపరీక్షలను ఎదుర్కొన్న జీవితానుభవమూ, అనేక మహత్కార్యాలను సాధించిన కార్యదీక్షా కలిసి, ఆయన కనుగొలకుల్లో విషాదబాష్పాలకూ ఆనంద బాష్పాలకూ పొత్తుకుదిర్చాయి.

ఆయన హృదయం కలవాడు. ప్రేమమూర్తి — ఆయన 'నెయ్యపు పయస్సులు దిద్దిన తీయకైత'లను కీ. శే. శ్రీ కొంపల్లి జనార్దనరావుగారు ఆయనకే కానుకయిచ్చారు :

"నీకిది పూవుగానుక, కరుణింపుమి ఓ మధుమూర్తి, సంతత
మ్మో కమనీయతల్ విరియునట్టిద; నీ తొలిసంజలూరు ప్రే
మా కృతియొల్కు దీవనలకై ఎదమూలమురేగి సంపదల్
వ్రేకలు మూదలింప మధురించు నదీపద సన్నిధిన్ చెలీ!"

(భారతి, 1930)

'డిగ్రీలులేని పాండిత్యమ్ము వన్నెకురాని ఈ పాడు కాలాన,' 'వాడీలకు ముఖప్రశంసల కీర్ష్యకు స్థానమైనట్టి లోకాన' తన 'అచ్ఛతర కమనీయ శీలజ్యోత్స్న అడవిగాచిన వెన్నెలగుచు వెలిగి;' తన 'చరిత్రజ్ఞాన నిర్మలాంభఃపూర మూషర క్షేత్ర వర్షోదకమయి'న శర్మగారికి శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారు 'ఆంధ్ర ప్రశస్తి'ని సమర్పిస్తూ—

"నీపనుకోనులేదు, మరి నేనిదిచెప్పను లేదుగాని, అ
న్నా వినవయ్య, నేటికిది నా చిరువొత్తము నీకు నంకితం
బై వెలయింపజేతు; హృదయంబులునీకునునాకు మాతృదే
శావిలదుఃఖ దారితము లై శ్రుతిగల్పెవిషాద గీతికన్

"ఇది నీకై యిడినట్టి నాయుపద, మున్నేనాడొ ఘూసాగ్రముల్
పదునై ఆంధ్రవిరోధి కంఠదళన ప్రారంభసంరంభ మే
చు దినాలన్ మరి తోడి సైనికులమైచూరాడు ప్రేమంబులో
నిది లేశంబనియైన చెప్పుటకు లేవే నాటి స్వాతంత్ర్యముల్"

"...గౌరీశంకరాచ్ఛశృంగ-తుంగము త్వదీయము మనస్సువొంగి, తెలుగు
నాటి పూర్వచరిత్ర కాణాచియెల్ల - త్రవ్వి తలకెత్త లేదె!...."

అని సత్యనారాయణగారు తమ హృదయంవిప్పి చెప్పుకొన్నారు.

శర్మగారు కవి, విమర్శకుడు; కృతికర్త, కృతిభర్త; కథకుడు, చారిత్రక పరిశోధకుడు; మహాపండితుడు, ప్రజాసేవకుడు- ఇవే ఆయనలోని విశిష్టత!

ఆయన కష్ట సహిష్ణుత, కార్యదీక్ష, సమభావం, సౌహార్దం - యువరచయితలకు ఇవే ఆదర్శాలు! ఆంధ్రసాహిత్యాభ్యుదయానికీ ఆంధ్ర జాతీయాభ్యుదయానికీ ఆయన జీవితాదర్శమే వెలుగుబాట!

— ప్రయాగ.

★

అభ్యుదయ రథము

కందుకూరినిజూచి చిందులేసినవారి - తందనాలా తలక్రిందులాయె
చిలకమర్తినిజూచి పలకరించనికవుల్ - తలలువంచిరి లోకతత్వమరసి
గిడుగుకొట్టినదెబ్బ పిడుగైతగిలి ఆంధ్ర - సాహితి సంకెళ్ళు సడలిపోయె
గురజాడకోకిల స్వరమునానాగళ - మ్ములకు సంగీతమ్ములలవరించె
అభ్యుదయ వేళయిది దిగ్దిగంతములకు - కాంతిపుంజంబు వెల్లువై కళదలిర్ప
సాహితీసీమ గౌరవస్థానపీఠి - పూజలందుచుకదలె నభ్యుదయ రథము

— నాగభైరవ శివరామక్రిష్ణయ్య

సంపాదకీయం

ఆంధ్రసాహిత్యానికి దివ్యభవిష్యత్తు చేకూర్చాలి!

ఆంధ్ర అభ్యుదయ రచయితల సంఘం మూడున్నర యేండ్లనుండీ 'అభ్యుదయ' మాస పత్రికను నడపాలని కలలుగంటూ వచ్చింది. ఆ కలలు ప్రజా మంత్రివర్గం వచ్చాకనే నిజంకావడానికి అవకాశాలేర్పడ్డాయి. ఈనాటికయినా, 'అభ్యుదయ' మాస పత్రిక వెలువరించగలిగినందుకు ఎంతో ఆనందిస్తున్నాం

ఇందుకు అవకాశాలు కల్పించిన గౌ. శ్రీ వి. వి. గిరిగారికీ, జస్టిస్, శ్రీ వింజమూరి గోవిందరాజాచారిగారికీ, ఆంధ్రప్రభ, ఆంధ్ర పత్రికా సంపాదకులకూ, శ్రీ కోరాడ రామకృష్ణయ్యగారు, పి. రామానుజులు నాయుడుగారు, బి. ఎస్. రెడ్డిగారు మొదలైన పెద్దలకూ, ముందుగా అభినందనాలర్పిస్తున్నాం కృతజ్ఞతను తెలియజేస్తున్నాం.

విశాలమైన ఆంధ్ర సాహితీరంగంలో ఈ మూడున్నర యేండ్లనుండీ ఇతరసాహితీ సమితులతో కలిసి, ఆంధ్ర సాహిత్యాభ్యుదయం కోసం, అభ్యుదయ రచయితల సంఘం పనిచేస్తూవచ్చింది తత్ఫలితంగానే మే 11 నుంచి జూన్ 10 వరకు, నెలరోజులు, పెదపూడి ఆంధ్ర సాహిత్య పాఠశాలను మూడుతరాలకూ చెందిన పెద్దల సహకారంతో— జయప్రదంగా నిర్వహించ గలిగింది.

అనుశ్రుతంగా వస్తున్న సాహితీ సంస్కారాలను అనుభవంగా తీసుకొని, ప్రజల జీవితాలను తీర్చి దిద్దడానికి అభ్యుదయ రచయితలు సాహితీ కళ నుపాసించారు. ఆంధ్ర సాహితీ రంగంలో వివిధతరాలకు చెందిన పెద్దలందరూ ఒకే వేదిక మీద, ఒకే ఆశయం కోసం, కలిసి కృషి చేయడానికి అభ్యుదయ రచయితల సంఘం నూతనోత్సాహాన్నిచ్చింది.

ప్రజల విజ్ఞాన వికాసాలు పెంపొందిననాడే - దేశం, జాతి, అత్యుత్తమ స్థాయి నందుకోగలవనీ; అందుకు సాహిత్యారాధకులందరూ కలిసి

కృషిచేయాలనీ శ్రీ వీరేశలింగం, గిడుగు, గురజాడలు యెలుగెత్తి చాటారు. ఈ ఆశయసిద్ధికోసం తమ జీవితాలనే అంకితం చేసారు.

వారి ఉత్తమాదర్శాలతోపాటు, బాధ్యతలను కూడా పంచుకున్న మనం, మన విద్యాలయాలలో వ్యావహారిక భాష ద్వారా ప్రజా విజ్ఞానానికి దోహదం చేయగలిగిననాడే, మన కర్తవ్యాన్ని నిర్వర్తించిన వారమవుతాం. ఆంధ్ర జాతికి దివ్య భవిష్యత్తును చేకూర్చగలుగుతాం

ఆంధ్ర జాతి దివ్యభవిష్యత్తును గురించి ఏత్రిమూర్తులు తమ జీవితాలను అంకితంచేసారో, వారి ఆశయాదర్శాలను సఫలం చేయడానికి సాహిత్యారాధకులమైన మనం పూనుకోవాలి. ఈ ఉత్తమ కర్తవ్యాన్ని నిర్వర్తించడానికి సాహిత్యారాధకులందరి సహకారంతో 'అభ్యుదయ' కృషి చేస్తుంది

దాస్య భారతంలో ముక్కలు ముక్కలుగా ఉన్న తెలుగు దేశాన్ని ఒకే స్వతంత్ర రాష్ట్రంగా నిర్మించడానికీ, విశాలాంధ్ర జాతీయ భాషా వికాసానికీ, ఆంధ్ర సంస్కృతీ కళావిజ్ఞానాలకు రూపురేఖలు తీర్చడానికీ 'అభ్యుదయ' నిరంతరం పాటు పడుతుంది.

రెండువందలేండ్ల బ్రిటిష్ దాస్యశృంఖలాలను తెగతెంచుకొనిబయట పడడానికై చావు బ్రతుకుల పోరాటం సాగిస్తున్న వీర భారత ప్రజా హృదయాన్ని 'అ భ్యు ద య' ప్రతిబింబిస్తుంది జాతీయ స్వాతంత్ర్య యోధుల వీరగాధలను ప్రజా హృదయానికి హత్తుకొనేలా చిత్రిస్తుంది.

ఈ ఉత్తమాశయాలతో, అభ్యుదయ ప్రధమసంచిక ఆంధ్రసాహిత్య పారశాలా సంచికగా వెలువడుతోంది. ఆంధ్రసాహిత్య పారశాల జయప్రదంగా నడవడానికి అన్నివిధాల తోడ్పడ్డ దాతలకు, ఉపాధ్యాయులకు, నిర్వాహకులకు, విద్యార్థులకు 'అభ్యుదయ' అభివందనాలర్పిస్తుంది. ఆంధ్ర సాహిత్య జీవనంలో నూతనాధ్యాయాన్ని ప్రారంభించిన సాహిత్యారాధకులను 'అభ్యుదయ' అభినందిస్తుంది. ఇంకా ముందు ముందు లలితకళాభ్యుదయానికై కృషిచేయడానికి 'అభ్యుదయ' ఆంధ్ర ప్రజల ఆదరాభిమానాలను అర్థిస్తుంది; ఆంధ్ర ప్రజల అండ నిండుగా వుంటుందని ఆశిస్తుంది.

★

సందేశాలు

[మళయాళ మహాకవి, శ్రీ వల్లథోల్ నారాయణమీనన్‌గారు
ఈ క్రింది సందేశం పంపారు]

ఆంధ్ర అభ్యుదయ రచయితల సంఘం అక్టోబరునుంచీ 'అభ్యుదయ' అనే సచిత్ర సాహిత్యపత్రికను ప్రచురింపనున్నదని తెలిసి చాలా సంతోషించాను.

ద్రావిడభాషల్లో తమిళభాష అతి ప్రాచీనమైన దంటారు; దానితర్వాత ప్రాచీనమైన భాష తెలుగే. ఇక కన్నడ మళయాళభాషలు ఈ రెంటి తరువాతనే వస్తాయి.

భారతదేశంలోని ఇతరభాషలవలెనే, మీ భాషకూడా నిరర్థకమైన సనాతన సంప్రదాయాలను త్రోసిపుచ్చి, అభ్యుదయపథంలో నడుస్తున్నదని తెలుసుకున్నాను. ఎంతోకాలం పట్టదు — నాకు తెలుసు — మీలక్ష్యం సిద్ధిస్తుంది. మన ప్రజల నిరక్షరాస్యతను రూపుమాపి, వారిని మన సాహితీసౌధాలకు ఆహ్వానించి, వారికి విజ్ఞాన సంస్కృతులను సమకూర్చడమే మన లక్ష్యం.

ఏ భాషకూడా, సోదరభాషల సహాయం పొందకుండా ఇంతవరకూ అభివృద్ధిచెందలేదు; ఇకముందుకూడా చెందదు. కనుక, తన మాతృభాషను ప్రేమించే ప్రతి వ్యక్తి, ఇతర భాషలలోని ఉత్తమసాహిత్యాన్ని తన ప్రజలకు అందజేయాలి.

మా మళయాళభాషకూడా అభ్యుదయపథాన్నే నడుస్తున్నది. ఇతర భాషల్లోని జాతిరత్నాలను సమకూర్చుకొంటున్నది.

మన ద్రావిడభాషలన్నీ రక్తసంబంధం గల సోదరభాషలు కనుక, మీ భాష అభివృద్ధి చెందుతున్నదంటే, నా భాషకూడా అభివృద్ధి చెందుతున్నట్లుగా భావిస్తున్నాను. మరి నాది ఒక్కటే హృదయపూర్వకమైన ప్రార్థన — 'అభ్యుదయ' పత్రిక అభ్యుదయ సాహిత్యోద్యమానికి నూతనకాంతులను విరజిమ్మగాక!

వల్లథోల్ నారాయణమీనన్

★

[సుప్రసిద్ధ హిందీ రచయిత స్వర్గీయ శ్రీ ప్రేమచంద్‌గారి కుమారుడు, ప్రఖ్యాత హిందీ సాహిత్య మాసపత్రిక 'హంస' సంపాదకులు అయిన శ్రీ అమృతరాయ్. ఎం. ఏ గారిలా వ్రాస్తున్నారు.]

ప్రియమిత్రమా,

మీ ఆగస్టు 29 వ తేదీ ఉత్తరానికి కృతజ్ఞుణ్ణి. ఆంధ్రాభ్యుదయ సాహిత్య పత్రికను ప్రచురిస్తామని మీరు వ్రాసిన లేఖను చూసి చాలా ఆనందం చెందాను.

మీదేశంలో అభ్యుదయోద్యమం ఎలా అభివృద్ధిచెందిందో మాకు ఎక్కువగా తెలియదు. కాని, అప్పుడప్పుడు మనదేశంలోని అభ్యుదయ పత్రికలద్వారావచ్చే చిన్న చిన్నవార్తలను చూస్తేచాలు, మీదేశంలో అభ్యుదయోద్యమం ఉన్నతస్థాయిలో వున్నదనీ, మీ ఉద్యమానికి ఉజ్జ్వల భవిష్యత్తు ఉన్నదనీ ఎవరికైనా తెలుస్తుంది.

చావుకుసిద్ధమైన బ్రిటిషు సామ్రాజ్యవాదం చేస్తున్న కుటిల తంత్రాలకు వ్యతిరేకంగానూ; వాటిఫలితంగా ఏర్పడి, సుందరమైన మనదేశాన్ని రూపుమాపుతున్న పరస్పర ద్వేషానికీ అంతఃకలహానికీ వ్యతిరేకంగానూ; చైతన్యవంతులైన కార్మిక కర్షక ప్రజల శవాలమీద సింహాసన మధిష్ఠించడానికై తుచ్ఛస్వార్థపరులు చేస్తున్న ప్రయత్నాలకు వ్యతిరేకంగాను మీరుసాగించే పోరాటంలోనే మీ ఉజ్జ్వల భవిష్యత్తు ఇమిడి వున్నది.

నిర్బంధ విధానానికీ, అన్యాయానికీ వ్యతిరేకంగా ఎంతదీక్షతో మనలేఖినిని ఉపయోగిస్తామో, అంతత్వరగా నేటి సాంఘిక స్వరూపం - ఇది స్వరూపంకాదు, వికారమైన భయంకరాకారం - మార్చగలం.

ఈ పోరాటంలో మన మందరం సోదర సైనికులం. మనలో మనంపూర్తి ఐక్యతను ప్రదర్శించుకొనడం, ఒకరి అనుభవాలను మరొకరికిచ్చి ఒండొరులం అభివృద్ధి చెందడం, ఇవి మనకు చాలా అవసరం.

మీ కరస్పర్శకోసమై జాపిన స్నేహపూర్వక హస్తమే ఈ నా సందేశం,

అభివందనాలు
మీ అమృతరాయ్

★

పదుగుర్నిన్నునుగూర్చి సంతసిల సద్వ్యాసమ్ములందిచ్చి, కో
విద మాన్యత్వముగూర్చి దేశమునకున్ విందొచు సార్థక్యసం
పద నీ పేరికిఁగూర్చికొం చలరుమా। ప్రఖ్యాతితో నెప్పుడ
భ్యుదయంబా। సితపక్ష చంద్రకళ పొల్పుంగూర్చి నానాఁటికిన్,

చెళ్లపిళ్ల వేంకటశాస్త్రి, శతావధాని

★

అక్టోబరునుంచి పత్రిక వెలువడుతుందని తెలిసి చాలా సంతోషించాను.

గొప్ప సాహిత్యం జీవితంమీద ఆధారపడి జీవితానికి అతీతమైన అనుభవానికి సాధనమవుతుంది. జగత్తే కావ్యవస్తువు గనుక ప్రజా హృదయాన్ని సాహితీ వీధుల్లో ప్రదర్శించడానికి ప్రయత్నించే "అభ్యుదయ" తప్పక ఆంధ్ర సాహిత్యాభ్యుదయయే అగును.

సంఘంవారి ఉత్సాహానికి తగినట్టి ప్రజల ప్రోత్సాహం, పోషణతో "అభ్యుదయ" వర్ధిల్లుగాక అని నాకోరిక.

ఇట్లు విధేయుడు,
జస్టిస్ పా. వే. రాజమన్నారు

★

"....అభ్యుదయ రచయితలనబడే యీ సంఘంవారు ఆ (అభ్యుదయ) శబ్దాన్ని గ్రహించి వారి రచనలు సాగించడం పూర్వాపర సందర్భం గలదిగానే గ్రహింప తగుచున్నది...

"రచయితలనే శబ్దం ప్రాయికంగా కవితా రచనలు చేసేవారికే అన్వయించ తగిన యోగరూఢ శబ్దమయినా, 'రచ్ ప్రతియత్నే' to arrange, to make, to write, to adorn, to direct అనే వ్యుత్పత్తినిబట్టి కళాసాహిత్యాది జాత్యభ్యుదయ కారకాలయిన సమస్తోద్యమ నిర్వాహకుల కనుగమకంగా ఎరుంగ దగిందిగానున్నది. రచన అంటే ఉద్యమమనీ, రచయిత అంటే ఉద్యమ నిర్వాహకుడనీ యీ పక్షాన అర్థం,

"ఇట్టి అర్థబాహుళ్యంగల శబ్దాలతో విరాజిల్లే వీరి సంఘమున్నూ, వీరు నడపబూనిన 'అభ్యుదయ' అనే పత్రికయున్నూ జాత్యభ్యుదయాన్ని సాధించ గలవని విశ్వసింపక తప్పదు..."

హరి నాగభూషణం

★

కరుణాసక్తి - స్వతంత్రతారతి - మనోగాంభీర్యమున్ - బ్రేమమున్
చిరనీతిస్ఫురణం - బహింసయును - సౌశీల్యంబు - హెచ్చించుచున్
నరులన్ దేవతలట్లు - లభ్యుదయ మొందన్ జేయు - సాహిత్య వి
స్ఫురణం "బభ్యుదయా"హ్వయంబును వహించున్ శాశ్వతానందమై।

విదితంబేగద! నేఁటి వాఙ్మయమునన్ బెంపొందులోపమ్ములన్
మొదలంటన్ దొలగించి - హృద్వికసనంబున్గూర్చు సౌభాగ్య సం
పదలన్ బెంచుట - సత్కవి ప్రతతికిన్ బ్రత్యేక ధర్మంబు! న
భ్యుదయాఖ్యంబగు పత్రికామణి జయంబున్ శ్రేయమున్గాంచుతన్!

జననంబా, బెజవాడ పట్టణమునన్; సంపాదకుల్, లోకశో
భనసాహిత్యకళాప్రభావకలితుల్; వ్యాసంబులందిచ్చు నా
ఘనులన్, నూఱులువేలుమంది; యిఁకనీఖ్యాతిన్ బురోవృద్ధి నే
మని వర్ణింపఁగనేర్తు! నభ్యుదయ! విద్వల్లోక చింతామణీ!

ఆశ్వయుజమున వెడలు నీయాదినంచి
కలు - సమగ్రాంధ్ర ధర - నెల్లకడలనిండి
పారకకరాబ్జములకెక్కి - పరమకళలఁ
గడలుకొను నభ్యుదయ పత్రికామతల్లి!

చెలులై కొండలవంటి కోవిదులు సంసేవింప - నూతేండ్లు వ
ర్ధిలి - మా భారతఖండమెల్లెడల దీప్తిన్నించి - యుజ్ఞాన సం
కులతన్ ద్రోయుచు - నాంధ్రమాతకు - ననుంగున్ బుత్రిపై కీర్తి రం
జిలవమ్మా! కవిసార్వభౌముని శుభాశీర్వాద సంభావనన్!

డి రాజశేఖర శతావధాని

★

'అభ్యుదయ' అను సచిత్ర మాసపత్రిక బెజవాడనుంచి త్వరలో వెలువడు నని వినుట సంతోషమైన విషయమే. ఇదివరకు తెలుగున వెలువడుచున్న పత్రికల వలెనే యిదికూడా ఉండినట్లయితే దీని విశేషమేమియును ఉండదు. ఇతర నాగరక దేశములలో అనేక విషయములలో అభ్యుదయమెట్లు వృద్ధిపొందినదో, పొందు చున్నదో, ప్రజల అభివృద్ధి ఎట్లు సాగుచున్నదో మొదలైన విషయములనుగురించి వ్రాయుచు, మన దేశమందెట్టి క్రొత్తపోకడలు పట్టవలెనో తెలియజేయుట, విజ్ఞానము ప్రపంచమందు వివిధ శాఖలలో యెట్లు పెరుగుచున్నదో సూచించు వ్యాసములు వ్రాయుట మొదలైన విషయములతో యీ క్రొత్త పత్రిక నిండియుండి ఆంధ్రుల ఆదరమునకు శాశ్వతముగా పాత్రముకాగలదని నమ్ముచున్నాను.

విస్సా అప్పారావు

★

'అభ్యుదయ' సచిత్రముగ త్వరలో వెలువడనున్నదని వినుటకు సంతస మగుచున్నది. అనేక సమస్యలు సంఘమును తట్టి మేల్కొలుపుచున్నవి. నూతన చైతన్యమును కల్గించుచున్నవి. తిరుగుబాటు పరిపాటి యగుచున్నది. భావాంబరమున విప్లవకేతువు రెపరెప లాడుచున్నది.

ఈ నూతనోత్సాహమును, ఈ విప్లవతత్వమును సరిదిద్ది, నిర్మించవలసిన భారము సాహిత్యకారకులమీదనున్నది. భవిష్యత్తును నవీన స్వరూపములతో రచించవలసియున్నది. ఈకార్యమును 'అభ్యుదయ' నెరవేర్చగలదని పూర్ణ విశ్వాసము.

బెజవాడ గోపాలరెడ్డి

★

'అభ్యుదయ' సచిత్ర సాహిత్య మాసపత్రికకు స్వాగతం చెబుతున్నాను.

పూర్వాధునాతన సాహిత్యోద్యానవనములకు - అనుద్వేగకరములయిన పద్ధతులతో, అఖిలాంధ్ర ప్రజానీకానికిన్నీ, జాతి వర్గవిభేద రహితంగా అభ్యుదయాన్ని చేకూర్పగల అభ్యుదయ మార్గాలతో దోహదం కలిగించి, సుపుష్పితం సుఫలితం అయ్యేట్లు చేయవలసిందని కోరడంకంటే మించి - నేను అందింపగల సందేశం లేదని మనవిచేస్తాను.

ముఖ్యంగా - తేజస్వినా వధీతమస్తు మా విద్విషావహై - అనే ఆదర్శం 'అభ్యుదయ' చేపట్టాలని నా కోరిక అభ్యుదయకు నా హార్దికమైన స్వాగతం ఇస్తున్నా.

పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రి

★

ఆంధ్ర అభ్యుదయ రచయితల సంఘం తరపున తామ 'అభ్యుదయ' పత్రికను ప్రచురింతుమని వ్రాసిన లేఖ అందె. చాలా సంతోషించినాను. సాహిత్య సేవచేయు మాసపత్రిక లిప్పు డాంధ్రలో కొన్నియున్నను, ఇట్టిపత్రికకు స్థానము ఆవశ్యకత కూడ. కలదని నా అభిప్రాయం. ప్రాచీన దృక్పథంతోను, "నవ్య సాహిత్య" దృక్పథంతోను చాల పత్రికలు నడుపబడుచున్నవి. కాని మన జాతీయ జీవితంలో ఆయా రంగాలన్నిటిలోను ప్రగతిని ప్రోత్సహించుచు సంఘ క్షేమమునే మనస్సునందు బెట్టుకొని, లోకాభ్యుదయమును పెంపొందించు రచనలకు తమ పత్రికలో ముఖ్యస్థానమిత్తురని ఆశించుచున్నాను. హిందీలో 'హంస' 'విశ్వవాణి' వలె, ఆంధ్రలో 'అభ్యుదయ' కూడ విశాల దృష్టిగల్గి, సమదృష్టితో నిష్పాక్షిక భావంతో, సంఘక్షేమమును వృద్ధిజేయుచూ, సార్థకనామమై నిరంతరాభివృద్ధి నొందుచు విలసిల్లుగాక!

కొ. శఠకోపం

★

తమ ముద్రిత లేఖ చేరినది. సర్వదా సంగీతాభ్యుదయ కాంక్షగల స్థితిలో మీ అభ్యుదయ పత్రిక సంగీతముంగూర్చికూడ యేమేని యొనర్పగలదేని ఎక్కువ ఆనందింతుము మీ అభ్యుదయ పత్రికా పుత్రిక చిరంజీవియై వర్ధిల్లుత.

సంగీత రత్నాకర, ద్వారం వెంకటస్వామి

★

అభ్యర్హిత భావ తరం
గాభ్యున్నతి మిన్నుముట్టి యతి సభ్యంబై
యభ్యుదయ మాసపత్రిక
యభ్యుద్ధరణంబొనర్చు నఖిలాంధ్రంబున్

విశ్వనాథ కవిరాజు

★

అభ్యుదయ రచయితల సంఘము చేయుచున్న సారస్వతసేవను విని మిక్కిలి ఆనందించితిని. జీవద్భాషలెప్పుడును మార్పులేక ఒకే మాదిరిగానుండవు ప్రతిక్షణము ప్రతి ప్రదేశమున చిత్ర చిత్ర నాట్యభంగిమలు చూపు నదీప్రవాహము వలె జీవద్భాష సంతతము పరివర్తనము చెందుచుండును. భాషాభావాలలోవచ్చు వికాసమును, నూత్నత్వమును రచయితలు గుర్తించిననాడే సారస్వతమభ్యుదయము పొందుట సంభవించును అభ్యుదయ రచయితలలో నట్టియత్నము సర్వతోముఖముగా గోచరించుచు నాంధ్రసారస్వతాభ్యుదమునకు శుభోదర్కముగా గానిపించుచున్నది.

ఆంధ్రమున సారస్వతైక ప్రధానములగు పత్రికలు తక్కువ. 'అభ్యుదయ' ఆలోపమును గొంతవరకుఁ దీర్చి రచయితలకును బాఠకులకును నుత్సాహము నొసంగుచు సారస్వతాభివృద్ధికి, దోడ్పడునుగాకయని కోరుచున్నాను.

దివాకర్ల వేంకటావధాని

★

సంస్కృత కవిత్వసౌందర్యము తగ్గిపోతూన్న రోజులలో నన్నయగారు తెలుగుభాషకి సభాగౌరవమూ, తెలుగుజాతికి పురాణ పరిచయమూ కలిగించారు. తెలుగు కవిత్వంలో సంస్కృత కావ్యసంప్రదాయాలు నిరంకుశంగా విహరించేరోజులలో కల్పనావిశేషం విరివిగా ప్రవేశపెట్టి పెద్దనగారు ఆంధ్రకవితాపితామహులైనారు. తెలుగు ప్రబంధాలు కొయ్యబొమ్మలుగా తయారౌతున్న రోజుల్లో అనుభూతినే పురస్కరించుకుని రచించి కొత్త చైతన్యము తెచ్చారు భావకవులు. సంఘానికి కావలసినా అక్కరలేకపోయినా తమ వ్యక్తిజీవితంలోని గాలి విసురులన్నిటికీ కవులు 'కావ్యరూపం' ఇచ్చేసే రోజుల్లో 'సాంఘిక ప్రయోజనం' అనే ఆదర్శాన్ని ముక్తకంఠంగా ఘోషిస్తున్నారు అభ్యుదయ రచయితలు. అభ్యుదయా

కాంక్ష దారిచూపే చుక్కానిమాత్రమే కాని కావ్యాన్నినడిపే తెరచాపకాదని జ్ఞాపక ముంచుకుంటే "అభ్యుదయ" నిజమైన అభ్యుదయం తీసుకురాగలదు.

శ్రీపాద గోపాలకృష్ణమూర్తి

★

మీరు సాహిత్య మాసపత్రికను నడపవలెనని చేస్తూన్న కృషి చాలా ప్రసంశ నీయమైనది. మీ ప్రయత్నం ఫలించుగాక అని ఆశీర్వదిస్తున్నాను. మీ ఆశయాలతో నేను పూర్తిగా ఏకీభవిస్తున్నాను నేనుకూడా మీకు అభ్యుదయ కరమైన రచనలను పంపి శక్తి ఉన్నంతవరకు సాహాయ్యము చేయాలని ఉంది.

మునిమాణిక్యం

★

మీ పత్రిక నిజమైన అభ్యుదయం తీసుకురాగలదని ఆశిస్తున్నాను.

చలం

★

అభ్యుదయ సాహిత్యపత్రిక ఏకోత్తరాభివృద్ధి నొందుగాకయని పరమేశ్వరుని ప్రార్థించుచున్నాను.

పెండ్యాల వేంకట సుబ్రహ్మణ్యశాస్త్రి

★

"మనకిపుడు కావలసినది దేశాభ్యుదయము. దేశమనగా నిచట జాతిగాని, సరిహద్దుల మధ్యనున్న భూభాగమని కాదు. దీని యభ్యుదయమునకు కావలసిన సాధనములలో సాహిత్యమొకటి. అది యెట్టిదిగా నుండవలెనన్న విషయమే నేటి రచయిత లాలోచింపవలసినది.

✓"జాతికి రానున్న యనర్థమూహించి దానిని తొలగింప నాయకుడు పాటు పడునట్లే కవియు పాటుబడవలెను. దేశాభ్యుదయమే తన యభ్యుదయముగా భావించు పూజ్యనాయకుని మాడ్కి నుత్తమ రచయితయు భావింపనగును. అభ్యుదయ రచన మన్నంతనే భాషాసారస్వతాభ్యుదయము మాత్రమేకాదు. అందు జాత్యభ్యుదయ మంతర్భూతమై నే నిందున్నానవి తలచూపుచున్నది. అందుచే నీ 'యభ్యుదయ' శిష్టవ్యవహారమునకు దూరము కాని భాషతో సహృదయ హృదయ రంజకములగు భావములతో జాత్యభ్యుదయమునకు దారిచూపు రచనలు ప్రకటించి. సాహిత్యసేవ చేయుంగాక.✓ ఆంధ్రజాతి కిపుడు కావలసిన యాంధ్ర సాహిత్యమదే."

మల్లాది సూర్యనారాయణశాస్త్రి

జైత్రయాత్ర

వెనుకలు ముందులున్ పడుగు పేకలుగా సరిక్రొత్త యుల్లికల్
గనుపడుచున్న ఈ నవయుగమ్మున మాపుఱరేపు లొక్క-చో
టని యొనగూడి, కూడి యొకటైనవి, నేడిది;- ఈ దిశాముఖ
మ్మున నవరక్తరేఖ పొలుపొందిన దభ్యుదయ ప్రబంధమై —

తనచేత నంటగూడని పంకజమ్ముల-నమృతాంశుడంతంత ననునయించె,
మృదు శీతలములౌ చంద్రికలు క్రొవ్వేడితో-విద్రాణ జగతి కన్విపొ్వనర్చె.
తమ చేతనత్వమ్ముదలగి, మైమఱచి, ని-ద్రించు పులుంగు లెల్గెత్తి లేచె,
వేయినోళులమూసి విలయ నైశ్శబ్ద్యమ్ము-భజియింపు డివి ప్రతిధ్వనిగదిర్చె.
గుట్టలను పుట్టలను పొంచి కూరుచున్న-చీకటులకు కాలాంతమే చేరువాయె,
ఈ తమస్స పటాపంచలై తొలంగి-యిక సముద్ర నీలిమతో లయించునేమొ।

వింగి, సముద్ర నీలిమలనే గిలిగింతలు వెట్టుకాంతితో
పొంగులు వారుచున్నది; తమోవిభు నీలిముసుంగు కొంగుపై
భంగములందు సైతము ప్రభాత విభా తరుణారుణద్యుతుల్
చెంగున దూకుచున్నవి; ఎగసెన్ నవదీధితి మత్పతాకముల్ —

గురికొని పగతుపై కురవడించు ఖరాసి-ధా సరివ్యాప్త ధాళధళ్య,
మాత్మార్పణాయత్తమైన చైతన్య తే-జోంశ నిర్యత్పరమాణుశక్తి,
పొగలు గ్రమ్మిన నేత్రములను జించుక దిక్కు-లగదొంద లేచిన యగ్నినాల్క,
తెర్లి సముద్ర మావిర్లు గ్రక్కుచు నిప్పు-లుమిసిన భయద మహోగ్రరేఖ,
కూడి గూడుకట్టి కొదమ సింగాల దం-ష్ట్రా కరాళకాంతియై, కఠోర
కంఠనాదమై, అఖండ గర్జాఘోష-యై, యనంత జైత్రయాత్ర నడుపు।

ఇది విజయ ప్రయాణము, జయేందిర నాకనుసన్నకోసమై
యెదురులు సూచుచున్నది; ఇకనెందును చీకటిరేడు నిల్వలే,
డిది జన మానసాబ్జము రమించిన క్రాంతిమయూఖరేఖ; అ
భ్యుదయ పరంపరల్, జగతి నొందుత। నూత్నయుగ ప్రభావముల్ —

— ప్రయాగ కోదండరామశాస్త్రి

★

ఆంధ్ర సాహిత్య పాఠశాల

ఆవిష్కరణ మహోత్సవం

[మా ప్రత్యేక విలేఖరి]

ఆంధ్ర సాహిత్య పాఠశాలావిష్కరణ మహోత్సవం - మే 11 వ తేదీ విద్యార్థులూ, అధ్యాపకులూ, వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన పెద్దలూ పాఠశాల పందిళ్ళలో అన్యోన్యపరిచయ భాగ్యంవల్ల ఆనందపరవశులవుతున్నారు.

పాఠశాలా ప్రవేశమే ఒక వరప్రసాదంగా యెంచిన విద్యార్థుల ఉత్సాహానికి మేరలేదు పాఠశాల ఎప్పుడు ప్రారంభమవుతుంది ఆంధ్రకళావేత్తల ఉత్తమ సందేశభాగ్యం తమకెప్పుడు లభిస్తుందని నిమిషాలు లెక్కిస్తూ విద్యార్థులు వేచివున్నారు. యువ రచయితలతో పరిచయం కలిగించుకోవాలనీ, తమ విజ్ఞాన సర్వస్వాన్ని తమ బిడ్డలకు అందజేయాలనీ పాఠశాలా విష్కరణ మహోత్సవం కోసం అధ్యాపకులు ఎదురుచూస్తున్నారు.

ప్రజలలో విజ్ఞానం వ్యాపించాలనీ, ప్రజా విజ్ఞానాన్ని పెంపొందించడానికే మన సాహిత్యం తోడ్పడాలనీ, అహర్నిశలూ కృషిచేసి, ఆ ఉత్తమాదర్శ సాఫల్యానికై తన అసువులనుసైతం ఆంధ్ర దేశానికి సమర్పించిన శ్రీ గిడుగు వేంకట రామమూర్తిగారి పేరిట పాఠశాలా మందిరం నిర్మించబడింది నాట్యకళద్వారా ప్రజల విజ్ఞానాన్నీ, నైతిక శక్తినీ, కార్యదీక్షనూ పెంపొందించడానికై తన సర్వస్వాన్నీ ధారపోసి, ఆ మహత్తరాశయసిద్ధికోసం కృషిచేస్తూ అసువులనుబాసిన శ్రీ బళ్ళారి టి రాఘవాచార్యులుగారిపేరిట పాఠశాల సింహద్వారం ఏర్పరచబడింది.

'రాఘవ' సింహద్వారం నుంచి 'గిడుగు' మందిరంలో ప్రవేశిస్తున్న అధ్యాపకులూ. విద్యార్థులూ, కళద్వారా ప్రజా విజ్ఞానాభివృద్ధిని లక్షిస్తున్నారు. ఆ మహోన్నతుల ఉత్తమాదర్శాలు వారి హృదయాల్లో వేగుచుక్కల్లాగా వెలుగుతున్నాయి ఒక నూతన ఆదర్శం - ఒక నూతన ఉత్తేజం - అందరికీ నూతన శక్తుల్ని ప్రసాదిస్తున్నది

ఆంధ్ర సాహిత్య పాఠశాలలో వారి ఆశయాలు మూర్తీభవించాయి, ఈ పాఠశాల వారి ఆశయాలకు ఒక రూపం కలిగిస్తున్నది. ఇదే నూతన సాహిత్యానికి పునాది!

ఈ సాహిత్య పాఠశాల ఆంధ్రదేశ చరిత్రలోనే కాదు, భారతదేశ చరిత్రలోనే అపూర్వమైనది ఇది ఒకనూతన సంప్రదాయం తన విజ్ఞానాన్నీ సంస్కారాన్నీ అంతటినీ విస్మరించి. బానిసత్వపు చీకట్లలో కుమిలిపోతున్న ఆంధ్రదేశ చరిత్రలో ఇది ఒక నూతన కళాజ్యోతి: ఆంధ్రదేశ భవిష్యత్తుకు ఆశాజ్యోతి!

అధ్యాపకుల మీద విద్యార్థులకూ, విద్యార్థులమీద అధ్యాపకులకూ ప్రేమ ఏనాడున్నది? అన్యోన్యత ఏనాడున్నది?

అదుగో — మల్లంపల్లి మహాపండితుడు. పాఠశాల పందిట అడుగిడుతున్నాడు. ఆ విద్యార్థులకు ఏమిటా ఉత్సాహం, ఏమిటా ఉద్రూతలు! శరత్పూర్ణిమ నాటి సముద్రతరంగాలులాగా వారిహృదయాలు ఉవ్వెళ్ళూరుతున్నాయి! తమ హృదయాలను కానుక యిస్తున్న యువ రచయితలను చూసాడు ప్రధానాధ్యాపకుడు మల్లంపల్లి. మర్మంలేనిమహాపండితుడు తన హృదయం విచ్చి, వారి హృదయాల్లో లీనమైనాడు ఇక ఆ ఆనందబాష్పాలకు అంతులేదు. పరిచయ మర్యాదలకు పాగంలేదు.

వృద్ధుల్లో వృద్ధు, యువకుల్లో యువకుడు, అధ్యాపకుల్లో అధ్యాపకుడు, విద్యార్థుల్లో విద్యార్థి—ఎవరాయన?— ఆహ్వాన సంఘంవారితో కలిసి పందిళ్ళ నలంకరిస్తున్నాడు పెద్దలనూ పిన్నలనూ స్వీకరిస్తున్నాడు. పచ్చని పందిళ్లూ పాకలూ వేయించి, తన యింటినీ ఆవరణనూ పాఠశాలకై యిచ్చి, నూతన సారస్వత వికాసరేఖలను చూచి పారవశ్యం చెందుతున్న ఆ చదలవాడ కుటుంబరాయుడుగారి ప్రక్కనే నిలచి, ఆయనకు అండదండిగా వున్నాడు - ఎవరా వృద్ధ యువకుడు, యువక వృద్ధుడు? ఆయనే సుప్రసిద్ధాంధ్ర పండితుడు శ్రీ పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రి.

జగన్నాధుని రథచక్రాల హోరుతో ప్రపంచానికి దిగివచ్చిన శ్రీ శ్రీ తోటి యువకవుల్లో మరోప్రపంచపు మార్గదర్శిలాగా సంచరిస్తున్నాడు. కులంగాడి అంత్యక్రియలు చేసి, నూతన సోపానాలధిరోహిస్తున్న కొడవటిగంటి కుటుంబరావు—అదే. నిండుదనంతో నడుస్తున్నాడు. జగత్తును చిత్రజగత్తులోకీ, చిత్రజగత్తును జగత్తులోకి తారుమారు చేసి, ఏమీఎరుగనట్లు లీనాలీన దృష్టితో చూస్తున్నాడు చిత్రకారుడు గోఖలే!

కళను కడుపార గ్రోలి, ఏ స్వతంత్ర స్వర్గసీమలను సందర్శిస్తున్నాడో గాని, పాఠశాలా ప్రారంభకుడు దేవీప్రసాద రాయ్ చౌదరి ముఖంలో నూతనోత్తేజం పొడుసూపుతున్నది,

ధారావాహినిగా వస్తున్న పెద్దలను సత్కరిస్తూ, ఆహ్వాన సంఘాధ్యక్షుడు శరణు రామకోటయ్య చౌదరి ఉత్సాహడోలికల్లో ఓలలాడుతున్నాడు ఆయన చూపుల్లో కృతజ్ఞతా గౌరవం వెల్లివిరుస్తున్నది.

దేశంలోని వివిధప్రాంతాలనుంచీ కవులూ, పండితులూ తమ గ్రామం విచ్చేసారు. ప్రజాసాహిత్యమనే పలుకులు వినబడుతున్నాయి. సాహిత్యం ప్రజలకా....ఇక తమ కోసమే కథలూ, కావ్యాలూ, నవలలూ, నాటకాలూ వస్తాయి! ఏమి అదృష్టం! పెదపూడి ప్రజలు వేలకొలదిగా పాఠశాలావరణలో సమావేశమైనారు. పాఠశాలావిష్కరణ మహోత్సవానికై నిరీక్షిస్తున్నారు. వారి హృదయాల్లో ఏదో ఆత్మీయత మంతనాలాడుతున్నది; ఆర్ద్రత తొణకాడుతున్నది.

'గలగలా గోదారి కదలిపోతు'న్నట్లుగా, 'బిరబిరా కృష్ణమ్మ పరుగు

లిడుతు'న్నట్లుగా, తమ సంగీతంతో తెలుగుతల్లికి కొనక్కలిచ్చిన నాజరుదళం ప్రార్థనాగీతాన్ని ఆలపించింది:

"పాడిపంటలు పొంగిపొర్లే
దారిలోనువు పాటుపడవోయ్;
తిండికలిగితె కండకలదోయ్,
కండకలవా దేనుమనిషోయ్ ।—
"ఈసురోమని మనుషులుంటే
దేశమేగతి బాగుపడునోయ్ ?—
"స్వంతలాభం కొంతమానుకు
పొరుగువాడికి తోడుపడవోయ్
దేశమంటే మట్టికాదోయ్
దేశమంటే మనుషులోయ్ ।
"చెట్టపట్టాల్ పట్టుకొని దే
శస్థులంతా నడువవలెనోయ్,
అన్నదమ్ముల వలెను జాతులు
మతములన్నీ మెలగవలెనోయ్ ।"

ఇదేమి ప్రార్థన । ప్రజల హృదయాల్లోకి దూసుకుపోతున్నది । ఇదేనా ప్రజాసాహిత్యం - వారు తన్మయత్వంతో తలలూపుతున్నారు. తమ హృదయాల్లో అస్పష్టంగా ఏనాడో మ్రోగినవాణి, ఈనాడు తమకనుల యెదుట సాక్షాత్కరించింది । తమ భావాలకు ఈనాడొక స్వరూపం వచ్చింది । ఇదే ప్రజా సాహిత్యం.

ప్రార్థనానంతరం పాఠశాలావిష్కరణ మహోత్సవం ప్రారంభమయింది.

"మన యువ రచయితల విజ్ఞాన వికాసాలను పెంపొందించడం కోసం, వారికి మన ప్రాచీ నార్వాచీన సాహిత్య కళా సంప్రదాయాలను, విజ్ఞానాన్ని అందజేయడం కోసం, విశ్వసాహిత్య విశేషాలతో వారికి పరిచయం కలిగించడం కోసం, నూతనాభ్యుదయ సాహితీ నిర్మాణానికి తగిన శక్తి సామర్థ్యాలను వారికి సమకూర్చడం కోసం, ఈ సాహిత్య పాఠశాలను నడపాలని ఆంధ్ర అభ్యుదయ రచయితల సంఘ కార్యవర్గం తీర్మానించింది. ఆ ఆశయం తోనే పాఠశాలా నిర్మాణానికి పెద్దలందరూ తోడ్పడ్డారు ఈ సాహిత్య పాఠశాలద్వారా యువ రచయితలు తమ విజ్ఞాన వికాసాలను పెంపొందించుకో గలరని ఆశిస్తున్నాను

"ఆంధ్రదేశంలో ఇలాంటి సాహిత్య పాఠశాలను స్థాపించడ మనేది ఇదే ప్రథమం ఈ పాఠశాలను మనం జయప్రదంగా నడప గలిగితే, ఇది ఆంధ్ర సాహిత్యాభివృద్ధికి ఎంతో దోహదం చేసిందవుతుంది. ఇందుకు సాహిత్యాభిమాను లందరూ తోడ్పడి, పాఠశాల ప్రయోజనం నెరవేరేలాగా కృషి చేస్తారని విశ్వసిస్తున్నాము." అని శ్రీ చదలవాడ పిచ్చయ్యగారు పాఠశాల ఆశయాలను విశదీకరించారు.

ఆహ్వాన సంఘాధ్యక్షులు శ్రీ శరణు రామకోటయ్య చౌదరిగారు పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులనూ, విద్యార్థులనూ హృదయపూర్వకంగాఆహ్వానిస్తూ, అభినందిస్తూ ఉపన్యసించారు.

ప్రఖ్యాత చిత్రకారులు మద్రాసు ఆర్టు కాలేజీ ప్రిన్సిపాలు శ్రీ దేవీప్రసాదరాయ్ చౌదరిగారు పాఠశాలను ప్రారంభిస్తూ, భారతీయ కళాసంప్రదాయాలను గురించీ, కళాభ్యుదయాన్ని గురించీ గంభీరోపన్యాసం చేశారు. విద్యార్థులను తన్మయత్వంలో ముంచివేశారు.

విద్యార్థుల్లోని జిజ్ఞాస కళ్ళకు కనబడుతున్నది; వేలకొలదిగా సమావేశమై, సాహిత్యసభలకే నూతన సంప్రదాయాన్ని శోభనూ సమకూరుస్తున్న ప్రజల హృదయం చూపుకు అందుతున్నది. ప్రధానాధ్యాపకులు శ్రీ మల్లంపల్లి సోమశేఖర శర్మగారు ఇలా ఉపన్యసించారు.

"మీరూ, మేమూ, ఆహ్వానసంఘం వారూ అందరం ఒకే కుటుంబంలోని వాళ్ళం. ఏ అరమరికలూ లేకుండా మెలగవలసినవాళ్ళం. మన కార్యదీక్షే మనల్ని ఏక కుటుంబంలోకి తెచ్చింది మనం కలిసి మెలసి పనిచేయాలి

"రవీంద్రుడు, మహాత్ముడు జన్మించిన మనజాతి ప్రపంచానికే మార్గదర్శకమయింది. ముందింకా మనకు గొప్ప భవిష్యత్తు వుంది. కాని, మనం మన ప్రాచీన ద్యావిధానాన్ని జీర్ణించుకొని, ప్రస్తుతానికి అనుగుణంగా నవీన విద్యావిధానాన్ని నిర్మించుకోగలిగినప్పుడే మనం ముందుకు పోగలుగుతాం. అంతే కాదు, మన విజ్ఞానాన్ని సాహిత్యం ద్వారా ప్రజలకు పంచిపెట్టినప్పుడే మనకు భవిష్యత్తు వుంది.

"అభ్యుదయ రచయితల సంఘం ఈ పాఠశాలను నడుపుతున్నందుకు నేను గర్విస్తున్నాను ఎందుకంటే—ఇది ప్రజలకూ సాహితీపరులకూ సన్నిహితత్వం కలగజేస్తున్నది. ఇందువల్ల సాహిత్యం ప్రజలలోకి పోతున్నది; ప్రజల్లో సాహిత్యాభిలాష రేకెత్తుతున్నది.

"ప్రజల్లో సాహిత్యాభిరుచి కలిగినప్పుడే మన సాహిత్యం రాణిస్తుంది వన్నెకెక్కుతుంది. పెంపొందుతుంది. అనేక నూతన కావ్యాలు వెలువడుతాయి. ప్రజలకు విజ్ఞానాన్ని పంచిపెడతాయి. ప్రజావిజ్ఞానమే దాస్యవిముక్తికిమార్గం.

"మనం విదేశాలనుంచి చాలానేర్చుకున్నాం. కాని ఒక్కటిమాత్రం ముఖ్యమైనది నేర్చుకోలేదు ఇంగ్లాండులో ఏదైనా ఒక విద్యాలయంవారు ఒక పుస్తకాన్ని ప్రకటింపదలిస్తే, ముందుగా ఆరిచయిత మామూలు కార్మికుల దగ్గరకు వెళ్ళి వారికి ఉపన్యసించి, వారి స్థాయిని తెలుసుకొని, వారి కర్థమయ్యే భాషలోనే తన గ్రంథాన్ని వ్రాస్తాడు. అందువల్ల ఆపుస్తకం ప్రజాసామాన్యానికీ, విజ్ఞానవంతులకూ ఉపయోగ పడుతుంది. ఈపద్ధతినే మనమూ అనుసరించాలి

"మన సాహిత్యపాఠశాల, ఏ కళాశాలా చేయజాలని మహత్తర కార్యాన్ని చేసి చూపుతుంది. మనలక్ష్యంఒక్కటే. అది ప్రజాసాహిత్యం. ప్రజావిజ్ఞానం.

"ఇది ప్రజల విశ్వవిద్యాలయం. ఇది ప్రజల ఆదరణవల్లనే నడుస్తున్నది. ప్రజలకోసమే నడుస్తున్నది. యిలాంటి కళాశాల భారతదేశానికే అపూర్వమైనది అద్వితీయమైనది. దీన్ని మనం విజయవంతం చెయ్యాలి దీనికి ప్రతి విజ్ఞానవేత్త, కళావేత్త తోడ్పడి తీరాలి." అని శర్మగారు విజ్ఞానవేత్తల, పురప్రముఖుల సహాయ సానుభూతులను అర్థిస్తూ ఉపన్యసించారు. పాఠశాలా కార్యక్రమాన్ని గూర్చీ, పాఠ్యక్రమాన్ని గూర్చీ ముచ్చటించారు

తరువాత శ్రీ పంచాగ్నుల ఆదినారాయణ శాస్త్రిగారుపన్యసిస్తూ, తమకు

1916 నుంచీ ఇలాంటి పాఠశాల నొక దానిని నడపాలనే కోరిక వుండేదనీ, ఈనాటికయినా అభ్యుదయ రచయితల సంఘంవారు ఆంధ్ర సాహిత్య పాఠశాలను నడుపుతున్నందుకు తాము సంతోషిస్తున్నామనీ అన్నారు.

"ఇంతవరకూ అభ్యుదయ రచయితలు ఆంధ్రుల జాతీయ విజ్ఞానవ్యాప్తికి ఎంతోకృషిచేశారు. వీరు నడుపుతున్న సాహిత్య పాఠశాలకు ప్రజలసహకారం పూర్తిగా వుంటుందని నా ఆశ" అని శ్రీ ఆదినారాయణ శాస్త్రిగారు తమ ఉపన్యాసాన్ని ముగించారు.

"మన సాహిత్యవేత్తలు ఎన్నాళ్ళ నుంచో కలలుగంటున్న సాహిత్య పాఠశాలకు ఇవాళ రూపం ఏర్పడింది. విజ్ఞాన సంపదను లోకానికి అందజేయాలని మన విజ్ఞానవేత్తలు తహతహ పడుతున్నారు తర్వాత తమ వైజ్ఞానిక సంప్రదాయాలనూ, సాహిత్య సందేశాన్ని ముందుకు తీసుకుపోగల సాహిత్య సేవకులైన యువకులకోసం వారు ఎదురు చూస్తున్నారు. అలాగే, వివిధ సాహిత్యాలలోను ప్రవేశం కలిగి వివిధ కళల లోను పరిశ్రమ చేస్తున్న యువకులు కూడా తమ పెద్దల కృషిఫలితాన్నీ పెద్దలు సేకరించిన విజ్ఞాన సంపత్తును అందుకొని, తాము అభివృద్ధి చెందడానికీ, ఆంధ్రజాతి విజ్ఞానాన్ని పెంపొందించడానికీ కుతూహల పడుతున్నారు

"ఈ విధంగా పెద్దలలోను యువకులలోను వున్న ఏకాశయమే ఈ పాఠశాలా నిర్మాణానికి పునాది. ఈ ఆశయైక్యతే అధ్యాపకుల విద్యార్థుల మధ్య అన్యోన్యతకూ, ఐక్యతకూ, ఆధారం. ఇది ఆంధ్ర సాహితీ రంగంలో, నూతన శకానికి దారి తీస్తున్నది.

"ఈ పాఠశాలా ప్రయత్నాలలో అన్ని విధాలా తోడ్పడిన ప్రజలకూ, సాహితీ వేత్తలకూ నా కృతజ్ఞతాభివందనాలు. ఈ పాఠశాలను జయప్రదంగా నడుపుకొనడం మీదనే ఆంధ్ర సాహిత్యాభివృద్ధి ఆధారపడివుంది. కనుక పాఠశాలా విజయానికి అధ్యాపకులూ, విద్యార్థులూ, సాహితీ ప్రియులు, అందరూ తోడ్పడాలని కోరుతున్నాను." అని పాఠశాల ఉపసంఘ కార్యదర్శి శ్రీ చదలవాడ పిచ్చయ్యగారు ఉపన్యసించారు.

పాఠశాలావిష్కరణ మహోత్సవం ముగిసింది అర్ధరాత్రి అయినా, సభ అప్పుడే ముగిసిందేమా అని ప్రజలు పాఠశాలావరణనుంచి కదలలేక కదలుతున్నారు. పురప్రముఖులొక్కరొక్కరే వచ్చి అధ్యాపకుల కరస్పర్శ అందుకొంటున్నారు. విద్యార్థులూ అధ్యాపకులూ ఏమేమో అన్యోన్యం సంప్రదించుకొంటున్నారు. ఎవ్వరికీ నిద్రరావడం లేదు జగత్తే మేల్కొన్నది!

★

" జ్ఞప్తి కెలయించుచున్నాడ ; చావలేదు,
చావలేదు ఆంధ్రుల మహోజ్జ్వల చరిత్ర—"

— రాయప్రోలు సుబ్బారావు

యుగసంధి

● సోమసుందర్ ●

ఎవరి దీ పాట ?
ఎవరు వీరు ... ?
మహోత్పాతమై
గహనాంతర నిష్యందంవలె,
సజీవ జాజ్వల్యమాన
విప్లవశంఖపు
విఖాతశబ్దం !
ఎక్కడిదీ శబ్దం — !
శతాబ్దాల నిద్రబరువు
చెరవిడిపించే నాదం, వీరిది.
ఎవరు వీరు ?
ఎవరి దీ పాట — ?
మమ్ముల మేలుకొల్పి
పురి ఎక్కిస్తూ ఉసికొడుతోంది :
ఎవరి దీ పాట ?
ఏదో నవజీవిత
శుభోదయారుణకాంతుల
విప్లవ వెల్లువలను
మా ముంగిలిలో నిలిపింది !
సువర్ణచ్ఛాయల రంగవల్లికల
తీర్చి దిద్ది మా కొసగింది :
ఎవరి దీ పాట ?
ఎవరు వీరు — ?
ప్రజావిరోధుల
కుత్తుకలను తెగనరకుచు
నిరోధశక్తుల
హతమార్చుటకై
శపథం పూనారట....
వీరేనా ?
వీరే. మావారై కపటం
విడిచారట !
శాప దగ్ధులగు
కర్మబద్ధులగు,
దేశజనుల హిత మెంచారట !
ఓహో, వీరేనా.... !
మేలుదారి మా కొసగెడి
కొసలెత్తిన అభ్యుదయవాదులా ?
బుసకొట్టిన తాచుపాములట.
వీరిపగేనా - ప్రజాద్రోహులకు.... ?
ఈ పాట ....
మా హృదంతరాళపు
కవోష్ణరక్తజ్వాలలు
ఎగసన తోస్తోంది . ?
నవజీవిత విభాతవేళా
నిర్ణయ నిర్మాణానికి
మా బలాల నొద్దే శక్తిస్తోంది .... !
ఈ పాటే, మా కిప్పుడూ
ఎప్పుడూ, పరంపరగా
అనుశ్రుతంగా
కావాలి !
ఇనుప కవచముల,
ఉక్కుగోడలను.
చీల్చే విప్లవ ఉజ్జీవితమై
వెలగాలి ! !
విప్లవ విపంచి సంతత నాదం,
మాదై మాకోసం,
వినిపించాలి ! ! :
రండయ్యా-
మా స్వాగత మందుకోండి !

సందేశం

★

"సుకుమార్"

★

"చదువుకున్నవారు నలుగురైదుగురు ఒకచోట గోష్ఠిగా చేరి ఏ విషయం గురించైనా చర్చించడానికి పూనుకునే ముందు, చర్చలో తాము ఉపయోగించ బోయే కొన్ని ముఖ్యమైన మాటల అర్థమును నిర్వచించుకుంటే యెంతో మంచిది" అన్నారు ఈమధ్య ఒకరు అల్లా నిర్వచించుకుంటే చర్చే అవసరములేకుండా పోవచ్చుకూడాను. ఎందుకంటే, అనేక విషయాలలో, కొన్ని కొన్ని వివరాలలో అభిప్రాయభేదానికి అవకాశముండవచ్చును కాని, అసలు విషయం గురించి, కాస్త జాగ్రత్తగా ఆలోచిస్తే భేదాభిప్రాయానికి తావేలేదు, మాటలయొక్క అర్థము, విశేషార్థము, పెడర్థము— వీటివల్ల ఎక్కడ లేని తర్కానికీ వీలుంది. అంతంలేని పేచీకి తావుంటుంది.

"ఎటువంటి పరిస్థితులలోనూ, 'అభ్యుదయ' మనేది మంచిది అని అందరూ ఒప్పుకుంటారు. 'రచన' కూడా అత్యవసరమనీ, రచనే ఒకజాతి సజీవంగా ఉన్నట్టు అనవాలనీ అందరూ సమ్మతిస్తారు. కాని, 'అభ్యుదయ రచన' అనే సరికి, "ఏది అభ్యుదయము?" — "ఏది రచన?" అనే ప్రశ్నలు బయలుదేరి, రాద్ధాంత సిద్ధాంతాలు మిన్నుముట్టుతాయి. వివరాలలో చిన్నిచిన్ని, పెద్దపెద్ద, తేడాలు ఉన్నా మన అందరి లక్ష్యమూ ఒక్కటే: మనదేశంలోని నలుబదికోట్ల ప్రజలలోనూ ఇదివరకు ఎన్నడూలేని చైతన్యం కలగాలి. ఈ ప్రజ అంతా మన జాతి జీవితపు ఒడుదుడుకులను అవగాహన చేసుకుని యీ జాతీయ జీవనంలో తామున్నూ కొద్దో, గొప్పో, పాల్గొనాలి" అనేదే - మన అందరి తీవ్రమైన వాంఛ ఈ గమ్యస్థానం జేరడానికి అనేక మార్గాలున్నాయి. కొందరు, "కొంతవరకైనా మన తాతముత్తాతలు నడచిన మార్గాన్నే నడుద్దాము" అని పట్టుపడుతూఉంటారు. కొందరు - కుర్రకారు - అబ్బే! అదుగో అడ్డత్రోవ! కనబడుతూనే ఉన్నదిగా! పదండి ముందుకు! పదండి తోసుకు" అని చిందులు త్రొక్కుతారు. నా ఉద్దేశంలో, భాషాసేవలోవారికీ స్థానం ఉన్నది, వీరికీ స్థానం ఉన్నది

"నేను అనుకోవడం: 'అభ్యుదయ రచన' అనేది ఒక పద్ధతికాదు. ఒక ఉద్యమం. కొన్నికొన్ని విశేషమైన పరిస్థితులలో ఇటువంటి ఉద్యమాలు బయలుదేరతాయి ముఖ్యంగా, నిన్న మొన్నటివరకు, గాఢనిద్రలోనో, మేల్కొనివున్నా మదురమైన స్వప్నాల మైకంవల్లనో ఒళ్ళు తెలియకవున్న మన సాహిత్య జీవనంలో ఒక గొప్ప మెలకువ కలిగిస్తున్నాయి ఈ ఉద్యమాలు ఈ ఉద్యమాలను ప్రోత్సహించి నవనాగరికతవల్ల మనకు కలుగుతూ ఉన్న సదుపాయాలను అన్నిటినీ వినియోగించి మన ప్రజానీకంలో ఒక క్రొత్త

ఆశ, ఒక క్రొత్త శక్తి. కలిగింప కలిగినామంటే, ధన్యులమన్న మాటే।

"ఈదీక్ష కొనసాగడానికి "అభ్యుదయరచన" అనే వ్యావహారిక నామంతో వర్తిస్తూఉన్న ఉత్తమ కృషి అన్ని విధాల తోడ్పడుతుంది—అని మన అభిలాష.

"ఐతే, ఎంత వడిగా వెళుతూవున్నా గాడి తప్పకూడని రైలులా కాకుండా; నిర్మల నీలాకాశంలోనూ, మేఘాలగుంపులలోనూకూడా యధేచ్ఛగా విహరిస్తూ ప్రపంచ జీవితాన్నే ఒక గొప్ప ఖగేంద్రంలా చూడగలిగే యైరోప్లేన్‌లా వుండాలి 'అభ్యుదయ రచన'— అని మన కోరిక."

★

'అభ్యుదయ' సచిత్రమాస పత్రికగా ఈ నెలలో నవ్యసాహిత్య రంగంలో ప్రవేశిస్తున్నందుకు చాలా సంతోషం.

అభ్యుదయ రచయితల సాహిత్య కృషి ఒక అపూర్వమైన, విశిష్టమైన పద్ధతిలో కొనసాగుతూ ఉండవలెనని నేనెప్పుడూ అనుకొంటూ ఉంటాను. చదువ నేర్చినవారి కందరికీ 'అభ్యుదయ' అందుబడిలో ఉండాలి. వాస్తవమైన సంస్కృతి అంటే ఏమిటో, విజ్ఞానమంటే ఏమిటో - అద్దంలో లాగ ప్రస్ఫుటంగా తెలిసే సులభమైన ప్రజల భాషలో వ్యక్తముచేస్తూ, సామాన్య మానవుని జ్ఞాననేత్రము తెరచుకొనేలాగ చెయ్యాలి. నేటి కొత్త ప్రపంచంలోని కొత్త పరిస్థితులు విశదముచేస్తూ, రేపటి కార్యకలాపానికి పాఠకులను సన్నద్ధులనుచేస్తూ ఉండాలి - అంటే, సాహిత్య కృషిలో ఉద్దేశము, వస్తువు, రచన సామాన్య మానవుని ఉత్తమ జీవితానికి కొనిపోయే అభ్యుదయ దృష్టి ప్రధానంగా వహించి ఉండాలి.

ఆంధ్ర రాష్ట్రం సిద్ధించ బోతూఉన్న ఈ కాలంలో, విద్యావిధానమంతా మాతృభాషలో జరగడానికి ఏర్పాటు చేసు కొంటూన్న ఈ కాలంలో, విజ్ఞాన వ్యాప్తికి మనభాషను సమర్థమైన సాధనంగా చేయవలసి ఉన్నదిగదా। భాషకు అటువంటి ఆకృతి 'అభ్యుదయ' సాధించాలి.

నేటి నాగరక జీవనానికి అవసరమైన సమస్త విషయాలు 'అభ్యుదయ' చేపట్టి ప్రజలకు విశదము చేయాలి. దేశము నలుమూలలా 'అభ్యుదయ' వ్యాపించాలి.

—తెరికిచర్ల వెంకటరత్నం,

కార్యదర్శి, నవ్యసాహిత్య పరిషత్తు.

★

"దేశమనియెడి దొడ్డవృక్షం - ప్రేమలను పూలెత్తవలెనోయ్.


నరుల చెమటను తడసి మూలం - ధనం పంటలు పండవలెనోయ్"

— గురజాడ



(4)

ఆంధ్ర సాహిత్య పాఠశాలా ప్రారంభకులు



శ్రీ దేవీప్రసాదరాయ్ చౌదరిగారు

విప్లవం వద్దన్నా వస్తుంది; భవిష్యత్తు మనవైపే చూస్తున్నది!

శ్రీ దేవీ ప్రసాదరాయ్ చౌదరిగారి ప్రారంభోపన్యాసం

ఆంధ్ర సాహిత్య పాఠశాలను ప్రారంభించే అవకాశం నాకు లభించినందుకు నేను ఎంతో గర్వపడుతున్నాను. 'పాఠశాల' అన్న పదం వినంగానే నాకు ఆటలను వదులుకొని, పెద్దల బలవంతంమీద బళ్లోకివచ్చి కూర్చునే చిన్నపిల్లలు, ఆ దృశ్యం జ్ఞాపకానికి వచ్చింది పిల్లలు - ఇష్టంలేకున్నా. కష్టంగావున్నా చదువుకోటానికి వచ్చినట్టు మనం సమాజంలో జీవితాన్ని గడపడానికి వీల్లేదు - సామాజిక జీవితంలో పరస్పర సహకారం అవసరం సామాజిక ఆదర్శం 'సమగ్రమైన జీవితం'. మనచుట్టూ నీడలలాగా సోలుతూ, బాధలతో క్రుంగి క్రుంగి కృశించే పీడితులున్నారు. వీళ్ళ బాధను పోగొట్టను, కన్నీళ్ళు తుడవను, చావక బ్రతికివున్న వీళ్ళకి ప్రాణంపొయ్యను, మనం మన ఉత్సాహాన్ని, ఉద్వేగాన్ని, మన నస్సులోపుట్టే ఊహలను, మన సర్వస్వం ఆనందంతో సమన్వయింపజేసుకోవాలని విజ్ఞులంటారు.

సంగీతం, కవిత్వం, చిత్రలేఖన, నాట్యం, మొదలైన లలితకళలద్వారా మనంపొందే 'ఆనందం' మన హృదయ ఫలకంమీద నిశితంగా, స్పష్టంగా హత్తుకుని, మనల్ని యీ ప్రపంచానికి అతీతమైన ఒక ఉత్తమ స్థాయికి తీసుకుపోతుంది. వైజ్ఞానికపథాల్లో విహరించాలంటే మనకు విశిష్టమైన సాహిత్యం. వేదాంతం, చరిత్ర, బహుభాషలువున్నై. వీటన్నింటిలో కళలకి ప్రత్యేకతవుంది.

ఈ అభ్యుదయరచయితల ఆదర్శం వివిధ కళావిజ్ఞానాన్ని సేకరించుకుంటూ ప్రముఖంగా సాహిత్యంలో కృషిచెయ్యడమనుకుంటాను.

ప్రతి నూతన ఉద్యమం జయప్రదం కావాలంటే, ఉద్యమ ప్రారంభదశలో ఉద్యమ నిర్వాహకుల స్వార్థపరత, స్వాభిమానాలు అడ్డురాకుండా వుండాలి. ఒకరొకరు వారివారి ప్రాధాన్యతలకు కీచులాడటం తగదు. ఇట్లాంటి విషబీజాలేవైనా యీదారిన పడినట్లయితే అవి అమాయగా ఒక విషవృక్షంగా తలెత్తుతాయి. ఒకరికన్నామరొకరు ఉద్యమంలో ఎక్కువ కృషి చెయ్యటం మంచిదేకాని అసూయ పొటమరించకూడదు.

మీ ఉద్యమంయెడల నాకు గాఢమైన విశ్వాసమూ, సానుభూతి వున్నప్పటికీ, వ్యక్తుల భేదాభిప్రాయాలు సంఘాదర్శానికి భంగం కలిగించకుండా కాపాడుకోవాలని సూచిస్తున్నాను. దీనికి సహనం, సహకారం, ఒకర్నొకరు అర్థం

చేసుకోవటం నేర్చుకోవాలి సాంఘిక జీవితానికి అలవడాలి.

మనల్ని ఉత్సాహపరిచే, ఉద్రిక్తం చేసే, మన కానందాన్నియిచ్చే కళ మన 'జీవితాని' కొక నూతన వ్యాఖ్యానం చేసేదిగా వుండాలి. మన అణువణువులో, నరనరములో చైతన్యవంతమైన కాంతిని ప్రసరింపచెయ్యాలి. ఈ సృజనాశక్తి అనేకకారణాలవల్ల ఆయావాతావరణాన్ని పురస్కరించుకుని మనలో ప్రభవిస్తుంది. ఈ కళాస్పందనలను విశదంగా వివరించటానికి మన జీవిత రహస్యాన్నే విపులీకరించాలి.

మేధావులు యీ జీవిత రహస్య శోధనకు తలక్రిందై తపస్సుచేశారు. అందరి యత్నాలూ కొండను త్రవ్వి చిట్టెలుకను పట్టినసామెతగా పరిణమించాయి. వారు బుద్ధిబలంతో యెన్ని గరిడీలు చేసినా తేలింది ఏమిటి? నరనరమూ, ఎముక ఎముకా పిండికొట్టి శాస్త్రజ్ఞులు జీవశక్తి ఎట్లా పెంపొందుతున్నదన్నారు? దీనికి సూటిగా సమాధానం చెప్పలేం.

కాని, మనల్ని కార్యాచరణకు ప్రేరేపించే ఉద్వేగం. మన యత్న కార్యసిద్ధితో, మహానదులు గంభీర సాగర గర్భంలో లీనమైపోతున్నట్టు పర్యవసిస్తున్నది చిత్రంగా. ఈ అనుభవానికి మీరు యే పేరుపెట్టినా పెట్టవచ్చు; కళావేత్తకు యిక్కడ ఒక విషయం బోధపడుతుంది. కొండలు, గుట్టలు, ఎడారులు దాటి, నదులు సముద్రంలో కలిసినట్టు, కళావేత్త, ఉద్వేగి. తన ఊహలలో, కలలలో సృష్టించుకున్న సుందర నందన వనాలను యదార్థ జగత్తులో సృష్టించుకున్నప్పుడు ఆయన సృజనాశక్తికి ఒక రూపాన్ని కల్పిస్తాడు. ఇట్లా రూపకల్పన చేసుకోడంవల్ల తను పొందిన ఆనందం అందరూ పొందగలిగేట్టు చెయ్యాలి ఇదే కళయొక్క ఉత్కృష్టమైన ఆదర్శం,

అందరి జీవితాల్లోనూ సుఖదుఃఖాలు చీకటి వెలుగులలాగా వున్నాయి వీటిని అనుభవించినంతమాత్రంచేత అందరూ వ్యక్తీకరించలేరు. అవి మూగగా, తలుపులు మూసినట్టు లో లో అణిగి అణిగి వెలికిరావు. వాటిని వివరించి వెలికి తేగలిగినవాడే కళాశీలి.

కళావిషయాల్లో 'సాహిత్యపాఠశాల' అవిరళంగా కృషిచెయ్యాల్సివుంది. యీ సంఘ యాజమాన్యంక్రింద పెదపూడిలో ఒక కళా కేంద్రాన్ని నిర్మించగలిగితే, మన ఆదర్శాలను ఆచరణలోకి సత్వరం తేగలమని నా నమ్మకం మన జీవితాన్ని ముందుకునడిపించగలిగే సంస్కృతికీ, విజ్ఞానానికీ మనం బలమైన పునాదులు వెయ్యాలి.

ఈ ఉన్నత సంస్కార భావాలు మన మనోవలయాన్ని విశాలం చేస్తాయి. ఎదుగు బొదుగు లేకుండావుండే సంకుచితత్వాన్ని నశింపజేస్తాయి

జీవితావరణంలోని సంకుచితమైన కొన్నిపొలిమేరలు, శిక్షణాదశలో కొంత ఉపకరిస్తాయేమో కాని పెంపొందుతూ 'నవ్యత' నన్వేషించే మనస్సుకు అవి గొడ్డలిపెట్టు. సంకుచితత్వం జ్ఞాన తృష్ణకు యినుపతెరలువేసి దాస్యానికి దారితీస్తుంది,

మనిషైనవాడు ఎప్పుడూ ముందు చూపు చూస్తూ అభ్యుదయపథంలో నడుస్తున్నాడు. యీ కృషికి విలువకట్టవలసింది నేనుకాదు—'కాలం'. ఎప్పుడూ మానవుడు మార్పునే వాంఛిస్తున్నాడు. అంటే 'నవ్యత' నన్వేషిస్తున్నాడు. ఇది నిజం.

జీవితస్రవంతి యింకిపోకుండా కాపాడేది మార్పు. మార్పును వాంఛించడం ధీరుని లక్షణం. మారేదే వీరుల లోకం. స్థిరపడుతున్న భావాలలో మార్పురాగానే కల్లోలం కలుగుతుంది. సంప్రదాయమనే సంకెళ్ళు తుత్తునియలవుతై. నీలి నీలి చీకటిపట్టాలాలలాగా తనచుట్టూ క్రమ్ముకునే మసకమబ్బులను వెలుగులకళారవి పటాపంచలు చేస్తాడు.

మార్పు సహజం, విప్లవం వద్దన్నా వస్తుంది. భవిష్యత్తు మనవైపే చూస్తున్నది.


కానీ, విప్లవం పోరాటంలేంది రాదు. పోరాటానికి సిద్ధమై మీ సంఘం సేనలలాగా ముందుకు పోవాలి. జీవితం నిండుగా వుండాలి బ్రతుకొక అతుకుల బొంత కాదు.

ముగించబొయ్యేముందు ఒక్కమాట చెప్తాను. యీ పాఠశాలలోని కవి, గాయకుడు, చిత్రకారుడు, కథకుడు అందరూ కలిసిమెలిసి పాఠశాల ఆశయ సిద్ధికి అందరూ పాటుబడాలి.

సలసల క్రాగే చమురా? కాదిది,
ఉష్ణ రక్త కాసారం……………

—శ్రీ శ్రీ

సుప్రసిద్ధాంధ్ర పండితులు



శ్రీ పంచాగ్నుల ఆదినారాయణ శాస్త్రిగారు

ప్రాకృతభాషావాదం

శ్రీ పంచాగ్నుల ఆదినారాయణ శాస్త్రి

మనకు అతి ప్రాచీనకాలంనుండిన్నీ సంస్కృత భాషా పాకృత భాషా అని రెండు భాషలు ప్రచారంలో ఉన్నట్లు తెలుస్తుంది సాధారణంగా భాషాస్వరూపంలో వ్యవహారంలో నాగరకంగా దిద్ది తీర్చిన భాషను సంస్కృతం అనీ, ఏవిధాలయిన నాగరక సంస్కారణలు చేయకుండానే సహజంగా ప్రజల వాడుకలో ఉన్నది ఉన్నట్లుగా ఉండే భాష ప్రాకృతం అనీ, మనం సౌలభ్యంకోసం చెప్పవచ్చు ఇది స్థూలదృష్టి నిరూపణం.

అయితే, ఆదికాలాన, ఇప్పుడు మనం సంస్కృతం ప్రాకృతం అని చెప్పే యీ రెండుభాషల మూలభూతమైన భాషకూడా సంస్కృతమే అనేది మనం మరచిపోకూడదు. కాని ఆనాడు దీనికి గీర్వాణభాష. లేక దేవభాష అని వ్యవహారం కూడా ఉండేది. ఉన్నప్పటికిన్నీ ఆభాష అప్పటికీ ఇప్పటికీ ఏకాకారంతో ఉందా? అంటే లేదనే నాసమాధానం. ఋగ్వేదనిర్మితి అయిన ఆ తొలికాలంలో సంస్కృతంమనభారతీయులకు సర్వసామాన్యభాషగా ఉండేదనేది సర్వవిదితమైన అంశం ఋగ్వేద సూక్తాలకు రచయితలుగానో, ద్రష్టలుగానో ఉన్న మహర్షులు ప్రకృతి సందర్శనంచేత పల్లవితమైన హృదయాలు కలవారై, తాము అనుభవించిన ఆ అద్వితీయానందాన్ని సూక్తరూపంగా గానంచేశారు అట్టి సూక్తాల సంపుటియే ఆవేదాలుగా పరిణమించినవి కాబట్టి వేదరచనలో ఆనాడు వ్యవహరింపబడిన సంస్కృతమును విషయవివేచనకై ఆర్షసంస్కృతం అని కానీ, వైదిక సంస్కృతం అనికానీ వ్యవహరించేవారు. ఈవైదికసంస్కృతం సాధారణ సంస్కృతంకంటే విభిన్న రూపంతో ఉండేది చిన్న ఉదాహరణం భద్రం కర్ణేభిశ్శృణుయామదేవాః - అనే ఋక్కు ఉన్నది. ఇందులో కర్ణేభిః - అని అకారాంత శబ్దముయొక్క తృతీయా బహువచనరూపం వాడివున్నది అది ఈనాటి సంస్కృతభాషలో అయితే - కర్ణైః అని ఉండాలెకదా. ప్రస్తుతం ఇక్కడ మనం గమనించవలసినవిషయం ఏమిటీ అంటే, ప్రజల వ్యవహార భాషయైన ఆనాటి సంస్కృతం, వేదాల రూపంగా గ్రంథస్థం అయిన దశను - ఆర్ష సంస్కృతంగా మనం గుర్తించవలసివున్నది.

ఆ తర్వాత రెండో దశలో వ్యవహారస్థమైన గ్రంథాకృతిని దాల్చినట్టి, ఆ ఆర్షసంస్కృతం ఉపనిషత్తుల ప్రాదుర్భావకాలానికి మఱికొన్ని మార్పులను పొందింది. దీనిని మనం ఔపనిషదికయుగంగా గుర్తింతాము. తరువాత మఱల ప్రజల వ్యవహారంలో దీనికి చాలా మార్పులు ఏర్పడ్డవి. పురాణాలరచన ఏర్పడిన దశలో ఈ మార్పు

మతాలను సమర్థించుకొనడాన్ని మనం గుర్తించవచ్చు ఈలాగా అనేక విధాల యిన అడ్డుపొడ్డులతో, పడుతూ లేస్తూ పెఱిగిన యీప్రాకృత భాషావాదం, మన ఆంధ్రులలోని వ్యావహారిక భాషావాదం లాగానే, గ్రంథ ప్రయోజ్యస్థితిని పొంద గలిగేసరికి, ఎన్నెన్నో అంతరువులను దాటవలసి వచ్చింది. ఆ అంతరువులను కొంచెంవివరించి అనుశీలనంచేసిచూస్తే ప్రాకృతవాదం యొక్క స్థితి గతులు మనకు స్పష్టం అవుతవి. కాబట్టి వాటిని అనుశీలనం చేతాము.

తొలుత సంస్కృతాభిమాను లయిన పండితులు మన వ్యావహారిక భాషకు అసూయతో పేర్లుపెట్టినట్లుగానే ఆ కాలంలో ప్రాకృతానికి అపభ్రంశభాష అని పేరుపెట్టారు. అపభ్రంశత పొందిన భాషను శిష్టులయినవారు నోట ఉచ్చరించ దానికే అర్హత లేదన్నారు మఱి ఈ స్థితిలో దానికి గ్రంథాలలో ప్రయోగించ తగిన యోగ్యత ఉందని వారు ఒప్పు కుంటారా ? ఆలోచించండి.

"నమ్లేచ్ఛితవై నాపభాషితవై" అనే శ్రుతినీ, "అహితాగ్నిరపశబ్దం ప్రయుజ్య ప్రాయశ్చిత్తీయామిష్టిం నిర్వపేత్" అనే శ్రుతినీ వారు ఆయుధాలుగా చేపట్టారు. సంస్కృతశబ్దాలను అనుశాసనం చేసిన పాణిని పతంజల్యాదులు, వ్యాకరణశాస్త్ర ప్రయోజనాలనుచెప్పడంలో "మ్లేచ్ఛా మా భూమేత్యధ్యేయం వ్యాకరణం" అని చెప్పారు. పతంజల్యాదులు అపశబ్దాలే లోకంలో హెచ్చుగా ఉన్నవనీ, సుశబ్దాలు చాలాతక్కువగా ఉన్నవనీ, ఉదాహరణంగా ఒక్క గోశబ్దాన్ని తీసికొంటే "గౌరిత్యస్యగావీగోణీగోపోతలికాగోతా" అని ఇత్యాదులు అపభ్రంశాలు ఎన్నో ఉన్నవని చెప్పారు. కాబట్టి వ్యాకరణాను శాసనం అవశ్యకంగా చేయవలసిన కార్యమే అని సమర్థించుకొన్నారు.

పతంజలి గోశబ్దానికి ఉన్నవన్న ఈ అపభ్రంశ రూపాలన్నీ జైన బౌద్ధాదు లయిన ప్రాకృతగ్రంథకర్తల గ్రంథాలలో మనకు నేటికీ కనిపిస్తవి. దీన్నిబట్టి నాటి సంస్కృతవాదులు ప్రాకృతభాషా వాదాన్ని మిక్కిలి పట్టుదలతో ఈసడించే వారనడం స్పష్టం.

ఏ వాదానికైనా కానీండి, అసమంజస మైన అవరోధం పెచ్చుపెరిగేకొద్దీ రెండు విధాలైనపంథాలు ఏర్పడుతవి. ఆపంథాల ఫలితాలలో మొదటిది, పట్టుదలతో తమ పైన ఆరోపించినదాన్ని సమర్థించుకో వలెనని పూనుకోవడముగా వుంటుంది. ప్రాకృతభాషావాదంలోకూడా ఈఫలితమే ఏర్పడ్డది. రెండోది ఏదోషాలు తమపైని ప్రతిపక్షంవారు చేశారో, వాటిని అవాదం వారిలోనే ఎన్నిచూపడము.

ప్రాకృత భాషావాదంవారు ఈ రెండు మార్గాలూ అవలంబించారు. సంస్కృతపక్షంవారు- ప్రాకృతభాష శిష్టులకు స్వీకారయోగ్యం కాదనీ, దానిలో మాధుర్యాదులయిన సారస్వత గుణాలు లేవనీ, అది అపభ్రంశమైన భాషకాబట్టి శ్రుతులు ధర్మశాస్త్రాలు మొదలయిన వాటిచేత అది నిషేధింపబడినదీ అనీ, పరి పరి విధాల దోషనిరూపణలుచేశారు. ప్రాకృతభాషావాదులు వీటిని ఎదిర్చి, తమ భాషయొక్క విశిష్టతను చాటారు. గ్రంథాలు వ్రాశారు. ఆబాలగోపాలమూ

మతాలను సమర్థించుకొనడాన్ని మనం గుర్తించవచ్చు ఈలాగా అనేక విధాల యిన అడ్డుపొడ్డులతో, పడుతూ లేస్తూ పెఱిగిన యీప్రాకృత భాషావాదం, మన ఆంధ్రులలోని వ్యావహారిక భాషావాదం లాగానే. గ్రంధ ప్రయోజ్యస్థితిని పొంద గలిగేసరికి, ఎన్నెన్నో అంతరువులను దాటవలసి వచ్చింది. ఆ అంతరువులను కొంచెంవివరించి అనుశీలనంచేసిచూస్తే ప్రాకృతవాదం యొక్క స్థితి గతులు మనకు స్పష్టం అవుతవి కాబట్టి వాటిని అనుశీలనం చేతాము.

తొలుత సంస్కృతాభిమాను లయిన పండితులు మన వ్యావహారిక భాషకు అసూయతో పేర్లుపెట్టినట్లుగానే ఆ కాలంలో ప్రాకృతానికి అపభ్రంశభాష అని పేరుపెట్టారు. అపభ్రంశత పొందిన భాషను శిష్టులయినవారు నోట ఉచ్చరించ డానికే అర్హత లేదన్నారు మఱి ఈ స్థితిలో దానికి గ్రంధాలలో ప్రయోగించ తగిన యోగ్యత ఉందని వారు ఒప్పు కుంటారా? ఆలోచించండి.

"నమ్లేచ్ఛితవై నాపభాషితవై" అనే శ్రుతినీ, "ఆహితాగ్నిరపశబ్దం ప్రయుజ్య ప్రాయశ్చిత్తీయామిష్టిం నిర్వపేత్" అనే శ్రుతినీ వారు ఆయుధాలుగా చేపట్టారు. సంస్కృతశబ్దాలను అనుశాసనం చేసిన పాణిని పతంజల్యాదులు, వ్యాకరణశాస్త్ర ప్రయోజనాలనుచెప్పడంలో "మ్లేచ్ఛా మా భూమేత్యధ్యేయం వ్యాకరణం" అని చెప్పారు. పతంజల్యాదులు అపశబ్దాలే లోకంలో హెచ్చుగా ఉన్నవనీ, సుశ బ్దాలు చాలాతక్కువగా ఉన్నవనీ, ఉదా హరణంగా ఒక్కగోశబ్దాన్ని తీసికొంటే "గౌరిత్యస్యగావీగోణీగోపోతలికాగోతా" అని ఇత్యాదులు అపభ్రంశాలు ఎన్నో ఉన్నవని చెప్పారు. కాబట్టి వ్యాకరణాను శాసనం ఆవశ్యకంగా చేయవలసిన కార్యమే అని సమర్ధించుకొన్నారు.

పతంజలి గోశబ్దానికి ఉన్నవన్న ఈ అపభ్రంశ రూపాలన్నీ జైన బౌద్ధాదు లయిన ప్రాకృతగ్రంథకర్తల గ్రంథాలలో మనకు నేటికీ కనిపిస్తవి. దీన్నిబట్టి నాటి సంస్కృతవాదులు ప్రాకృతభాషా వాదాన్ని మిక్కిలి పట్టుదలతో ఈసడించే వారనడం స్పష్టం.

ఏ వాదానికైనా కానీండి, అసమంజస మైన అవరోధం పెచ్చుపెరిగేకొద్దీ రెండు విధాలైనపంధాలు ఏర్పడుతవి. ఆపంధాల ఫలితాలలో మొదటిది, పట్టుదలతో తమ పైన ఆరోపించినదాన్ని సమర్ధించుకో వలెనని పూనుకోవడముగా వుంటుంది. ప్రాకృతభాషావాదంలోకూడా ఈఫలితమే ఏర్పడ్డది. రెండోది ఏదోషాలు తమపైని ప్రతిపక్షంవారు చేశారో, వాటిని అవాదం వారిలోనే ఎన్నిచూపడము.

ప్రాకృత భాషావాదంవారు ఈ రెండు మార్గాలూ అవలంబించారు. సంస్కృతపక్షంవారు- ప్రాకృతభాష శిష్టు లకు స్వీకారయోగ్యం కాదనీ, దానిలో మాధుర్యాదులయిన సారస్వత గుణాలు లేవనీ, అది అపభ్రంశమైన భాషకాబట్టి శ్రుతులు ధర్మశాస్త్రాలు మొదలయిన వాటిచేత అది నిషేధింపబడినదీ అనీ, పరి పరి విధాల దోషనిరూపణలుచేశారు. ప్రాకృతభాషావాదులు వీటిని ఎదిర్చి, తమ భాషయొక్క విశిష్టతను చాటారు. గ్రంధాలు వ్రాశారు. ఆబాలగోపాలమూ

ఆభాషలోనే సమస్త విజ్ఞానాన్నీ పొంద గలిగేలాగా యత్నాలుచేసి ప్రచారం సాగించారు.

సక్కయ కవ్వస్సత్థం జేణజాణంతి
మందబుద్ధీయో,
సవ్వాణ విసుహబోహం. తేణేమం
పాయయం రయితం,
గూఢత్థదేసిరయియం సులవిద
వన్నేహిం విరజిదంరమ్మం,
లోయే పాయియకవ్వం కస్సనహి
దయం సుహావేయి,
పరవుగారపరేణం సాభాసాహోయి
ఏత్థభణిదవ్వా
జాయయి జీయే విజహో సవ్వాణవి
బాలమాయీణం.

అని శబ్దభేద ప్రకాశిక గ్రంధకర్త చెబుతాడు.

సంస్కృత కావ్యపు అర్థం బోధ పఱచుకోలేనివారికి తేలిగ్గా బోధపడే నిమిత్తం తాను తనగ్రంధాన్ని ప్రాకృతంలో వ్రాశాననీ, శ్లేష మొదలయిన గూఢార్థాలు లేకుండా దేశీపదాలతో లలితాలయిన వర్ణనలతో వ్రాసినది గనుక అది అందరికీ ఆనందాన్ని కలిగిస్తూందనీ, కవికి తన విజ్ఞానం పరులకు ఉపకారంగా ఉండాలనే బుద్ధిఉంటే, తల్లులకు పిల్లలకు, బాలురకు గోపాలురకు బోధపడే ప్రాకృతంలోనే గ్రంధాలు వ్రాయాలని ఆయన అన్నాడు.

ఇల్లాగా పట్టుబట్టి ప్రజోపకారార్థమై గ్రంథాలువ్రాసే జైన బౌద్ధమత ప్రచారం కల యుగాలలో హరిభద్రసూరి, వర్ధమానుడు శీలాంకభద్రుడు, జినపతిసూరి మల్లవాది శాంతిరక్షితుడు కమలశీలుడు మొదలయినవారు ఎందరెందరో ఎన్నెన్నో గ్రంధాలు వందలకొద్దీ ప్రాకృతంలో వ్రాశారు ఇల్లాగా నాడు ప్రాకృతభాషావాదులు జనసామాన్యానికి ఎంతో వాఙ్మయాన్ని సృష్టిస్తూవుంటే సంస్కృత వాదులుకూడా ఈ ప్రాకృతగ్రంధ నిరుపయోగత్వాన్ని చాటుతూనే ఉన్నారు. కాని ఊరుకోలేదు. విశ్వనాధ కవిరాజుగారి యీ క్రింది సాహిత్య దర్పణశ్లోకము సంస్కృత ప్రాకృతముల పరమోన్నత స్థితిని చాటుతున్నది.

కేభూవన్నాఢ్య రాజ్యస్య
రాజ్యేప్రాకృత భాషిణః
రాజ్యే శ్రీ సాహసాంకస్య
కేనసంస్కృత భాషిణః

ఆఢ్యరాజు కాలంలో ప్రాకృతంలో మాట్లాడలేనివారెవరూ? అంటే, ఆబాలగోపాలం ప్రాకృత వ్యవహార నిపుణతకలదే. ఇల్లాగా సాహసాంకుని కాలంలో సంస్కృతం మాట్లాడలేని వారు కూడా లేనేలేరు. అంటే ఆఢ్యరాజు రాజ్యపాలనం ప్రాకృత వాదోజ్వలతకూ, సాహసాంకుని రాజ్యం సంస్కృత వాదోజ్వలతకూ ఆశ్రయాలూ ఆధారాలు అయినవని అనుకొందాం.

ప్రాకృత భాషనూ తద్వాదాన్నీ పూర్తిగా ఎదిర్చి ద్వేషించి రూపుమాపసమకట్టాడు తొల్త శాతవాహనుడు. అయితే దైవాత్తూ మధ్యను ఏర్పడ్డ కొన్ని కారణాలవల్ల ఆ ద్వేషం అంతా మారి, ప్రాకృత భాషావాదాన్నీ తత్పండితుల రచనలనూ ఆదరించి ఆనందముగ్ధుడై ప్రాకృతానికి తాను దివ్యకీర్తి స్తంభముగా నిలచి గాధాసప్తశతిని

వ్రాసి - అంటే సంధానించి, ప్రాకృతానికి సామ్రాజ్యపట్టం కట్టినవాడూ ఆయనే.

మన కాలంలోని ప్రతిభావంతులయిన రచయితలనుగురించి, ఆయా ప్రభువుల సంస్థానాలలోనూ ప్రజలలోనూ ఏరీతిగా నిరాధారాలయిన అపవాదులను ప్రచారంచేసి వైముఖ్యాన్ని సృష్టించడానికి ఎల్లాగా ప్రచారంచేసి ఉన్నారో, ప్రాకృతభాషా వాదులను గురించీ ఆనాడు సంస్కృత భాషా వాదులు ప్రచారంచేశారు. ఈ విషయంలో కుమారపాలుడి కథ మనకు పూర్తిగాసాక్ష్యంఇస్తుంది.

ఇల్లాగే పండితులుకూడ ధనాశచేత, సత్యాన్ని మఱుగుపరిచి, చేతగాకున్నా సంస్కృతభాషావాదులుగా నటించేవారు. సిద్ధసేనుడికథ ఈ సత్యాన్ని నిరూపిస్తుంది. ప్రతివాదంవారి తిరస్కారాన్ని లక్ష్యంచేయకుండా, మహాభిమానంతో తమభాషా ప్రాశస్త్యాన్ని ప్రాకృత భాషావాదులు వేయివిధాల చాటుకొన్నారు.

పై ఉదాహరణాలవల్ల ప్రాకృత భాషావాద ప్రాశస్త్యాన్ని ఆనాడు వారు నిలవబెట్టుకొన్న విధం మనకు గోచరిస్తూన్నదికదా? అయితే లోకంలోని జనసామాన్యం ప్రాకృత భాషావాదానికి ప్రతిపక్షంవారైన పండితుఖూ ప్రభుకోటీ ప్రాకృత భాషావాదంపై ఆరోపించే దోషాలు, కేవలం అసూయా సంకలితాలు అనీ, అట్టి దోషాలు సంస్కృత భాషావాదుల రచనల్లోకూడా అసంఖ్యాలుగా ఉన్నవనీ, (మన కాలంలోని గ్రాంధికవాదులయిన పండితుల భాషాభేషజాన్ని పరీక్షించి, గిడుగువారు అది వట్టి దంభం అని నిరూపించినలాగానే) భట్ట శబరస్వామిగారు, తన భాష్యంలో విశుద్ధసంస్కృత భాషాతంత్ర స్వతంత్రులమని విఱ్ఱవీగే వారి గ్రంధాలనుండి లక్షలకొద్దీ దోషాలనూ, అపభ్రంశములయిన సంస్కృత వ్యవహారాలనూ పైకితీసి, నాటి వైయాకరణులయొక్క- ఆనాటి సంస్కృత భాషా వా దు ల యొక్క- భాషాపారిశుద్ధ్యపు బండారాన్ని బయటపెట్టాడు.

ఇంతతో మనం ఈ ప్రాకృత భాషావాదంలోని ముఖ్యాంశాలు ముగిసాయి అనుకోవచ్చు. కాని ఈ వాదం దృఢపడి ప్రజలకూ, ప్రభువులకూ, పండితులకూ అంగీకారయోగ్యం అయిన తర్వాత, ఏమేమి ఉన్నత స్థితులను పొందగలిగిందో మనం తెలుసుకోవాలె. అవి ఇవీ: (౧) పాఠ్యకళలో ప్రాకృతం కూడా ఒక అర్హస్థానాన్ని సంపాదించడము (౨) లక్షణ వేత్తల అనుమతిని అభిముఖ్యాన్నీ సంపాదించడమేకాకుండా పద్యం గద్యం గేయం పాఠ్యంనాట్యం — మొదలయిన కళాస్థానములయందు ప్రముఖపాత్రత్వాన్ని పొందగల్గడము. (౩) చిరకాలమునుండి రూఢమైన సంస్కృతాన్ని త్రోసిపుచ్చి తానే వాఙ్మయసింహాసనాన్ని అధిష్ఠించడము.(౪) ఆ తర్వాతఅష్టాదశ ప్రాకృతభాషాత్మకంగా పరిణమించి, దేశభాషా రూపాన అవతరించి, తరతరాలనుంచి చిరస్థాయితను చేకూర్చుకోవడమూ అనే సత్ఫలాలను ఈ భాషావాదం సాధించి, అనంతానందాన్ని ప్రజాలోకానికి వర్షించింది.

ప్రఖ్యాత చారిత్రక పరిశోధకుఁడు



డాక్టర్, శ్రీ చిలుకూరి నారాయణరావుగారు

ప్రాచీనాంధ్ర వైయాకరణుల భాషాదృష్టి

శ్రీ చిలుకూరి నారాయణరావు

మనకు ప్రతి విషయంలోను శాస్త్ర దృష్టికావాలి, శాస్త్రం, శస్త్రంవలెనే విషయాన్ని కోసివెయ్యాలి; ఎక్కడికక్కడ విడదీసిచెప్పాలి. శస్త్రమూ, శాస్త్రమూ, ఈరెండూ 'శస్' అనే ధాతువునుంచే పుట్టాయి

శాస్త్రం రెండు విధాలు; ఇందులో ప్రకృతిశాస్త్రాలు ఒకరకం; నీతిశాస్త్రాలు రెండవరకం వృక్షశాస్త్రంలో ముందు విభేదాలను ఎత్తిచూపి, తరువాత వివరాలను పేర్కొంటాడు పోలికలచేత ఆయాజాతులను వర్గీకరించి, విశేషాలు చెబుతాడు సూత్రాలు చేసి, అపవాదాలు కూడా వెల్లడిస్తాడు ఇలా పరీక్షించి, వాటి వాటి ప్రవృత్తులను సూత్రీకరించేదే శాస్త్రం శాస్త్రం ఎప్పుడూ ఒకేరకంగా వుండదు మార్పుచెందుతూ వుంటుంది. ఏదీ స్థాణువుకాదు సజీవంగావున్న ప్రతిదానికీ మార్పుతప్పదు, భాషాశాస్త్రం కూడా ప్రకృతిశాస్త్రాల్లో ఒకటి ఏ ప్రకృతిశాస్త్రమూ ఆజ్ఞాపించదు ఆ పని నీతిశాస్త్రాలది. కాని, ఛాందసులు ఆజ్ఞాపించప్రయత్నించారు. తమ ఆజ్ఞలకు కట్టుబడనివారిని పాపులన్నారు.

భాషింపబడేదిభాష. మన దేశంలో మొత్తం 535 భాషలున్నాయి. ఇందులో ప్రధానమైనవి 18 అర్థవంతమైన ధ్వనుల సముదాయమే భాష.

ఆంధ్రభాష — ఈ భాషను మాట్లాడడం వల్ల మనం ఆంధ్రులమైనామో, లేక, ఆంధ్రులం మనం మాట్లాడుతున్నాం కనుక ఈ భాష ఆంధ్రభాష అయిందో తెలియదు ఇప్పటికి సుమారు 5000 సం॥నాటి ఐతరేయబ్రాహ్మణంలో 'ఆంధ్రజాతి' పేర్కొనబడింది. అశోకుని శాసనంలో ఆంధ్రశబ్దం కనిపిస్తున్నది. ఆంధ్రశబ్దానికి సంబంధించిందే ఆంధ్రం.

తెలుగు అనే పదానికి ఇంతవరకూ ఉత్పత్తి ఏమిటో తేలలేదు. ఉత్తరదేశంలో 'కళింగ' లాగా, 'తెలింగ' అని అంటారు. తెలుగు వారొకజాతి, తెలుగు ఒకభాష 11వ శతాబ్దం నాటికి తెలుగు జాతి ఆంధ్రజాతి కలిసిపోయాయి. ఆంధ్ర, తెలుగు అనేపదాలు రెండూ పర్యాయపదాలైనాయి. శాతవాహను లాంధ్రులా అనే సందేహాన్ని కర్ణాటకులు వెలిబుచ్చారు. ఏమయినా ఇతర భాషలతో కలిసిపోయి ప్రాకృతమే ఆంధ్రభాషగా పరిణమించిందని నా అభిప్రాయం.

కాల్డ్వెల్, 'కంపారిటివ్ స్టడీ ఆఫ్ ది ద్రవిడియన్ లాంగ్వేజెస్' (Comparitive Study of the Dravidian Languages) అనే పుస్తకం వ్రాశాడు. ఇందులో అభివృద్ధిచెందిన భాషల నారింటినీ, ఆటవికభాషల నారింటినీ కలిపి, ద్రావిడభాషలన్నాడు. కాని మన భాషకు అన్నిభాషలతోను సంబంధం వున్నదని నా ఉద్దేశం.

ఆంధ్రభాషకు మొదటి వ్యాకరణం ఆంధ్ర శబ్ద చింతామణి' నన్నయ వ్రాశాడంటారు. కాని ఇది నిజంకాదు. ఈ వ్యాకరణానికి విరుద్ధమైనవే నన్నయ ప్రయోగాలున్నాయి నిజం విచారిస్తే ఆంధ్రశబ్దచింతామణి అధర్వణకారికలు, నన్నయకు తరువాత, బాలసరస్వతికి పూర్వమూ పుట్టివుంటాయి.

శబ్ద చింతామణి దృష్టి సంస్కృతం మీదే వుంది. సంస్కృతంలో వ్రాయక పోతే మైలపడిపోతుందని తెలుగు వ్యాకరణాన్ని సంస్కృతంలో వ్రాశారు. చాలా పరిమితమైన గ్రంధం ఇది. 'విశ్వ శ్రేయః కావ్యం' అని ఎత్తుకున్నాడు. కావ్యానికి వ్యాకరణం ఛందస్సు అలంకారాలు కావాలన్నాడు. (శ్రేయస్సు ప్రేయస్సు అని రెండు - శ్రేయస్సు పరార్థమైంది; ప్రేయస్సు ప్రియమైంది.) దోషంకానిది గుణమన్నారు. గుణ వాదమూ, అలంకారంవాదమూ సమ న్వయం పొందుతున్నాయి.

శబ్దానికి 'సిద్ధిర్లోకాద్వశ్యా' అన్నారు. లోకంలో ఉన్నప్రయోగాన్నీ వాడుకనూ బట్టే శబ్దానికిసిద్ధి. కాని భాష ప్రవాహిని. ఎప్పుడూ మారుతూ వుంటుంది.

ఇప్పుడు రెండుగకాలయిన మాండలికాలు కనపడుతున్నాయి న-Dialectics య-Dialectics అని. కొట్టి + అ = కొట్టిన, కొట్టియ(అరవంలో) 'కొట్టి'కి 'అ' కలిపితే అరవంలో 'కొట్టిన' కావచ్చు; 'కొట్టియ' కావచ్చు ఉత్తర సర్కార్లలో 'య' డయలెక్టిక్సు కనిపిస్తాయి. తెలంగాణాలో 'న' డయలెక్టిక్సు కొట్టినడు, చెప్పినడు, చెప్పిండు, కొట్టిండు ఇదే రాయలసీమలో - కొట్టినాడు, చెప్పినాడు, చెప్పిండు, కొట్టిండు.

ఏకాలపుభాష ఆకాలానికి ప్రమాణం. కాని మధ్యకాలంలో భాషంతా కలగా పులగమైపోయింది. నన్నయ తిక్కనలు తమకాలపు భాషనుపయోగించారు. కాని తరువాతి వారు భాషకు లేనిపోని అంత స్థులు కట్టుకొని కృత్రిమభాషను తయారు చేసారు (Standard of language a misnomour)

ఎవరు ఏలాంటి భాషలో వ్రాసినా, చదువరులకు అందంగా కనపడితే, అది సరైన భాషే. సర్వలోక మోహనమైన కావ్యానికి వ్యాకరణముతో నిమిత్త మేమిటి?

ఇదే ప్రాచీనాంధ్ర వైయాకరణుల భాషాదృష్టి.

ఆంధ్రవాఙ్మయ చరిత్ర

శ్రీ పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రి

ఆంధ్రులు అనగా ఆంధ్రదేశంలో నివసిస్తూ ప్రాచీనకాలంనుంచీ - ఒక్క-భాషా, ఒక్క- సంప్రదాయం, ఒకటే రీతీ, నీతీ - ఇత్యాదులను అనూచానంగా కలిగివుండే ప్రజలు వాఙ్మయం అనే మాటకు నాగరకతోన్నతిని పొందినట్టి భాషా దశాస్వరూపం అని అర్థము. ఆంధ్రులయొక్క- వాఙ్మయం ఎప్పుడు ఆరంభమైందీ? ఏ యే యుగాలలో ఏ యే కూర్పులనూ, మార్పులనూ పొందిందీ? వాటికి కారణభూతాలుగా వుండే సన్నివేశాలు యెట్టివి? వాటి మూలాన ఆంధ్ర వాఙ్మయ చరిత్ర యెట్టిదిగా మనకన్నులకు గోచరిస్తూ ఉన్నదీ? అని పూర్వోత్తర సన్నివేశాలను ఒక్క-మారు చెప్పుకోవడమే ఈనాడు ఇక్క-డ మనం నిర్వహించుకోవలసినట్టి ప్రధానమైన కార్యంగా ఉన్నది.

అందుకుగాను ముందుగా మనం కొన్ని విషయాలను చక్క-గా తెలిసికోవలసివుంటుంది. ఇంగ్లీషులో లాంగ్వేజ్, లిటరేచర్ అని రెండు పదాలు ఉపయోగిస్తూ వుంటారు ఇల్లాగే మనలోకూడా భాషా, సాహిత్యం అని రెండు పదాలు ఉన్నవి. అవి పై పదాల అర్థాలనే చెబుతూ వాడుకలో వున్నవి. సాహిత్యం అనే మాట తరుచుగా ఏ అర్థంలో వాడుతూవుంటారో, ఆ అర్థంలోనే నేనూ, నాలాంటివాళ్ళూ వాఙ్మయం అనే మాటను వాడుతూ వున్నాము. సాధారణ ప్రజల నిత్య వ్యవహారసాధనంగా ఉండే వాగ్వ్యాపారాన్ని భాష అనిన్నీ, అట్టి భాషలోవుండే సౌకుమార్య, సౌందర్యాలను, వ్యవహరించేవారి ఆత్మభావోన్నతినీ, విన్నవారికి చాటగల భాషారాశి, వాఙ్మయం అనిగానీ, సాహిత్యం అనిగానీ చెప్పవలసివుంటుంది. ఈ రెండు పదాలనూ మనకు తెలిసిన భాషలో చెప్పాలెఅంటే పాలూ, మీగడా లాంటివని మనం పోలిక చెప్పవచ్చు. పాలలో ఏర్పడినట్టి సుకుమారమైన, మధురమైన సారం, క్రమ పరిణామంవల్లా, పాకదశవల్లా ప్రత్యేకింపబడి మీగడ అవుతుందిగదా!

అల్లాగే ప్రతిభానిధులయిన ప్రజల యొక్క- భావనావిశేషంచేత, పరిపక్వ దశనుపొంది, ఆస్వాదనార్హంగా, అనుభవించేవారిహృదయాలకు ఆనందప్రదంగా ఏర్పడిన భాషయొక్క- నాగరకతను చాటగల సున్నితమైనభాషారాశి, సాహిత్యం అని కానీ, వాఙ్మయం అని కానీ, వాడబడుతూఉన్నది అని జ్ఞాపకం ఉంచుకొందాము. అయితే, కొందరు వివరిస్తారు—వాఙ్మయం అనేది వేరు అనీ.

సాహిత్యం అనేది వేరుఅనీ, ఇది నాకు సమ్మతంకాదు నాకేకాదు. మన పూర్వు లకున్నూ సమ్మతంకాదు. ఆచార్యదండి- అంటే కావ్యాదర్శ గ్రంథకర్త ఈ విష యాన్ని స్పష్టంగా చాటాడు. వినండి— 'ఆదిరాజయశోబింబం, ఆదర్శం ప్రాప్య వాఙ్మయం, తేషాం అసన్నిధానేపి, న— స్వయంపశ్యనశ్యతి' అని సాహిత్యాన్ని వాఙ్మయంగా పేర్కొన్నాడు.

ప్రతిభానిధులయిన ప్రజల భావనా విశేషంవల్ల పరిపక్వదశను పొంది, ఆస్వాద్యస్థితికివచ్చిన భాష వాఙ్మయం అవుతుందనిచెప్పాను. కొందరంటారు— అంటారేమిటి, అన్నారుకూడా — ప్రతిభా నిధులయిన వారి భావనా విశేషాలు మాత్రమే పరిపక్వదశలో వాఙ్మయం అనుపించుకోవడం ఏల? సాధారణ ప్రజల భావనలు వాఙ్మయం అని మన మెందుకు అనుకోకూడదూ అని. కొంత వఱకూ ఈ వాదాన్ని నేనూ అంగీక రిస్తాను. కాని ప్రజలలో అందరికీ భావ నాశక్తి ఉండదు. నూటికి ఏ ఒకరిద్ద రకో మాత్రమే ఆయాదృశ్యాలను చూచి నప్పుడు భావింపగల శక్తి ఉంటుందే కాని, అందరికిన్నీ ఆ శక్తి ఉండదు. ఈ విషయాన్ని అక్షిపటలన్యాయంగా శాబరభాష్యంలో శబరస్వామి పేర్కొ న్నాడు. అందుచేత ప్రతిభానిధులయి ఉంటేనే విశిష్టభావనలు కలుగుతవి. వాటిని వారు మనకు ప్రత్యక్షీకరించడ మున్నూ జరుగుతుంది. తక్కినవారికి ఆ శక్తి ఉండనూఉండదు. అందుచేత ప్రత్యక్షీకరింపనూలేరు.

కాబట్టే - ఒక్కమాటలో, భాష యొక్క నాగరికచిహ్నాన్ని అందాన్నీ, ఆనందాన్నీ వెల్లడించే భాగాన్నిమాత్రమే వాఙ్మయంగా, లేదా సాహిత్యంగా మనం గుర్తించుకొందామనుకొన్నాము. కాగా, తేలినసారం ఏమంటే ఆంధ్రులయొక్క పైన చెప్పినలాంటి భాషా సారం గల ఖండాలను వాఙ్మయం సాహిత్యం అంటు న్నాము. ఆంధ్రులు అతి ప్రాచీనమైన జాతికి చెందినవారు. అతి ప్రాచీనమైన సంస్కృతినీ సాహిత్య ముద్రలనూ కల వారు. సామ్రాజ్యాలు నిలబెట్టినవారు. సామ్రాజ్యాలను స్థాపించినవారు. చివ అకు నిర్దయగా లక్ష్యంలేకుండా, పిల్లలు ఎంతో శ్రమపడి బొమ్మరిండ్లను కట్టు కొని, కొంతసేపు ఆనందాన్ని అనుభ వించి, తర్వాత చివరిదశలో ఆ బొమ్మ రిండ్లను కాలదన్ని కూలద్రోసికొన్న లాగానే మనవారుకూడా ఆ సామ్రా జ్యాలను కూలద్రోసికొన్న ఘనులుగాని, సామాన్యులుకారు. ఈనాడు మనం ఆ సంతతిలోని చివరి బైరాగులం.

ఋగ్వేదకాలం అంతటి ప్రాచీన కాలంనుండీ ఆంధ్రులున్నట్లు మన చరిత్ర కర్తలు నిరూపించారు. శాతవాహనుల సామ్రాజ్యం ఆంధ్రులదే అనీ స్పష్టపరి చారు. మగధ సామ్రాజ్యాన్ని పడిపో కుండా నిలవబెట్టారనే కీర్తిని మనవారు చరిత్రలో స్వర్ణాక్షరాలతో చిత్రించుకో గలిగారు. చివరకు మొన్నమొన్నటి రామరాయల కాలంలో కట్టకడసారిగా మన సామ్రాజ్యాలనే బొమ్మరిండ్లను చిదిపివేసికొని, చెరిపివేసికొని చరిత్రలో విషాదాంతమైన అధ్యాయాన్ని పూర్తి చేశారు. ఇది అందరికీ తెలిసిన విష

యమే కాని ఇక్కడ మనకు ప్రధాన మైన విషయం ఏమిటీ అంటే - ఇంతటి ప్రాచీన చరిత్ర మహత్వాన్ని సంపాదించిన ఆంధ్రజాతికి ప్రాచీన చరిత్ర మహత్వాన్ని సంపాదించిననాటి వాఙ్మయం ఉన్నదా? లేదా? అనేది ఈనాటి మనకు విచారణ చేయవలసినట్టి విషయంగా ఏర్పడింది.

ఆంధ్రులది చారిత్రికంగా ఎంత ప్రాచీనమైన జాతి అయినా, అనుమాన ప్రమాణంచేత, ఆంధ్రులకు ఎంతో ప్రాచీన సాహిత్యం ఉండవలసివున్నా, యథార్థదశలో క్రీ. శ. పదోశతాబ్ది దాటేంతవరకూ, అంటే పదకొండో శతాబ్దికిగాని, విస్పష్టమైన వాఙ్మయం అంటూ, వకటిమనకు ప్రత్యక్షంకాకుండా ఉన్నది అనగా పదకొండో శతాబ్దిలో రచితమైన నన్నయభట్టారకుల ఆంధ్ర మహాభారతమే మన ఆంధ్రభాషకు ప్రథమగ్రంథంగాను, దానిని రచించిన మొదటి ఆంధ్రకవిని నన్నయ్యగాను మనం విస్పష్టంగా ద్రష్టలకున్నూ శ్రోతలకున్నూ చూపవలసిన్నీ, చెప్పవలసిన్నీ ఏర్పడ్డది. అంతకుపూర్వం మన వాఙ్మయంలో సాహిత్యగ్రంథాలు లేవా? అంటే ఉన్నవీ అని ఒకపక్షంవారున్నూ, లేవూ అని వేరొక పక్షంవారున్నూ వాదోపవాదాలు చేస్తూనేవున్నారు. ఇంతేకాదు— ఉన్నవనేవారున్నూ, లేవనేవారున్నూ కేవలం అనుమానప్రమాణంచేతనే తమ తమ వాదాలను నిరూపిస్తున్నారు. ఈ అనుమాన ప్రమాణంకూడా, పదకొండో శతాబ్ది గ్రంథంగా విస్పష్టరీతిని గుర్తింపబడే, ఆంధ్ర భారతంయొక్క ఉపోద్ఘాతపు ఆధారముచేతనూ, ఆ శతాబ్దిలోనూ అంతకుపూర్వ శతాబ్దులలోనూ రాజులు మహారాజులు మొదలయినవారు చెక్కించిన శిలాశాసనాదులనూ, ఇచ్చిన దాన శాసనాదులనూ అవలంబనంగొని చేసిన నిరూపణల ఆధారంచేతనూ మతసాంఘిక చరిత్రలలోని అంశాల ఆధారంవల్లనూ, విజాతీయ సోదరభాషల చరిత్రలను బట్టీ, వాఙ్మయం ఏర్పడే సహజస్థితినిబట్టీ — మనం ఏర్పఱచుకోవలసిందే కాని, ప్రత్యక్షప్రమాణంచేత—ఇదమిత్థం అని పైకెత్తి కన్నులయెదుట నిలబెట్టడానికి సుతరాం సాధ్యంకానట్టిది.

అందుచేత మనం మున్ముందుగా ఆంధ్రలో ఆది గ్రంథంగా మనవారు నమ్ముతూవున్న (1) ఆంధ్ర భారత గ్రంథంయొక్క ఉపోద్ఘాతాన్ని అనుశీలనం చెయ్యాలి. ఆ పిమ్మట (2) పదకొండో శతాబ్దానికి పూర్వోత్తరాలలో వుండే శాసనాలనుబట్టిన్నీ, ఆ తర్వాత (3) మత సాంఘికాది చరిత్రాధారాలను బట్టిన్నీ, (4) సోదర జాతీయ భాషల చరిత్రలను బట్టిన్నీ (5) వాఙ్మయం ఏర్పడే సహజస్థితినిబట్టిన్నీ - ఆ అనుమాన ప్రమాణపు చిహ్నాలను అనుశీలనం చేసికోవలసియున్నది. మఱిన్నీ మన ఆంధ్ర వాఙ్మయానికి ప్రథమ ప్రకృతిగాను, ద్వితీయ ప్రకృతిగానూ మనవారు వప్పుకునే సంస్కృత ప్రాకృతాలలోని - అలంకారశాస్త్రం, వ్యాకరణ శాస్త్రం ఛందశ్శాస్త్రం - మొదలయినవాటి ఉత్పత్తి వికాసాదుల దశల చరిత్రకూడా ఈ సందర్భంలో - అంటే అనుమాన ప్రమాణంద్వారా ఆంధ్ర వాఙ్మయం యొక్క ఆద్య దశా స్థితిని నిరూపణచేసే సందర్భంలో ఉపయోగపడగలదు.

నవపతాక

— శ్రీకుందుర్తి ఆంజనేయులు —

నరజాతి విముక్తికై ఒక
నవపతాక వెలిసింది!
అధోజగత్సహోదరుల
హృదయంలో మెరిసింది!

మన సంఘం చిట్టచివర
సమాజంపు లోతుల్లో
అణగారిన కోటికోట్ల
జీవుల బ్రతుకుల వెలుగై
నరజాతి విముక్తికై ఒక
నవపతాక వెలిసింది;

ఏడంతస్తుల మేడలు
యెక్కలేని నవపతాక
పూరిగుడిసె చీకటిలో
పుట్టిందీ మనపతాక!

జగత్తులో మూల మూల
స్వార్థం విహరిస్తున్నది
కదనభూమి కంఠంలో
మూల్గులు వినవస్తున్నవి

ఆకాశం చేస్తున్నది
ఆకలి దీనాలాపం!
భరించింది సముద్ర గర్భం
బహుళశవాల దుర్గంధం!

పొగగొట్టం భుగభుగలో
పనికూనలు బ్రతుకలేరు
పగలు - రాత్రి తీరని పని
శ్రామికులకు శాంతిలేదు -
ప్రపంచమొక గాయంగా
భయంకరంగా వుంది

జగత్పీడిత వర్గాలకు
సమ్మెలు నేర్పింది పతాక!
కష్టజీవి పాటుచూచి
కంటనీరు పెట్టిందట

భూస్వామ్య విధానాలను
భూదగ్ధం చేస్తుందట
నిరంకుశ ప్రాసాదాలకు
నిప్పంటించేస్తుందట.

నియంతల నిష్ఫలచర్యల
నెదుర్కొను పుట్టిందట
స్వార్థ పరులగుండెలపై
రథాలునడిపిస్తుందట.
ఈభువిలో నూత్నజగతు
లెన్నో పెకలిస్తుందట

పతిత వర్గ పీడితులకు
బ్రహ్మరథం పడుతుందట.
ఆపరాని దీస్రవంతి
కట్టలు తెంచేస్తున్నది

చీకటి గర్భంచీల్చుకొని
సహజంగా వస్తోందిమార్పు
చైతన్య ముషోదయంలో
అరుణ రేఖలు దిద్దుతోంది.

పతితలోక మాదర్శ
ప్రదర్శనం చేస్తున్నది
నవపతాక నీడల్లో
విముక్తి వచ్చేస్తున్నది.

జాతిలేదు మతంలేదు
పాతకు దాసోహంలేదు
ఆకలి లేదసూయ లే
దసలు మనస్పర్థ లేదు.

తరతరాల బానిసత్వ
బ ధన తెగిపోతున్నది
మానవుడికి స్వేచ్ఛాగత
మహిత శాంతి లభిస్తుంది.

నవ్య సాహిత్య చరిత్ర

శ్రీ చిలుకూరి నారాయణరావు

ఇవాళ మనం ఇక్కడ ఆంధ్ర సాహిత్య పాఠశాలను నడుపుతున్నాం. ఇటువంటి ప్రయత్నం మనదేశంలో ఇదే మొదటిది ఇక్కడకు వచ్చిన తర్వాత - ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని తీసివేసి, ఒక సంచార విద్యాపీఠం పెడితే బాగుంటుందిగదా - అనిపించింది నేను లోగడ ప్రాచీన విద్యాపీఠములు అనే గ్రంధం వ్రాసాను ఈ విషయంలో శ్రీ మల్లంపల్లి సోమశేఖర శర్మగారే ప్రథములు, అగ్రగణ్యులు

ఆంధ్ర వాఙ్మయ సముద్ధరణకు కృషి చేసిన వారిలో ప్రప్రథములు శ్రీ కందుకూరి వీరేశలింగం పంతులుగారు. ఆయనే తెలుగులో మొట్టమొదటి పత్రికను స్థాపించాడు. మొదటి నవల వ్రాశాడు. మొదటి నాటకం వ్రాశాడు. (కొంతమంది వ్యతిరేకులు అదివరకే పత్రికలూ, నవలలూ, నాటకాలూ, వున్నాయంటారు. కాని, ప్రజలకు నచ్చనిదీ, ప్రచారం లేనిదీ యేదీ కాదు. కనుక చచ్చు పుచ్చువి ఏవో మచ్చు పేర్లు చూపినంత మాత్రాన సరిపోదు. పత్రిక అనుకోదగిందీ, నాటకం అనుకోదగిందీ నవల అనుకోదగిందీ తెలుగులో మొట్ట మొదటిది ఆయనదే)

ఆయన సంఘసంస్కర్త మాత్రమే కాక, సాహిత్యాభ్యుదయానికై అహోరాత్రాలు కృషిచేశాడు. నిందలను లెక్క చేయకుండా నడుముకట్టి పనిచేశాడు. ఆయన 'ఇది అభ్యుదయ పంథా' అనే నిశ్చయానికి వచ్చాడంటే అది నెరవేరిందాకా నిద్రపోయేవాడు కాదు. ఆయన విద్యావ్యాప్తికోసం వాచక పుస్తకాలు వ్రాశాడు. ఇప్పటికీ, ఎంత మందో ఎన్ని వాచకాలో వ్రాశారు గాని, ఆయన వాచకాల పరపతిమాత్రం పోలేదు. వీరేశలింగం పాశ్చాత్య నాగరికతలోని నిగ్గును ప్రోగుచేశాడు. ఆంధ్రజాతి అభ్యుదయానికి కృషి చేసాడు. తెలుగులో శాస్త్రరచనచేసాడు. ప్రజా విజ్ఞానాన్ని పెంపొందించాడు. ఈనాడు అభ్యుదయ రచయితల సంఘం గానీ, మరే సంఘంగానీ ఏర్పడిందంటే అది ఆయన చేసినకృషిఫలితమే। నేటి మన విజ్ఞానానికంతటికీ ఆయనేమూలం. ఆయనే ఆది పురుషుడు. మనకు మార్గదర్శి.

పురోగమనమార్గాలనన్నిటినీ ఆయనే సూచించాడు. సంస్కృతంలోని విజ్ఞానాన్ని తేటతెలుగులోకి తెచ్చాడు. తర్కం, అలంకారం, నాటకం-అన్నీ తెలుగుచేసాడు. ఆంగ్ల విజ్ఞానాన్ని ఆంధ్రజాతికి సొంతంచేసి పెట్టాడు. ప్రాచ్య పాశ్చాత్య విజ్ఞానాలను రంగరించి, వాటికి తెనుగుదనం చేకూర్చాడు.

ఆంధ్ర వాఙ్మయ వికాసానికి ఆయన చేసినకృషి అపారం ఆయన, కాలంతో పాటు ముందుకు నడిచాడు. ముందు చూపేగాని, వెనుకచూపులేదు అభ్యుదయ మార్గానికి ఆయన వైతాళికుడు.

మన రుచులు మారడంచేత మనం కొందరుపండితులను మరచిపోతున్నాం. కొక్కొండ వెంకటరత్నం, తాతా సుబ్బరాయుడుశాస్త్రి, వేదం వేంకటరాయశాస్త్రి మొదలైనవారు మహాపండితులు. ఇందులో వేదం వేంకటరాయశాస్త్రిగారు ఆంధ్రలోకానికి "పేరిగాణ్ని" సమర్పించాడు. అయినా, వీరు వీరేశలింగం గారితోపాటు ముందడుగు వేయలేకపోయారు. ప్రజల్లో కలిసి పోలేకపోయారు.

చిలకమర్తి లక్ష్మీనరసింహం గారు వీరేశలింగంగారి ధోరణిలో రచనలు సాగించిన మహామేధావి. గొప్పవక్త. జాతీయోద్యమానికి జీవంపోసాడు.

తిరుపతి వేంకట కవులు గొప్పగా ఆశువు చెప్పగలరు. బ్రహ్మాండమైన కవిత్వోద్యమం తీసుకువచ్చారు. అనేక మంది శిష్యులను తయారుచేసారు. రాజాస్థానాల్లో అనేక సత్కారాలు పొందారు. వీరిశిష్యుల్లో ప్రముఖులు, వేటూరి ప్రభాకరశాస్త్రి, విశ్వనాథ సత్యనారాయణ, త్రిపురనేని రామస్వామి చౌదరి, పింగళి లక్ష్మీకాంతం, కాటూరి మొదలయినవారు.

రవీంద్రనాథ టాగూరు శిష్యుడు రాయప్రోలు సుబ్బారావుగారు. తెలుగులో ఖండకావ్య రచనకు ఆయన ప్రథముడు. ఇదే ధోరణిలో పిఠాపురాస్థాన కవులు వెంకట పార్వతీశ్వరులు 'ఏకాంతసేవ' అనే కావ్యం వ్రాసారు. ఇది ఆనాటి ఆంధ్రదేశంలోని వాఙ్మయచరిత్ర.

సాహితీ సమితివారు ఒక క్రొత్త మార్గాన్ని త్రొక్కారు. శివశంకరశాస్త్రి గారు సభాపతి ఆయన సుమారు 30 కావ్యాలు వ్రాసారు. అందులో 'హృదయేశ్వరి' మంచిది. దేవులపల్లి, త్రిపురారిభట్ల, మొదలయినవారందరు, వారి గ్రూపులో వుండేవారు. వీరు వ్రాసిన కవిత్వం భావకవిత్వమనిఎవరోఅన్నారు. ఆపేరే ఖాయమయింది. దీనిమీద ఆంధ్ర సాహిత్యపరిషత్తు వారు దండెత్తారు.

కృష్ణశాస్త్రిగారు వ్రాసిన కృష్ణపక్షాన్ని చూసి, అనంతరామస్వామిగారు 'శుక్ల పక్ష' మని Satire వ్రాసాడు వీరేశలింగంగారి అభాగ్యోపాఖ్యానమే తెలుగులో మొదటి వ్యంగ్యరచన (satire) ఇటీవల జలసూత్రం రుక్మిణీనాథశాస్త్రి మొదలైనవారు పారెడీలు, సెటైర్లు వ్రాస్తున్నారు.

సాహితీ సమితివారు 'సఖి' పత్రికను స్థాపించారు దేశంలో అనేకగ్రంథ మాలలు బయలుదేరి, వ్యాపింపసాగాయి. విద్వాంసులకే కాక, అందరికీ పనికి వచ్చే గ్రంథాలు వ్రాయ మొదలుపెట్టారు. పండితపామరుల కందరికీ పనికివచ్చే వాఙ్మయం వెలువడింది. చింతా దీక్షితులు గారు బాలవాఙ్మయాన్ని ఎంతగానో పెంపొందించారు. శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రిగారు కథారచనకు పూనుకున్నారు. ఆయన కథకచక్రవర్తి. 'ప్రబుద్ధాంధ్ర' సంపాదకులు.

ఇది మన సాహిత్యంలో ఒక మహా ప్రస్థానం. కొందరు యువకులు ముందుకు పోతున్నారు. మరికొందరు జారిపోతున్నారు. ముందుకుసాగేవారు వెనక్కి చూస్తూ, వెనకవారు జారిపోకుండా నిల బెట్టుకోవాలి. వారిశక్తిసామర్థ్యాలను విని యోగించుకోవాలి.

మేము వెనుక చూపు వదలుకోలేదు. వ్యావహారిక భాషకోసం మేము అనేక పరిశోధనలు చేసాం. ఎవ్వరూ మాకృషిని గుర్తించలేదు. గిడుగు పిడుగు వంటి వాడు, దరిద్రుడుగా, అభాగ్యుడుగా చని పోయాడు కన్నీళ్ళతో ఇప్పటికీ, అలాంటి వృద్ధులనేక మంది వున్నారు. వారిని ఆంధ్రజాతి పోషించుకోవాలి. వారి విజ్ఞాన సర్వస్వాన్ని ప్రజాపరం చేసుకోవాలి.

అనాడు ఆంధ్ర సాహిత్య పరిషత్తు మాకు అడ్డం వచ్చింది. సాహిత్యాభ్యుదయానికి అడ్డునిలిచింది. అందుకని మేమే దానిలో చేరదలచాం. కాని, సభ్యత్వపు పేచీ పెట్టుకొని పాత పండితులు మమ్మల్ని తరిమివేశారు. తలుపులు మూసుకున్నారు మేము బయట బీగాలువేసాం. లోపలే కుళ్ళుతూ, వారు కొన్ని తాళపత్ర గ్రంధాలను మాత్రం ప్రచురించారు. అవి సుపరిష్కృతాలు కాకపోయినా, కొంతమంచే జరిగింది.

వారు 'వజ్రాయుధం' అనే పత్రిక పెట్టారు. మేము 'సుజన రంజని' అనే పత్రికను స్థాపించాం. వారొక కేంద్ర సంస్థను స్థాపించాలనే ఉద్దేశంతో 'అభినవాంధ్ర కవిపండిత మండలి' అనే పేరుతో ఒక సంస్థను ఏర్పరచారు. ఆ మరుసటి సంవత్సరమే మేము ,నవ్య సాహిత్య పరిషత్తు'ను నిర్మించాం. 'ప్రతిభ'ను నెలకొల్పాం.

ఇవాళ సాహిత్య పాఠశాలద్వారా అభ్యుదయ రచయితలు చూపినమార్గం ఉత్తమమైంది. ఒక సంచార విద్యాపీఠాన్ని స్థాపించాలి. పట్నం పట్నం తిరగాలి. ఒక్కొక్కచోట నెలా, పదిహేను రోజుల చొప్పున పాఠశాల నడపాలి. అలాచేస్తే, ఒకటి కాదు; రెండు వందల విశ్వవిద్యాలయాల పెట్టు!

నేడు ప్రజలకుపయోగించే వాఙ్మయం కావాలంటున్నారు. కర్షకుల వాఙ్మయం కావలసిందే. కష్టజీవులకు సాహిత్యం దోహదం చెయ్యాలి. మనకింకా స్త్రీల వాఙ్మయం కావాలి. బాల వాఙ్మయం కావాలి

సామాన్యమైన ఆటవిక ప్రజానీకానికి సవర జాతికి, అమోఘమైన సేవజేసిన శ్రీ గిడుగు రామమూర్తిగారు మనకు నాయకుడు; ఆంధ్రజాతికి సేవకుడు. ఆయన మార్గాన్నే నడుస్తూ, మనం నేడు సమావేశమయినాము.

*

"ఆకులందున అణగిమణగీ — కవితకోయిల పలుకవలెనోయ్
పలుకులనువిని దేశమం దభి — మానములు మొలకెత్త వలెనోయ్—"

— గురజాడ.

భాషాతత్వశాస్త్రవేత్త



శ్రీ కోరాడ రామకృష్ణయ్యగారు

మన భాషలు

శ్రీ కోరాడ రామకృష్ణయ్య

భాషాతత్వశాస్త్ర రచనకు మొదట్లో పాశ్చాత్యులే పూనుకున్నారు. కాని ఎంతసేపూ గ్రీసుతోను, రోముతోను ప్రారంభించేవారు చరిత్రను. కాని, ఈ గ్రీకులంతా ఆటవికులుగా నున్ననాటికే, భారత నాగరికత అత్యున్నత స్థాయికి వచ్చింది. హీబ్రూలే ఆది మానవులని పాశ్చాత్యులనుకునేవారు. గ్రీకు అరిస్టాటిల్ నామవాచకం, క్రియా వాచకం, Case ఉన్నవని కొంతవరకు కనిపెట్టాడు కాని, నిన్న మొన్నటిదాకా (Latin) లాటిన్ భాషే అన్ని భాషలకూ మాతృక అనుకొనేవారు.

అయితే భారత దేశాన్ని జయించడంతో వారికి భారతీయ నాగరికతతో సంబంధం కలిగింది. సర్ విలియం జోన్సు అనే పండితుడు లాటిన్‌కూ సంస్కృతానికీ సంబంధం ఉన్నదని కనిపెట్టాడు. సంస్కృతజ్ఞానం కలిగిన తర్వాత పాశ్చాత్యులు భాషాశాస్త్రాన్ని అభివృద్ధి చేయగలిగారు. భాషా సంబంధాలను తెలుసుకున్నారు వ్యాకరణాలను నిర్మించడం నేర్చుకున్నారు. జర్మన్, స్కాండినేవియన్, రష్యన్ భాషలన్నింటిలోనూ సంస్కృతంతోపాటు ఒకే కుటుంబానికి చెందిన పదాలు కొన్ని వున్నాయి

భరతి, ఫెరో (గ్రీస్) పితా, Pater, Father, మొ॥ రూపాలు తీసి, Phonetics తయారుచేశారు. ఏ యే భాషల్లో ఏ యే పదాలు ఎలా మార్పు చెందాయో స్పష్టపరిచారు.

సప్త - సెప్టెం - సెటెం - సెవెన్

అష్ట - అక్టో - అట్టో - యైట్

(శ్వాస కలిగినవికొన్ని; నాదంకలిగినవికొన్ని. నాదతంతువుల కంపం కలిగినపుడు పుట్టేవి నాదశబ్దాలూ, శ్వాసమాత్రక ధ్వనులు పరుషాలు. ఇలాగే నాదశ్వాసలనుబట్టి ఒక్కొక్క భాషలోని మార్పులను వివరించారు) ఈ సంబంధాలను బట్టి ఇండో - యూరపియన్ భాషలన్నీ ఒకేకుటుంబంలోని వన్నారు. కాని, ఇదంతా సంస్కృతజ్ఞానం కలిగిన తర్వాతనే వారికి సాధ్యమయింది. మిగతా భాషలకు కూడా ఇలాంటి సంబంధం ఎందుకుండదని తక్కినవారాలోచించసాగారు,

ధాతురూప పదభాషలు

చైనాభాష (symbols) సాంకేతికాలతో నడుస్తుంది. 'నేను వెళుతున్నాను' అనే దానికి ఒక బాణు వేసి గుర్తులు పెడతారు. చైనాభాష, ధాతురూప పదభాష.

ద్రావిడ భాషలు

ద్రావిడ భాషలన్నీ ఒక వర్గంలోనివని హాంబోల్టు అనే ఆయన ఒకవాదం లేవదీసాడు. 1850 లో కాల్డ్వెల్ అనే ఆయన ఈ వాదాన్ని సమర్థిస్తూ గ్రంథాలు వ్రాసాడు

భాషాతత్వం

భాష ఎలాపుట్టింది ? 'గోడ' శబ్దంతో గోడే ఎందుకు స్ఫురించాలి ? ఇటువంటి ప్రశ్నలు ఎంత తమాషాగా వుంటాయి! ఇన్ని భాషలు ఎందుకు పెరిగాయి ? ఎక్కడనుంచి వచ్చాయి ? ఒకదానినుంచే పుట్టాయా ? అని ప్రశ్నలు శర పరంపరగా వస్తాయి.

భాషఅంటే అర్థవంతమయిన శబ్దం అన్నాడు పాణిని ఒకేశబ్దం ఎన్నాళ్ళుగానో ఒకేఅర్థంలో వస్తున్నది. వైయాకరణులు ఈశ్వరసంకేత మన్నారు. ఇతరులు మానవసంకేత మన్నారు.

అసలు పసిబిడ్డ వేసే కేకయే జీవితానికి మూలం అదే భాషకీ మూలం. తరువాత తరువాత అమ్మ అయ్య తాత అనే మాటలు నేర్చుకుంటుంది. అలాగే అన్నిభాషలవారూ, తమతమ భాషలను నేర్చుకుంటారు. ఇలా భాష అనుకరణతో ప్రారంభమవుతుంది. మొదట ఎవరు కనిపెట్టారు ? అనే ప్రశ్నకు సమాధానం లేదు'

ఒకచోట పుట్టిన ఒకేభాష, క్రమంగా అనేక భాషలుగా విడిపోయిందా ? లేక, వివిధ ప్రాంతాల్లో వివిధ భాషలు స్వతంత్రంగా పుట్టిపెరిగాయా ? అంటే, ఈ భాషలన్నీ భారతదేశంలోనే పుట్టాయంటారు కొందరు ఏమయినా, ఒకచోట పుట్టి విడిపోయిన భాషలకు మార్పు లెక్కువగా వుంటాయి. పుట్టిన చోటనే ఉన్న భాషలో మార్పులంతగా వుండవు. కాని భాష ఎప్పుడూ మారుతూనే ఉంటుంది అయితే, ఈ వాదాలు ఋగ్వేద కాలంనుండీ వున్నాయి.

ధ్వన్యనుకరణంగా బయలుదేరి యుండవచ్చు నామకరణం కొన్ని శబ్దాలు ఇలాగే వుంటాయి. పని చేసేటప్పుడు చేసే ధ్వనులనుబట్టి మరికొన్ని శబ్దాలు పుట్టి వుండవచ్చు. ఈ రీతిగా భాషల్లో భేదాలుకూడా ఏర్పడుతాయి.

వేదాలు చదువుతూంటే, ఉచ్చారణ భేదమునుబట్టి మార్పులుగుతూఉండడం చేత ఏ ధ్వని ఏ భాగమునుంచి పుట్టిందో పరిశీలించి హ్రస్వమనీ, దీర్ఘమనీ, స్వరితమనీ, భేదాలునిరూపించి స్వరశాస్త్ర పద్ధతిని - ప్రాతిశాఖ్యలను రచించారు వేద ఋషులు. అర్థాలు మారుతూవుంటే వ్యుత్పత్తులనుబట్టి అర్థ నిర్ణయంకూడా చేశాడు యాస్కుడు. హింసచేసేది సింహః అయింది. వీటినిబట్టే (Syncopy assimilation) స్వర సూత్రాలను తయారుచేసారు, వీటివల్లనే భాషా సంబంధాలు తెలుస్తాయి.

భారతదేశంలోని భాషలు తీసుకుంటే ఉత్తర దేశంలో సంస్కృతం ప్రధానం. అయితే, సంస్కృతం భారతదేశంలోనే పుట్టిందా ? లేకపోతే, ఎక్కడ పుట్టింది? అసలిది- ప్రాకృతంకంటే ముందు పుట్టిందా ? లేక, ప్రాకృతమే ముందా ? అనే ప్రశ్నలు వస్తాయి.

వంశ వృక్షాల మోస్తరుగా భాషలన్నింటినీ వర్గీకరించి జాబితా వేస్తారు. ఇండోయూరపియన్ భాషల్ని మొత్తం 12 భాగాలుగా చేసారు. ఇందులో ఒకదాని కొకదానికి సంబంధాలున్నాయి.

అయితే, ఇవి అటునుంచి ఇటువచ్చినాయా? లేక, ఇటునుంచి అటుపోయినాయా? అంటే - 'కాదు మధ్య ఆసియాలో పుట్టా' యన్నారు. మధుశబ్దం అన్నిభాషల్లోను సమానంగా వుంది. కనుక పాలు, తేనె ఎక్కువగా వున్న ప్రదేశంలో వీరు మొదటనుండి వుండాలి.

అయస్ (సం) Iron (ఇం)
దస్ (సం) Ten (ఇం)

ఇలా పోలికలనుబట్టి, ఇంకా ఇతర విషయాలను బట్టి, నాగరికతలను కూడా నిర్ణయించి, పూర్వాపరాలను తేల్చవచ్చు.

కాగా తెలుగుకీ సంస్కృతానికీ వున్న సంబంధం ఏమిటో తెలుసుకోవాలి. సంస్కృతంనుండే తెలుగు వచ్చిందా? లేకపోతే, ద్రావిడ భాషలనుండే సంస్కృతం వచ్చిందా? అని ప్రశ్న.

ఆర్యులెక్కడినుంచో వచ్చి, దేశీయులైన ద్రావిడులను (దస్యులను) తరిమి తరిమి దేశాన్ని ఆక్రమించారు. ఇది చరిత్ర.

వైయాకరణులు చెప్పిందేమంటే — సంస్కృతమే ప్రాచీనమయిందనీ — అదే కాలక్రమాన ప్రాకృతమైందనీ 'భవతి-హోది' అయిందన్నారు. కాని వేదకాలంలో లేని శబ్దాలు ప్రాకృతంలో కన్పడుతున్నాయి. అందుచేత వేదాలు ప్రాకృత భాషాపరిణామంలో ఒక దశ అనీ, తర్వాత ఇక్కడపుట్టిన మాటలను పాణిని సంస్కరించాడనీ అంటారు.

మన భాషలు

మనం ఎవరం? తెలుగువారమా? ఆంధ్రులమా? తెలుగుభాషా? ఆంధ్ర భాషా? రెండుపేర్లెందుకు వచ్చాయి — మరెక్కడా లేదే యిది? ఏది ఎక్కడి నుంచి వచ్చింది?

తెలుగు శబ్దంకంటె ఆంధ్ర శబ్దం ప్రాచీనమైంది. ఆంధ్రశబ్దం ఐతరేయ బ్రాహ్మణంలో పేర్కొనబడింది. 1500 B. C. వేదాలు. 1100 B. C. ఉపనిషత్తులు, 800 B. C. బ్రాహ్మణాలు అని పాశ్చాత్యులు కాలనిర్ణయం చేస్తారు. కాని ఇది సరికాదు. ఇవి ఇంతకంటె చాల ప్రాచీనమైనవి.

శునశ్శేపుడు - హరిశ్చంద్ర జలోదరానికి బలి - వరుణుడు రక్షిస్తాడు - విశ్వామిత్రుడి సాయం - విశ్వామిత్రుడు అతన్ని కొడుకుగా భావించుకుంటానంటే అతని నూర్గురు కొడుకుల్లో 50 మంది ఒప్పుకోలేదు. వీరిలో వున్నారట ఆంధ్రులు....

దీనినిబట్టి ఆర్య ద్రావిడ భేదం స్పష్టం. ఆంధ్రులు వింధ్యకు దక్షిణానికి వచ్చారనీ, తరువాత కృష్ణవేణి ప్రాంతాన్ని పరిపాలించారనీ నిదర్శనాలున్నాయి. పిదప కళింగ, మగధలు కూడా పరిపాలించారని చరిత్ర. క్రీ శ. 200 నాడే ఆంధ్రులు మహావైభవాలతో తులతూగుతూండేవారని మెగస్తనీస్ద్వారా తెలుస్తుంది.

వింధ్య దక్షిణాన కృష్ణానదీ తీరవాసులతో ఆంధ్రులు కలిసారు. రాజ్యాలను

స్థాపించారు. అనార్యజాతి సంపర్కం కలిగిన ఆర్యజాతి ఆంధ్రులు ఇక్కడికి వచ్చి, ఇక్కడి అనాగరికులతో కలిసి పోయారు. మగధ క్రీ శ. 200 లకి పూర్వం; శాతకర్ణి క్రీ. శ. 300 కి పూర్వం—అప్పటి నాణెములు దొరుకుతున్నాయి. కృష్ణా - గోదావరీ మధ్య ప్రాంతం చరిత్రలో 20 శతాబ్దాల పూర్వంనుంచీ గోచరిస్తుంది. నాసిక్ దగ్గిర, అమరావతి దగ్గిరకూడా వారి శాసనాలు కన్పిస్తున్నాయి. ఆంధ్రులు ప్రబలులుగా వచ్చి కలిసిపోయినందువల్ల కృష్ణా, గోదావరీ మధ్యప్రాంతంలోని ప్రజలకు ఆంధ్రులని పేరు వచ్చింది. ఆ కాలాన ప్రభుత్వము నెరపిన ఆంధ్రులది ప్రాకృత భాష లిపి ఆంధ్ర కన్నడ లిపి.

చారిత్రకంగా ఆంధ్రుల శాసనాలన్నీ ప్రాకృతంలోనే వున్నాయి. సంస్కృత వ్యాకరణాలన్నీ నన్నయ కాలంలోనే బయలుదేరాయి. తెలుగులో నన్నయ భారతమే మొదటిదన్నారు. అంతకు ముందు సంగతి మనకు తెలియదు. సారస్వతంలేదు గనుక ప్రాకృతభాష నుండే తెలుగు వచ్చిందన్నారు నారాయణరావుగారు. ఒకవిధంగా సరిపోయింది. ప్రాచీనశాసనాలు ప్రాకృతంలో వున్నాయి, పండితులందరూ తెలుగు సంస్కృతంలోంచి పుట్టిందనుకొంటున్నారు - తెలుగు శాసనాలు లేనేలేపు-మరి తెలుగు ఎక్కడ ? నన్నయ్యకు ముందు ఏమయిందీ తెలుగు ? కనుక, నన్నయ్యే తెలుగును పుట్టించాడంటారు.

ఉత్తర హిందూస్థానంలో అనార్య సంపర్కంవల్ల ఆర్యసంఘంనుంచి బహిష్కృతులైన ఆర్యులు వింధ్య దక్షిణానికి వలసవచ్చి, అక్కడినుంచి కృష్ణా ప్రాంతాన స్థిరపడి మహాసామ్రాజ్యాన్ని స్థాపించారు. దాంతో ఇక్కడి తెలుగువారంతా, వారికి తెలియకుండానే, ఆంధ్రులయిపోయారు. ఆంధ్రజాతినిబట్టి ఆంధ్రదేశం ఆంధ్రభాష అయినాయి. విజయనగరం పూసపాటివారు ఇప్పటికీ ఇళ్ళలో హిందూస్థానీయే మాట్లాడుతారు. వ్రాయడంమాత్రం తెలుగులో వ్రాస్తారు. ఇలాగే వెనుకటి బహిష్కృతార్యులు తెలుగులో వ్రాసేవారు ; ప్రాకృతంలో మాట్లాడేవారు. జయసింహ వల్లభ శాసనం తెలుగులో వున్నది ఇది ప్రాకృతం కాదు. సంస్కృతంలోకి మార్చవలనుకాదు.

మధ్యకాలంలో సాహిత్యం లేదని, 6 వ శతాబ్దాని కల్లా అకస్మాత్తుగా 'సంవత్సరంబుళ్' అను తెలుగు పదము తయారయిందనడానికి వీలులేదు.

పిణ్డై, పిణ్డైగళ్, పిణ్డైగ, పీనిగ; ఈన్, ఈన్గళ్, ఈన్గ, ఈంగ - ఇలా తెలుగుకు అరవంతో సంబంధంవున్నది కాని క్రియారూపాలు వాక్యనిర్మాణపద్ధతి మొదలగు ముఖ్యవిషయాలలో తెనుగునకు సంస్కృతంతో అసలు పోలికే లేదు. సంస్కృతంనుండి తెలుగులోనికి చాలా సంస్కృత శబ్దజాలం వచ్చింది. సంస్కృత వ్యాకరణపద్ధతే అవలంబింపబడింది.

అరవం చాలా ప్రాచీనమైన భాష. క్రీస్తు పూర్వపుభాషకాని, ఆ తరువాతది కాదు. నారాయణరావుగారు 11 వ శతా

బ్దమువరకూ వాఙ్మయంలేదని వ్రాసారు. కాని తొల్కాప్యం అనే లక్షణ గ్రంథం క్రీస్తుపూర్వమే వుంది. క్రీ. శ. 8 వ శతాబ్దంలో 'కవిరాజమార్గం'అనే లక్షణ గ్రంథం కన్నడంలో బయలుదేరింది మరి తెలుగులో వాఙ్మయం ఏమైపోయి నది ? 643 దగ్గరినుంచీ తెలుగులో శాసనాలు కన్పడుతున్నాయి. అరవంలో నుంచి తెలుగు ఎప్పుడో విడిపోయి వుంటుంది. సంవత్సరంగళ్ సంవత్స రంబుళ్గా మారడానికి, 'గళ్ - లు'గా మారడానికి బోలెడంత కాలంపట్టివుండాలి ఈలోపుగా ఎంతో వాఙ్మయం పుట్టి వుండాలి. ఏది ఆ వాఙ్మయం ? ఏమైనా తెలాంగ్‌జాతిని బట్టి మన భాష తెలుగు అయి వుంటుంది.

ఆంధ్రుల శాసనాలన్నీ క్రీ. శ. 4 వ శతాబ్దంవరకు ప్రాకృతంలోనే వున్నాయి. తెలుగు ద్రావిడభాషా కుటుంబంలోది.

బౌద్ధమతాభిమానంవల్ల ఆంధ్రులు ప్రాకృతంలో శాసనాలు వ్రాసారు. 4 వ శతాబ్దంతో బౌద్ధమతం అంతరింప సాగింది. తర్వాత మళ్ళీ సంస్కృతమే ప్రబలింది. దర్శనాలూ, శాస్త్రాలూ, సంస్కృతంలోనే వుండడం చేత, రాజులు, పండితులు సంస్కృతాన్నే ఆదరించారు.

చాళుక్యుల కాలంలో తెలుగు శాస నాలు బయలుదేరాయి. ఇంతకుముందు కన్నడంగానీ, తెలుగుగానీ వున్నాయా ? లేక సంస్కృతంనుంచే తెలుగు వచ్చిందా ? 7 వ శతాబ్దంలో కుమారిల భట్టు తెలుగుశబ్దాలు, అరవశబ్దాలుకూడ సంస్కృతంలో చేరిన వన్నాడు. సంస్కృతంకూడా ఇతర దేశభాషలలో నుంచి కొన్ని శబ్దాలను ఎరువు పుచ్చు కుంది పికనేమాది శబ్దాలు గ్రీకు మొద లైన భాషలలోనుండి చేరియుంటాయి. కుటి మీనం, మర్కట మొదలగునవి దేశభాషలలోనుండి చేరిఉంటాయి.

ఇది ఇలావుండగా 4, 5, 6 శతాబ్దు లలో తెలుగుశాసనాలు లేవు కనుక తెలుగేలేదనే వాదం అసమంజసం.

ద్రావిడభాషలు, దక్కన్‌లోను దిగు వనూ వున్నాయి బెలూచీస్థాన్ దగ్గరి 'బ్రాహూయీ' వింధ్య ప్రాంతంలోని 'గొండ్', 'రాజమహల్' 'కూయి' భాషలు కూడా ద్రావిడభాషలే.

వైయాకరణులు తెనుగు వికృతి అన్నారు. అంతేగాక, ద్రావిడీ దాక్షిణాత్య భాషలుకూడా ప్రాకృతమే నన్నారని మరొకవాదం అయితేఇది తెలిసి, చెప్పిన మాటకాదు. ఉత్తరబ్రాహ్మలు దక్షిణాదికి వలసవచ్చి మాట్లాడిన భాషను ద్రావిడి అన్నారని నా అభిప్రాయము.

అసలు ప్రాకృత భాషలు ఆరు. ఇవి ఉత్తరదేశంలో వాడుకలో వుండేవి. హిందీ, రాజస్థానీ మొదలయిన ఆధునిక ఉత్తర దేశభాషలు ప్రాకృత భవములు, సిలోన్‌లో జాఫ్నా ప్రాంతం తమిళం సింహళి భాష ప్రాకృతం - హిందూదేశ భాషలన్నీ సంస్కృతం-ప్రాకృతం భాష లని చిలుకూరి వారన్నారు.

'చెయ్యి' అనే పదం తీసుకుందాం. శయః - చెయ్యి అయిందంటారు. 'కై' అనే పదం తెలుగులోను కన్నడంలోనూ కూడవుంది 'కై'క్రమంగా 'చై' అయి, 'చెయ్యి'గా మారింది.

రంజ్ + ఇంచు = రంజించు; ఇందులో 'ఇంచు' తెలుగు ధాతువు. 'నేను యాక్టు చేస్తున్నా' నంటారుగాని 'నేను యాక్టింగ్' అని ఎవ్వరూ అనరు అలాగే క్రియాపదాలు, విభక్తి ప్రత్యయాలు, అవ్యయాలు, వాక్య నిర్మాణ పద్ధతి మొ॥ మరొక భాషనుంచి ఎరువు తెచ్చుకోలేము. ఇదే క్రియాపద్ధతి. అహంగచ్ఛామి (సం.) I am going (ఇం) నేను పోవుచున్నాను, (తె.) నాన్ పోగిరెన్ (త) తెలుగు తమిళ వాక్యాలకు పోలిక కనబడుతున్నది. వాక్య నిర్మాణంలో భేదాలు కన్పిస్తూ వున్నాయి. ఎన్ని శబ్దాలయినా ఒక భాషనుంచి మరొక భాషలోకి తీసుకోవచ్చు. సమాసం సమాసం పట్టుకొచ్చినా డుమువులు చేర్చకపోతే, తెలుగు కాదు గదా ! తెలుగు చేసిగాని ఇతర పదాలను చేర్చుకో వీలులేదు. Road = రోడ్డు ; Battalion = పటాలము; Hospital = ఆసుపత్రి. అజంతాలు చేసినప్పుడే తెలుగవుతుంది అరవంలో ఎక్కువ హలంతాలున్నాయి, కన్నడంలోకూడా అంతే తెలుగు మాత్రమే అజంత భాష సంస్కృతంతో ఎక్కువ సంబంధం వల్ల ఇలా అయిపోయింది. అందుకే, తెలుగు పలుకుబడికి మెచ్చి, Italian of the East అన్నారు.

రెండు భాషలయొక్క సాజాత్యాన్ని నిర్ణయించాలంటే ప్రధానమైనది ఆ యా భాషల్లో సర్వసాధారణంగా వాడే పదాలను తీసుకొని పోల్చిచూడాలి. తినుట, నడచుట. పండుకొనుట మొదలైనవి నిత్య వ్యవహారంలోని పదాలు. ఇలాంటి పదాల్లో సంస్కృతంతో తెలుగుకు సాజాత్యం వున్నట్లయితే, తెలుగు సంస్కృతంలోనుంచే పుట్టిందని ఒప్పుకోవచ్చు

'అహం' కీ 'నేను' కీ సంబంధం లేదు 'తన్డ్రై' కీ 'తండ్రి' కీ సంబంధం వుంది. తెలుగు తల్లి, మళయాళ తళ్లై - అరవ తంబి, తెనుగు తమ్ముడు. ఒండ్రు-ఒకటి, రెండ్రు-రెండు, ఎంటు-ఎట్టు; ఈవిధంగా తెలుగుకూ ద్రావిడ భాషలకూ అన్యోన్య సంబంధం కనిపిస్తున్నది. ఇక భాషలు మూడురకాలు.

1. ధాతురూప పద భాషలు
2. సంయుక్త పదరూపభాషలు
3. ప్రత్యయాంత భాషలు.

వెళ్ళుచున్నాను (నేను). వెళ్ళుచున్నావు(నీవు). వెళ్లుచున్నాడు(వాడు). వెళ్ళుచున్నది (అది) ఇలాంటి భాషలను సంయుక్త పదరూపభాషలంటారు.

వచ్చెడివాడు ఫల్గునుడు - వచ్చేవాడు ఇది వ్యావహారికం - భాష అనుక్షణం మారుతూనేవుంటుంది చేయవలెను - చెయాలె - చెయ్యాలె - చెయ్యాలి - చేయాలి — ఇన్ని రూపాలూ వున్నాయి గదా!

అవన్ (త.) - వాన్‌రు - వాండు - వాఁడు. రామః - రామన్ - రామ్రు - రామండు - రాముండు - రాముడు. ఇలా ఒక శబ్దాన్ని మరోశబ్దానికి చేర్చడంవల్లనే ద్రావిడభాషలన్నీ ఏర్పడ్డాయి. తమిళం - కన్నడం-తెలుగులలో విభక్తి ప్రత్యయాలు కలవడం లేదు. అవి ఎప్పుడో చీలిపోయి మారిపోయాయి,

కు' అనే ఒక్క విభక్తిమాత్రమే కన్ప డుతుంది. ఈ 'కు' ప్రత్యయం మరే భాషలోనూ కన్పించదు విభక్తి ప్రత్య యాలు ఎక్కడా ఎవ్వరూ ఎరువు తెచ్చు కోరు. కొన్నింటిలో సామ్యం కన్పడు తుంది; కొన్నింటిలో కన్పడదు ద్రావిడ భాషల్లో. ఎందువల్లనంటే - మూల భాషనుంచి ఈ భాషలు విడిపోయాకనే తక్కిన విభక్తి ప్రత్యయాలన్నీ ఏర్పడి వుంటాయి.

ఇలా సంస్కృతంలో, స్వతంత్ర ధాతువులను కలపడానికి వీలులేదు. అందువల్ల సంస్కృతం ప్రత్యయాంత పదభాష అవుతుంది.

స్వరములు

తెలుగులో ఋ, ౠ, ఌ, ౡ, లు లేవు. సంస్కృతంలోలేని ఎ, ఒ, ఱ, ళ, లు కన్పడుతున్నవి.

హల్లులు

తెలుగులో క, గ, చ, జ, ట, డ, ణ త, ద, న, ప, బ, మ, లు మాత్రమే కన్పి స్తాయి. ఒత్తు అక్షరాలన్నీ సంస్కృతం లోనుంచి తెచ్చుకున్నవే శకటరేఫ ఱకారము, పదాంత నకారము ఆర్యభాష లలోలేనే లేవు. ధూజ్ కంపనే-ధాతువు నుంచి దున్ను ధాతువు వచ్చినదని నారాయణరావుగారు చెప్పారు. ధూజో అంటే కదలుట అని అర్థం. దున్నితే కదలుతుందట! మూంద్రు-మూన్-అర వంలో పదాంతనకారంవున్నది. శషసలు లేవు. శకటరేఫ, ఱకారం విశేషంగా కన్పడుతాయి. ఱ కారం డు కారంగా మార్చాడు నన్నయ నన్నయకు ముందరి తెలుగు శాసనాల్లోను 'ఱి' కారంవున్నది. కోఱి = కోడి, తెగఱి = తెగడు, కూఱి = కూడు ఇంతేకాదు. తెలుగు శాసనాల్లో శకటరేఫ కూడా కన్పడుతుంది. విభక్తి ప్రత్యయాలు కూడా ద్రావిడ భాషల్తో సామ్యం కలిగివున్నాయి. కనుక ద్రావిడ భాషలన్నీ ఏకకుటుంబములోనివని నా వాదం

క్రీ. శ. 10, 11, 12, శతాబ్దాలలో పాకృతములనుండి వచ్చిన ఉత్తర హిందూస్థానార్య భాషలలో ద్రావిడ సంప ర్కంవల్ల కొన్ని ద్రావిడ పదాలు సంప్ర దాయాలు కలిసాయి; ఆ చిహ్నాలు ద్రావి డానివే కాని, ప్రాకృతానివికావు ఏల యనగా అవి సంస్కృతములోగాని ప్రాచీన ప్రాకృతములలోగాని కనబడవు.

నన్నయకు పూర్వం శాసనాలున్నాయి వాఙ్మయం కన్పడదంలేదు. ఏమయి పోయింది? చాళుక్యుల దగ్గరనుంచి ఆంధ్రభాషలో శాసనాలుకన్పడుతున్నాయి నన్నెచోడుడు ఆ రహస్యం బయట పెట్టాడు. ఆంధ్ర వాఙ్మయ చరిత్రను గూర్చిన దృక్పథమునే మనము మార్చు కోవాలి. నన్నెచోడుని మాటలను బాగా పరిశీలిస్తే మార్చుకోవలసి వస్తుంది. ఆయన నన్నయకు తరువాతివాడే. కాని నన్నయకు పూర్వపువాఙ్మయం ఏమైంది?

నన్నయ్య కొన్ని సంస్కారాలు చేసి నాడు. శాసనాలు కన్పడుతున్నాయి. వాఙ్మయం లేదు. చాళుక్యుల కాలంలో యుద్ధాలమూలాన శాంతిలేక, వాఙ్మయం అంతరించి వుంటుందా?

నన్నయకవితా స్రవంతి ఒక్కసారిగా పొంగి పొరలివచ్చిందా? పంప, పొన్న, రన్నఅనే కన్నడకవులు జైనమత మవ లంబించి చంపూకావ్యాలు వ్రాసారు. జైనులంటే నన్నయ్యకు ఇష్టంలేదు కాని, కన్నడభాషను అనుకరించాడు.

చాళుక్యులు
"మునుమార్గ కవిత దేశ
మ్మునవెలయగ దేశికవితపుట్టించి తెలుం
గును దేశమ్మున ఏలిపిరి"

అని నన్నెచోడు డన్నాడు 'తరువోజ, అక్కర'లు చాళుక్య శాసనాల్లో కన్పిస్తాయి పీటిని నన్నయభట్టే తీసుకొచ్చాడు. తరువాత నన్నెచోడుడు కన్నడంలోనుంచి సమాసాలకు సమాసాలు సంగ్రహించాడు. ప్రబంధ రచన చేశాడు. ప్రబంధ రచనాపద్ధతిని కన్నడ కవులనుండి తీసికొని వచ్చినవాడు నన్నెచోడుడే. పెద్దన ప్రబంధరచనకు మొదటి వాడని మన మనుకుంటూ ఉన్నాము ఇన్నాళ్లూ.

దేశికవిత ఏనాటినుండో వస్తున్నది. రాజరాజుకు పూర్వపు చాళుక్యులు దేశి కవితను పుట్టించారని నన్నెచోడు డన్నాడు. కాని అందులో అక్షరం కన్పించడంలేదు. దాన్ని ఆదరించిన వారు లేక అది నశించినది జనుల నోళ్ళలోనే ఉండిపోయింది. కాని గ్రంథస్థము కాలేదు. కావున మనదాకా రాలేదు. శాసనాల్లోవి మాత్రం నిలిచివున్నాయి. పాల్కురికి, రంగనాథ ద్విపదకావ్యాలు దేశికవితలో కేవస్తాయి

తెలుగుభాష నన్నయ కాలంలో మారింది. మళ్ళీ శ్రీనాధుడి కాలంలో మార్పుచెందింది. నన్నయ ప్రయోగ ధోరణి మారిపోయింది.

దృష్టు, కోతురు, చేతురు, అని నన్నెచోడుడు వ్యావహారికమే వాడాడు. ఈనాడు అందరమూ వ్యావహారికమే వాడుతున్నాం. కాలప్రభావం తప్పదు.

ఏ ప్రాంతమువారు ఆ మాండలికాలను ప్రోగుచేసి నిఘంటవులు తయారు చెయ్యాలి. అప్పుడే ఆ మాండలికాలను ప్రయోగించిన పురాతనకవుల చరిత్రలను రచనలను అర్థంచేసుకో గలుగుతాం.

మనం మన భాషయొక్క చరిత్రనే కాక, సాహిత్య చరిత్రను తెలుసుకో వలెనంటే, కన్నడం మొదలైన భాషలను చదివితీరాలి. మన పరిసరాలను తెలుసు కోవాలి.

"మూగవోయిన నాగళమ్మునను గూడ
నిదురవోయిన సెలయేటి రొదలు కలవు—"

— కృష్ణశాస్త్రి.

ఏది శ్రేష్ఠ పపంథా?

శ్రీ శ్రీరంగం శ్రీనివాసరావు



'ఈ కావ్యం బాగున్నది'

'ఈ కావ్యం బాగాలేదు' అని మనం ఒక కావ్యాన్నిగురించి చెప్పినప్పుడు మన మనస్సులో వున్న కొన్ని 'కొలబద్దల'తో దాన్ని కొలిచి పై నిర్ణయాలకు వచ్చామన్న మాట! ఈ కొలబద్దలు ముఖ్యంగా మూడు రకాలుగా వున్నై. కావ్య విమర్శనలో

[I] సాహిత్య విమర్శ: కాలనిర్ణయం సమకాలికుల నిరూపణ విషయ విమర్శ ఛందో వికరణలు యీ వర్గంలోవి

[II] గతి తార్కిక భౌతికదృక్పథం దీనినే మార్క్సిస్టు దృక్పథం అంటారు (Dialectical Materialistic Criticism) యీ కోణంనుంచి చూచినప్పుడు

కావ్య వస్తువు - కవికీ వస్తువుకూ, ఆనాటి ఆర్థిక, రాజకీయ, సామాజిక వ్యవస్థకూ వున్న సంబంధాలను గ్రహించి వాటివల్ల కవి వివృతం చేసిన విషయాలు సంఘ పురోగమనానికి ఎంతవరకు తోడ్పడగలవో, ఎంత సజీవమైన శబ్ద చిత్రణద్వారా కావ్య నిర్మాణం చేసాడో విలువ కట్టడం

[iii] మనస్తత్వ పరిశీలన : కావ్యంలో వివిధసన్నివేశాలలో(Instances) పాత్రల (Objective) లేదా కవియొక్క (Subjective) మనః పరివర్తనాలు యెట్లా వున్నాయో సిగ్మండ్ ఫ్రాయిడ్‌లాగా పరిశీలించటం (Psycho - Analytical Outlook)

అయితే యే ఆదర్శమూ లేకుండా విమర్శించటం శ్రేయస్కరం కాదు. క్రొత్త క్రొత్త కవితారీతులను చూచి ఇది భారతీయ సాంప్రదాయం కాదని నిరసించడమూ మంచిదికాదు. శ్రీ అక్కిరాజు ఉమాకాన్త విద్యాశేఖరులు 'నేటికాలపు కవిత్వం'లో కవులందరినీ తిట్టారు. Degeneration అనేపుస్తకంలో Maxnardou ఇట్లాగే 19వ శతాబ్దపుకవులందరినీ తిట్టాడు. దీనికి కారణం పారిశ్రామిక విప్లవానంతరం శరవేగంతో వచ్చిన పరివర్తనలను అర్థం చేసుకోలేక పోవటమే. అవి అర్థంకాక ఆ మార్పులను ప్రస్ఫుటంచేసే కవిత్వాన్ని వెర్రి కవిత్వం అన్నాడు.

కావ్య విమర్శనకు అలంకార శాస్త్రాలు లక్షణ గ్రంథాలు ఉపకరించవచ్చు. అవి కేవలం శిల్పాన్ని నిర్దిష్టం చేస్తాయి కావ్య వస్తువును నిర్దేశించవు. అది, అపారమైన మన జీవితానుభవాలనుంచి సేకరించుకోవాలి.

కావ్యంలోని శిల్పాన్ని, వస్తువును (Technique, Form and Content) విడమరచలేము. కావ్యం వివిధ దశలలో అవి ఒకదానితో మరొకటి సమానంగా పెంపొందుతూ వుంటై. ఈ సమానాభివృద్ధి వుంటేనే మంచికావ్యం తయారవుతుంది. కావ్యంలో చెప్పేది యేదైనా బాగా చెప్పబడి వుండటంవల్ల అది మంచిదికాదు, చెప్పిన దానికి చెప్పిన విధానానికి సమానమైన ప్రాధాన్యత ఉంటుంది.

ఇంత కావ్యం విశ్వశ్రేయస్సుకా ? రసానందం కోసమేనా అన్న ప్రశ్న వున్నది. గతితార్కిక భౌతికవాద దృష్ట్యా యీప్రశ్నకు సమాధానం చెప్పుకోవచ్చు. ఇంగ్లండులో వచ్చిన పారిశ్రామికవిప్లవానంతరం అభివృద్ధిలోకి వచ్చిన మార్క్సిస్టు భౌతిక తత్వజ్ఞానం ఒక ముఖ్యవిషయాన్ని స్పష్టం చేసింది. అది మానవుడు పరిసరాలకు బానిస అనే విశ్వాసాన్ని విచ్ఛిన్నం చేసింది. విధినీ పరిసరాలను మార్చగలిగిన మహత్తరశక్తి మానవుడికి వున్నదని ధృవపరిచింది. ఈ నూతనోత్సాహం దిక్కు దిక్కులా వెల్లివిరిసింది. దీనితో ప్రపంచంలో అనేక దేశాల్లో అనేకుల జీవితాల్లో తిరుగుబాటు వచ్చింది. యీ విప్లవకారులు సాహితీ జగత్తులోనూ వున్నారు. వీరి సందేశం : కొద్దిమంది తమ చేతుల్లో పెట్టుకొని వున్న విజ్ఞానం, సిరిసంపదలు అశేష జనసముదాయానికి అందుబాటులో వుండేటట్టు చేసి సామాజిక జీవితాన్ని సుఖమయమూ, శుభకరమూ, చెయ్యాలని భూతలాన్ని 'స్వర్గంగా' మార్చాలని యీ దృక్పథం. వ్యక్తి సంఘాభి వృద్ధికీ-సంఘం వ్యక్తి అభివృద్ధికీ దోహదమయ్యేటట్లు, పరస్పరం ప్రయోజనకారిగా వుండేట్టు చేస్తుంది. ఈ ఉత్తమ దృష్టి అలవరచు కొన్నప్పుడు, 'ఆత్మానందం పరమావధి' అనేదృష్టి సంకుచితంగా అభివృద్ధి నిరోధకంగా కనిపించక పోదు ! శాసనాలకంటే బలీయమైందీ, ఉదాత్తమైందీ, ఉల్లంఘించరానిదీ కవివాక్యం. అందుచేత కవి సంఘానికి మార్గదర్శకుడు కావాలి. అందుకనే వడివడిగా ప్రజలందరినీ ముందుకు నడిపించే కవిత్వం వ్రాయాలి. సంఘాన్ని ముందుకు నడిపించడమే విప్లవ పంథా, అభ్యుదయరీతి ! యిది కావ్యవిమర్శకు గీటురాయి !

అస్థిపంజరం

అదిగో!
అలా చూడు
ఆ నడి రోడ్డున
అదేదో
పడుతూ లేస్తూ
తూలి పోతూ
పోతున్నాడు దెచ్చటికో

ఆనిప్పులు చెరిగే
వేడి గాడ్పులో
సుడి గాలి
సృష్టించిన
ధూళి మేఘాలలో
తేలి పోతూ
పోతున్నాడు దెచ్చటికో
అదొక
అస్థి పంజరం
అది
నడిచే అస్థి పంజరం

తిండి దొంగ
రాతి గుండెలో
రగులొన్న
దురాశా జ్వాలలో
రక్త మాంసాల్

ఆహుతై పోగా
మృత్యు దేవత
బలి కోసమై
మిగిలియున్న
ఎముకల గూడు!

కరువు రక్కసి
కటికి పాదాల క్రింద
నలిగి పోయిన
అనాధుని
శిధిల స్వరూపం

మృత్యు దేవత
భీక రాట్టహాసం
విలువీడిన బాణంలా
వెంటాడుతుంటే
బెదిరి పోయి
గాలికెగిరే
ఎండు టాకులా
పోతున్నాడు దెచ్చటికో

అదిగో
అదొక అస్థి పంజరం
అది
నడిచే అస్థి పంజరం

— పి. విశ్వనాథ్



శ్రీ శ్రీపాద గోపాల కృష్ణమూర్తిగారు

తెలుగు ఏకాంకిక

శ్రీ శ్రీపాద గోపాల కృష్ణమూర్తి

తెలుగు ఏకాంక నాటిక రంగస్థలంలో పుట్టిందీకాదు; మరిదేనికీ అనుకరణగా వచ్చిందీ కాదు. 'సాహితీ' పత్రిక తొలిరోజుల్లో తెలుగు ఏకాంకిక స్వతహాగానే పుట్టుకొచ్చింది.

పత్రికలలో ఎప్పుడూ చిన్ననాటికలకూ, చిన్న కావ్యాలకూ మాత్రమే స్థానముంటుంది, కాని పెద్దపెద్ద నాటకాలకూ మహాకావ్యాలకూ వుండదు. 'సాహితీ' పత్రిక రోజుల్లో చింతా దీక్షితులుగారు పత్రికలకోసమై కొన్నిసంభాషణలను వ్రాయడం మొదలుపెట్టారు. ఆయనలో వున్న ప్రత్యేకత ఏమిటంటే, మనం ఎన్నడూ ఎరుగని ఒక చిత్రమైన వాతావరణాన్ని మాటలలో తయారుచేసి పెడతాడు. ఆయన సంభాషణలు వెనుకటి సంఘంలోని దోపిడిని, కుళ్ళను బయటపెడతాయి.

చింతా దీక్షితులుగారి సంభాషణలనుంచే క్రమంగా తెలుగులో ప్రయోగార్హములైన ఏకాంక నాటికలు ఉద్భవించాయి. ఏదో ఒక క్రొత్తవిషయాన్ని చెప్పడమే వీటి ప్రధానోద్దేశం.

'శర్మిష్ఠ' అనే నాటిక యిలాంటి క్రొత్తభావాలను సూచించేదే. ఇందులో 'య యా తి' కృతఘ్నుడుకాడని అంటాడు. కాని తెరలో 'దేవయాని' నవ్వు వినిపిస్తుంది. ఇందులో ఇంకా కథా ధోరణి (Narrative వాసన) వుంది.

నాటికకు వస్తు పరివర్తనమే జీవం. కథ అంతా ఒక విధంగా నడుస్తుంటే, చివరకు ఒక మలుపు (Turn) వస్తుంది. ఇదే నాటికకు ఆధారం. దీక్షితులుగారి 'ముద్దు కృష్ణ' అనే నాటికలో ఈ వస్తు పరివర్తనం చక్కగా కనిపిస్తుంది. కృష్ణుణ్ని శిక్షించడానికని వచ్చిన గోపికలు, ఆ చిన్నికృష్ణుని ముద్దులు మూటగట్టు కొంటి మాటలు విని హృదయపరివర్తన పొంది నవ్వుకుంటూ వెళ్ళిపోతారు. ఇదే వస్తు పరివర్తన అనబడుతుంది

'సఖి' పత్రికలో ప్రకటితమైన దీక్షితులుగారి 'ఖేలా భిక్కుని' అనే ఏకాంకిక కూడా ఇలాంటిదే. ఖేలారాణి బిందుసారుని భార్య. బహు సుకుమారిణి. జీవితం సుఖం నిమిత్తమే అని ఆమె నమ్మకం. కాని ఆమె కెలాగైనా బౌద్ధసిద్ధాంతాలు నచ్చజెప్పడమే బిందుసారునికి ప్రధానం. తర్వాత బుద్ధుణ్ని చూసీ చూడడంతోటే ఆమె మనస్సు మారిపోతుంది, విరాగిణి అవుతుంది. ఈ విచిత్ర పరివర్తనమే ప్రహసనానికి ప్రధానలక్షణం. భమిడిపాటి కామేశ్వరరావుగారి 'బాగు బాగు' అనే ప్రహసనం కూడా ఏకాంకికే.

ఈ ప్రహసన ఫక్కీని తెలుగులో

మొ ద ట వీరేశలింగంపంతులుగారే ప్రారంభించారు. ఏవో చిక్కులువస్తున్నా యని తప్పుకోడానికై అతి జాగ్రత్తగా అడుగులువేస్తూ వుండడం; కాని ఆప్రతి అడుగూ బురదలోనే పడడం....ఇది చూస్తే మనకు నవ్వుతప్పదు. ప్రహస నాల్లో స్వగతం వుంటుంది. కాని స్వగ తంలో కథావస్తువు బయటపడగూడదు. పాత్రలమాటల ద్వారానే ప్రేక్షకులు కథను గ్రహించాలి. సాంఘిక నాటిక లకు స్వాభావికత చాలా ముఖ్యం.

కామేశ్వరరావుగారి 'బాగు బాగు' అనే నాటికలో చెప్పిందే చెప్పడం పరి పాటి. కాని, మనం నవ్వుతూనే వుంటాం. దీనిలో నాటకం, 1 పాలు, ప్రహసన ఫక్కీ 99 పాళ్ళు.

ఇక-కామేశ్వరరావుగారి 'ఎప్పుడూ ఇంతే, అనే నాటిక స్వగతం, పాము లాగా వంకరలు తిరుగుతూ కథ సాగి పోతుంది. కొన్ని నమ్మడానికి వీలు లేని సన్నివేశాలున్నాయి. గతకథా కథ నమూ, ఆకాశసంభాషణలు నాటికలో వుండగూడదు. వక్రగతి, అంటే పర స్పర సంభాషణలద్వారా వస్తుసాధన వుండాలి.

కామేశ్వరరావుగారి'క చ ట త ప లు' అనేదీ ప్రహసనమే. ప్రయోజనమూ, రచనా విధానమూ నాటికకు ప్రధాన మైనవి. కావ్యార్థ సూచన వున్నప్పటికీ, ముందరి కథను వెల్లడించకుండా, క్రమ ముగా కథా వికాసానికి తోడ్పడేలాగా వుండాలి. ఊహతో తాపీగా వ్రాయవల సింది నాటిక.

శ్రీనివాస శిరోమణిగారి'పరివర్తనం, అనే నాటికలో రచనా సంవిధానం బాగానేవుంది. కాని కథలో పట్టులేదు. నాటికల్లో వక్రగతిని వీరే ప్రవేశపెట్టారు. కావ్యార్థ సూచికకూడా వీ రే ప్రవేశ పెట్టారు.

మన నాటికల్లో కొన్ని రంగస్థలం కోసమూ, మరికొన్ని సాహిత్య ప్రధానం గాను వచ్చాయి. కృష్ణశాస్త్రిగారి నాటి కలు ఖండకావ్యాల వంటివి. శివశంకర శాస్త్రిగారి 'యక్షరాత్రి' అనే నాటిక పద్యనాటికేగాని, వ్యాసనాటిక వంటిది.

నాటిక వ్రాయడమంటే అంత తేలి కైన పనికాదు. నాటికాకర్త చాలా జాగ్రతగా ఆలోచించి, సన్నివేశాలను సమకూర్చుకొని, సంభాషణలను చమ త్కరించి, స్వాభావికతను సంగ్ర హించి వ్రాయాలి. నాటకము ఒకఆట వంటిది. కాని నాటిక బాణంవంటిది.

చందూరి నాగేశ్వర్రావు, ముద్దా విశ్వ నాథంగార్లు వ్రాసిన 'ఛాయ' నాటికలు చిన్నకథలవంటివి. శ్రీపాద సుబ్ర హ్మణ్య శాస్త్రిగారి నాటికలన్నీ కథలే. సంభాషణలు - యుద్ధంలోవలె పోట్లాడు కున్నట్లుంటాయిగాని, మాట్లాడు కొన్నట్లు వుండవు.

గుడిపాటి వెంకటచలంగారు 'భాను మతి' అనేనాటికను వ్రాసారు. ఇందులో భానుమతి పాత్ర నిర్మాణం (Characterisation) ముఖ్యం.

నాటికలలో చారిత్రకాలు పౌరాణి కాలు, ఊహాచిత్రాలు, పరమార్థ నాటి కలు. వ్యాఖ్యాన చిత్రాలు అనే భేదా లున్నాయి.

ఆమంచర్ల గోపాలరావుగారు'హిరణ్య

కశిపుడు' అనే నాటకంలో హిరణ్యకశిపుడు లెనిన్ పూర్వావతారమనీ, అతన్ని ఎవరో హత్యచేసారనీ వ్రాసారు. ఇలాంటి నాటికలన్నీ వ్యాఖ్యానచిత్రాలు మాత్రమే. ముద్దుకృష్ణ, బాపిరాజుగార్ల నాటికలు కూడా ఈ తెగలోకే వస్తాయి.

కొత్తగడ్డ అంటే రైతుకిష్టం వుండదని నార్ల వ్రాశాడు. అందు పరమార్థంతోను పరిహాసంతోను సందేశాన్ని అందజేసాడు.

విశ్వనాధ కవిరాజు పరిహాసంలో అందెవేసిన చెయ్యి. గురజాడ అప్పారావుగారి హాస్యాన్ని పట్టుకున్నాడు. వీరి నాటకాల్లో 'నాటికి నేడు', 'దొంకలో షరాబు', 'అపశ్రుతి' అనేవి మంచివి. 'గ్రామ్య ప్రహ్లాద' హాస్యప్రదమైంది.

'అపశ్రుతి' లో భార్యాభర్తలు అంతలో పోట్లాడుకొని, మళ్ళీ అంతలో కలిసిపోతారు. ఇది సాంఘిక ఘట్టం. 'సారె గదిలో' అనే నాటిక కూడా ఇలాంటిదే. విశ్వనాధ కవిరాజు ఒక సమస్యతో ప్రారంభించి చివరకు తేల్చివేస్తాడు- 'దొంగాటకం' ఇటువంటిది.

నాటికా రచన - కథాసంవిధానం

ఒక కార్యంతో సంబంధించని కారణాలు అతిలోక కారణాలవుతాయి. ఇట్టి అతిలోకతను నాటికలో ప్రవేశపెట్ట గూడదు. ప్రవేశ పెడితే, కథలోవున్న పట్టు కాస్తా పోతుంది. దీర్ఘ సంభాషణలు వుండగూడదు. స్వగతం పనికి రాదు. వక్రగతి వుండాలి. కాని దానిలోని కథ ముందుగా గోచరింపజేసేలాగా వుండగూడదు.

ముఖ్యంగా శ్రీ పి వి. రాజమన్నారు గారు మనం అనుకున్న ఆకారానికి మకుటం తెచ్చిపెడతారు. ఇది ఈ కవిలో వున్న ప్రతిభకు నిదర్శనం. 'దయ్యాల లంక' మొదలైన నాటికలు వ్రాశారు

'నిష్ఫలం' అనే నాటిక వీరి నాటికల్లోకల్లా ఉత్తమమైంది రాజమన్నారు రచనాసంవిధానంలో అందరికంటె మొనగాడు. చాలా నాటికలు వ్రాశాడు. ఈయన 'సంకల్పం - పర్యవసానం' అనే నాటికలో నిష్క్రమణప్రవేశాలను కూడా వినియోగించుకున్నాడు.

పరమార్థనాటికలు రెండువిధాలు—
(1) సీరియస్ (సందేశప్రధానమైనవి)
(2) హాస్యప్రధానమై, హాస్యంద్వారా సందేశ మిచ్చేవి.

ఇందులో సందేశప్రధాన నాటికలకు రాజమన్నారు, హాస్యప్రధాన నాటికలకు విశ్వనాధ కవిరాజుగార్లను ప్రధానంగా చెప్పుకోవచ్చు. ఇద్దరి రచనలోను సందేశంవుంది. ఇద్దరూ గడ్డుసమస్యలనే తీసుకుంటారు. తేలికగా పరిష్కరిస్తారు.

ముఖ్యంగా శరత్‌బాబు నవలలలో హృదయం వున్నది, రాజమన్నారు నాటికలలో సందేశం వున్నది.

గో. రా. శాస్త్రి వ్రాసిన దూరతీరాలు అనే నాటికలో క్లైయిమాక్సూ లేదు; యాంటీక్లైయిమాక్సూ లేదు ఇలాంటి నాటికలను ఒక్క ఠాగూరు మాత్రమే సాధించగలిగాడు.

రచయిత తన దృష్టికి గోచరించే మామూలు సన్నివేశాలను పట్టుకోవాలి గాని, లేనిపోని కల్పనలు చేస్తే ప్రయో

జనం వుండదు. ప్ర తి నాటికలోను నాటిక ఎంత స్వాభావికంగావుంటే, అది స్వాభావికత జాలువారుతూ వుండాలి. అంతే ఉత్తమమైనది.

★

నాటక ప్రదర్శనం-శిల్పం

కవి మొదట ఒక కథను నాటక రూపముగా తనమనస్సులో ప్రదర్శించుకొని ఆనందించి, తదుపరి రచనసాగించి, యితరులకు ప్రదర్శనార్థమై యిస్తాడు. నాటక రచనమే ఉత్తమ కావ్యం. హావభావములతో, మహత్తరమైన ఆదర్శాన్ని కవి యిస్తాడు.

సూత్రధారుడు ప్రొడ్యూసరులాంటివాడు. ఇతను నటనాశక్తి ఎవరెవరికెంత ఉందో నిర్ణయించుకోవాలి. అదే యితని పని. అవసరమైనపుడు నటకుడు కన్నీరు కార్చగలిగి ఉండాలి. ఈ రకంగా ఎవరు ఏ పాత్రకర్హులో సూత్రధారుడు (ప్రొడ్యూసరు) నిర్ణయిస్తాడు. కథయొక్క సందేశం మనకు అందిన నాడే నాటకరచన ధన్యత నొందుతుంది. నాటకంలో ప్ర తి పా త్ర కు స్వార్థం ముఖ్యం. అది ఇతరులను బాధించరాదు. పాత్రలనుబట్టి భాష వుండాలి. కవి వ్రాసిన ఒక్కొక్క మాటకు అనేక రూపాల్లో అనేక అర్థాలు వచ్చేలా వుండాలి. నాటక ప్రదర్శనం స్వాభావికంగా జరిగినట్లుండాలి. కాని నాటకంలో ఏ పాత్రకూడ తన ప్రతిభనే చూపించరాదు.

ఒకడు బాగా పాడాడనీ, మరొకడు డ్యాన్సు బాగాచేశాడనీ, ఇటువంటి అభిప్రాయం రాకూడదు. ఉద్దేశం లేకున్నా పాత్రల ప్రతిభ బయటపడితే నాటకం విఫలమవుతుంది. అందుకనే సూత్రధారుడు సమర్థులైన నటకులను ఎన్నుకోవాలి.

అయితే స్త్రీ పాత్రలకు స్త్రీలే వుండాలా అన్న సమస్య ఇక్కడ వస్తుంది. శకుంతల పాత్ర కావలసి వచ్చినప్పుడు శకుంతలత్త్వంగల నటుణ్ణి ఎన్నుకోవాలి. పురుషనటకుడు శకుంతలపాత్ర ధరించినప్పుడు, ఆసమయంలో తన పురుషత్వాన్ని మరచిపోవాలి. ఇది కష్టసాధ్యం. నటకురాలు స్త్రీ అయితే తేలికగా శకుంతలత్వాన్ని పొందగలదు.

స్త్రీ పాత్రల విషయంలో, సంస్కారంలేని, చాకచక్యంలేని, తెలివితేటలు లేని స్త్రీ కంటే ఇవి అన్నీ కల్గిన పురుషుడే స్త్రీ పాత్ర వేయవచ్చు. స్థానం నరసింహారావు, జగ్గరాజులవంటి నటకులు దొరికితే సూత్రధారుడు ఎగిరి గంతేసి తీసుకోవచ్చు.

రీహార్సల్ :—దీన్ని రాయలసీమ వారు 'ఒద్దిక' అని అంటారు. గంజాం వారు 'పొడకల్పు' అని అంటారు. తన భావాన్ని ఇతరులకు అందజేయాలన్నా, కళను వ్యాపింపజేయాలన్నా, ముఖ్యంగా సూత్రధారుడు అనుభవశాలియై, సమర్థుడై వుండాలి. ప్రదర్శనానంతరం

ప్రేక్షకుల మన్ననలకు గురియైనదే నాటకం. ప్రదర్శనంలో నటుడు స్రష్ట కాడు. నాటక విషయంలో "వినదగు నెవ్వరు జెప్పిన" అన్నదానిని పాటించాలి. నటునికి భావతన్మయత వుండాలి. నటకులలో ఐక్యత వుండాలి. నాటకంలో సమయస్ఫూర్తి, సంగీతం వుండాలి పద్యాన్ని ముఖ్యంగానిషేధించాలి. వన్సుమోరును పాటించకూడదు ముందు సూత్రధారుడు నటకులను ఎసయెదుట కూర్చుండబెట్టి నాటకమంతా చదివి వినిపిస్తాడు. తరువాత వాళ్ళచేత చదివించుతాడు. చదివేటప్పుడు ఎవరు ఏపాత్రను వేస్తారో వారు అపాత్రను అర్థం చేసుకుంటారు మాటలను ఉదాత్త అనుదాత్తాలతో అనాలి. అంతేగాని తమ తమ పోర్షన్సును యిళ్ళదగ్గర వల్లించుట తప్పు.

సూత్రధారుడు స్టేజీకాపీనొక దానిని తీసుకొని దగ్గరుంచుకోవాలి. ఇతనుగాక స్టేజీ మేనేజరు ఒకరు అనుభవశాలి వుండాలి. నటనాకౌశలము గలవాడే సూత్రధారుడుగా వుండాలి. స్టేజీమీద నటకులు తన్మయత్వాన్ని చెందరాదు, ప్రదర్శనంలో వ్యక్తి ఘనతలను తెలియనీయరాదు. సూత్రధారుడు నాటకంలోని భావాన్ని వూహించినట్లు, నటకులుకూడా ఆ భావాన్నిబట్టి ఆలోచించాలి. సూత్రధారుని ఆజ్ఞను పాటించాలి. (ఆ ఆజ్ఞ సమిష్టిదై వుండాలి) మ్యూజిక్‌లో కూడా అంతే. కాబట్టి నాటకానికి సూత్రధారుడే (ప్రొడ్యూసరు) ముఖ్యం. వాడే చిత్రకారుడు, కళాకారుడున్ను. ఎంత గొప్ప నటకులైనా కాంబినేషన్ లేనిదే నాటకం సఫలంకాదు. అందువల్లనే సూత్రధారుడవసరం. వాచికాభినయం వుండాలి. సాంఘిక నాటకాలలో కోటా వుండకూడదు. సబ్బు (Soap)తో ముఖమును శుభ్రపరచుకోవాలి.

కొలది వేస్‌లైనునో, స్నోనో రాచుకొని కొలదిపౌడరును మాత్రమే ముఖమునకు అద్దుకోవాలి. నాటకము ముఖ్యంగా ప్రజల కష్టసుఖములను ప్రదర్శించునదిగా వుండాలి. ప్రజానురంజకంగానూ వుండాలి. నటకుల్లో ఎవ్వరూ సూత్రధారుని ఆజ్ఞను మీరరాదు. నాటకం ఒక వ్యక్తి యొక్క సృష్టి. నటుల్లో సంస్కారభేదం ఉండరాదు. ద్రౌపదీ మానసంరక్షణ నాటకంలో రాఘవాచారి 'గెలుపునాది' అని కర్ణుడిని కరస్పర్శ చేస్తాడు. కాని కర్ణుడందుకోలేదు. పాత్రాభినయం చెడిపోయింది. రాజరాజు, రహస్యం తెలిసిన తరువాత సార్వభౌముని ధీమాతో చిత్రాంగివైపు చూస్తాడు. చిత్రాంగి వేషధారియైన స్థానం నరసింహారావు 'ఓయి వెఱ్ఱివాడా' అని రాజు గుండెమీద తట్టాడు. పాత్రాభినయం చెడిపోయింది. సూత్రధారుడు నిర్ణయించిన ఏకత్వం తక్కువైనా యిబ్బందిలేదు, కాని నటకులలో ఏకత్వం (Unity) లేకపోతే చెడుతుంది.

హరిశ్చంద్ర నాటకంలో డి. వి. సుబ్బారావు చంద్రమతి కాటివద్దకు వచ్చినప్పుడు మంగళసూత్రాన్ని వర్ణించాడు. నాటకం చెడింది. కాబట్టి నటకులకు స్వతంత్రత యివ్వరాదు. నాటకంలోని నటకులు యిద్దరు గొప్పవారై తక్కిన

వారు దద్దమ్మలైతే, గొప్పవారు తమ గొప్పను తగ్గించుకొని వాళ్ళను సమర్ధిం చాలి. రాజుకు పాతకోటుయిచ్చి మంత్రి పూసలకోటు తొడిగితే,నాటకం రసాభాస మవుతుంది. డి. వి. సుబ్బారావు పద్యాన్ని రెండుమార్లు చదవడం. యడ వల్లి సంస్కృతంలో శ్లోకంచదివి, తరు వాత తెలుగులోకూడా పద్యం చదవడం తప్పు. కోడూరి అచ్చయ్యగారు నాటకం నడిపితే ఎక్కడచూచినా ఆయనే. ఆయన సూచనే ప్రతీదీను బాగుంది. ఒకనటుడు బాగానటిస్తే నాటకం విజయ వంతంకాదు. నాటకం అయిపోయిం తర్వాత ప్రేక్షకులునాటక కథనుగూర్చే చర్చించుకోవాలి. అప్పుడే విజయవంత మయినట్లు. అంతేగాని నటుడు తన్మ యత్వంచెందాడా లేదాఅనేదిప్రశ్నకాదు.

సూత్రధారుడు చెప్పినట్లు నటకుడు నడిస్తే వేరే తన్మయత్వం చెందనక్కర్లా. తన్మయత్వం లేకుండా చెయ్యడమే ఉత్తమనటన. పాత్రవలే కనపడాలి. సంకేతాలను తెలివిగా మభ్యపరచు కోవాలి. సహజత్వాన్ని సహజంగానే ప్రదర్శించాలి. ' నాటకంలో సంగీతం ఉంచవచ్చా? పద్యాలు ఉండవచ్చా? కూడదా? అంటే, పాటలూ పద్యాలు వచనాన్ని నిరూపించలేవు. అది ఒక ప్రత్యేకం. పాటలోనూ, పద్యంలోనూ ఉన్న భావాన్ని వచనంలోనైతే ఎక్కు వగా చూపించవచ్చు. పద్యాలు తీసి వేయాలి. పాటలు నలుగురు కలసి పాడు నవిగా ఉపయోగించాలి. ఒకడు యుద్ధ రంగంలో క్రిందపడిపోయాడు. ఆ సమ యానికి తెర(కర్టెన్) పడలేదు. వెంటనే వాడుఎదుటివాడి నుద్దేశించి, "ఓరిదురాత్మా నేను చచ్చితిననుకొంటివిరా, లేదు, నేను మూర్ఛబోయితిని" అనిలేచి పశ్చా యుద్ధం ప్రారంభిస్తాడు ఇందు మూలాన్నే స్టేజికాపీ (నాటక ప్రతి) అవసరమొస్తుంది స్టేజి కాపీ అంటే ప్రతి రెండు అచ్చుకాగితాల మధ్య ఒక తెల్లకాగితాన్ని పుంచి, బైండు చేయించి, దానిమీద ఎక్కడికక్కడ స్టేజి డైరెక్షన్లు వ్రాసుకోవాలి. ఈ విధా నము చాలాఅవసరం. కుర్చీలు, బల్లలు కత్తులు, దుస్తులు దువ్వెనలు అన్నీ సిద్ధంచేసుకొని వుండాలి. నాటక ప్రద ర్శనంలో ప్రతి చిన్నవిషయంలోను అతి జాగ్రత అవసరం. నటన (Action) నుండి మాటను వేరుచేయరాదు.

పద్యంతోపాటు వన్సుమోరు వచ్చి నది. ఇది తప్పు. కానిసహజమైనచోట్ల సంగీతాన్ని వుంచవచ్చు.

★

" ఎందుకో యీ మౌనమ్మూనుట - ఎందుకో యీమాంద్యమంతా,

పోయి సాంఘిక సేవచేస్తే - పుణ్యముండునుగా !"

—చింతా దీక్షితులు.

రూపకములు

శ్రీ అయల సోమయాజుల నరసింహశర్మ

నాటకం అనే పదాన్ని దృశ్యము లేక రూపకము అనే పదాలకి ఇప్పుడు పర్యాయంగా వాడుతున్నారు. లాక్షణికులు రూపకభేదాల్లో ఒకటిగా నాటకాన్ని పరిగణించారు.

శ్రవ్యకావ్యంలో కంటె దృశ్యకావ్యంలో రెండువిధాలైన వైలక్షణ్యం ఉంది. ఒకటి కథాసంవిధానంలో విశిష్టత. రెండవది అభినయం.

శ్రవ్యకావ్యంలో కథాసంవిధానం క్రమంగా సాగుతుంది. రూపకంలో రసవద్ఘట్టాలు మాత్రమే ప్రదర్శింపబడతాయి. నీరసము. అప్రధానము. అప్రదర్శ్యము అయిన కథాభాగం సూచ్యంగాని ఊహ్యంగాని అవుతుంది. ప్రదర్శితవస్తువు బహుముఖంగా ప్రయోజనాలను సాధించి ఆనందజనక మవుతుంది. ఉదాహరణకు.— శాకుంతలంలో ఆపన్నసత్వయైన శకుంతల ధర్మాసన సన్నిధిలో ఉంది. అనపత్యుడైన దుష్యంతునివద్ద నిస్సంతుని మరణం వివరింపబడ్డది. దుష్యంతుడు

> "యేనయేనవియుజ్యంతే
> ప్రజాస్నిగ్ధేన బంధునా
> ససపాపాదృతే తాసాం
> దస్యంత ఇతి ఘుష్యతాం"

అని వెలయించాడు.

ఈ సన్నివేశం అనపత్యుడైన దుష్యంతునికి అంతర్వత్నియైన శకుంతలను గ్రహింపవలెననుటకు సహకారమగుచున్నది. కాని పరస్త్రీ స్పర్శపాంసులత్వము భయహేతు వగుచున్నది. ఆ విషయము "పాపాదృతే" అని వ్యక్తమవుతుంది. దీనివలన గృహమేధిత్వము ప్రజాపర్యవసితము. రాజ్యము ప్రజాసేవాపరము మొదలైన దుష్యంతుని ధర్మపరాయణాశయములు వ్యక్తమవుతున్నాయి. ఒక సన్నివేశం దుష్యంతుని రాజ్యపాలనంలోని ధర్మాలని, వ్యక్తిగతంగా అనపత్యుడై పొందుతూన్న విచారాన్ని అలాటిస్థితిలో ఆతని ధర్మనిష్ఠని వ్యక్తపరుస్తూంది. ఇంతే కాకుండా మానసికతత్వాన్నాశ్రయించి సామాజిక హృదయాన్ని స్పందింపజేస్తూంది. ఇది ఒక అవాంతర సన్నివేశం.

ముఖ్యమైన రసవత్తర సన్నివేశాలే అంకాల్లో నిరూపింపబడతాయి. రసవద్ఘట్టమైనా యుద్ధము, దేశవిప్లవము మొ॥ రంగంమీద ప్రదర్శించడానికి వీలులేదు. ఇలాటివాటిని ప్రదర్శించడం అపాయకరం కావచ్చును. స్నానము, సురతము, అంబరగ్రహణము మొ॥ లజ్జాజుగుప్సాకరములు కాబట్టి విడిచారు. మరణాదులశ్లీలాలని విడిచారు. కథావ

బోధకి కొంత కథాభాగం సూచింపవలసి వస్తుంది. అప్పుడు ఆ కథని విష్కంభము, చూళిక మొ॥ వటిద్వారా సూచిస్తాడు కవి.

నాటకవస్తువును కవి పరిశీలించి రసవద్ఘట్టాల నెన్నుకుని వాటి ని మాత్రమే అంకాలలో ప్రదర్శించాలి. కథా వస్తువు రత్నంలో ఉండే అణువుల లాగ కుదింపబడి ఉజ్వలంగా ఉండాలి. ఇది నాటకాని కుండవలసిన విశిష్టత. కథ ప్రసిద్ధమైనదిగా ఉంటే సామాజికుడు తెలిసినకథ అవడంచేత సూచ్యము, ఊహ్యము, అయిన భాగాన్ని తెలుసుకోడానికి శ్రమ అక్కర లేకుండా నాటకాన్ని అవగాహన చేసుకోగలుగుతాడు. ప్రసిద్ధమైన కథ ఐతే కథను కుదించి ఉజ్వలవంతం చేయడానికి అవకాశం ఎక్కువగా ఉంటుంది. కథావస్తువు ఘట్టాలలో హెచ్చు ఆనందాన్నిస్తుంది అనడం శ్రవ్యకావ్యాల్లోకూడా ఉంటుంది. అందుచేత రామాయణంతీస్తే "పాదుకాభిషేకఘట్టం చదువు, హనుమత్సందేశం వినిపించు" అని కొన్ని ఘట్టాలుచదవమంటాం. అలాగే భారతంలోని యుద్ధ పర్వాలు తీస్తే అభిమన్యుని వధ ఘట్టం సైంధవ వధ ఘట్టం అని తీయించి చదివిస్తాం. దీనివల్ల సహజంగా కథా ఘట్టాలకి స్పందింపచేసే శక్తి ఉంది. అందుచేత అవి మన్ని ఆకర్షిస్తాయి, అని స్పష్టమవుతుంది. వాటి నుద్ధరించి ఉజ్వలంగా ప్రదర్శించడం నాటకంలో ఉండే విశిష్టత. ప్రతి చిన్నభావాన్ని ప్రదర్శించడం గాని, సంభాషణాదికాలను వాటికోసం పెంచడం గాని, నాటక సాంప్రదాయం కాదు. ప్రతి ఒక్క వాక్యం ప్రతి ఒక్క మాటా, ప్రయోజనాన్ని సాధించాలి. సూత్రభాషలా ఉండాలి. ఒక అంకంలో సాధారణంగా ఒక ఘట్టం ప్రదర్శింపబడుతుంది. విష్కంభాదులు కథాసూచకాలై ప్రవర్తింపజేయవచ్చును. ఆ ఘట్టాన్నాశ్రయించిన ఇతర విషయాలు పరిపోషణకై ప్రదర్శింపబడతాయి. దేశము, కాలము, పాత్రలు వస్తుఘట్టము మారినప్పుడు అంకం మారుతుంది. యథా సంభవంగా కొన్ని మారినా, అంకం మారుతుంది. నవీనుల రంగము అనే విభాగం కూడా ఈ పద్ధతులమీదనే ఆధారపడి ఉంటుంది,

రెండవది అభినయం ఇది వాచికము, ఆంగికము, సాత్వికము, ఆహార్యము అని నాల్గు విధాలుగా ఉంటుంది.

సంస్కృతభాష దేశభేదాన్ని బట్టి ఉచ్చారణలో భిన్నంగానే ఉన్నది. ఉండేది. ఈవిషయం కావ్య మీమాంస లో రాజశేఖరుడు వివరించాడు. తెనుగు కూడా మాండలిక భేదంచేత విభిన్నంగా ఉంటుంది. కవి ప్రయోగించిన భాషను బట్టి నటకుడు వాచికాభినయం సాగించాలి. కన్యాశుల్కంలో విశాఖజిల్లా వ్యావహారికం ప్రయోగింప బడ్డది. ష. ఛ. చె. ఈ మొదలైన అక్షరాలు నందాపురాగ్రహారీకుల సంభాషణలు విని ఆ స్మృతితో వాక్కును శిక్షిస్తేనే గాని నటకుడు అభినయించలేడు. ఈ శిక్ష లేకపోవడం కన్యాశుల్క ప్రదర్శనాలలో లోపం కనిపిస్తూనే ఉంటూంది. నందాపురీయుల అనుభవం లేనిదే నాటక

ప్రయోగం జరిగితే అది ఉత్తమత్వాన్ని చెందలేదు. ఇందుకు ప్రాంతీయుల యాస నాటకంలో అభినేయం అవడమే కారణం పాత్రయొక్క భాష, వ్యక్తి, దేశము మొదలగు వాటి నాశ్రయించి అభినయం సాగాలి. వాచికాభినయం సరీగా లేకపోతే విరుద్ధ రసోత్పత్తి, రసభంగము జరుగుతుంది. అంతకంటే అనౌచిత్యము ఉండదు. ఉదాహరణకు.

"నిటలాక్షుండిట ఎత్తి వచ్చినను రానీగాక" అనే పద్యాన్ని రౌద్రంతో అభినయించడం కనిపిస్తూంది. ఇక్కడ రౌద్రం అస్థానసంరంభమే. అర్జునుడు రౌద్రమూర్తికాడు. రౌద్రము ఉద్ధతుని లక్షణంగాని ఉదాత్తుని లక్షణంగాదు. భీముడు అర్జునుడు వీరిశిలభేదంలో కని పించేది, భీముణ్ని వేరుగ చూపేది రౌద్రమే. అలాంటి రౌద్రము అర్జును నందు చూపుట మొదటిదోషము.

రెండవది ప్రకరణ విరుద్ధావస్థ. అర్జునునకు ఈశ్వరుడు, కృష్ణుడు, సోద రులు; పవిత్రులు, ప్రేమాస్పదులు; పూజ్యులు. వారితో విరోధము అర్జును నకు పరితాపకారణము. మనస్సుచేకూడ కోరరానిది. అలాంటిదైనా అనుభ విస్తాను. ఈశ్వరుడు ఎత్తివస్తేరానీ మరేంచేస్తాను అనుభవిస్తాను అంతేగాని గయుడ్ని విడువను. అని ఈశ్వరుని దండెత్తుట మొదలగునవి అనిష్టములై, పరితాపకారణములై ఉన్నను విధిలేక ధర్మంకొరకు గయుని విడువలేను. అని పరితాపము, ధర్మదీక్ష స్ఫురించేలాగు చదవాలి. అలా చదవకపోవడం ప్రస్తుత రసభంగానికి కారణమౌతూంది. కాబట్టి వాచికాభినయం రసోత్పత్తికి, భావపో: ణకికూడా కారణం. అది నిర్దుష్టం సాగాలి.

ఇక పాత్ర నాశ్రయించిన భాషకూడ అభినేయమవుతుంది. ప్రాకృతం నా కాలలో ప్రయోగించడంకూడా ఇందు ఉద్దేశింపబడ్డది. ఆ ప్రాకృతంలోకూడ మార్పు ఉన్నది. అనసూయా ప్రియం వదల ప్రాకృతంవేరు. జాలరివాడి ప్రాకృతం వేరు. ఈరెంటికీ భేదం స్ఫుటంగా కనిపిస్తూనేఉంటుంది. భావం, పాత్ర సందర్భము దేశకాలాదులను లెస్సగా విచారించి వాచికాభినయం ప్రయోగించాలి. అభినయాలన్నీ వీటి నాశ్రయించే ప్రయోగించాలి.

ఆంగికము-ఇదివాక్యార్థ స్ఫోరకము, ...దార్థ స్ఫోరకము అవుతుంది. అంగ, విన్యాసాదులు, చేష్టలు, మొ॥ వాటిచే రస భావములు స్ఫురింపచేయ బడతాయి. వాక్యార్థాల కనుకూలాభినయమేకాకుండా కొన్ని చేష్టలచేత కవి రసభావాలను స్పందింప చేస్తాడు. "దర్భాంకురేణ చరణఃక్షత ఇత్యకాండే" ఈవిషయాన్ని శకుంతల అభినయించాలి. దానివల్ల ఆమె మానసికభావాలు, రతి,వ్యక్తమవుతాయి. గిరీశం మధురవాణిఇంట్లో రామప్పంతు లును చరిచి అవతలకి పారిపోతాడు. ఈచేష్ట గిరీశంయొక్క హృదయాన్ని, శీలాన్నిస్పష్టపరుస్తుంది. మనుజుడికిభావా వేశాల్లో సాత్వికాలు ఎలా కలుగుతాయో కొన్నిచేష్టలుకూడా అలాగే వ్యక్తమవు తాయి. ఆచేష్టకి కారణమైనభావంమనస్సు లోది, ఆ చేష్టవలన భావ్యమవుతుంది. అలాటిచేష్టలనుకలిపి నిరూపించడం నట

కుడు అభినయించడం శ్లాఘ్యమైన విషయం. శ్రీ అప్పారావు ఈవిషయంలో ప్రత్యేక కృషిచేసి తన నాటకంలో ఇమిడ్చాడు. చేష్టలు కూడా భావవ్యంజకాలవుతాయి, ఇవి కొన్ని 'ఆంగికము లలోను, కొన్ని సాత్వికముల లోను చేరుతాయి.

మూడవది ఆహార్యము. నటుని వేషాన్ని, ఆకారాన్ని చూసి పాత్రావబోధ జరగాలి. అలాంటి వేషధారణము ఆహార్యము. దుష్యంతునిపాత్ర నటకుడు ధరిస్తే కవి దుష్యంతుని ఎలా ఉద్దేశించాడో అలా స్ఫురించాలి. వస్తుతః దుష్యంతుడు ఎల్లా ఉండేవాడో మనకు తెలీదు. కాని కవి ఎలా వర్ణించాడో దానివల్ల ఒక ఆకారాన్ని చిత్రించుకోగలం. దాన్ని స్ఫురింపచేసేలాగు దుష్యంతుని వేష మమరి ఉండాలి. ఒక కాలంలోని ఉజ్వలవేషము ఒక కాలానికి హాసజనకంగావచ్చు - అంటే పూర్వం ఉండే హారకిరీట కేయూరాంగదాలు, రత్న ఖచితాలైన కవచాలు చూపాలని ముత్తెపురేకులతికిన చొక్కాలు — అవి తొడిగి దుష్యంతుణ్ని మనకి చూపితే గంగిరెద్దులా కనిపిస్తాడేగాని, దుష్యంతునిలా కనిపించడు. వాని అభినయాలన్నిటికంటె వేషం ఆకర్షకమైనా రసస్ఫూర్తి తగ్గుతుంది. కాబట్టి సాధారణంగా ప్రాచీనుడు, రాజు, అనే జ్ఞానం కలిగేటట్టు వీటికి అవిరుద్ధంగాను వేషాన్ని నిర్మిస్తే చాలును. అది యుక్తం అని నేభావిస్తున్నాను. పాత్రల వయోరూపాదులు పరిశీలింపబడాలి. 60 ఏళ్ళవాడు ప్రహ్లాదుడువేస్తే ఉచితంగాదు ఆజానుబాహువు స్త్రీ వేషం వేయడంలో ఔచిత్యం కనిపించదు కాబట్టి ఇలాటి విషయాలు జాగరూకతతో పరిశీలించాలి. ఇలాంటివి కూడా మన రంగాలలో ప్రదర్శించబడ్డాయి.

నాల్గవది సాత్వికాభినయము. పరగత సుఖదుఃఖాది భావనచేత మనస్సుకి ఒక వేదన (అనుభూతి) కలుగుతుంది. దానివల్ల కలిగేది సాత్వికము. ఇవి నటకునికి సహజాలుకావు. అభ్యాసపాటవము చేత నైపుణ్యంచేత ప్రదర్శిస్తాడు. సాత్వికాలకి ఆశ్రయులు దుష్యంతాదులు గాని పాత్రధారులుకారు. పాత్రధారులకు పాత్రలతోటి అభేదానుభూతి ఉండరాదు. సమర్థతతో దుష్యంతాదులవలె అభినయించాలి. ఆయా భావాలుగాని రసాలు గాని నటుడు అభేదంచేతే అనుభవించి అభినయించరాదు. అలా అయితే లౌకిక స్త్రీ పురుషుల రతికూడా దర్శించినవాడికి రసానందం కలుగవలసి ఉంటుంది. లోకంలో అలా కలగడంలేదు. లౌకిక శృంగారమును చూసిన సజ్జనుడికి లజ్జ, జగుప్స కలుగుతూంది. ఇతరుడికి అసూయ అనురాగాపకర్షణ మొదలగు భావాలు కలుగుతున్నాయి కాని రసానుభూతి కలగడంలేదు. కాబట్టి నటుడు తానే దుష్యంతుడు అనే జ్ఞానాన్ని పొందనక్కరలేదు. నేను దుష్యంతుని పాత్రను అభినయిస్తున్నాను. ఈ విషయాలని అభినయించాలి అన్న వివేకంతో అభినయిస్తాడు. వాడే ఉత్తమ నటుడు. ఈ విషయం నటన, నాటకము అనే పదాలే వివరిస్తున్నాయి. అంచేత నటునకు రసానుభూతి లేదు. ఉంటే

వాడు సామాజికుడే అవుతాడు. అను ఘూతి ఉన్నట్టు అభినయించాలి. అందు లోనే వాని విశిష్టత ఉంది.

ఇక నాంది, ప్రస్తావన, స్వగతము, ఆకాశభాషితము, పద్యములు ఇవి నాట కానికి ఉపయుక్తములా అనే ప్రశ్నలు కలుగుతున్నాయి.

నందీశ్వరుడు, నాట్యప్రవర్తకుడు, వాని ప్రీతికై నాందీఅనిన్నీ, సామాజికు లనునందింపజేయునది కాబట్టి నాందీ అనిన్నీ పెద్దలు తలచారు.

నానావిషయవ్యాపారాలను విరమించి నాటకశాల నలంకరించిన సామాజికు లకు మనశ్శాంతి నాటకోన్ముఖత కల్పిం చడం, శాంతవాతావరణం కల్పించడం, నటకుల బాధ్యత. ఆ కారణంచేత సామాజికులకు విషయాంతరపరివర్తనం కలుగచేయడానికి భగవన్నుతిరూప మైన నాంది ఉపయోగిస్తుంది. ఇది సామాజిక చిత్తవృత్తితో పరివర్తనను కలిగించి భగవంతునియం దేకాగ్రతను కలిగిస్తూంది. దైవభక్తికంటె దేశభక్తి ప్రధానమైన ఈరోజులలో జాతీయగీతం నాందీవ్యాపారాన్ని నిర్వర్తిస్తూంది.

తరువాత చిత్తానికి మార్దవం కల్పిం చడానికి మధురమైన సంగీతం ఋతు శోభ నాశ్రయించి ప్రవర్తింపజేయాలి. దీనివల్ల సామాజికహృదయం సంస్కృ తమై నవనీతంవలె మృదుత్వాన్ని చెంది, స్పందావస్థసు ఉన్ముఖమై, రస చర్వణకి సిద్ధంగా ఉంటుంది. దైవత్వం నుండి ప్రకృతికి, అక్కడనుండి అలౌకి కానందానికి క్రమంగా నాంది ఋతు గాన నాటకములు సామాజికులను చలింపచేస్తాయి. కాబట్టి నాంద్యాదు లపరి త్యాజ్యములు. ఇందులో ఋతువర్ణన గానముకూడా ప్రయోజనాపేక్షచేత అపరి త్యాజ్యాలు.

స్వగతంగాని, ఆకాశ భాషితంగాని నాటకంలో కధావస్తుచలనానికి ఉపయో గిస్తుంది. కాబట్టి ఇవి అతి సూక్ష్మస్వ రూపంలోకధావస్తువునన్యధా చూపడానికి వీలులేనిపరిస్థితులలో చూపడంఅనివార్య మవుతుంది వీటిని మానడం ఉచితమే గాని వీలులేనప్పుడు చిన్నవిగా స్వల్పం గా ఉండాలి. పొడిగించడం రసభంగం అవుతుంది. పొడిగిస్తే సామాజికులకు విసుగు కలుగుతుంది. చంచలమైనచిత్తా నికి ఏకాగ్రత కుదరదు. దానివల్ల రసా నందం భిన్నమవుతుంది.

ఒకరోజున ప్రదర్శించడానికి వీలు లేని నాటకాలకు ద్వైధీకరణమవసర మవుతుంది. ఈ పరిస్థితి శాకుంతలము, నాగానందం మొదలైన నాటకాల్లో కని పిస్తూంది. ద్వైధీకరణంలో నాటకం రెండు భాగాలుగా ఉండి ఒక్కొక్కటి ప్రత్యేకంగా భావించాలి. రెంటికీ ఐక్యత కూడా ఉండాలి. శాకుంతలంలో మొదటి ఐదంకాలు ఒకభాగం. ఇక్కడకు వియో గాంతమైన ఒక వస్తుపూర్తి అవుతుంది. అక్కడ కధావస్తువు ఆరంభిస్తే రెండవ భాగం సంయోగాంతంగా పూర్తిచెందు తుంది. వేరువేరుగా ప్రయోగించి రెండు భాగాలకు ఐక్యత, అనైక్యత కూడా సాధింపవచ్చును. ఇది ప్రయోగ సౌక ర్యం కొరకు ప్రదర్శింపబడ్డది. ఈవిష యాన్ని గమనించక ఒక విమర్శకుడు పంచమాంకంతో ఈ నాటకం ముగిస్తే

ఇంకా ఉత్తమంగా ఉంటుంది అని, వివరించాడు. అందులో కొంత సత్యముంది. కాని అది ద్వైధీకరణ నాశ్రయించి వచ్చింది. ఈ ద్వైధీకరణను కాళిదాసు తన కావ్యములో చూపాడు.

"పశ్చార్ధేన ప్రతిష్ఠశ్శర పతన భయాత్ భూయసాపూర్వ కాయం"

ఈశ్లోకం కావ్యార్థాన్ని సూచిస్తుంది. మొదటి భాగమందలి కధావస్తువునందు ఉత్తరభాగ కధావస్తువు ప్రవిష్టమవుతూంది అని కవి భావించాడు.

నాగానందంలో పితృభక్తితో త్యాగముతో ఆరంభించిన జీమూతవాహనుడు ప్రేమకు వశంవదుడై ఆమెను వివాహము చేసుకుంటాడు. వివాహాంతమైన ఈ కథావస్తువు మొదటి భాగమవుతుంది, నాగపరిరక్షణం రెండవభాగం కధావస్తువు అవుతుంది; ఇలా రెండు భాగాలుగా ఉండడంచేత నాటకానికి ఐక్యతలేదు అన్న సందేహాన్ని విమర్శకులువ్యక్తపరిచారు. ఈవిభాగం ప్రయోగ సౌకర్యాన్ని ఉద్దేశించి చేయబడ్డది. కాని ఐక్యతా భంగానికి కాదు. పితృభక్తితో ఆరంభించి కుటుంబినీ ప్రణయాన్నీ, మైత్రినీ వ్యాపించి విశ్వజనీనమై విభిన్న లోకగతులందు తిర్యక్కులందునిబిడమై నాగరక్షణతో జీమూతవాహనుని విశ్వ ప్రేమ ఈ నాటకంలో చూపబడ్డది. బంధువులతో ఆరంభించి జ్ఞాతులందు, మిత్రులందు, విశ్వమందు ఎలా వ్యాప్తమైనదీ నిరూపించడంచేత నాటకానికి ఐక్యత కొరతపడలేదు. ద్వైధీభావం ప్రయోగ సౌకర్యానికై వచ్చింది అని నిరూపించవచ్చును.

ఇంతకీ నాటకంలో కావ్యంలోకంటె ఔచిత్యం విపులంగా ప్రయత్నించాలి.

అనౌచిత్యా దృతేనాన్య
ద్రసభంగస్యకారణం.

★

"నీచపు దాస్యవృత్తి మననేరని శూరత మాతృదేశ సే
వాచరణమ్మునం దసువు లర్పణసేసిన వారి పార్థివ
శ్రీ చెలువారుచోట, తదసృగ్రుచులన్ వికసించి, వాసనల్
వీచుచు రాలిపోవగవలెన్; తదుదాత్త సమాధిమృత్తికన్!"

— వేదుల

జయభేరి : :

శ్రీ 'అనిశెట్టి'

మీతోనె వుంటాను ! మీతోనె వస్తాను !
అడు గడుగునా మీకు అండగ నిలుస్తాను !

పరతంత్రతలొ మగ్గు బానిసల ముక్తికై
కదనభూముల కెత్తి కదిలివెళ్లే మీకు
అడు గడుగునా నేనె అండగ నిలుస్తాను !

మీ స్వతంత్ర జగత్తు నిర్మించ పోరాడు
మీ ఉనికి కేముప్పు మించివచ్చిన నేడు
మీ ఏకహృదయమై మ్రోగు జయభేరి నే !
యుగయుగాలుగ మీలొ వెలుగు స్వేచ్ఛాజ్వాల
ఈ శుభ దినాలలో ఎగసినది భగ్గుమని
అడు గడుగు ఆకాశమంటి నినదిస్తాను !

మన పురా దాస్యమే దగ్ధమై . మన పురా ఆదర్శ మగ్నియై
అడు గడుగునా మనకు హారతిడు భూమాత !

ఆకాశ మవని ఉగ్రూతలూగే నేడు
మీతోనె వుంటాను ! మీతోనె వస్తాను !
సమరహృదయము నేను; స్వాతంత్ర్య జయభేరి !

పతిత ప్రజల గుండె పరిపుల్ల మయ్యేరా,
దిక్కులన్నీ మనకు దివిటీలు పట్టెరా
సాగురా స్వాతంత్ర్య యోధుడా !
వెనుక · బంగరు పండు సమరప్రజలు; ముందు :
సమ ధర్మ సంఘ సంస్థాపనోత్సవమురా
సాగురా స్వాతంత్ర్య యోధుడా !
అడు గడుగునా శత్రు వణగిపోతాడురా,
వెనుక : సామ్రాజ్యాల శాశ్వత సమాధులై,
ముందు . శత్రు క్రూరమృగము తుత్తునియలై
అడు గడుగు మంట లెగసే కంఠ ఘోషతో
సాగురా స్వాతంత్ర్య యోధుడా !
మీ బాహుబలముగా మించుతున్నానురా !
మీ దృష్టి తేజమై మెరయుచున్నానురా !
మీ ఒకే గుండెగా మ్రోగుతున్నానురా !
మీతోనె వుంటాను ! మీతోనె వస్తాను !
నేనె మీ జయభేరి ! నేనె మీ బావుటా !



శ్రీ కొడవటిగంటి కుటుంబరావుగారు

నవలా - చిన్నకథ

శ్రీ కొడవటిగంటి కుటుంబరావు

ఈ నాటి నవలకూ, చిన్న కథకూ పూర్వ స్వరూపాలు ఇతి హాసము, ఉపాఖ్యానమును. అప్పట్లో వీటికి రెండు ఆశయాలుండేవి. (1)చరిత్రనుసజీవంగా ఉంచటం, (2) జీవితం గురించి (Objective) గా రచించటం.

(Subjective, Objective) అనే దృష్టిపథాలను గురించి కొంత తెలుసు కోవాలి. జంతువుల జీవితాలు Subjective గా అంటే వాటి భావాలు కష్టసుఖాలతో లగ్నమై ఉంటై. నిర్లిప్తత ఏర్పడితే తప్ప జీవితాన్ని గురించి శాస్త్రీయంగా ఆలోచించి సంస్కారం పొందే శక్తి రాదు. సంస్కారం పెరిగిన కొద్దీ ఈ నిర్లిప్తత కూడా హెచ్చవుతుంది. నిర్లిప్తత అంటే నిర్లక్ష్యం అనుకోరాదు. నిర్లిప్తత వెంట నిర్లక్ష్యంకూడా ఉంటే వేదాంతం పుట్టుకొస్తుంది. మనకు కావలిసింది వేదాంతం కాదు, సంస్కారం.

ఉదాహరణకు పామును తీసుకోండి పాము మనకు భయం ప్రేరేపిస్తుంది. ఈ భయం మనల్ని ఆవేశించినంతకాలమూ పాము మనకు తెచ్చిపెట్టే సమస్యల్ని పరిష్కరించలేం. పాముకాటుకు విరుగుడు కనిపెట్టాలంటే పాముయెడల ఉండే భయాన్ని దాటి పామును పట్టుకుని విషంపిండి దాని విరుగుళ్లు అన్వేషించే శక్తి రావాలి. జీవితం తాలూకు సమస్యలకు పరిష్కారమార్గాలన్వేషించేవా రందరూ సమస్యలను మించి పెరిగిన సంస్కారం కలవారే గాని సమస్యలతో బాధపడుతూ దానిలో లగ్నమై ఉండేవారా పనిచెయ్యలేరు.

జీవితంలో లగ్నమైన సంస్కారంలేని జీవులు కష్టసుఖాలు మటుకే గుర్తిస్తారు కాని (Objective)గా జీవితాన్ని చూసే సంస్కారి ఆనందం పరమావధిగా పెట్టుకుంటాడు. నిర్లిప్తత ద్వారా ఆనందమనేది కష్టసుఖాలు రెంటినుంచీ ఉత్పన్నమవుతుంది. జాతీయ వీరుడు జైలుకుపోయో, దెబ్బలుతినో, ప్రాణాలర్పిస్తూనో ఆనందం పొందగలుగుతాడు. సుఖంలో నుంచి మటుకే ఆనందం పుట్టుతుందనుకోరాదు. కళల ద్వారా ఉత్పన్నమయే సంస్కారానికి ఈ ఆనందమే పరమావధి.

మనిషి బుద్ధిని జీవితం నుంచి విడదీసి నిర్లిప్తత చేకూర్చేటందుకు మానవుడు చేసిన తొలి సాంస్కారిక ప్రయత్నాల ఫలితంగా భగవంతుడు, విధీ వచ్చాయి. మనిషికి కలిగే కష్టసుఖాలన్నిటికీ ఒక బాహ్యకారణం ఉందనే విశ్వాసం ఏర్పడగానే మానవుడి దృష్టి కష్టసుఖాలను దాటి పై కారణంకేసి మళ్ళింది, పిల్లవాడు ఏ పీటో తగిలి

ఏడుస్తుంటే మనం వాడి మనస్సును బాధనుంచి మరల్చటానికి పీటను కొప్ప డతాం. కొడతాం. దాంతో పిల్లవా డేడుపుమాని పీటను గురించి ఆలోచి స్తాడు.

భగవంతుడూ, విధీ మనసులో ఉంచుకుని అవే బాహ్యాకారణాలుగా నిరూపించి రాసిన కథల్లో భగవంతుడు గాని, అతని అవతారంగాని ప్రధాన పాత్ర ధరించింది. ఈ ప్రయత్నంలో చరిత్రగా ఉండవలసిన ఇతిహాసాలు వక్రస్వరూపం పొందినాయి. కాని అప్పట్లో అదే సంస్కార సాధనంగా ఉండింది.

కాని రాను రాను భగవంతుడు, విధి అనేవి-సత్యకారణాలు కానికారణం చేత-సంస్కారాన్ని విశేషం ముందుకు పట్టుకు వెళ్ళలేకపోయినాయి. అంతా విధేననే నెపంమీద ఏ దుర్మార్గమైనా సహించ వలసినస్థితి ఏర్పడింది. ఈ స్థితిలో సంస్కారానికి మరో ఆధారం దొరికింది. అది నీతి. మనిషియొక్క కోరికలు చైతన్యానికిదారితీస్తూ ఉండడం చేత-వాటిద్వారా మానవబుద్ధి జీవితంలో లగ్నమైపోతూ ఉండటంచేత - కోరిక లను (objective) గా, నిర్లిప్తంగా చూసుకోగలందులకు నైతికదృష్టి కథా సాహిత్యంద్వారా ప్రచారం చెయ్యటం జరిగింది. దీనికి ఫలితంగా పంచ తంత్రం కథలేగాక, ఈసప్ కథలు మొదలైనవి అనేకం పుట్టుకొచ్చినై.

ఈపరిణామంలో ఆఖరుదశ ఇటీ వలనే దాదాపు మన కళ్ళఎదటనే కలి గింది. సంఘాన్నిగురించీ, ఆర్థికాలను గురించీ, మానవ మనస్తత్వంగురించి జరిగిన శాస్త్రీయమైన పరిశోధనల మూలంగా సాంఘికజీవితంలోనూ,వ్యక్తి జీవితంలోనూ కలిగే ప్రతిమార్పునూ మనం అర్థంచేసుకుని ఆ మార్పును నిర్ణ యించేశక్తి మానవుడికి అందుబాట యింది. అందుచేత కథా సాహిత్యం శాస్త్రజ్ఞానాన్ని నిర్లిప్తతాసాధనంగా పెట్టు కుని యదార్ధ జీవితాన్ని ప్రతిబింబించ టానికి పూనుకుంది. ఇది ఆఖరు పరి ణామం. ఈ విధానమే పోనుపోను మరింత సమగ్రం కావచ్చు, ఉత్తమ కథలు రావచ్చుగాని, ఇక మరోమార్పు వచ్చి సాహిత్యం నిర్లిప్తతకోసం కొత్త మార్గాలు తొక్కే అవకాశంలేదు.

ఈనాడు మనకు నీతికథలు అన ర్థంగా కనిపిస్తాయి. ఉదాహరణకు చూడండి. పరశురాముడనేవాణ్ణి అతని తండ్రి "నీతల్లిని వధించు" అని శాసిం చాడు. పరశురాముడు ముందువెనక లాలోచించకుండా తల్లిమెడ నరికేశాడు. తండ్రిమాట తక్షణంపాలించిన పరశు రాముడికథలో ఒకనీతి మనంచూస్తాం. చిరకారి అని మరొకడున్నాడు. అతణ్ణి కూడా తండ్రి తల్లిని చంపమని ఆజ్ఞా పించి అరణ్యానికిపోతాడు. కాని చిర కారి పరశురాముడల్లే తల్లిని చంపక తండ్రికోపంలో అన్నమాట పాటించ టానికి సందేహిస్తాడు. ఇంతలో తండ్రి తనకోపం చల్లారి తిరిగివచ్చి కొడుకు నిదానానికి సంతోషిస్తాడు. ఈరెండూ నీతికథలే. నీతికథల ఉద్దేశం నిజంగా ప్రవర్తన ఉపదేశించటమే అయితే ఈ రెంటిలో ఏదోఒకటి తప్పయిఉండాలి.

కాని వాటి ఉద్దేశం అదికాదు. ప్రవర్త నను గురించి నిర్లిప్తంగా - మరోదృష్టి నుంచి - ఆలోచించేటందుకు ప్రేరేపించటమే. ఈనాడు పార్యపుస్తకాలలోపెట్టే నీతికథలు చూస్తే అందులో కొన్ని హాస్యాస్పదంగా ఉంటాయి. దానికి కారణం మన ఈనాటి సంస్కారం శాస్త్ర విజ్ఞానంతో కూడుకున్నది కావటమే.

కథా రచనలో విషయమూ, విధానమూ అని రెండున్నాయి. వెనకటివారికి విషయంగురించి బాధ ఉండేది కాదు. ఉపనిషత్తుల్లో భావాలూ, పురాణాల్లో గాధలూ తీసుకుని అవే మళ్లా మళ్లా రాస్తూ శిల్పాన్ని పదునుపెట్టుకుంటూ, ఒకరినిమించి ఒకరు రాయాలని ప్రయత్నిస్తూ వచ్చారు. దీనివల్ల శిల్పంమెరుగు తేలిందిగాని దానికి ప్రాధాన్యతకూడా ఏర్పడింది క్రమంగా సాహిత్యం జీవితానికి ఎడంగా కూడా పోయింది విషయదారిద్ర్యంవల్ల.

కాని ఇప్పుడు అభ్యుదయ సాహిత్యంలో యధార్ధ జీవితాన్ని ప్రతిష్టించాం కనక, మనకు తాత్కాలికంగా విషయ ప్రాధాన్యత ఏర్పడింది. విషయం గురించి చర్చలేకుండా పోయిన తరువాత కళాసృష్టిలో విధానానికితగినప్రాముఖ్యం ఏర్పడక తప్పదు. యధార్ధ జీవితాన్ని గురించి రాయటమే పరమాదర్శంకాదు. దాన్ని గురించి నిర్లిప్తమైన. సంస్కారికమైన దృష్టి ప్రజాసామాన్యంలో వ్యాప్తంకావాలి. అది ఈనాడులేదు. పాపం అనేదాన్ని తీసుకోండి. పాపం సాంఘికవ్యవస్థ నంటిపెట్టుకొని ఉంది. వ్యక్తులు పాపాన్ని ఎంత పోగొట్టుకోవడానికి చూసినా, పాపులను మనం ఎంత కాలం శిక్షించినా సాంఘికవ్యవస్థ నంటిపెట్టుకున్న పాపంనుంచి పాపులు పుట్టుతూనే ఉంటారు. పాములను చంపటం అవసరంకావచ్చుగాక కాని పాము విషానికి విరుగుడు కనిపెట్టడం సంస్కారదృష్టిలో ఇంకా ముఖ్యమైనది. జీవితాన్ని గురించిన నిర్లిప్తమైన సంస్కారిక దృష్టి పెరిగినకొద్దీ, జనసామాన్యం జీవిత సమస్యలతో సరిగా పోరాడగల్గుతుంది.

ఇక శిల్పవిషయం. ఒకే పుస్తకాన్ని పదిమంది చదివి పదిమందీ ఒకే రకమైన ఆనందం పొందరు. అందుచేత అందరు వ్యక్తులకూ అనందం ఇచ్చే శిల్పాన్ని నిర్ణయించటం సాధ్యంకాదు. కాని ఒక వర్గానికిమట్టుకే ఇంపుగాఉండే శిల్పాన్ని నిర్ణయించడం ఇంతకంటె తేలికైనపని. అచ్చగా జమీందార్లనే రుచించేటట్టు శిల్పం నిర్ణయించవచ్చు.

శిల్పమనేది సహజంగా మన అందరిలోనూ ఉంది. ఏడిచే పిల్లవాణ్ణి నవ్వించవచ్చు మభ్యపెట్టి. అయితే సాహిత్య కళకి చెందిన శిల్పంయొక్క ఆశయం ప్రజలను మభ్యపెట్టడంకాదు. వారి దృష్టిని జీవిత కష్టసుఖాల దగ్గర్నుంచి మరల్చి వాటి వెనకఉండే కారణాల మీదికి మరల్చటం. ఆ కారణాలను ఎట్లా సంస్కరించుకునేదీ ప్రజలే నిర్ణయించుకుంటారు. శిల్పం అసమర్థంగా ఉంటే బుద్ధి విషయంమీదనుంచి విముఖము అవుతుంది. అందుచేత శిల్పం యొక్క ఆశయం విముఖుల్ని కూడా విషయోన్ముఖులు చెయ్యటం.

శిల్పికి మానవ మనస్తత్వం తెలిసి ఉండటం అవసరం, నటుడయినా, కథకుడయినా. ఏ కళాకారుడైనా మానవ మనస్తత్వం అవగాహన చేసుకోకుండా ప్రేక్షకుల నాకర్షించలేడు. మనకు ప్రత్యక్షానుభవంలేని జీవితఘట్టాలలో కూడా మన బుద్ధిని లగ్నం చెయ్యాలంటే కళాకారుడు మనస్తత్వాన్ని ఎంత బాగా గ్రహించగలవాడై ఉండాలో ఊహించవచ్చు.

మరో ముఖ్యవిషయమేమంటే రచయిత తన అనుభవాన్ని దాటిపోరాదు. తనకు సమగ్రంగా తెలిసిన జీవితభాగం అవగాహన చేసుకుని అందులోని సత్యాన్ని ప్రకటించనంతసేపూ రచయిత మధ్యతరగతివాడయినా, జమీందారయినా కూడా అభ్యుదయ సాహిత్యము రాయగలడు. ప్రజాజీవితానికి ఎంతో ఎడంగా ఉన్న రచయిత కూడా ప్రజలకు సన్నిహితుడు కావటానికి సరియయినమార్గం ఇదే.

రచయితకూ అతనురాసే జీవితానికీ ఉండదగిన సంబంధం ఏమిటంటే ఆ జీవితంకంటె ఆ రచయిత సన్నిహితంగా ఉండికూడా కొద్దిగా పైగాఉండి దాన్ని సమగ్రంగా అవగాహన చేసుకోగలవాడైఉంటేనే ఉత్తమ సాహిత్యం పుట్టుతుంది. కొందరు కథకులు అత్యాసకుపోయి తమకు ఒకమెట్టు పైన ఉన్న జీవితాన్ని చిత్రించబోతారు కొందరు రచయితలు నెలకో మూడొందలు సంపాదించే పాత్రను సృష్టించి కూడా సరిగా నిర్వహించలేకపోతారు. తనను ఆకర్షించే జీవితాన్నిమట్టుకే రాసే రచయిత విఫలుడై తీరుతాడు. తనకు కొంచెం కిందుగాఉన్న జీవితం గురించి రాసినప్పుడే రచయిత సంపూర్ణసంస్కారం ప్రకటించగలడు. ఆమాటఅని మరీ కిందుగాఉన్న జీవితాన్ని తీసుకున్నట్టయితే రచయితయొక్క నిర్లిప్తత నిర్లక్ష్యంగా మారి వేదాంతం చెప్పే అవకాశం ఉంది.

కథాశిల్పంలో సూత్రప్రాయంగా గమనించవలసిన అంశమేమంటే, కథఅంతా చెప్పాలి కథతప్ప మరేమీ చెప్పకూడదు కథలో ఏకత్వం (Oogsnic unity) పరిపూర్ణత్వమూ ఉండాలి.

కథాశిల్పానికి సంబంధించిన ఇతర సూత్రాలేమంటే, పరితల రసగ్రహణ శక్తిలో కొంత విశ్వాసం ఉంచాలి. ప్రతి స్వల్పవిషయాన్ని అంతులేకుండా వ్యాఖ్యానంచేసి కథ చెప్పటమంటే బుట్టలో ఏకులు కుక్కటంలాగా చెయ్యకూడదు, చదివేవాడు ఒక్క ముక్కలో తెలుసుకునే విషయాన్ని పదివాక్యాలలో వ్యాఖ్యానిస్తే చదివేవాడి ఆసక్తి ఎటో పోతుంది. వెనుకటికథలు శిల్పం లోపించిన కారణంచేత పూర్వకథలు దీర్ఘంగా ఉండేవి. సమయనిరూపణకు మూడు పేరాల వర్ణనా, స్థలనిరూపణకు మరో మూడు పేరాలూ, పాత్రను ప్రవేశపెట్టడానికి మరో కొంతస్థలమూ వినియోగపరిచేవారు. ఈనాటికథలు చాలా సంగ్రహంగా ఉంటాయి. కథనానికి అవసరంలేని వివరాలుండవు.

కార్డుకథలు చూసినట్టయితే పాత్రలను పరిచయంచేసి ఒక సంఘటనచెప్పి ఆ సంఘటనకు ఒక మొన ఏర్పరచటం

అతి కొద్దిలోగా అయిపోతుంది. కార్డు కథలు శిల్పంలో మంచి శిక్షణ ఇస్తాయి. కాని వాటిద్వారా ఉత్తమ సాహిత్యం రావటం అనుమానాస్పదం. కార్డుకథలు బాగా రాయటం సులభంకాదు.

కథ సంఘటనను అరిటిపండువొలిచి నట్టు వొలిచిపెట్టాలా. లేక చదివేవాడి ఆలోచనకేసి వదలాలా అంటే నాఅభి ప్రాయం ఆలోచనరేపి వదలాలనే. సరి అయిన సాహిత్యం చదివేవారి భావా లను ఒకమార్గంగా నడపాలి గాని ఒక గమ్యస్థానం చేర్చి వదలరాదు అట్లా ఒక సందేశం ఇచ్చి వదలినట్లయితే సాహిత్యం పరమార్థమైపోయి, అది మహో చైతన్యానికి దారితీయదు. కథలో ఉండే సంఘటన అసమగ్రంగా ఉండా లనికాదు. కాని దానిమీద కథకుడు తీర్పు చెప్పరాదు కథ చదివినాక చదివినవాడి తలలో భావాలు నలుముఖాలు పోయినా కూడా శిల్పంలో లోపంఉన్నట్టే.

ఒకేసంఘటనను చిత్రించేది చిన్న కథ, ఒక జీవితభాగాన్ని చిత్రించేది నవల. కథకు వాతావరణం, పాత్రల మనస్తత్వం. నవలకు వాతావరణం సంఘం. లాటరీలో ఒకలక్షరూపాయలు రావటంలాటి మారుమూలసంఘటనలను కూడా సరిఅయిన మనస్తత్వ వాతావర ణంతో చిత్రించవచ్చు. కాని నవలలో యధార్థ జీవిత వాతావరణం వొదిలేసి మారుమూల సంఘటనల పరంపర చిత్రించడం సాధ్యం కాదు. నవల పాత్ర జీవితంద్వారా కొంత వరకు సంఘ జీవితం కూడా చిత్రించక తప్పదు. నవలలో పాత్రలు పరిణామం చెందుతాయి చిన్నకథల తాలూకు సంఘటనలు పాత్రల పరిణామానికి ఎంత ప్రబలమైన అవకాశం ఇచ్చినా ఆ పరిణామాన్ని చిత్రించటం చిన్నకథ ఆశయం కాదు.

రచన అనేది తదేక దీక్షతో చేసి నప్పుడే ఉత్తమ సాహిత్యం వెలువడు తుంది. రచయిత పొట్టపోసుకునేం దుకు ఇతర వ్యాపారాలలో నిమగ్నుడై ఉంటే ఉత్తమ సాహిత్యం సృష్టి కాదు. ఈనాటి సంఘంలో రచనద్వారా పొట్ట పోసుకునే అపూర్వ అవకాశం దొరికిన వానికి ప్రజాజీవితం ఎడమవుతూ ఉంది. ప్రజా జీవితం సన్నిహితంగా ఉండి రచనద్వారా పొట్టపోసుకునే అవకాశాలు గలవారికి మంచి సాహిత్యం సృష్టించే అవకాశం కూడా ఉంటుంది.

కథారచనలు చెయ్యదలచినవారు విరివిగా కథా సాహిత్యం చదవాలి. మొదట్లో అన్ని కథలూ బాగున్నట్టే కనిపించినా, రాను రాను వాటిలో మంచి చెడ్డలూ, గుణలోపాలూ కనిపిస్తాయి. శిల్పంకూడా పరిచయంవల్ల లభ్యమవు తుంది.

ఆంధ్ర సాహిత్య పారశాలా విద్యార్థిని

భాషాప్రవీణ, శ్రీమతి పసల సత్యవతీ**దే**వి



“ఈ సాహిత్య పాతశాలలో గడచిన నా విద్యార్థినీ దశ అమూల్య మైనదిగా భావిస్తున్నాను ఉపాధ్యాయులు తమ చింకాల కృషి ఫలితాలను, అమూల్యాశయాలనూ ఇచ్చి విద్యార్థుల అభ్యుదయానికీ పారశాలా అభ్యుదయానికీ తోడ్పడ్డారు

ఆంధ్రసాహిత్యంలో — కొత్త పోకడలు

శ్రీ మద్దుకూరి చంద్రశేఖరరావు

1857 తిరుగుబాటు ఓడిపోవడంలో బ్రిటీషు ప్రభుత్వం భారతదేశంలో వేళ్లూనింది. భారత ప్రజలను బానిసత్వంలో అణచిపెట్టడానికి, తమ సామ్రాజ్యాన్ని రక్షించుకోడానికి బ్రిటీషువాళ్ళు రైల్వే నిర్మాణానికి పూనుకున్నారు.

అదివరకు మనదేశంలో జమీందారీ సమాజం వుంది వ్యవసాయం, చేతి పరిశ్రమలపై ఆధారపడిన ఆర్థికజీవితం అమలులోవుంది. జమీందారులు, జాగీర్దారులు, ఈనాందారులచే పీడించబడుతున్న రైతాంగం, కుల-మత హెచ్చుతగ్గులతో చీలివున్న ప్రజలు, అజ్ఞానంలో మూఢ విశ్వాసాలతో మునిగివున్నారు.

రాజుల-నవాబుల జమీందారీ నాగరికతను బ్రిటీషుసామ్రాజ్యవాదుల పెట్టుబడిదారీ నాగరిత జయించింది. మనం బానిసలమయ్యాము. బ్రిటీషు వాళ్ళు రైల్వేల నిర్మాణంతో పెట్టుబడిదారీ ఆర్థిక విధానాన్ని ప్రవేశపెట్టారు. ఈ దేశంలోని ముడిపదార్థాలను చౌకగాకొని తీసుకుపోవడం, వాళ్ళ ఫ్యాక్టరీ వస్తువులను దిగుమతిచేసి లాభాలకు అమ్ముకోడం ప్రారంభించారు. దీనితో మన దేశంలోని చేతిపరిశ్రమలు నశించిపోసాగాయి. పెట్టుబడిదారీ విధానంతో పాటు అచ్చుయంత్రాలు, పత్రికలు మన దేశంలోకూడ వెలయసాగాయి

వీరేశలింగయుగం

పై మార్పు లన్నిటి ఫలితంగా నూతన పరిస్థితులనుండి నూతనాంధ్ర జాతీయవికాసం ప్రారంభమయింది. ఈ దశకు వీరేశలింగ యుగమని పేరిడదాము. పాశ్చాత్య నాగరికతతోను, ఇంగ్లీషు సాహిత్యంతోను ఏర్పడిన సంబంధంవల్ల తెలుగు సాహిత్యంపైన, మన నాగరికతపైన వాటి ఛాయలు పడసాగాయి. వీటిని తీర్చిదిద్ది, తెలుగు సాహిత్యానికి, కొత్త అలంకారాలు జేకూర్చి, మన ప్రజలకు అందజేసి, కందుకూరి వీరేశలింగం పంతులుగారు నిజంగా యుగపురుషులయ్యారు.

అప్పటికి మన తెలుగుసాహిత్యం రాజుల, జమీందారుల దయకోసం శృంగార ప్రబంధాలు వ్రాసే స్థితికి దిగజారిపోయింది. మన రాజుల రాజ్యం చిన్నదైనా, అధికారం ఏమీ లేకపోయినా, బిరుదావళి పొడుగ్గా ఉంటుంది. అదేవిధంగా సాహిత్యరంగంలో పదాడంబరంకోసం తాపత్రయం హెచ్చింది. రెండర్థాలువచ్చే శ్లేషకావ్యాలు, ద్వ్యందార్థ

కావ్యాలతో డ్రిల్లుచేయడంకూడ పరిపాటి అయింది. ఈ విషయాన్నిగురించి సరస్వతీ శారదా విలాపమనే గ్రంథంలో వీరేశలింగంగారే యిలా చెప్పారు :

క. తెలియదు సుమ్మిపుడు నా
పలుకుల యర్థంబు నాకె భావములేమిన్
వెలసొమ్ములుగాకివి సం
కెలలయి కడునాదుమేనికి న్వేతనించున్.

సీ. దయమాలి తుదముట్ట దలకట్లునిగిడించి
ధీరుడై నన్ను బాధించు నొకడు
పాదంబులోపల బాదంబు లిమిడించి
పీడుడై నన్ను నొప్పించు నొకడు,
ప్రాసంబుకై బెక్కుప్రాసంబు లడరించి
పోటుబండయి నన్నుబొడచు నొకడు;
బెండుపల్లులుగూర్చి నిండించి నగలంచు
దిట్టయై చెవులు వేధించు నొకడు.
ఖడ్గచక్రాది రూపము ల్గాసిపించి
వర్ణముల్మార్చిననుజిక్కపరచునొకడు
కుమతులొడలెల్ల విరిచి ప్రాణమ్ముతీయ
నొడలి పసలేక శుష్కించి యున్నదాన.

ఇట్టి తెలుగుసాహిత్యాన్ని తీర్చి దిద్దడానికి, ఇంగ్లీషుసాహిత్యంలో చూస్తున్న అభ్యుదయ సాహిత్యరీతులను ప్రవేశపెట్టడానికి వీరేశలింగంగారు పూనుకున్నారు. కాని మొదట్లో వీరుకూడ తమ పాండిత్య గరిమను చూపుకోడానికి కొన్ని రచనలను వ్రాయకపోలేదు. రసికజనమనోభిరామం అనే శృంగార ప్రబంధం, శుద్ధాంధ్ర నిర్వచన నిరోష్ట్య నైషధం, నీతిచంద్రికలోని 'విగ్రహం, సంధి' లాంటివి పాతఫక్కీని వ్రాసారు. కాని అది సరియైన మార్గంకాదని తెలిసికొని ఆ పద్ధతి వెంటనే మానివేసారు.

తెలుగు ప్రజలలోవున్న మూఢవిశ్వాసాలను, దురాచారాలను ఖండించుతూ అనేక ప్రహసనాలు వ్రాసారు. వాటిలో శులభశైలి, నిశితమైన విమర్శ యిమిడివుంది సంఘసంస్కార ప్రబోధం వుంది. 'సత్యవతి' 'చంద్రమతి' అన్న కధలను, రాజశేఖరచరిత్ర అను నవలను వ్రాసారు. వీటిలో తెలుగుప్రజల జీవితం చిత్రించుతూ తాము కోరుతున్న సంస్కారభావాలను ప్రచారం చేసారు.

రాజశేఖరచరిత్ర తెలుగులో వ్రాయబడిన మొదటి వచనకావ్యం. దీనినే ఇంగ్లీషులో నావెల్ అంటారు. వీరేశలింగంగారు తరువాత మంచి నవల వ్రాసినవారికి బహుమానాలు యిస్తామని ప్రకటించారు. ఈ పోటీలో బహుమతి పొందినవే చిలకమర్తివారి 'హేమలత, రామచంద్ర విజయం, అహల్యాబాయి' అను నవలలు.

వీరేశలింగంగారు శాకుంతల, రత్నావళివగైరా సంస్కృతనాటకాలను సులభశైలిలో తెలిగించారు. తాము స్వయముగా హరిశ్చంద్ర వగైరా నాటకాలు వ్రాసి నూతనఫక్కీ నాటకాలను ప్రోత్సహించారు. లంచగొండితనాన్ని ఖండించుతూ 'వ్యవహార ధర్మబోధిని' అనే వచన నాటకాన్ని వ్రాసారు.

బాలికా పాఠశాలను నిర్వహించి స్త్రీ విద్యను ప్రోత్సహించారు. స్త్రీ విద్య పనికిరాదన్న వారిని విమర్శించుతూ ప్రహసనాలు, వ్యాసాలు వ్రాసారు వితంతు వివాహాలను సమర్థించుతూ ప్రహసనాలు, వ్యాసాలు వ్రాసారు:తాము స్వయంగా ఎన్నో కష్టాలకోర్చి వితంతు వివాహాలను చేసారు. శంకరాచార్యుల ఆంక్షలకు- బహిష్కారణ పత్రాలకు

గురి అయ్యారు. భావి పౌరులు కానున్న తమ విద్యార్థుల సైన్యంతో శంకరాచార్యులసన్యాసుల మఠానుఓడించివేశారు

'సత్యరాజా పూర్వదేశయాత్రలు' లో చక్కని హాస్యరసాన్ని చిత్రించి వీరేశలింగంగారు 'సెటైర్' వ్రాయడంలో కూడ అద్వితీయులని నిరూపించుకున్నారు 'అడమళయాళం'లో మన సమాజంలో మహిళలకున్న నిర్బంధాలు, యిబ్బందులు పురుషులకున్నట్లు చిత్రించి అపుడెంత హేళనగా వుంటుందో చూపి, తాము కోరే స్త్రీ స్వాతంత్ర్యాన్ని ప్రచారం చేసారు. లంకాద్వీపయాత్రలో జ్యోతిష శాస్త్రాన్ని హేళన చేశారు.

ఉద్యోగుల లంచగొండితనాన్ని నిరసించుతూ వ్యాసాలు, ప్రహసనాలు వ్రాశారు. పరువునష్ట దావాలకు గురి అయ్యారు కులవిచక్షత పనికిరాదని నిరూపించుతూ సహపంక్తి భోజనాలను ఏర్పాటు చేశారు. తమ జందెం తీసి వేసి బ్రహ్మసమాజములో చేరారు.

తెలుగులో శాస్త్రగ్రంథాలు లేనిలోటు గమనించి శరీరశాస్త్రము, ఖగోళ శాస్త్రము వ్రాశారు. అప్పటికి దొరకినపరిశోధనల ఫలితాలను అనుసరించి ఆంధ్ర కవుల చరిత్రను వ్రాశారు. తరువాత పరిశోధనలను అనుసరించి యీ పుస్తకాన్ని సవరించుతూ వున్న సమయంలోనే 1919 మే 27 తేదీన కీర్తిశేషులయ్యారు.

వీరేశలింగం పంతులుగారు ఆంధ్ర సాహిత్యానికి, ప్రజల విజ్ఞానాభివృద్ధికి చేసిన సేవ అపారం ఒకమాటలో చెప్పాలంటే పంతులుగారు ఆంధ్ర సంస్కృతిలో ఒక నూతనశకం ప్రారంభించారు. జమీందారీ యుగపు సాంప్రదాయాలనే సంకెళ్ళలో కునారిల్లుతున్న ఆంధ్రసంస్కృతికి వీరు పునరుజ్జీవనం పోశారు. "వీరేశలింగముగారు నవీనాంధ్రదేశమునకును, ఆంధ్రవాఙ్మయమునకును యుగపురుషుడు" (రాయసం వెంకట శివుడు). "వీరేశలింగంగారే ఒక ఉద్యమం; ప్రజ" (క్రిష్ణశాస్త్రి)

విజ్ఞాన చంద్రికామండలి

పంతులుగారు ప్రారంభించిన సత్సాంప్రదాయాలను తరువాత అనేకమంది రచయితలు కొనసాగించారు. వారిలో ముఖ్యులు చిలకమర్తి లక్ష్మీనరశింహంగారు. అనేక నవలలు, కథలు జీవితాలు, ప్రహసనాలు, నాటకాలువ్రాసారు. వారి 'రాజస్థాన కథావళి' ఎంతోమంది తెలుగుయువకులలో దేశభక్తిని రగుల్కొలిపింది. హేమలత, అహల్యాబాయి చక్కని చారిత్రిక నవలలు. రామచంద్ర విజయం, రాజరత్నం, నాటి బ్రాహ్మణ కుటుంబాల జీవితాన్నిచక్కగా చిత్రించే సాంఘికనవలలు. గణపతి మూఢాచారాలను హేళనచేసే హాస్యరస ప్రధానమైన నవల. వీరినాటకాలు గయోపాఖ్యానం వగైరా ఎంతో జనాదరణ పొందాయి. ఇలాగే అనేకమంది రచయితలు వీరేశలింగంగారి సాంప్రదాయాలను కొనసాగించారు.

తానే ఒక సంస్థగా పనిచేసాడు వీరేశలింగంగారు. 1906 లో కొమరాజు లక్ష్మణరావుగారు విజ్ఞానచంద్రికా గ్రంధమాల అను సంస్థను స్థాపించారు. రచయితలను ప్రోత్సహించి అనేక

గ్రంధాలను వ్రాయించారు. 'అబ్రహాం లింకన్' 'స్వీయచరిత్రము' జీవిత చరిత్రలను. విజయనగర సామ్రాజ్యము, రాయచూరు ముట్టడి పాతాళభైరవి, అల్లాహో అక్బర్‌లాంటి గొప్పనవలలను ప్రకటించారు.

హిందూ మహాయుగము మహమ్మదీయ మహాయుగము, ఆంధ్రులచరిత్ర వంటి చరిత్ర గ్రంధాలను ప్రకటించారు. ఫ్రెంచి విప్లవం, అమెరికా స్వాతంత్ర్యము వగైరా రాజకీయ గ్రంధాలు ప్రకటించారు.

భౌతికశాస్త్రము, రసాయనశాస్త్రము, వ్యవసాయశాస్త్రము, ఆర్థిక శాస్త్రము వగైరా సైన్సు గ్రంధాలను తెలుగులో వ్రాయించి ఆంధ్రసాహిత్యానికి గొప్ప సేవచేసారు. ఆంధ్రవిజ్ఞాన సర్వస్వాన్ని గొప్ప ఆశయాలతో ప్రారంభించారు. 3 భాగాలను మాత్రం ప్రకటించగలిగారు. దురదృష్టవశాత్తు స్వల్ప వయస్సులోనే (46 యేండ్లకు) 1923 జులై 13 తేదీన మరణించారు.

'విజ్ఞానచంద్రిక'ను అనుసరించుతూ తెలుగుదేశంలో అనేక గ్రంధమాలలు బయలుదేరాయి. ఆంధ్ర ప్రచారిణీ, సరస్వతి, వేగుచుక్క వగైరా అనేక గ్రంధమాలలు విరివిగా నవలలను ప్రకటించాయి. ఇంగ్లీషు, బెంగాలీ భాషలనుంచి అనువాదాలు విరివిగా రాసాగాయి.ఆంధ్ర సాహిత్యవనంలో వివిధ రకాల క్రొత్త క్రొత్త మొక్కలు, అంట్లు దినదినాభివృద్ధి గాంచసాగాయి.

గ్రంధమాలలు మాదిరిగానే గ్రంధాలయాలు (లైబ్రరీలు) గ్రామగ్రామాన వెలసాయి. విరివిగా గ్రంధాలు అచ్చు గావడం, చౌకగా దొరకడం, సులభశైలిని వ్రాయబడిన నవలలు మొదలైన వచనరచనలు ప్రజాసామాన్యానికి అందుబాటులో వుండటం సాధ్యమయింది. గ్రంధాలయోద్యమంకూడ యిందుకెంతో దోహదం చేసిందని చెప్పాలి.

ఈ సమయంలోనే (1909) మచిలీపట్నంలో ఆంధ్ర జాతీయకళాశాల ప్రారంభించబడింది. దానితోబాటు పెద్ద వర్కుషాపు (కర్మాగారం) స్థాపించబడింది. ఇంజనీరింగు చిత్రకళ, తివాశీనేత వగైరా అనేక శాఖలతో ఒక విశ్వవిద్యాలయంలా నడుపాలనే ఆశతో పునాదులు వేయబడ్డాయి. ఇంతేగాక క్రిందటి యుద్ధకాలంలో (1912-18) ఆంధ్రదేశంలో, బందరు పంచదార ఫ్యాక్టరీ, రాజమండ్రి పేపరుమిల్లు, తాడేపల్లి బట్టలమిల్లు వగైరా పరిశ్రమలు మొలకలెత్తాయి.

ఈ కాలంలో నూతన జాతీయ వికాసానికి పాటుబడుతున్న రచయితలకు ఆశాజ్యోతి కన్పించేది. భవిష్యత్తును గురించి బంగారు కలలు గనేవారు. అందుకు చక్కని ఉదాహరణ :

దించు లంగరు

"దించు లంగరు దీర్ఘ యుద్ధం
ధర్మపక్షము ముల్లుచూపెను
నరులపీనుగు పెంటపోగుల
నాటివెలయు శాంతిపక్షము.

(1913)

వ్యవహార భాషావాదము

నవ్యాంధ్రభాషకు పునాదులు వేసిన

వీరేశలింగంగారు. ఆ పునాదుపై విస్తరింపజేసిన విజ్ఞాన చంద్రికా గ్రంథమాల, చిలకమర్తి వగైరా రచయితలు సులభమైన గ్రాంథికభాషను వాడారు. ప్రబంధాలలోని కృతకభాషను వారు వదలివేసినా, సజీవమైన వ్యవహారభాషలో గ్రంథరచన చేయడానికి అంగీకరించలేదు. విశ్వవిద్యాలయంవారు కూడ వ్యవహారభాషలో వ్రాసిన రచనలను పాఠ్యగ్రంథాలుగా తీసికొన నిరాకరించారు.

ఈవిషయంలో గిడుగు రామమూర్తి పంతులుగారు వ్యవహారిక భాషే సజీవమైనదనీ, పూర్వకవుల రచనలలో కూడ భాష కాలానుసారంగామారుతూ వచ్చిందనీ, ఒక ఉద్యమాన్ని లేవదీశారు. గ్రాంథిక భాషను సమర్థించే ఆంధ్ర సాహిత్య పరిషత్తుతో హోరా హోరీగా పోరాడారు. భాషాశాస్త్రాన్ని దించి పండితులను ఓడించారు.

ఒకసారి రామమూర్తిగారిని హేళన చేయడానికి ఛాందసపండితులు వ్యవహారికభాష వివిధ ప్రాంతాలలో వివిధ రూపాలలో వుంటుంది. సర్వులకు తెలిసేదిగా వుండదు అని ఆక్షేపించారు. ఉదాహరణకు:-పోకచెక్కలను కొన్ని చోట్ల చెక్కలు, మరికొన్ని చోట్ల వక్కలు అని వాడతారు; కందులు. బేడలు అని వేరువేరు ప్రాంతాలలో వాడుతారు; అని ఆక్షేపించారు. దానికి రామమూర్తిగారు నవ్వి "అవస్తువులకు మీ గ్రాంథికభాషలో సర్వులకు తెలిసే చేసారు. పండితులు తెల్లమొఖం వేయవలసి వచ్చింది

వీరేశలింగంగారు తమ అవసాన కాలంలో 1918 లో గిడుగువాదాన్ని అంగీకరించారు. వ్యవహారభాషా ప్రచారక సంఘాన్ని, తాము అధ్యక్షులుగా వుండి, స్థాపించేరు కాని తరువాత వీరేశలింగంగారు కొలది మాసాల్లోనే మరణించుటచేత యీ సంఘం పనిచేయలేదు.

మూడుకోట్ల తెలుగుప్రజలు చదువుకోవాలంటే, విజ్ఞానం పొందాలంటే వ్యవహారికభాషలో పాఠ్యగ్రంథాలరచన అవసరమని గిడుగు రామమూర్తిగారు ఎలుగెత్తిచాటారు.

"సంఘంలో నిరక్షరకుక్షులు ఎక్కువగా ఉన్నంతకాలము సంఘం వృద్ధిలోకి రాదు. సౌఖ్యమన్నది సంఘంలోని భాగ్యవంతులూ, పెద్దలూ, సామాన్యప్రజలతో పాటు సమాంశులుగా అనుభవించవలసినదే కాని, తామొక్కరే అనుభవించవలసినదికాదు. ప్రజలలో విద్యవ్యాపిస్తేకాని సంఘం వృద్ధిలోనికి రాదు."

గిడుగువాదాన్ని ఆచరణలో పెట్టి, చక్కని రచనలు సృష్టించి ప్రజల మన్ననలను పొందిన మహాకవి గురజాడ అప్పారావుగారు. వ్యవహార భాషలో 'కన్యాశుల్కం' లాంటి గొప్పనాటకాన్ని వ్రాసారు. దానికి దీటైన నాటకం యింతవరకు రాలేదనే చెప్పాలి.

నీలగిరిపాటలు, ముత్యాల సరాలు అనే పాటలు మాత్రాఛందస్సులో వ్రాసారు. ముత్యాలసరాలలో అప్పా

జాతీయత, తెనుగుదనంకలది. మాటలు తూచి తూచి వాడినట్లు కనబడతాయి. కన్యక, పూర్ణమ్మ, లవణరాజుకల వగైరా కథలను ముత్యాలసరాలలో వ్రాసారు.

వీటన్నిటినీ మించినది అప్పారావు గారి 'దేశభక్తి' అనే గేయం. దాని ఒక్కొక్క పాదం నిజంగా ఒక్కొక ముత్యంవంటిది. ఈ గేయం ఒక్కటి చాలు అప్పారావుగారిని అమరజీవిని చేయడానికి భారత దేశంలో అనేక జాతీయగీతాలు వచ్చాయి. కాని వాటిలో దేనికీ అప్పారావుగారి గీతంలోని భావ గాంభీర్యంలేదు. బంకించంద్రుని 'వందే మాతరం'గాని, రవీంద్రుని'జనగణమన' గాని ఇక్బాల్ 'హిందూస్థాన హమారా' గాని 'దేశమును ప్రేమించుమన్నా' గీతానికి ఏమాత్రం పోలికకు రాలేవు.

అప్పారావుగారు జాతీయవాదులను ఎలా హెచ్చరించుతున్నాడో చూడండి :

"దేశాభిమానం నాకు కద్దని
వొట్టిగొప్పలు చెప్పుకోకోయ్
పూని ఏదైనాను ఒకమేల్
కూర్చి జనులకు చూపవోయ్"

పూర్వుల గొప్పతనం చెప్పుకొని సంతృప్తి పడవద్దంటూ ఏమన్నాడో చూడండి :

"వెనుకచూచిన కార్యమేమోయ్
మంచి గతమున కొంచెమేనోయ్
మందగించక ముందుఅడుగేయ్
వెనుకబడితే వెనుకెనోయ్"

దేశాభివృద్ధిని ఆయన ఎలా కాక్షించు తున్నాడో చూడండి :

"పాడిపంటలు పొంగిపొర్లే
దారిలో నువు పాటుపడవోయ్
తిండికలిగితె కండకలదోయ్
కండకలవాడేను మనిషోయ్ :
యీసురోమని మనుషులుంటే
దేశమేగతి బాగుపడునోయ్
జల్దుకొని కళలెల్ల నేర్చుకు
దేశిసరుకులు నింపవలెనోయ్"

అప్పారావుగారు పెట్టుబడిదారీ నాగరికతలోని బలహీనతలు చూసాడు. ఓర్వలేమి పనికిరాదని చెబుతూ యిలా హెచ్చరించుతున్నాడు

"స్వంతలాభం కొంతమానుకు
పొరుగువాడికి తోడుపడవోయ్
దేశమంటే మట్టికాదోయ్
దేశమంటే మనుషులోయ్"

ఐకమత్యంగా వుండమని కోరుతూ-

"అన్నదమ్ముల వలెను జాతులు
మతములన్నీ మెలగవలెనోయ్"

అంటున్నాడు.

మానవుల కష్టంనుంచే సర్వము ఉత్పత్తి అవుతూందని ఎంత చక్కగా చెబుతాడో చూడండి :

"నరుల చెమటను తడిసిమూలం
ధనం పంటలు పండవలెనోయ్"

అప్పారావుగారు తెలుగు ప్రజలకు ఇచ్చిపోయిన యీ జాతీయగీతం నిజముగా మహాభాగ్యం. అదివ్రాసి యిప్పటికి దాదాపు 36 యేళ్ళు గడిచినా కొత్తదనం ఏమీపోలేదు.

గిడుగు, గురజాడల వ్యవహారిక భాషావాదం ప్రజలలో వ్యాపించింది. నేడు పత్రికలు, రచయితలు వ్యావహారిక

భాషలోనే ఎక్కువగా రాస్తున్నారు. ఆంధ్రసాహిత్య పరిషత్తు, విశ్వవిద్యాలయం మాత్రం తను మొండిపట్టుదల వీడలేదు పిల్లలు చదువుకునే పుస్తకాలు గ్రాంధిక భాషలోవుండి సత్వర విద్యావ్యాప్తికి ఆటంకంగా వున్నాయి. కాని ప్రజలకు సంబంధించినంత వరకు గిడుగు జయించాడు.

గిడుగువారి వ్యావహారిక భాషావాదం అభ్యుదయుకరమైనది. ఆంధ్రభాషను వ్యాకరణ పండితుల సంకెళ్ళ నుంచి విముక్తిచేసి జీవద్భాషగా చేయడానికి జరిగిన మహత్తర కృషి. గురజాడ అప్పారావుగారు పై భావాలనే 'కన్యాశుల్కం' 'ముత్యాల సరాల' రూపంలో చిత్రించిన మహాశిల్పి.

జాతీయవాదం

పెట్టుబడిదారీ నాగరికతను చూసి ఉత్తేజం పొందిన మన దేశభక్తుల, రచయితల ఆశలు నెరవేరలేదు. మన ఆర్థిక జీవితం పెంపొందలేదు బ్రిటీషు సామ్రాజ్యవాదుల పోటీకి నిలువలేక పసిప్రాయంలో ఉన్న మన పరిశ్రమలు దివాలా తీసాయి. పాశ్చాత్య నాగరికత చూపిన ఆశారేఖలు సన్నగిల్లాయి. ప్రపంచాన్ని యుద్ధమనే మారణహోమంలోకి సామ్రాజ్యవాదులు నెట్టుకుపోయారు.

దీనితో మన నాయకుల చూపు మన ప్రాచీనౌన్నత్యం వైపు మరలింది. మన రచయితలు-బానిసలంకాకముందు మనం బ్రతికివున్న రోజులనుండీ, చరిత్రలోతుల నుండీ ఉత్సాహాన్ని పొందసాగారు. ఇది 1905 వందేమాతరం రోజులలోనే రాజకీయంగా వ్యక్తిగత హింసావాదంగాను, తిలక్‌గారి తీవ్ర జాతీయవాదంగాను ప్రారంభమయింది. వీటి పలుకుబడి మన తెలుగు సాహిత్యం పైన కూడ స్పష్టంగా కనబడుతుంది.

ఉదాహరణకు రాయప్రోలు సుబ్బారావు గారి ప్రబోధం చూడండి.

"వేదశాఖలు - పెరిగె నిచ్చట
ఆదికావ్యము - అందె నిచ్చట
బాదరాయణ - పరమఋషులకు
పాదుసుమ్మిది చెల్లెలా!

"విపిన బంధుర - వృక్షవాటిక
ఉపనిషన్మధు - వొలికె నిచ్చట
విపుల తత్వము - విస్తరించిన
విమలతలమిదె తమ్ముడా!

"పాండవేయుల - పదునుకత్తులు
మండిమెరసిన - మహిత రణకథ"

"లోకమంతకు - కాకపెట్టిన
కాకతీసతి - కదన పాండితి"

చేర్చి పాడమని రాయప్రోలు కోరుతున్నాడు దీనిలో మన పాతచరిత్ర నుంచి దేశగర్వం, ఉత్సాహం, పెంపొందించే ప్రయత్నముంది. కాని అప్పారావుగారివలే మనలోని లోట్లను సవరించుకొని "పాడిపంటలు పొంగిపొర్లే దారిలో నువు పాటుపడవోయ్" అనే ఉద్బోధ లేదు.

ఇలాంటిదే విశ్వనాధ సత్యనారాయణ గారి ఆంధ్ర ప్రశస్తి - ఆంధ్రపౌరుషము కూడ. ఐనప్పటికీ ఆ కాలంలో పెట్టుబడిదారీ నాగరికతయెడల వుండేభ్రమలు తొలగిపోతున్నాయి పరపాలకులతో పోరాడి దేశస్వాతంత్ర్యం సాధించాలనే

తీవ్ర జాతీయోద్యమం బయలుదేరింది. ఆ సమయంలో పాత చరిత్రనుంచి ఉత్సాహం పొందడం సహజమే అందుచే యీ రచనలుకూడ అభ్యుదయ కరమైనవే।

కాని దానితోపాటు జమీందారీ యుగపు సాంప్రదాయాలవైపు వెనుక చూపు లేకపోలేదు దేశగర్వంతో పాటు హిందూజాతీయదురహంకారపుచిహ్నాలు లేకపోలేదు ఇవి పెరిగి పెద్దవాట వల్లనే తరువాత రాయప్రోలు, విశ్వనాధ గార్లు జమీందారీయుగపు ఛాందసాలన్నిటినీ సమర్థించుతూ, అభ్యుదయాన్నే వ్యతిరేకించేవారుగా తయారయ్యారు

ఈ పోకడలో వున్న లోటులను పసిపట్టినయే ప్రజాకవి గురజాడఅప్పారావు గారు జాతీయ వాదులను యిలా హెచ్చరించాడు -

"వెనుక చూచిన కార్యమేమోయ్
మంచిగతమున కొంచెమేనోయ్
మందగించక ముందు అడుగేయ్
వెనుకపడితే వెనుకేనోయ్"

1920 సహాయ నిరాకరణోద్యమము

గాంధీ మహాత్ముని నాయకత్వాన జరిగిన సహాయ నిరాకరణోద్యమం 1920 లో తెలుగుదేశాన్ని ఉత్తేజ పరచింది ప్రజలలో బయలుదేరిన ఉద్వేగం మన సాహిత్యంలో కూడ ప్రతిబింబించింది

'దండాలు - దండాలు భరతమాత' అనేపాట, 'మాకొద్దీ తెల్లదొరతనం' అనేపాట గరిమెళ్ళ సత్యనారాయణ గారు వ్రాసారు ఇవి గ్రామగ్రామాన, తెలుగుదేశమంతటా ప్రతిధ్వనించాయి బ్రిటీషు ప్రభుత్వంపై ద్వేషాగ్ని రగుల్కొల్పి ప్రజలను స్వాతంత్ర్యపోరాటం వైపు మరల్చడానికి యిలాంటిపాటలు ఎంతో తోడ్పడినాయి నిజంగా యివి. బసవరాజు అప్పారావుగారి పాటలు 'మాగాంధి' వగైరాకూడ ఎంతో అభ్యుదయకరమైన పాత్రను వహించాయి. కాని వీటిలోకూడా జాతీయ వాదులలో వున్నలోటు (పూర్వ చరిత్రను తలచి గర్వపడుతూ, లోటులను తెలిసికో నిరాకరించుట) మాత్రంవుంది.

ఈ దశలో వ్రాయబడిన రచనలలో వేలూరి శివరామశాస్త్రిగారి 'అహో బలీయం' అను నవలనాదృష్టిలో చాల ముఖ్యమయినది, ఆయనఅప్పటిజాతీయ వుద్యమంలోని గొప్పతనాన్ని, లోపాలనుకూడ సహజంగా చిత్రించాడు

ఓబయ్య అనే చదువుకున్న యువకుడు కాంగ్రెసు వాది అవుతాడు గ్రామంలో జాతీయ పాఠశాలపెట్టి బీదలకు చదువుచెబుతాడు పోష్టాఫీసు, కోపరేటివ్ సొసైటీ పెట్టించుతాడు రోడ్డు వేయించుతాడు బ్రహ్మచర్యం అవలంబించి చిన్నతనంలోనే పెండ్లాడిన భార్యను కాపురానికి తీసుకురాడు క్రమంగా ఓబయ్య నిర్మాణ కార్యక్రమం అంతా, సరియైన పునాదులులేక గాలిలో సాగింది. ఉత్సాహాలు వేసేవారు తగినంతమంది లేక పోష్టాఫీసు రద్దు అవుతుంది అప్పులు తీర్చలేక కోఆపరేటివ్ సొసైటీ దివాలాతీస్తుంది పిల్లలు సరిగా

రాక జాతీయ పాఠశాల మూలబడు తుంది కాని ఓబయ్య కృషి కేవలం వృధాగాపోలేదు గ్రామంలో కొంపలకు నిప్పంటుకున్నపుడు ఓబయ్య శిష్యులంతా మంటలను ఆర్పడానికి సైనికులవలె సుశిక్షణతో పనిచేస్తారు. గ్రామం తగులబడిన వార్తను వైద్యపరీక్షప్యాసై ప్రాక్టీసుచేస్తున్న ఓబయ్యభార్యవింటుంది. కొంపలు లేక అల్లాడుతున్న నిరాధారులకు సాయంపంపుతుంది.

ఈ కథనే 'అహోబలీయం' లో వీలూరి శివరామశాస్త్రిగారు వాస్తవికంగా చిత్రించి నాటి తెలుగుదేశంలోని జాతీయోద్యమానికిసజీవమైన రూపమిచ్చారు

ఈ దశలోనే వ్రాయబడిన ఉన్నవ లక్ష్మీనారాయణగారి మాలపల్లి కూడ చెప్పదగినదే రష్యన్ విప్లవపు ఛాయలు హిందూ వేదాంతఛాయలు' అరాజకపు ఛాయలు మిశితమై వున్నాయి అడివి బాపిరాజుగారి 'నారాయణరావు' లో జమీందారీ సాంప్రదాయాలనుండి పెకల్చుకొని పెట్టుబడిదారీ నాగరికత ఎలా నెమ్మదిగా బయటపడుతూందో చూపబడింది. ఇవి నాటి తెలుగుదేశపు ప్రజాజీవితాన్ని చిత్రించుతున్న అభ్యుదయ రచనలు

భావ కవిత్వం

జాతీయోద్యమం ప్రబలుతూన్న రోజులలోనే సాహితీసమితి వచ్చింది లిరిక్ పొయిట్రీ - భావకవిత్వం తెలుగులో వ్రాయసాగారు. రాయప్రోలు సుబ్బారావుగారి రచనలు, విశ్వనాధవారి కిన్నెరసాని పాటలు, కృష్ణశాస్త్రిగారి కృష్ణపక్షం వగైరా యీరకానికి చెందినవే భాష, శబ్దమాధుర్యంచేకూర్చడంలో యివి ముందంజవేసాయి. చింతా దీక్షితులుగారి కథలు నాటకాలు, పాటలు కూడ యీ పోకడకు చెందినవే మృదువుగా తెనుగుతనం వుట్టిపడుతూ వుంటాయి.

భావాలకు సంబంధించినంతవరకు విశ్వనాధ, రాయప్రోలు, శివశంకరశాస్త్రి దీక్షితులుగారి రచనలది వెనకచూపే దేవులపల్లి కృష్ణశాస్త్రిగారి రచనలలోని విషాద ఛాయలుకూడ నాటి మనతెలుగు దేశపు దీనస్థితిని తెలుపుతాయి కృష్ణశాస్త్రిగారు బ్రహ్మసమాజకులైన ఆర్. వెంకటరత్నం. వీరేశలింగంగార్ల శిష్యులు వారి గురువులు. తామూ కూడ ఆశించిన నూతనాంధ్రజాతి యింకా రాలేదు సంస్కారం జాతీయవాదం పేర వెనుకచూపు పట్టింది కృష్ణపక్షంలో శాస్త్రిగా రేమంటారో చూడండి :

"అంత లజ్జా విషాద దురంతభార
వహనమున కోర్వలేని యీ పాడుబ్రతుకు
వంగిపోవును మఱిమఱి క్రుంగిపోవు
రో తెఱుంగని పాతాళలోకమునకు !"
"మీరు మనసారగా నేడ్వనీరు నన్ను
నన్ను విడువుడు ; ఒకసారి నన్నువిడిచి
నంత నేకాంత యవనికాభ్యంతరమున
వెక్కి వెక్కి రోదింతును—వినువులేక
విరతిలేక సర్వరశోక విషమగీతు
లేచ్చెనైతు, ఎలుంగెత్తి యేడ్చెనైతు"

తిరుగుబాటులు-అరాచకమార్గాలు

మొదటి ప్రపంచసంగ్రామం తరువాత పాశ్చాత్యదేశాలలో యుద్ధానికి దారితీసిన పెట్టుబడిదారీ నాగరికతయెడల ఏవగింపు బయలుదేరింది పాత సాంప్రదాయాలు,

నియమాలు ఉల్లంఘించే కొత్తపోకడలు వచ్చాయి. సాహిత్యరంగంలో కూడ ఈ పోకడలు ప్రతిబింబించాయి. డాడాయిజం, క్యూబిజం, ఇంప్రెషనిజం, సర్రియలిజం వగైరా యీ రకానికి చెందినవే. ఛందస్సు నియమాలను, రైమ్స్‌ను పాటించకపోవడం, బ్లాంకువర్స్ వ్రాయడం, ఊహాలోకొచ్చిన తలపులను సంస్కారం లేకుండా చిత్రించడం యీ పోకడల ప్రత్యేకత

భారతదేశంలో జాతీయోద్యమం ఫలితంగా పెట్టుబడిదారీ నాగరికతపై ఏవగింపువల్ల జమీందారీ యుగపు సాంప్రదాయాలవైపు చూపుమరలింది. అందుచే పై పోకడలు అంతగా దిగుమతికాలేదు. కాని జాతీయోద్యమం నవసంస్కారాన్ని ముందుకు తీసుకుపోనందున, వెనుక చూపుకు మరలినందున యిచటకూడ కొన్ని తిరుగుబాటులు, అరాచకపోకడలు వచ్చాయి.

ఉదాహరణకు గుడిపాటి వెంకటచలంగారిరచనలు. వీరుకూడ కృష్ణశాస్త్రిగారివలె బ్రహ్మసామాజికులు. వీరేశలింగంగారి శిష్యులు. వీరు చిన్నతనంలో ఆశించిన స్త్రీ స్వాతంత్ర్యం, నూతన సంస్కారం వ్యాప్తిచెందలేదు. కృష్ణశాస్త్రిగారి విషాదగీతాలలో నిస్పృహ ద్యోతకమయితే, చలంగారి రచనలలో కేవలం తిరుగుబాటుతత్వం స్పష్టంగా కనిపించుతుంది.

చలంగారు ముఖ్యంగా స్త్రీలు మన సమాజంలోఅనుభవించుతున్న కష్టనిష్ఠురాలను వాస్తవికంగా చిత్రించుతారు. సజీవమైన వ్యావహారికభాష వాడుతారు. వీరి కథలకు, నవలలకు అన్నిటికీ దాదాపు యితివృత్తం స్త్రీ-పురుష సంబంధాలు. పూర్వ శృంఖలాలను బద్దలుచేసి స్త్రీ తిరుగుబాటు చేయడమే అనేక రూపాలలో చలంగారు చిత్రించారు కాని వీరేశలింగంగారివలె ఒక నిర్మాణాత్మకమైన మార్గాన్ని మహిళలకు చూపలేకపోయారు. 'బానిసగా వుండొద్దు! తిరుగుబాటుచేయి! ఇంట్లోనుంచి లేచిపో' అని ధైర్యంగా బోధించారు. కాని ఇంట్లోనుంచి లేచి బజారునపడిన సోదరికి నేటి సమాజంలో గతిఏమిటి! పెట్టుబడిదారీ నాగరికతలో తక్కిన అన్ని వస్తువులమాదిరిగా అమ్ముడు కావడమే గదా! తద్వారా ఆమె యింకోరకపు బానిసత్వంలోకి దిగజారి చివికిపోవడమే గదా! ఈ విషమావస్థనుంచి తప్పించుకునే మార్గం చలం రచనలు ఏమాత్రం సూచించవు. అదే వాటిలోని అరాజకత్వం.

భాష, రచనా నైపుణ్యం, శిల్పం దృష్టితో చూస్తే చలంగారి రచనలు తెలుగు సాహిత్యంలో కథలను ఒక కొత్తస్థాయికి తీసుకుపోయాయి.

ఇతర తిరుగుబాటులు

జాతీయోద్యమం వెనుక చూపులు పట్టిందనీ, నూతన సంస్కారాన్ని వ్యాప్తిచేసి నూతనాంధ్రజాతిని సృష్టించడంలో సాఫల్యం పొందలేదనీ యిదివరకే తెలియజేసాను. ఎప్పుడైతే ప్రధాన పోకడ వెనుకచూపు పట్టిందో అప్పుడే పై తిరుగుబాటుకూడ మొలకెత్తింది.

త్రిపురనేని రామస్వామి చౌదరిగారి కురుక్షేత్ర సంగ్రామం, సూతపురాణం

రాక జాతీయ పాతశాల మూలబడుతుంది. కాని ఓబయ్య కృషి కేవలం వృధాగాపోలేదు గ్రామంలో కొంపలకు నిప్పంటుకున్నపుడు ఓబయ్య శిష్యులంతా మంటలను ఆర్పడానికి సైనికులవలె సుశిక్షణతోపనిచేస్తారు. గ్రామం తగులబడిన వార్తను వైద్యపరీక్షప్యాసై ప్రాక్టీసుచేస్తున్న ఓబయ్యభార్యవింటుంది కొంపలు లేక అల్లాడుతున్న నిరాధారులకు సాయంపంపుతుంది.

ఈ కథనే 'అహోబలీయం' లో వేలూరి శివరామశాస్త్రిగారు వాస్తవికంగా చిత్రించి నాటి తెలుగుదేశంలోని జాతీయోద్యమానికి సజీవమైన రూపమిచ్చారు.

ఈ దశలోనే వ్రాయబడిన ఉన్నవ లక్ష్మీనారాయణగారి మాలపల్లి కూడ చెప్పదగినదే రష్యన్ విప్లవపు ఛాయలు హిందూ వేదాంతఛాయలు' అరాజకపు ఛాయలు మిళితమై వున్నాయి అడివి బాపిరాజుగారి 'నారాయణరావు' లో జమీందారీ సాంప్రదాయాలనుండి పెకల్చుకొని పెట్టుబడిదారీ నాగరికత ఎలా నెమ్మదిగా బయటపడుతూందో చూపబడింది. ఇవి నాటి తెలుగుదేశపు ప్రజాజీవితాన్ని చిత్రించుతున్న అభ్యుదయ రచనలు

భావ కవిత్వం

జాతీయోద్యమం ప్రబలుతూన్న రోజులలోనే సాహితీసమితి వచ్చింది లిరిక్ పొయిట్రీ - భావకవిత్వం తెలుగులో వ్రాయసాగారు. రాయప్రోలు సుబ్బారావుగారి రచనలు, విశ్వనాధవారి కిన్నెరసాని పాటలు, కృష్ణశాస్త్రిగారి కృష్ణపక్షం వగైరా యీరకానికి చెందినవే. భాష, శబ్దమాధుర్యంచేకూర్చడంలో యివి ముందంజవేసాయి. చింతా దీక్షితులుగారి కథలు నాటకాలు, పాటలు కూడ యీ పోకడకు చెందినవే మృదువుగా తెనుగుతనం వుట్టిపడుతూ వుంటాయి.

భావాలకు సంబంధించినంతవరకు విశ్వనాధ, రాయప్రోలు, శివశంకరశాస్త్రి దీక్షితులుగారి రచనలది వెనకచూపే. దేవులపల్లి కృష్ణశాస్త్రిగారి రచనలలోని విషాద ఛాయలుకూడ నాటి మనతెలుగుదేశపు దీనస్థితిని తెలుపుతాయి. కృష్ణశాస్త్రిగారు బ్రహ్మసమాజకులైన ఆర్. వెంకటరత్నం, వీరేశలింగంగార్లకు శిష్యులు. వారి గురువులు, తాముకూడ ఆశించిన నూతనాంధ్రజాతి యింకా రాలేదు సంస్కారం జాతీయవాదం పేర వెనుకచూపు పట్టింది. కృష్ణపక్షంలో శాస్త్రిగా రేమంటారో చూడండి :

"అంత లజ్జా విషాద దురంతభార
వహనమున కోర్వలేని యీ పాడుబ్రతుకు
మునిగిపోవును మఱిమఱి క్రుంగిపోవు
లోతెఱుంగని పాతాళలోకమునకు !"
"మీరు మనసారగా నేడ్వనీరు నన్ను
నన్ను విడువుడు ; ఒకసారి నన్నువిడిచి
నంత నేకాంత యవనికాభ్యంతరమున
వెక్కి వెక్కి రోదింతును—వినువులేక
విరతిలేక సర్వరశోక విషమగీతు
లెచ్చెపైతు ; ఎలుంగెత్తి యేడ్చువైతు"

తిరుగుబాటులు-అరాచకమార్గాలు

మొదటి ప్రపంచసంగ్రామం తరువాత పాశ్చాత్యదేశాలలో యుద్ధానికి దారితీసిన పెట్టుబడిదారీ నాగరికత యెడల ఏవగింపు బయలుదేరింది. పాత సాంప్రదాయాలు,

నియమాలు ఉల్లంఘించే. కొత్తపోకడలు వచ్చాయి సాహిత్యరంగంలో కూడ ఈ పోకడలు ప్రతిబింబించాయి. డాడాయిజం, క్యూబిజం, ఇంప్రెషనిజం, సర్రియలిజం వగైరా యీ రకానికి చెందినవే ఛందస్సు నియమాలను, రైమ్స్‌ను పాటించకపోవడం బ్లాంకువర్స్ వ్రాయడం, ఊహలోకొచ్చిన తలపులను సంస్కారం లేకుండా చిత్రించడం యీ పోకడల ప్రత్యేకత

భారతదేశంలో జాతీయోద్యమం ఫలితంగా పెట్టుబడిదారీ నాగరికతపై ఏవగింపువల్ల జమీందారీ యుగపు సాంప్రదాయాలవైపు చూపుమరలింది. అందుచే పై పోకడలు అంతగా దిగుమతికాలేదు. కాని జాతీయోద్యమం మనసంస్కారాన్ని ముందుకు తీసుకుపోనందున, వెనుక చూపుకు మరలినందున యిచటకూడ కొన్ని తిరుగుబాటులు, అరాచకపోకడలు వచ్చాయి.

ఉదాహరణకు గుడిపాటి వెంకట చలంగారిరచనలు. వీరుకూడ కృష్ణశాస్త్రి గారివలె బ్రహ్మసామాజికులు. వీరేశలింగంగారి శిష్యులు. వీరు చిన్నతనంలో ఆశించిన స్త్రీ స్వాతంత్ర్యం, నూతన సంస్కారం వ్యాప్తిచెందలేదు. కృష్ణశాస్త్రిగారి విషాదగీతాలలో నిస్పృహ ద్యోతకమయితే, చలంగారి రచనలలో కేవలం తిరుగు బాటుతత్వం స్పష్టంగా కన్పించుతుంది.

చలంగారు ముఖ్యంగా స్త్రీలు మన సమాజంలో అనుభవించుతున్న కష్టనిష్ఠురాలను వాస్తవికంగా చిత్రించుతారు. సజీవమైన వ్యావహారికభాష వాడుతారు. వీరి కధలకు, నవలలకు అన్నిటికీ దాదాపు యితివృత్తం స్త్రీ-పురుష సంబంధాలు. పూర్వ శృంఖలాలను బ్రద్దలుచేసి స్త్రీ తిరుగుబాటు చేయడమే అనేక రూపాలలో చలంగారు చిత్రించారు కాని వీరేశలింగంగారివలె ఒక నిర్మాణాత్మకమైన మార్గాన్ని మహిళలకు చూపలేకపోయారు. 'బానిసగా వుండొద్దు। తిరుగుబాటుచేయ్। ఇంట్లోనుంచి లేచిపో' అని ధైర్యంగా బోధించారు. కాని యింట్లోనుంచి లేచి బజారునపడిన సోదరికి నేటి సమాజంలో గతిఏమిటి। పెట్టుబడిదారీ నాగరికతలో తక్కిన అన్ని వస్తువులమాదిరిగా అమ్ముడు కావడమే గదా। తద్వారా ఆమె యింకోరకపు బానిసత్వంలోకి దిగజారి చివికిపోవడమే గదా। ఈ విషమావస్థనుంచి తప్పించుకునే మార్గం చలం రచనలు ఏమాత్రం సూచించవు. అదే వాటిలోని అరాజకత్వం.

భాష, రచనా నైపుణ్యం, శిల్పం దృష్టితోచూస్తే చలంగారి రచనలు తెలుగు సాహిత్యంలో కధలను ఒక కొత్తస్థాయికి తీసుకుపోయాయి.

ఇతర తిరుగుబాటులు

జాతీయోద్యమం వెనుక చూపులు పట్టిందనీ, నూతన సంస్కారాన్ని వ్యాప్తిజేసి నూతనాంధ్రజాతిని సృష్టించడంలో సాఫల్యం పొందలేదనీ యిది వరకే తెలియజేసాను. ఎప్పుడైతే ప్రధాన పోకడ వెనుకచూపు పట్టిందో అపుడే పైతిరుగుబాటుకూడ మొలకెత్తింది.

త్రిపురనేని రామస్వామిచౌదరిగారి కురుక్షేత్ర సంగ్రామము, సూతపురాణం

వగైరాలో రచనలు యిలాంటివే. వీరిభాష, కవిత్వపోకడ చక్కగా వుంటుంది. జమీందారీ సాంప్రదాయాలను, బ్రాహ్మణ మతాన్ని విమర్శిస్తూ బయలుదేరిన వీరు, రాజకీయంగా జమీందారీ నాయకత్వంలో వున్న జస్టిస్‌పార్టీకి అనుబంధమై పోయారు. అందుచే ప్రజలను ఏమాత్రం ఉత్తేజపరచలేక పోయారు. వీరు వేనరాజు, కథను 'ఖూనీ' అనే పేరుతో నాటకంగా అభ్యుదయకరమైన పోకడలో చిత్రించారు. వీరి రచనలలో ఎన్నదగిన పాట. "వీరగంధము తెచ్చినారము వీరు లెవ్వరో తెల్పుడీ."

త్రిపురనేని రామస్వామిగారి 'శంబుక వధ' ముద్దుకృష్ణగారి 'అశోకం' చలం గారి 'సావిత్రి' వగైరాల్లో పురాణగాథలనే తీసికొని వాటిని కొత్త దృక్పథం నుంచి చిత్రించారు. వెనుకటి గాథలను తీసికొని కొత్తభావాలను ప్రచారం చేయడానికి వినియోగించడం యూరోపులో రూసో, విక్టర్‌హ్యూగో లాంటి వారు కూడ ప్రారంభంలో చేశారు. కాని వారు తరువాత అప్పటి ప్రజాజీవితాన్ని చిత్రించుతూ కొత్త పాత్రలను సన్నివేశాలను సృష్టించుకున్నారు. 'లేమిజరబుల్స్' లాంటి గొప్ప రచనలు చేయగలిగారు. కాని దురదృష్టవశాత్తు మన తిరుగుబాటుదారులు మన పురాణాలలోని మూఢవిశ్వాసాలను తొలగించడానికి కృషి చేశారు గాని, కొత్త పాత్రలను సృష్టించుతూ మహాకావ్యాలను వ్రాయలేకపోయారు.

అందుచే 'అశోకం' 'సావిత్రి'లాంటి రచనలు ప్రజలలోని ఛాందసభావాలను రెచ్చగొట్టాయేగాని, కొత్తదారి చూపలేక పోయాయి. అంతేగాక ప్రజలు పరమ పతివ్రతలుగా గౌరవించే సావిత్రి, సీత వంటి పాత్రలకు యముడు, రావణులతో ప్రేమను సృష్టించడం ప్రజలను కొత్త సంస్కారంవైపు ఆకర్షించటానికి సరియైన మార్గము కాదు. గురజాడ అప్పారావు గారివలె (కన్యాశుల్కంలో గిరీశం) క్రొత్తపాత్రలను వాస్తవికంగా సృష్టించగలిగితే తమ ఆశయాన్ని నెరవేర్చుకునేవారు.

ఆంధ్రజాతీయ తిరుగుబాటు

మనం యిదివరకు పెట్టుబడిదారీ నాగరికతపై తిరుగుబాటు చూసాము. హిందూ జమీందారీ సంస్కారంపై తిరుగుబాటు చూశాము జాతీయోద్యమంలో వచ్చిన వెనుకచూపులను గమనించాము.

భారత జాతీయోద్యమంలో ముఖ్య భాగమైన గాంధీజీ పరిశ్రమలకు వ్యతిరేకత, హిందూస్థానీని జాతీయభాషగా తెలుగుదేశంలో విరివిగా ప్రచారం చేస్తూంది. పరిశ్రమలే పెంపొందని తెలుగుదేశంలో వాటిని వద్దని ప్రచారం చేయడం, చేతి పరిశ్రమలను పట్టణ [illegible] ఒక తిరుగుబాటుకు కారణమయింది. ఇది ముఖ్యంగా శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారి రచనలలో స్పష్టంగా కన్పించుతుంది.

శాస్త్రిగారు కథలు, నాటకాలు, నవలలు వ్రాసారు. వీరి రచనలలో తెలుగుదనం వుట్టిపడుతుంది. సంభాషణలు (కొట్టవచ్చినట్లు) పదునుగా వుంటాయి. హిందీ తెలుగుకు అపచారం చేస్తూం

[illegible]
లేని తెలుగుదేశస్థులు ఆమాటలను వల్లించడం ఘోరమనీ; ఉత్తరదేశవాసుల వేషభాషలు మనవాళ్లు అనుకరించడం వల్ల తెనుగుతనానికి, ఆంధ్రజాతీయతకు నష్టంవాటిల్లుతూందని వీరు ఎలుగెత్తి చాటుతున్నారు. సంఘసంస్కార ఆశయాలతో వితంతువులకష్టాలనుగురించిన కథలను శాస్త్రిగారు మొదట్లో వ్రాసారు. ఆంధ్ర జాతీయవాదం భుజానవేసికున్నాక శాస్త్రిగారు మన ప్రాచీన కళలను రక్షించాలనే ఆవేశంలో వేశ్యావాటికలను సమర్థించే స్థితికి దిగజారారు. అందుచే శాస్త్రిగారి రచనలలో గాంధీజంలోని లోటులను సూచించినా, ఆంధ్రజాతీయ అహంకారంకూడ ప్రస్ఫుటమవుతుంది.

విశ్వనాథ సత్యనారాయణగారు నూతన సాహిత్యరూపా లన్నిటిలోను రచనలు సాగించారు పాటలు పద్యాలు. కథలు, నవలలు వ్రాయడంలో చేయి తిరిగిన దిట్ట. కాని ఆధునిక సాహిత్య రూపాలన్నిటినీ విశ్వనాథసత్యనారాయణగారు వెనుకచూపుకే వినియోగించారు. 'వేయిపడగలు' అనే నవలలో వర్ణాశ్రమ ధర్మాలను జమీందారీ సమాజాన్ని, పునః ప్రతిష్ఠించాలనే భావం ద్యోతకమవుతుంది. వీరేశలింగంగారు మొదలుకొని ఆంధ్రజాతి సాధించిన అభివృద్ధి ఉన్నత సంస్కారంకాదు ; పూర్వమే ' ఔన్నత్యంగా వుండేవారమంటారు. పాశ్చాత్య నాగరికతకు అలవాటుపడి చెడుతున్నామంటారు. ఆధునిక నాగరికత సరి

[illegible]
పరిశీలనాదృష్టితో చూస్తే వీరు మన నాగరికతను కరుడుగట్టిన జమీందారీ పంథావైపు తీసుకుపోవాలని కోరుతున్నారనీ తేటతెల్ల మవుతుంది. హిందూ జాతీయ దురహంకారం ప్రస్ఫుటమవుతుంది.

నవ్యసాహిత్య పరిషత్తు

నవ్యసాహిత్య పరిషత్తువారు వ్యావహారిక భాషావాదాన్ని ప్రచారంచేశారు. వ్యావహారికభాషలో రచనలు సాగించే వారికి ప్రోత్సాహ మిచ్చారు. భాషను ప్రజల దగ్గరకు తీసుకుపోవడానికి కృషి చేసారు.

భావకవిత్వం (లిరిక్ పొయిట్రీ) లో కొన్ని కావ్యాలు వచ్చాయి. మధ్య తరగతి ప్రజాజీవితాన్ని ఆధారం చేసుకొని కథావాఙ్మయం వచ్చింది. దువ్వూరి రామిరెడ్డిగారి 'కృషీవలుడు' 'కర్షకుడు' అనే కావ్యాలలో రైతుల జీవితాన్ని చిత్రించారు. నండూరి సుబ్బారావుగారి "ఎంకిపాటలు" కూడ మధురంగా వ్రాయబడిన పాటలు. కాని వీటిలో పల్లెటూళ్ళనుపాడిపంటలతోవర్ధిల్లేస్వర్గంగాను రైతులను శాంతిసుఖా లనుభవించేవారిగాను చిత్రించారు అంతేగాని రైతుల కష్టనిష్ఠురాలను, పల్లెలలోని ఇబ్బందులను సహజంగా చిత్రించలేదు బస్తీల గందరగోళంతో బాధపడేవాడు చిత్రించుకునే వూహించుకునే భ్రమలేగాని వాస్తవికచిత్రంకాదు. ఏమైనా రైతులజీవితాన్ని సామాన్యప్రజల జీవితాన్ని చిత్రించడానికి

జరిగిన మొదటి అభ్యుదయకరమైన ప్రయత్నాలు అవి. జాషువాగారి గబ్బిలము, స్వప్నకథ, కాందిశీకుడు అనే కావ్యాలు కూడ అభ్యుదయకరమైన రచనలు.

జాతీయవాద యుగంలో ఆంధ్ర సాహిత్యరంగంలో ఒకముఖ్యమైన బలహీనత కన్పించుతుంది ఈ యుగంలో పరిశ్రమలు, ఆర్థిక జీవితం కుంటుపడ్డాయని చెప్పాను. సాహిత్యరంగంలోకూడ పుస్తక ప్రకటన అమ్మకం విషయమై చెప్పుకోతగ్గ నిర్మాణాత్మకమైన కృషి జరుగలేదు. అంతకు పూర్వపుయుగం వారైన వీరేశలింగం, చిలకమర్తి, విజ్ఞాన చంద్రిక వగైరా పుస్తకాలు వేలకొలది అచ్చు అయ్యేవి. ఖర్చు అయ్యేవి. రచయితలకు భుక్తిగడిచేది. ఆదరణ వుండేది. జాతీయవాదయుగంలో ఆంధ్ర సాహిత్యరంగంలో యిది పూర్తిగా దెబ్బతిందె. వెయ్యిపుస్తకాలు అచ్చువేసి అమ్ముకోగలిగితే గొప్పవిశేషం. రచయితలు భుక్తికే అవస్థలు పడేస్థితిలో వున్నారు. సాహిత్యం ప్రజాసామాన్యంలోకి విరివిగా వెళ్ళలేదు. దీనికి కొంత బాధ్యత కవులపై కూడ ఉంది. తమ రచనలను దర్జాగా అచ్చువేసి హెచ్చు ఖరీదులు పెడితేగాని అవి విలువైనవని ఎంచరనే భ్రమ వారికుంది. అందువలన రచయిత ఏమీ సంపాదించనూలేదు. రచనలు ప్రజాసామాన్యంలోకి విరివిగా ప్రాకనూలేదు

జాతీయవాదయుగంలో మన సాహిత్యంలో యింకో వెలితికూడ కన్పించుతుంది. ఆంధ్రప్రజాజీవితాన్ని సహజంగాను, వాస్తవికదృష్టితోను చిత్రించే నవలలు ఆగినన్ని రాలేదు. దీనివల్లనే పునర్వికాసయుగానికి, ప్రజాయుగానికి మధ్య మన సాహిత్యంలో పెద్ద అఖాతం కనబడుతుంది.

ఉదాహరణకు బెంగాలీ, హిందీ సాహిత్యాలను పరికించండి. టాగోరు తరువాత జాతీయవాద యుగంలో శరశ్చంద్రఛటర్జీ, బుద్ధదేవబోసు మొదలైనవారు బెంగాలీ సాహిత్యాన్ని ఎంతో ముందుకు తీసుకుపోయారు. ప్రేమచంద్ మొదలైనవారు హిందీసాహిత్యాన్ని యెంతో ముందుకు తీసుకుపోయారు. ఆవిధంగా వారు రాబోవు ప్రజాయుగానికి బలమైన పునాదులు వేశారు. అలాంటి పునాదులు ఆంధ్రసాహిత్య రంగంలో మనకు కన్పించవు. ఆంధ్రదేశంలో ఆర్థిక జీవితంలో వచ్చిన లోటే ఆంధ్రసాహిత్య రంగంలోకూడ ప్రతిబింబించింది.

ప్రజాయుగం

1930 - 35 మధ్యకాలం ప్రపంచమంతా ఆర్థిక సంక్షోభం ఆవరించింది. మొదటి ప్రపంచసంగ్రామంలో పెట్టుబడిదారీ నాగరికతపై విశ్వాసం సడలిందని చెప్పాను. ఈ ఆర్థికసంక్షోభంలో ఈ నాగరికతపైవి నమ్మకమే పోయింది. ఆర్థికసంక్షోభం, నిరుద్యోగసమస్య లేని సోషలిస్టు ప్రపంచం (సోవియట్ యూనియన్) వైపు ప్రజలంతా చూడసాగారు.

మన ఆంధ్రదేశంలో 1930 - 33 శాసనోల్లంఘనోద్యమం విఫలమయింది. సత్యాగ్రహులుగా జైళ్ళకు పోయిన యువకులకు ఉత్తరదేశ విప్లవకారు

లతో సంబంధాలేర్పడ్డాయి. మార్క్సు లెనిన్ రచనలను యూరోపియన్ ప్రజా సాహిత్యాన్ని - గోర్కీ క్రిపాట్కిన్, జోలా, హ్యూగో, డస్టవోస్కీ మొద లైనవారి రచనలను - చదివారు సోష లిస్టుభావాలతో బయటికి వచ్చారు. రైతు కూలీ ప్రజాపుద్యమాల నిర్మాణానికి పూనుకున్నారు.

వీటి ప్రాబల్యం మన రచయితలపై ప్రతిబింబించింది. శ్రీ రంగం శ్రీని వాసరావుగారు తన "మరో ప్రపంచం" గీతంతో ప్రజాసాహిత్యానికి నాందీ ప్రస్తావన చేశారు:

"మరోప్రపంచం, మరోప్రపంచం
మరోప్రపంచం పిలిచింది....
పదండి పోదాం వినబడలేదా
మరో ప్రపంచపు జలపాతం ?
కనపడలేదా మరో ప్రపంచపు
కణకణ మండే త్రేతాగ్ని ?
ఎగిరి ఎగిరి పడుతున్నవి
ఎనభై లక్షల మేరువులు
తిరిగి తిరిగి తిరిగి సముద్రాల్
జలప్రళయ నాట్యం చేస్తున్నవి.
"సలసల కాగే చమురా ? కాదిది,
ఉష్ణరక్త కాసారం
శివసముద్రమూ నయాగరావలె
ఉరకండీ, ఉరకండీ ముందుకు!....

— మరో ప్రపంచం

బ్రతుకు కాలి పనికి మాలి
శనిదేవత రథ చక్రపు
టిరుసులలో బడి నలిగిన
దీనులారా ! హీనులారా !
కూడులేని గూడులేని
పక్షులార ! భిక్షులార !....
హతాశులై
ఏడువ కండేడువకండి !
మీరక్తం కలగి కలగి
మీ నాడులు కదలి కదలి
మీ ప్రేగులు కనలి కనలి....
ఏడువ కండేడువకండి !
వస్తున్నా యొస్తున్నాయి
జగన్నాథ రథ చక్రా
లొస్తున్నా యొస్తున్నాయి ...
సింహాచలం హిమాచలం
వింధ్యాచలం సంధ్యాచలం
మహానగా లెగురుతున్నాయి!
మహాంధం కదలుతున్నది!
"అదివిలయం
అదిసమరం
అటో ఇటో తెగిపోతుంది!....
"స్వాతంత్ర్యం, సమభావం
సౌభ్రాత్రం, సౌహార్దం
పునాదులై యిళ్ళులేచి
జనావళికి శుభంపూచి
శాంతి శాంతి శాంతి శాంతి
జగమంతా జయిస్తుంది

— జగన్నాథ రథచక్రాలు

వాసిరెడ్డి నాగేశ్వరరావు అను రైల్వే కార్మికునిచే వ్రాయబడిన "కూలోడ" పాట కష్టజీవులందరిని ఉత్తేజపరచింది. అలాగే శెట్టిపల్లి వెంకటరత్నంగారి "ఆగునాజీవాలు సాగునాలోకాలు" గరి మెళ్ళ సత్యనారాయణగారి "అన్యాయ కాలంబు దాపురించిందిపుడు అందరము మేలుకోవాలండి" లోకనాథంగారి "రైతు కూలీలేకమైతే కూటికీ తరుగేమిరా" రైతాంగాన్ని మేల్కొలిపాయి.

ప్రజాపుద్యమాలనుంచి ఉత్సాహం

పొందిన అనేకమంది యువకరచయితలు ముందుకు వస్తున్నారు. ప్రజల కష్టనిష్ఠురాలను తెలుపుతూ గీతాలు, గేయాలు వ్రాస్తున్నారు. ప్రజలు వాటిని విరివిగా చదువుతున్నారు. పుస్తకప్రచురణకూడ మరల క్రమంగా ఎక్కువయే సూచనలు కనబడుతున్నాయి.

1939 లో రెండవప్రపంచయుద్ధం ప్రారంభమయింది. ప్రపంచానికి ఫాసిస్టు ప్రమాదం వచ్చింది. జపానువాళ్లు మన దేశంలో విశాఖపట్నం, కాకినాడలపై బాంబులు వేశారు. బెంగాలు కరువు వార్తలు, రాయలసీమ, విశాఖకరువు దృశ్యాలు ప్రజాసేవకుల హృదయాలను కరిగించాయి. గేయాలు, పాటలు నాటకాలు వగైరా బయలు దేరాయి. ప్రాచీన ఆంధ్ర కళారూపాలన్నిటిని పునరుద్ధరించడానికి ప్రయత్నాలు జరిగాయి. నామమాత్రంగావున్న బుర్రకథలు, జముకలకథ, వీధి భాగోతాలను పునరుద్ధరించారు. ప్రస్తుత సమస్యలను తీసికొని రచన సాగుతూంది. గాయకులు, వైజ్ఞానిక దళాలు వీటిని ప్రజలకు ప్రదర్శించుతున్నారు. వీటినిచూచి లక్షల కొలది తెలుగుప్రజలు ఉత్తేజం పొందుతున్నారు. కొనకళ్ళ వెంకటరత్నం, నాజర్, సుంకర సత్యనారాయణ, కోగంటి గోపాలకృష్ణయ్య మొదలైన వారు వ్రాసిన రచనలను ప్రదర్శనాలను మీరుకూడచూచి ఆనందించివుంటారు. వీరి రచనలకు కొన్ని ఉదాహరణలు చూడండి

"తొలికొబ్బు మెరసెరా తొలికరికురిసెరా
దుక్కులు దున్న వేమిరా? రైతా, రైతా!
నడుము బిగించరా నాగలిపట్టరా
సాగును మొదలుపెట్టరా! రైతా, రైతా!"

— కోగంటి

కరువు వచ్చింది. గ్రామ జీవితం విచ్ఛిన్నమయిపోయింది. తమ ఇళ్ళనూ వాకిళ్ళనూ విడిచి, కుటుంబాలకు కుటుంబాలు తిండికోసం పట్నాలకెగబ్రాకారు. ఈ దృశ్యాన్ని కవిఎలా వర్ణిస్తున్నాడో చూడండి.

"వెళ్ళిపోదామా? మామా
వెళ్ళిపోదమ పట్నవాసపు
కుళ్లవీధుల లోబడి-
ఈన మోపైవున్న పైరులు
ఏటి ముక్కల పాలుజేసి
కొంప గోడీ విడిచి పట్టెడు
కూటికై వూరేగవలెరా....
ఒడలు పెంచిన గడ్డమీదే
ఒరిగిపొమ్మే రాతలేదో!
ఊరుగానీ ఊరులో ఛితి
పేర్చుకొమ్మని నుదుటివ్రాలో!

— కొనకళ్ళ వెంకటరత్నం.

ఈనాడు మన ప్రజల కర్తవ్యాన్ని గురించి కవి చేస్తున్న ప్రబోధం చూడండి:

"చేయెత్తి జైకొట్టు తెలుగోడా!
గతమెంతొ ఘనకీర్తి గలవోడా!
సాటిలేనిజాతి ఓటమెరుగనిజాతి
నివురుగప్పి వేడు నిదురపోతుండాది
జైకొట్టి మేల్కొల్పు తెలుగోడా!
గతమెంతొ ఘనకీర్తి గలవోడా!"

— శ్రీకృష్ణ

కవి ప్రకృతిలో లీనమైపోతున్నాడు. ప్రకృతి కూడా ప్రజాసేవ చేస్తున్నది. చూడండి పంటచేను రైతుతో చెబుతుంది:

"పచ్చ పచ్చగ పెరిగి పండి ఒరిగున్నాను
ప్రజను నన్నందించ రావా, ఓ రైతు,
ప్రళయమౌ కరువాపలేవా?"

——సుంకర

పూర్వకాలంలో పండితుడు పురాణాన్నిచదివి అర్థంచెప్పి ప్రజాసామాన్యానికి విజ్ఞానాన్ని ఎలా అందజేసేవారో, అలా ఇపుడు నాజర్, గోపాలం, రాధాకృష్ణమూర్తిలాంటికళోపాసకులు ప్రదర్శనలద్వారా ప్రజలకు సాహిత్యాన్ని అందజేస్తున్నారు.

ప్రజావుద్యమాలనుంచి వచ్చిన రచయితలకున్న విజ్ఞానం కొద్దిపాటిది. యువకరచయితలు వ్రాస్తున్నవాటిలో వున్న లోపాలను దిద్దటానికి అనుభవజ్ఞులు సాయంచేయాలి. ప్రజాజీవితాన్ని చిత్రించే గేయాలను, బుర్రకథలను, హరికథలను వ్రాయండి. వాటిని ప్రదర్శనాలద్వారా ప్రజలలోకి తీసుకుపోయి ప్రజావిజ్ఞానాన్ని అభివృద్ధిచేసే బాధ్యత కళోపాసకులది.

తెలుగు ప్రజలలో నూటికి 15 మంది మాత్రమే నేటికీ చదవగలరు. రాయలసీమలోనూ, తెలంగాణాలోనూ యింకా వెనుకబడివున్నారు ఇంకా ప్రజలలో కుల మత భేదాలు, మూఢవిశ్వాసాలు వున్నాయి. నవ్యాంధ్రజాతీయ వికాసానికి మూలపురుషులయిన వీరేశలింగంగారు తమఅంతిమ సందేశంలోయిలాకోరారు. "అజ్ఞానంలో, అమాయకత్వంలో జీవిత సంస్కారంలేని ప్రజా సామాన్యానికి విద్య, విజ్ఞానం, సమానత్వం, సంస్కారము కలిగించడానికి కృషిచేయాలని కోరుతున్నాను"అన్నారు. ఇదే మన అందరి ఆశయం అందుకొరకు రచయితలు మేధావులు అందరూకృషిచేసి నూతనాంధ్రజాతిని, జాతీయ సంస్కృతిని పెంపొందించాలి.

ఆంధ్ర ప్రజాజీవితాన్ని వాస్తవిక దృష్టితో చిత్రించే నవలలు తగినన్ని మనకులేవు. అభ్యుదయ రచయితలు అందుకు కృషిచేయాలి

అ ధి వా స్త వి క త

క్రిందటి యుద్ధానంతరం వచ్చిన అరాచకపోకడలలో సర్రియలిజం ఒకటని యిదివరకే చెప్పాను సర్రియలిస్టులు పెట్టుబడిదారీ నాగరికతపై ఏవగింపువల్ల పూర్వ నియమాలన్నిటినీ తోసివేసారు. యూరపులో వీరు ఏ నియమాలూ లేని బ్లాంక్‌వర్సు వ్రాయసాగారు. తమకు తోచిన భావాలను ఒక క్రమంలో వుంచడానికి కూడ ప్రయత్నించక పోవడమే అధివాస్తవికతని వీరి వాదన.

తెలుగుదేశంలో శ్రీరంగం శ్రీనివాసరావు, నారాయణబాబుగార్లు అధివాస్తవిక రచనలు సాగించారు, కాని యివి ప్రజామోదాన్ని పొందడం లేదు. "మరో ప్రపంచం" లాంటి శ్రీ శ్రీ గేయాలను మెచ్చుకున్న ప్రజలే ఆ శ్రీ శ్రీ వ్రాసిన అధివాస్తవిక రచనలను మెచ్చుకోడం లేదు. వాటి భావాలేమిటో నాకు కూడ బోధపడలేదు.

అధివాస్తకవిత పేరుతో మళ్ళీ భావరహితమైన శబ్దాడంబరం కొంత ప్రయత్నాలు — డ్రిల్లు — జరుగుతున్నాయి. ఉదాహరణకు చూడండి —

తురాయికంటే
ఆకురాయికంటే
కీచురాయికంటే
హిమాంశురాయి గొప్పవాడు.

మన మనస్సులో అనేక ఆలోచనలు పుడుతుంటాయి. వాటికొక క్రమముండదు; నియమంగానూ ఉండవు. కాని మనము ఆ భావాలను బయటికిచెప్పము. మాట్లాడవలసి వస్తేనే, మన ఆలోచనలను క్రమపద్ధతిలో పెడతాము. వ్రాయవలసివస్తే యింకా బాగా సరిదిద్దుకుంటాము. బుర్రలోకి వచ్చిన ఆలోచనలన్నిటినీ మాట్లాడినా వ్రాసినా మతిపోయిందని ఆక్షేపించుతారు

అల్లాగే అధివాస్తవిక రచయితలు కూడ తమ భావాలను ఒక క్రమపద్ధతిని సంస్కరించుకోవాలి. పాత నియమాలు పనికిరావనుకుంటే గురజాడ అప్పారావుగారు 'ముత్యాల సరాలు' అను కొత్త మాత్రా ఛందస్సును సృష్టించుకొన్నట్లే వారుకూడ తాము కొత్తరకపు నియమాలను, రైమ్సు సృష్టించుకోవచ్చు. ఉదాహరణకు :— యూరపులో మొదట్లో సర్రియలిస్టులు బ్లాంకు వర్సులో మాత్రమే రాసేవారు. లిరిక్ పొయిట్రీ రాయడంకూడ సంకెళ్ళకు కట్టుబడటమే అనుకునేవారు. కాని వారిలో చాలమంది ఫాసిస్టు వ్యతిరేక పోరాటంలో ప్రజలను ఉద్బోధించవలసి వచ్చేటప్పటికి లిరిక్స్ రాయవలసి వచ్చింది. పాతఅభిప్రాయాలను మార్చుకొని గేయాలను రాస్తున్నారు. మన తెలుగుదేశంలోని సర్రియలిస్టు మిత్రులు కూడ అనుభవాన్నిబట్టి ప్రజామోదాన్ని పొందే రచనలకు పూనుకుంటారని ఆశించుతాను.

★

రహస్యము

బహుదేశ మత మహాపరిషత్తు తలయూచ - పలికివచ్చినది మా భరతసుతుడు
కండెబొట్టున నైదు ఖండాలనోడించి - కొలువులందినది మా కోమటన్న
సీమలో నాచార్య సింహపీఠికమీద - నిలచివచ్చినది మా తెలుగువాడు
విశ్వసన్మానంబు వెలయు నోబెలుకీర్తి - రంగమెక్కినది మా వంగసుకవి
చెట్టుచేమల సుఖ దుఃఖ జీవితములు - నిజముదేల్చినవాడు మా నేలవాడు
నన్ను దొలగించి లెక్కించినారుగాని - మొదట నెల్లర మన్నదమ్ములము మేము.

— జి. జాషువ



ఆంధ్ర సాహిత్య పాఠశాలా విద్యార్థులు

ఆంధ్ర సాహిత్య పాఠశాల

(మా ప్రత్యేక విలేఖరి)

ఈయేటికి ఆంధ్రసాహిత్య పాఠశాల పూర్తిఅయింది. చడీచప్పుడూ లేకుండా మారుమూల పెదపూడిలో ఒక మహా వృక్షానికి బీజం నాటబడింది.

"ఆంధ్ర సాహిత్యచరిత్రలో అసలిది స్వర్ణాక్షరాలతో లిఖించదగిన విషయం" అన్నారు శ్రీ నిడదనోలు వెంకటరావు గారు.

"వెనకటి గురుకులాలలో ఉండే కొన్నిలోపాలు లేకుండా తిరిగి ఈనాటికి మళ్ళీ గురుకులం ఒకటి స్థాపితమయింది" అన్నారు శ్రీ కోరాడ రామ కృష్ణయ్యగారు.

"ఎంతోకాలంకూడా అవసరంలేదు. మరి రెండుమూడు సంవత్సరాలకల్లా ఈపాఠశాల ప్రజా విశ్వ విద్యాలయం అయిపోతుంది"అని చెప్పారు శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మగారు.

శ్రీ చిలుకూరి నారాయణరావుగారు కూడా పైపెద్దల విశ్వాసాలను బలపరిచారు.

పాఠశాల నిర్వాహకులను ప్రోత్సహించటానికి అన్నముక్కలు కావివి; పాఠశాల నెలరోజులూ జరిగినాక, ఫలితాలను చూసి చెప్పినజోస్యం ముక్కలు.

ఏమిటీ ఫలితాలు ?

పాఠశాలకు విద్యార్థులుగా వచ్చిన వారిలో ఎంతోకాలంగా రచనలు చేస్తున్న వారున్నారు. వయోవృద్ధులున్నారు. పదివేలమందిఎదట బుర్రకథలూ, భాగోతాలూ, మొదలైన కళాప్రదర్శనాలు నెరపుతూన్న వారున్నారు. శిరోమణి, విద్వాన్, భాషాప్రవీణ మొదలైన డిగ్రీలు పొందినవారున్నారు.

పాఠశాల ఈ యాభైమంది విద్యార్థులకు డిగ్రీల ఆశపెట్టలేదు. ఉపాధ్యాయుల జాబితాచూసి ముచ్చటపడి, ఈ ఉత్తమ సంస్కారులమీది ప్రేమాభిమానాలతో, వారి సహవాసంకోరి వచ్చారు. ఇదే పాఠశాలకు పదిహేను వీసాలు విజయం.

ఆవిధంగానే ఉపాధ్యాయులుకూడా, అనేక సంవత్సరాల కృషిఫలితాలను ఆస్థతో స్వీకరించేవారికి అందచేద్దామనే ప్రేమతో వచ్చారు.

ఈ సమ్మేళనంలోనుంచి ఉపాధ్యాయులూ, విద్యార్థులూకూడా ఊహించనిశక్తి పుట్టుకొచ్చింది. ఎవరోఅన్నట్టు ఇటువంటి విద్యార్థులను ఈ ఉపాధ్యాయులూ, ఇటువంటి ఉపాధ్యాయులను ఈ విద్యార్థులూ, ఎన్నడూ చూసివుండలేదు.

ఈ ఉపాధ్యాయులనూ, ఈ విద్యార్థులను కలిపినఘనత చదలవాడపిచ్చయ్యాది పిచ్చయ్య ఉద్దండుడు. ఎవరి సహకారంఉన్నా లేకపోయినా, కర్తవ్యమని

తోచినపనిని చెయ్యటానికి అష్టకష్టాలూ పడటానికి తయారయే శతమొండిజాతికి చెందినవ్యక్తి. తలపెట్టినపని విజయవంతమవుతుందనే మూఢవిశ్వాసము పిచ్చయ్యలో ఉన్నంతగా మరెవరిలోను చూడం. పిచ్చయ్య నా అనుచరుడు అందుచేత ఆపే తిట్టరాదు.

ఈపారశాల నడపటంవల్ల ప్రత్యక్ష ఫలితాలుకూడా గమనించదగ్గవే. నెల రోజులూ పెదపూడిలో ఒక పెళ్ళి జరుగుతున్నట్టుగాఉంది ఊళ్ళోవాళ్ళకి. పారం జరుగుతున్న సమయంలో విద్యార్థులుగాక పది పదిహేనుగురు ఊళ్ళోవాళ్ళు కూడా ఉంటూవచ్చారు. ప్రతిఉదయం విద్యార్థులుచేసే నగర సంకీర్తనపాటలు పట్టుకొని ఊళ్ళోకుర్రాళ్లు "దేశమంటే మట్టికాదోయ్, దేశమంటే మనుషులోయ్"అనీ, "చుక్కానిపట్టరా తెలుగోడా, నావదరిజేర్చరా మొనగాడా"అనీ పాడటం నేర్చుకొన్నారు. విద్యార్థులు తేనెటీగల్లాగా పనిచేశారు. నగరసంకీర్తనమూ, స్నానపానాలూ, ఆరుగంటలు పాఠాలూ, రెండుగంటలు గోష్ఠి, జరుపుతూకూడా వ్రాతపత్రికలు నడిపారు. పార్లమెంటు కార్యక్రమం జరిపారు. కళాప్రదర్శనాలు నడిపారు. ఈనూతనోత్సాహఫలితంగా విద్యార్థులలో కొత్తగా రచనలు ప్రారంభించిన వారున్నారు. గోఖలే సహకారంతో చిత్రలేఖనం ప్రారంభించిన వాళ్ళున్నారు. కళాప్రదర్శనాలకు కాకిచేత కబురుపంపితే మూడు నాలుగువేల ప్రజపోగయింది. ఒకనాటి ప్రదర్శనం మధ్య వానవస్తే కొద్దిమంది లేచేసరికి "కూర్చోండి, కూర్చోండి"అని కేకలు. పిడుగులుపడినా ఆగని ఉత్సాహము వానచినుకులకు చల్లారుతుందా?

పారశాల నిర్వహణంలో లోపాలు జరిగినై. వస్తామన్న ఉపాధ్యాయులు కొద్దిమంది రాలేదు. వచ్చినవారుకూడా అనుకున్ననాటికి రాలేదు. పారశాలానిర్వహణంలో కలిగిన ఈలోపాలను విద్యార్థులు శ్వేచ్ఛగా విమర్శించారు. తమ లోపాలను నిర్వాహకులూ, ఉపాధ్యాయులూ మనస్ఫూర్తిగా ఆమోదించారు. భావిపారశాలాభివృద్ధికి ఇది ఉత్తమోత్తమచిహ్నం.

పారశాల ఏర్పరచిన ఉపన్యాస ప్రణాళికగురించిఒకముక్క. భాషాచరిత్రా, వాఙ్మయచరిత్రా, సాహిత్యంలో కొత్త పోకడలూ, అలంకార శాస్త్రాలు, రసవాదమూ,ధ్వనివాదమూ మొదలైనవన్నీ తెలుసుకోవటంవల్ల విద్యార్థులకు కలిగిన మేలేమిటి? సామాన్య సంస్కారంగలవారే పట్టించుకోని ఈ విషయాలను గురించి ఈవిద్యార్థులెందుకింత శ్రద్ధతో వినగలిగారు?

దానికి కారణంఉంది. ఈ విద్యార్థులందరూ సాహిత్యపరిచయం అభిలషించినవారు. ఒకరచయితతో పరిచయం చేసుకోవాలంటేనే ఆరచయిత రాసిన గ్రంథాలక్రమం తెలియకపోతే, రచయితయొక్క పరిణామం తెలియదు ఆవిధంగానే అతనికాలపుచరిత్రా. అతనిసాంప్రదాయాలూ తెలియకపోతే, అతనిసందేశముకూడా తెలియదు. భాషకూ, సాహిత్యానికీ, జాతికీచెందిన చరిత్రా, ఆ యా దశలలో మారుతూవచ్చిన సాహిత్య సాంప్రదాయాలూ, తెలియకపోబట్టే ఈ

విద్యార్థులకూ పూర్వసాహిత్యంతో బాంధవ్యం ఏర్పడకపోయింది. కేవలమూ గ్రంథాలయంలో కూర్చొని సాహితీపరనముచేసేవాడు, దేశపటం చూడకుండా రైలెక్కి వివిధస్థలాలు తీర్థయాత్రచేసేవాడిమాదిరిగా ఉంటాడు. ఈపాఠశాల ఈకొరతను చక్కగా తీర్చింది.

శ్రీ సోమశేఖర శర్మగారు చెప్పినట్లు మరో కొద్దిసంవత్సరాల కాలంలో ఈ పాఠశాల సాహిత్యంతాలూకు జాగ్రఫీ విద్యార్థులకందించటానికీ, వివిధస్వరూపాల సాహిత్యం సృష్టించటంలో మెళకువలు విద్యార్థులకు తెలియజెప్పటానికీ చక్కని కార్యక్రమం తయారుచేసి, దేశములోఉండే ఉత్తమ పరిశోధకుల విమర్శకుల సంపూర్ణ సహకారం పొంది యువక రచయితలకు అమూల్యమైన సేవ చేయగలుగుతుంది.

పాఠశాల కార్యవర్గానికీ, ప్రత్యేకించి కార్యదర్శికీ పైసంవత్సరంనుంచీ ఇతోధికమైన సహకారం పండితులనుంచీ, ఆంధ్ర ప్రజనుంచీ లభిస్తుందనటానికి సందేహంలేదు.

★

"బోధకులు తమ జీవితాలను సాహిత్యరంగాని కంకితంచేసి, తమ విజ్ఞానాన్ని ప్రజల కందించాలనే తహతహ గలవారగుటచే ఎంతోశ్రద్ధగా బోధించారు.

"నా అభివృద్ధికి ఈ పాఠశాల ఎంతైనా తోడ్పడింది. ఎన్నో క్రొత్తవిషయాలు నేర్పింది."

నాజరు
("బెంగాల్ కరువు" "పల్నాటియుద్ధం"
రచయిత, సుప్రసిద్ధ గాయకులు)

★

"ఎందరో వ్యక్తులు ఒకచోటికి సమీకరింపబడటంవల్ల నూతన పరిచయాలు అనుభవాలూ కలిగినవి. ఇప్పుడు నే ననుభవ సంపన్నుడనైనాను ...

"సాహిత్యంలో ప్రతివ్యక్తికీ అభినివేశం కలిగించటానికై ఏర్పడిన యిట్టి ప్రజావిద్యాలయాన్ని ఆంధ్రచరిత్ర ఇంతవరకు ఎరగదు.

శ్రీరాం వేంకట భుజంగరాయశర్మ
(బి. ఏ. ఆనర్సు విద్యార్థి, ఆంధ్ర విశ్వవిద్యాలయం)

బూరె ముక్కలు

శ్రీ తెన్నేటి సూరి

ఆ పసిబిడ్డ బక్కపలచగా ఎఱ్ఱగా తేలల్లే వున్నాడు. చిన్ని చిన్ని రాగి వెంట్రుకలు చిరుగాలికి కొసలు రేగి కొంచెం పెంకెతనంగా కనుపించుతున్నాడు. సన్నని ఆ మెళ్ళో, జెఱ్ఱిపోతులా, ఒక బంగారు నానుతాడూ, దాని చివర ఒక పులిగోళ్ళ పతకం వ్రేలాడుతున్నయ్. దిగంబరి. ఉండీలేనట్లున్న ఆ చిట్టి చిట్టి పిరుదుల మీదికి, జారి జారి పోకుంటూ, మొలచుట్టూ, ఒక బంగారు గజ్జల మొలత్రాడు.

తొందర తొందరగా నడవాలనే ఉత్సాహమంతా తడబడుతున్న ఆ తప్పటడుగుల్లో కనుపించుతూనే ఉంది. ఆలంబనంకోసం అనసాగిన లేత బచ్చల తీగెలా, ఆ సన్నటి, యెఱ్ఱటి చెయ్యిచాచి, మునివ్రేళ్ళ చివరలతో ఆ స్త్రీ కుడి భుజాన్ని అంచుకో బోతున్నాడు. ఆ ముంజేతిచివర ఆ చెయ్యి మొయ్యలేనంత బరువుగా, ఒక బంగారు పలకల గాజు, వదులై, జంగిడంలా వ్రేలాడుతోంది.

ముసి ముసి నవ్వుల 'సన్నజాజులు' మోవికొసలలో, మోసులెత్తుతున్నయ్. ఆ స్త్రీ భుజంమీద మునివ్రేళ్ళాని, వారగా తల వంచి, ఆ స్త్రీ ముఖంలోకి తొంగిచూచాడు చిరునవ్వుతో. ఆ బిడ్డను ఒళ్ళోకి ఆహ్వానించింది ఆ స్త్రీ. అడ్డాలలో పడుకో బెట్టుకుని రొమ్ము నోటికందించి పైటచెంగు కొంచెంగా కప్పింది ఆ స్త్రీ ముంజేతులమీదుగా రెండు మీగాళ్ళూ జారవేసి, ఒకలయలో ఊపుతూ ఒళ్లుమరచి పాలు త్రాగుతున్నాడు ఆ బిడ్డ. కాళ్ళకు కట్టివున్న వెండి గజ్జలజత, ఒకదానికొకటి కొట్టుకొని, 'జగ్-జగ్-జగ్' మంటున్నయ్. ఆ బిడ్డ త్రాగుతున్న స్తన్యం రక్తముగామారి, పాదాలకువ్యాపిస్తున్నట్లు పాదాలు తామర రేకులల్లే కెంపులు దేరుతున్నయ్.

ఆ స్త్రీ చామనఛాయ వర్ణంలో కొంచెం భారీ మనిషి. బలిష్టమైన అవయవాలు. నాజూకుతనం కోరకపోతే ఆరోగ్యంతో కండలు తేరిన అందమైన చెక్కిళ్ళు. వెను మాసిన ఆ 20 నెంబరు నేతచీరా, వెలిసి, బూడిదైపోయిన, ఆ ఎఱ్ఱ బొంబాయి రవికా, ఆ తల్లి పేదరికాన్ని దాచలేకుండా వున్నయ్. ఆ ముఖం—అందంమాట ఎలావున్నా—చాలా ప్రశాంతం. చిరునవ్వులు ముఖాన్ని ఎప్పుడూ ఆవరించుకొనేవుంటయ్. చాలా మితభాషిణి. ఎప్పుడూ మాట్లాడినట్టే ఉండదు! అథవా యెప్పుడైనా పెదవి కదిపితే, ముసి ముసి నవ్వులు ముందు జారిపడిగాని పలుకులు బయటికి రాలేవు

పండు తమలపాకుల పసిడి చెక్కిళ్ళతో పసిడి పువ్వుల యెఱ్ఱ బనారసు చీరకట్టుకొని మరొక ఇల్లాలు అక్కడకువచ్చి ఆగింది. తెలుగు జాతిలో ఆవిడ చాలా అందకత్తెననాలి ఇరవైయైదు సంవత్సరాల పడుచు ప్రాయంలో బక్కపలచని నాజూకుమనిషి. పచ్చటి శరీరంమీద ఆ కాసుల బంగారపు నగలు, యెందుకూ కొరగాక వెలాతెలా బోతున్నయ్.

"సుబ్బలక్ష్మీ! తరిపిదూడలా ఇంకా వాడికి పాలేమిటి?— చేరనివ్వకూ — ఎన్నాళ్ళు పోయినా వాడలానే పీక్కుతింటూవుంటాడు. గూబమీద వెయ్యి వెధవని"... అన్నదావిడ.

సుబ్బలక్ష్మి, ఒక చిరునవ్వునవ్వి, నిర్లక్ష్యంగా, మెళ్ళోవున్న నల్లపూసలు సర్దుకుంటోంది.

బూరె ముక్కలు

శ్రీ తెన్నేటి సూరి

ఆ పసిబిడ్డ బక్కపలచగా ఎర్రగా తేలల్లే వున్నాడు. చిన్ని చిన్ని రాగి వెంట్రుకలు చిరుగాలికి కొనలు రేగి కొంచెం పెంకె తనంగా కనుపించుతున్నాడు. సన్నని ఆ మెళ్ళో, ఇత్రెపోతులా, ఒక బంగారు నాను తాడూ, దాని చివర ఒక పులిగోళ్ళ పతకం వ్రేలాడుతున్నయ్. దిగంబరి. ఉండీలేనట్లున్న ఆ చిట్టి చిట్టి పిరుదుల మీదికి, జారి జారి పోకుంటూ, మొలచుట్టూ, ఒక బంగారు గజ్జల మొలత్రాడు.

తొందర తొందరగా నడవాలనే ఉత్సాహ మంతా తడబడుతున్న ఆ తప్పటడుగుల్లో కనుపించుతూనేఉంది. ఆలంబనంకోసం అన సాగిన లేత బచ్చల తీగెలా, ఆ సన్నటి, యెర్రటి చెయ్యిచాచి, మునివ్రేళ్ళ చివరలతో ఆ స్త్రీ కుడి భుజాన్ని అందుకో బోతున్నాడు. ఆ ముంజేతిచివర ఆ చెయ్యి మొయ్యలేనంత బరువుగా, ఒక బంగారు పలకల గాజు, వదులై, జంగిడంలా వ్రేలాడుతోంది.

ముసి ముసి నవ్వుల 'సన్నజాజులు' మోవికొసలలో, మోసులెత్తుతున్నయ్. ఆ స్త్రీ భుజంమీద మునివ్రేళ్ళాని, వారగా తల వంచి, ఆ స్త్రీ ముఖంలోకి తొంగిచూచాడు చిరునవ్వుతో. ఆ బిడ్డను ఒళ్ళోకి ఆహ్వానించింది ఆ స్త్రీ. అడ్డాలలో పడుకో బెట్టుకుని రొమ్ము నోటికందించి పైటచెంగు కొంచెంగా కప్పింది ఆ స్త్రీ ముంజేతులమీదుగా రెండు మీగాళ్ళూ జారవేసి, ఒకలయలో ఊపుతూ ఒళ్లుమరచి పాలు త్రాగుతున్నాడు ఆ బిడ్డ. కాళ్ళకు కట్టివున్న వెండి గజ్జలజత, ఒకదాని కొకటి కొట్టుకొని, 'జిగ్-జిగ్-జిగ్' మంటున్నయ్. ఆ బిడ్డ త్రాగుతున్న స్తన్యం రక్తముగామారి, పాదాలకువ్యాపిస్తున్నట్టు పాదాలు తామర రేకులల్లే కెంపులు దేరుతున్నయ్.

ఆ స్త్రీ చామనఛాయ వర్ణంలో కొంచెం భారీ మనిషి. బలిష్టమైన అవయవాలు. నాజూకుతనం కోరకపోతే ఆరోగ్యంతో కండలు తేరిన అందమైన చెక్కిళ్ళు. వెనుమాసిన ఆ 20 నెంబరు నేతచీరా, వెలిసి, బూడిదైపోయిన, ఆ ఎర్ర బొంబాయి రవికా, ఆ తల్లి పేదరికాన్ని దాచలేకుండా వున్నయ్. ఆ ముఖం—అందంమాట ఎలావున్నా—చాలా ప్రశాంతం. చిరునవ్వులు ముఖాన్ని ఎప్పుడూ ఆవరించుకొనేవుంటయ్. చాలా మితభాషిణి. ఎప్పుడూ మాట్లాడినట్టే ఉండదు; అథవా యెప్పుడైనా పెదవి కదిపితే, ముసి ముసి నవ్వులు ముందు జారిపడిగాని పలుకులు బయటికి రాలేవు

పండు తములపాకుల పసిడి చెక్కిళ్ళతో పసిడి పువ్వుల యర్ర బనారసు చీర కట్టుకొని మరొక ఇల్లాలు అక్కడకువచ్చి ఆగింది. తెలుగు జాతిలో ఆవిడ చాలా అందకత్తె ననాలి ఇరవైయైదు సంవత్సరాల పడుచు ప్రాయంలో బక్కపలచని నాజూకుమనిషి. పచ్చటి శరీరంమీద ఆ కాసుల బంగారపు నగలు, యెందుకూ కొరగాక వెలాతెలా బోతున్నయ్.

"సుబ్బలక్ష్మీ! తరిపిదూడలా ఇంకా వాడికి పాలేమిటి ?— చేరనివ్వకూ — ఎన్నాళ్ళు పోయినా వాడలానే పీక్కుతింటూవుంటాడు. గూబమీద వెయ్యి వెధవని"... అన్నదావిడ.

సుబ్బలక్ష్మి. ఒక చిరునవ్వునవ్వి, నిర్లక్ష్యంగా, మెళ్ళోవున్న నల్లపూసలు సర్దుకుంటోంది.

ఈ మాటలు చెవులబడి ఆబిడ్డ త్రాగే త్రాగే రొమ్ము చివాలున వదిలేసి, ముసుగ్గా కప్పివున్న పైటచెంగు 'చెక్'న అవతలికి త్రోసేసి, ఆ వచ్చిన యిల్లాలివంక చురచురా చూశాడు. చారెడేసి వున్నయ్ ఆ కళ్ళు. అలా చూడ్డంలో ఆ కళ్ళల్లోవున్న రక్తపు జీరలు మరింత యఱ్ఱబడ్డయ్. కుడికంట్లో వున్న నల్లటి పుట్టుమచ్చ ఆ అరుణరేఖల నడుమ మిలమిల లాడిపోయింది

ఆవిడ నవ్వుతూ, "ఏడిశావ్! వెధవా!-" అంది.

సుబ్బలక్ష్మి చిరునవ్వునవ్వి. ఆబిడ్డను హృదయానికి హత్తుకుంది. మళ్ళా రొమ్ము నోటికందించి, పైటచెంగు కప్పేసింది

తనే బయించాడు. ఆ సంగతి ప్రదర్శించి తన్నలా మాట్లాడిన ఆ స్త్రీకి, కుళ్ళుమోతు తనం తెప్పించాలి. పాలు త్రాగుతూ పాదాలు ఇందాకటికంటే మరింత జోరుగా ఊపేశాడు.

"అ! నీవలా వాణ్ణి ముద్దుజూసినకొద్దీ వాడు నెత్తికెక్కుతాడు. వాడి జాతేంజాతీ!"- అంటూ నవ్వుకుంటూ వెళ్ళిపోయింది ఆ యిల్లాలు.

సుబ్బలక్ష్మి ఆ బిడ్డను ఆప్యాయంగా, హృదయానికి హత్తుకుంది. గర్వంతో సుబ్బ లక్ష్మిఎడద భూదేవి వక్షస్థలంలా, మరింత విస్తృతమై విచ్చులుకుని ఆ బిడ్డకు ఆశ్రయ మిస్తోంది.

* * * *

అతఃపూర్వం జరిగిన విషయాలేవీ నాకు తెలియవ్. ఈ జీవితంలో నాకు కొంచెం బుద్ధి తెలిసీ తెలియడంతోటే నాకు అవగత మైన మొట్టమొదటి ఘట్టం ఇదే. అప్పట్లో నా ప్రపంచమంతా ఆఒక్క సుబ్బలక్ష్మే. తక్కిన విషయాలేవీ నాకు తెలిసేవీ కావూ. తెలుసుకోవాలనే అవసరంగాని, ఉత్సాహం గాని, నాకు ఉండేవీ కావు

నన్ను గర్భిణితో వుండగా మా అమ్మకు చాలా జబ్బుచేసిందట. నీళ్ళాడాక ఆవిడ దగ్గిర పాలు లేకపోవటంచేత, నేను పుట్టి నప్పటినుంచీ లక్ష్మే నాకు పాలిస్తూవుండేది. మాయింట్లో పనంతా లక్ష్మే చేస్తూవుండేది. బయట మా పొలంపాటంతా లక్ష్మి పెని మిటి సుబ్బన్న చూస్తూవుండేవాడు వంట చేసుకోటం, భోజనం చెయ్యటం, ఇవే మా అమ్మకూ మా బామ్మకూ మిగిలే పనులు. చేతినిండా పనిలేక వాళ్ళకేమీ తోచేదిగాదు. ఏదో చిలిపితగూ ఒకటి లేవదీసి, ఒకరి నొకరు ప్రొద్దస్తమానమూ, తెగసాధించు కుటూ వుండేవాళ్లు — వినేవాళ్ళకి తలవాచి పోయేలా

ఇంటెడు చాకిరీ సుబ్బలక్ష్మే యెముకలు విరుచుకుంటూ వుండేది. తెల్లవారు జామున యెప్పుడు వచ్చేదో, నేను నిద్దర లేచేటప్పటికే బండెడు చెంబులు ముందువేసుకుని వాటికి చింతపండు పులుసూ, వెలిబూడిదా పట్టించి తోముతూ వుండేది. నిద్దరకళ్ళు నులుపు కుంటూ వెళ్ళి, ఆ వీపు మీద వడు కునే వాణ్ణి. మళ్ళా ఒక గ్రుడ్డికునుకు తీసే వాణ్ణి - మా అమ్మ బలవంతాన అన్నానికి పడలాక్కుపోయేదాకా ఆ వెన్నుమీద నాకు లభించిన శాంతి, మళ్ళా నాజీవితంలో ఇంత వరకు మరొక తావున, ఇంకెక్కడా లభించ లేదు. మా అమ్మ ఎప్పుడన్నా కానేపు ఎత్తుకుంటే ఎప్పుడు దిచుతుందిరా బాబూ! అనిపించేది. ఊకదాలిబెట్టి, కిటికీలు మూసి వేసిన గదిలా, ఉక్కిరిబిక్కిరిగా ఉండేది. ఎప్పుడూ సుబ్బలక్ష్మి కొంగు కొనపట్టుకు నేను తిరగటం మా అమ్మకి కొంచెం చిరాకు గానే వుండేది. మా అమ్మకూ నాకూ సంబంధం యేమిటో నా కర్థమయ్యేది కాదు అప్పుడప్పుడు మా అమ్మ నామీద అధికారం చలాయిస్తూ ఉండేది ఏ అధికారంతో ఆవిడ అలా నామీద జులుం చేస్తోందో నాకు తెలిసేది కాదు. అట్లాంటప్పుడు. అనవస రంగా, అక్రమంగా దండగంగా శిక్షింపబడు తున్న ఒక పెద్ద 'మార్టీరు'కు కలిగే భావా లన్నీ నాలో కలిగేవి. "కొట్టుకుంటే కొట్టుకో".. అనే అర్థం తోచేలా నిర్లక్ష్యంగా

నిలుచ్చుని సత్యాగ్రహం చేసేవాణ్ణి — బుగ్గలు ఎంతైనా మెలేసుకోనీ కాని లక్ష్మిగనక అక్కడుంది, మా అమ్మను కొట్టనియ్యకుండా అడ్డొచ్చిందా - ఇక జూసుకోండి - గగ్గోలుగా ఏడ్చుకుంటూ, పెద్దపెట్టున ఒక విప్లవం లేవదీసేవాణ్ణి

రోజులు గడిచినకొద్దీ, సుబ్బలక్ష్మినుంచి నన్ను దూరదూరం చేసే సంఘటనలు ఎన్నో కల్పింపబడుతూ వుండేవి. అలాంటప్పుడు ఒళ్ళంతా కుదించేసుకుని సుబ్బలక్ష్మిని అల్లుకుపోవాలనిపించేది

సుబ్బలక్ష్మి నాకు నాలుగు చుక్కల పాలిస్తుందనీ, వాటికోసం నేనలా ఆశ్రయించుకుతిరుగుతాననీ మా అమ్మ నన్ను యాసగా దెప్పిపొడుస్తూ వుండేది అప్పుడప్పుడు కాని అవిడది వట్టి తప్పభిప్రాయమని రుజువు చెయ్యగలను. మాఅమ్మ నాకు ఒక పెద్ద వెండి గిన్నెడుపాలు ప్రొద్దునా, ఒక పెద్దవెండిగిన్నెడు పాలు సాయంత్రం త్రాగించేది - పంచదార కూడావేసి. త్రాగకపోతే గవద బద్దలు కొట్టి మరీ త్రాగించేది. మరి ఆ వెండిగిన్నెకోసం గాని, మా అమ్మకోసంగాని, నామనస్సు అలా వెంపర లాడేది కాదేం? — మా బామ్మ నాకు పట్టెడు పట్టెడు వెన్నపూసా, మీగడా పెడుతూ వుండేది. అవిడకూ నాకూ మధ్య మాత్రం యీ అంతర్యమేదీ?

ఎవళ్ళ లోపం వాళ్ళు కప్పుకోడానికి ఏదో అభూతవాదాన్ని ఒక దాన్ని లేవతీసి ప్రచారంలోకి తెస్తూవుంటారు. మా అమ్మ వాదంకూడా ఆ జాతిలోదే.

రంగు రంగుల పువ్వులు గుత్తులు గుత్తులుగా గుబుల్కొని పుష్పించి పోయిన పూల మొక్కలతోనూ, నాజూకైన సన్న సన్నని తీపి వాసనలు వ్యాపింపజేస్తున్న చిన్ని చిన్ని పిల్ల వాయువులతోనూ. ఎంతో హాయిగా వుంటుంది — ఒక పార్కు. దాల్లోకివెళ్ళి కాసేపుకూర్చొని వద్దామని ఉబలాటపడతాం. ఆ పార్కు గేట్లు దగ్గిర అమ్ముతున్న కారప్పు శనగలు కొనుక్కు తింటానికే మనమక్కడికి వెడుతున్నామనివాదించటం అదేమంతబాగుంటుంది. కారప్పు శనగ లక్కడున్నై గనక అప్పుడప్పుడు మనం కొనుక్కు తింటే తింటాం గాక - కారప్పు శనగల కోసమే పార్కులోకి వెడుతున్నారు' అని వాదించటం హాస్యాస్పదం

ఒక్కొక్కవ్యక్తిహృదయం అలా నందనోద్యానవనంలా వుండి సౌరభ్య సౌందర్యాలను ఒలికించుకుంటూ, మానవ హృదయాలను తనలోకి ఆకర్షించుకుంటూ వుంటుంది. మరికొన్ని హృదయాలుంటై — పల్లేరు దొంకలూ, గచ్చపొదలూ, శీతజీబుల ముళ్ళతోపులూనూ; ఇంకా కొన్నివుంటై-తడివూక దాళ్లూ, నిప్పులకుంపట్లూ; మరికొన్ని అసలు గోగులు నానిన మురికి గుంటలు!!!

ఇంకా చిత్రం—సుబ్బలక్ష్మి నా కళ్ళల్లో నుంచి నా హృదయంలోకి తొంగిచూసేది వెంటనే నా విషయమంతా ఆవిడకు తెలిసిపోయేది. నాకూ అంతే. ఆ చిరునవ్వులో నాకు స్వర్గ భూముల భోగట్టా అంతా తెలిసేది. ఆ క్రీగంటిచూపుతో మానవ ప్రపంచ విజ్ఞానాన్నంతా 'శక్తివంతం' జేసినట్టు నాలో జ్వలింప జేసేది, ఆ తపస్విని. హృదయంలో వున్న ఆవేశంలో అణుమాత్రమైనా బయటికి చెప్పుకోటానికి చాలని యీ ఇంటి మానవ భాష మాకేం చాలేదీ! —

పాలు త్రాగేయీడు దాగా మించిపోయిందని బలవంతాన పాలు మానిపించారు. కాని అదేమిటో నాకు కుతిగానే వుండేది. పాలు నాకక్కరలేదు. ఆ ఒళ్ళో పడుకుని హాయిగా ఒళ్లుమరచి నన్ను ముయ్యనిస్తేచాలు. ఈ అవకాశాన్నికూడా వాళ్లు అరికట్టడానికి చూస్తున్నారని నాకు మా అమ్మా వాళ్ళమీద యెంతైనా ఉక్రోషంగా ఉండేది దొంగ మాటుగా మా అమ్మని తప్పించుకొని సుబ్బలక్ష్మి దగ్గిరకు చేరుకునే వాణ్ణి కరుణావాహినిలా కదలి, మునిముసి నవ్వుల వెన్నెల తరగల మాలికలతో నన్ను ఆలింగనంలోకి అల్లుముకుని, గబగబా ఒళ్ళోకి తీసుకునేది— "దబ దబా రెండు గుక్కలు తాగెయ్!"

అన్నమాటలు నిశ్శబ్దంగా ఆ మాతృ హృదయంలోనుంచి సన్నని నాకంర నాళములోకి పుక్కిలింతగా ప్రవహించి పోయేవి.

నాకు పాలివ్వటం ఒకపెద్ద గౌరవంగానే భావించుకుని లక్ష్మి గర్వపడేది. ఎందుకనో—? యీ రహస్యం మట్టుకు నాకు యిప్పటికీ సరిగా అర్థంకాదు. సుబ్బలక్ష్మి హృదయంలో మూలమూలలకు పారాడి ఆడుకునేవాణ్ణి. ఆ ముత్యాలశాలంతా నాకు కొట్టిన పిండే! యీఒక్క రహస్యంమటుకు నాకు కనిపించకుండా ఎక్కడో గుప్తంగా దాచి పారేశింది. కొంచెం పెద్దవాణ్ణయాక, ఆ భవనమంతా మళ్ళా ఒకసారి కలియవెదికి కనుక్కుందామని బయలుదేరితే - ఆ దివ్య భవనంలోవున్న విద్యుద్దీపికలన్నీ ఒకటొకటే 'టప్' 'టప్'న ఆరిపోయి కన్నూ కన్నూ పొడుచుకున్నాకూడా కనుపించకుండా, అంధకారమావరించి అయోమయమై పోయింది.

గౌతమ దేవులకు పాలిచ్చి తనిపిన మహా ప్రజాపతీదేవి కూడా ఇలానే గర్వపడేదని మీరంటే అనొచ్చు. కాని, దీనికీ దానికీ చాలా వ్యత్యాసం వుంది. ఆ తల్లి అలా గర్వపడటానికి తగిన బలవత్తరమైన కారణాలు కనుపించుతున్నై. ఆ మహా శిశువు చక్రవర్తి కాబోతున్నాడనీ, శాక్య సింహాసనానికి ముందెప్పుడో కలగబోయే గౌరవం తన వక్షస్థలం ముందుగానే దక్కించుకుంటున్నదనీ ఆమెకు తెలుసు. అదీగాక, ఆ శిశువు జనించగానే పెద్దపెద్ద జ్యోతిష పండితులంతావచ్చి, ఈ శిశువు ప్రపంచోద్దరణ చెయ్యటానికి పట్టుకొచ్చిన మహాపురుషుడన్నారు.

మరి నా మాటేమిటి?— నాకు రాజ్యాలేమీ లేవే! పైగా నేను పుట్టినప్పుడు యేజ్యోతిష పండితుడూ వచ్చి నేను గొప్పవాణ్ణవుతానని చెప్పనూలేదు. నిశ్శబ్దంగానే మా అమ్మను చూడ్డానికివచ్చిన ఆవిడ పినతల్లి మాత్రం - పురుట్లో నేను అహోరాత్రులూ కచ్చబట్టి యేడుస్తూ, మా అమ్మకు నిద్రాహారాలు లేకుండాచేసి వేపుకుతింటుంటే విసుక్కుని, ఎలికపిల్లలే కీచుమంటూ, వెధవ. పీడు బ్రతికి నిన్ను ఉద్ధరించి యేడుస్తాడూ? పీకనులిపి ఆ పాటి మీద పారెయ్యి.... చెవులు గింగురెత్తు కుంటూ ఒకటే కీచురాయి రొద.." అందిట. ఆ శాపం ఒక్కటి మినహా, నాకు ఇతర మహదాశీస్సులు కూడా యేమీ ఉన్నట్టు యెవరూ చెప్పరు.

పోనీ లక్ష్మికి బిడ్డలు లేకపోవడంచేత బిడ్డలంటే మోజందామా?... అలానూ అంటానికి వీలులేదు. ఆ తల్లికి కడిపెడు సంతానం. వాళ్ళందరికంటే లక్ష్మి నేనంటే యెక్కువ ఆప్యాయంగా చూసేది

లక్ష్మి బిడ్డలతో నేను ఆడుకొనే వాణ్ణి. వాళ్ళేమన్నా కాస్త నన్ను నొప్పించితే, వాళ్ళను వెంటనే మందలించేది. నేను వాళ్ళనేమి చేసినా నన్నేమి అనకపోగా, వాళ్ళు 'తల్లిగదా' అని తనతో చెప్పుకోవస్తే— "పాపాయితో పోట్లాడుతున్నారా?—" అని ఎదురు తన బిడ్డలనే మందలించుకొని, వచ్చి నన్ను ఎత్తుకొని బుజ్జగించేది. నా దురుసుతనాన్నీ, నాదుర్మార్గాన్నీ, తన కన్నబిడ్డ లెత్తి చూపినా ఆ తల్లి సహించేదికాదు. ఆ మాతృమూర్తి హృదయంలో నా మీద అంత కరుణ ఏమిటో!!—

ఆ తల్లికి నేనెప్పుడూ యే విధంగానూ సాయపడ లేకపోయాను. నాది అదొక దౌర్భాగ్య జీవితం. నాకు లవలేశ మేదైనా జీవితంలో సుఖశాంతు లిచ్చిన యే వ్యక్తికీ, నావల్ల చిల్లి గవ్వైనా ప్రత్యుపకారం జరగలేదు—ఇంతో అంతో సంక్షోభంతప్ప నేనే వ్యక్తికైనా అనవసరంగా కొంచెం చెయ్యి ఆసరాఇవ్వబోయానో, వాడల్లా నాదొక్కలో ఏదో ఒకబాకు పోటు పొడిచే తీరాడు.

అసలా దేవమూర్తికి నేను సహాయం చెయ్యటమనేది వట్టి లేకిమాట - వట్టి అపవిత్రమైన భావంకూడా నేమో! ఆ స్త్రీమూర్తి బానిసకాదు, ఆ యీ మనుష్యుల ముష్టిమీద ఆధారపడి బ్రతకటానికి తన జీవిత సర్వ

స్వాన్ని తన రెక్కల కష్టంమీద ఆధారపడి నిర్మించి, నిర్వహించుకున్న ధీశాలిని ఆ తల్లి. పొరపాటున, అలాంటిమాట నేను నోరుజారి అనేఉంటే, నావంక ఒక ఓరకంటిచూపు చూచి ఒక్క చిరునవ్వుతో, నేను వట్టి లేకి మనిషినని చెప్పేనేసేదే - ఏనాడో.

ఒకసారి ఇలానే జరిగిందట. లక్ష్మి నాకు పాలిస్తోందని, ఏదైనా ముట్టజెప్పి చేతులు కడిగేసుకుందామని మా అమ్మ కొంతపైకం లక్ష్మి చేతిలో పెట్టబోయిందట. "ఏమిటది ?" అందిట లక్ష్మి. "ఇవి నువ్వుతీసుకోలక్ష్మీ!. పసిగుడ్డును బ్రతికించుతున్నావు .ఏమిస్తే మటుకు ఋణం తీరుతుందిగానీ..." అందిట మా అమ్మ. వెంటనే లక్ష్మి ముఖం కందగడ్డ చేసుకుని "చాల్లెండి!... ఎవరన్నా వింటే నవ్విపోతారు. . పసిబిడ్డకు నాలుగు ధారలు పాలచుక్క లిస్తున్నాటా .. అందుకనీ కూలి స్తారుట ! .చనుబాలమ్ముకుని బ్రతుకవలసిన చెడురోజులుకూడా వస్తే అప్పుడిద్దురుగాని లేండి....ఏదో రెక్కలకష్టంచేసుకుని బ్రతుకుతున్నానుగా." అం చాలా చిరాకుపడ్డదిట. ఇంత అల్పకాలంలో - తన దేశంలో కొనుక్కోటానికి కూడా బ్రెడ్ పాలైనా దొరక్క, పసిగుడ్లు, లక్షలకు లక్షలు కలకత్తా వీధుల్లో కంకాళాలుగా రాలిపోవలసి వస్తోందని - ఆతల్లి ఆనాడు ఊహించుకోగలిగివుంటే, ఆ తల్లి కరుణాహృదయం ఎంత కోసుకు పోయేదో !

తన రెక్కల కష్టంమీద తను బ్రతకగలననే ఆ ఆత్మవిశ్వాసం, ఆతేజోమయ హృదయంలో ఒకజ్యోతిలా వెలుగుతూ కనిపించేది. ఎవరైనా ఏదైనా ఊరికె తన చేతిలో పెట్టవస్తే చాలా కంటగించుకొని "ముష్టి వేస్తారా ?". .అనేది. ఆ జీవితం ఒక అసిధారావ్రతం. ఏ పూటకాపూట తన కంచంలో ఉన్న మెతుకులు తన రక్తంలోనుంచి పుట్టినవా కావా ? అని ఆజ చూసుకొనేది. ఆ తల్లి గంభీరమైన ఆఆత్మవిశ్వాసాన్ని జ్యోతిగా చేసుకొని తన జీవితాన్నంతా తేజోమయం చేసుకుంది ఆ మాతృ శ్రీ—

*   *   *   *

ఆ రోజు స్వర్ణ సంక్రాంతి మా యింట్లో బూరెలు వండుకున్నారు. మా అమ్మ నాకు ఒకబూరెముక్క చేతికిచ్చింది. 'సుబ్బలక్ష్మికో మరి ?.. " అనిపించింది నా మనసుకు. రెండోచెయ్యి చాచాను. ఆ చేతికికూడా ఇంకొకటి అందించింది. అవి రెండూ తీసుకొని సుబ్బలక్ష్మికోసం దొడ్లోకివెళ్ళాను. సుబ్బలక్ష్మి పీపుమీద పడుకుని భుజంమీదుగా చెయ్యి ముందుకు పోనిచ్చి నోటికందివ్వ బోయాను. లక్ష్మి ఆపి, ఆ ముక్కతీసి చేత్తోబట్టుకొని

"తినూ"—అంది.

"ఇదిగో నాకూ" అని రెండో బూరె ముక్క చూపించాను.

"ఇదికూడా తిను"

"ఊహూఁ...."

"ఏం ?.. ."

"నువ్వు తిను"

"వద్దులే. .నువ్వేతిను"

"ఊ....తినూ...." అని మారాం చేశాను.

నోట్లో పెట్టుకోబోయింది. మళ్ళా, ఎందుకనో—చటుక్కున ఆగి—కళవళంగా— "అలా నేతినగూడదులే.... నువ్వే తిను. ." అని నా చేతికిచ్చేసింది. నన్ను తృప్తిపరచడానికి, మొదట్లో యేమీ ఆలోచించకుండా నోట్లోబెట్టుకో బోయింది. కాని మళ్ళా యేదో మత్తులోనుంచి మేలుకున్న మనిషిలా, చివాల్న ఆగి, కంగారుగా "కాదులే.. అలా నేను, అలాతినగూడదులే ...అంటూ ఆబూరెముక్క నా చేతికిచ్చేసింది. నాకెందుకో యేడుపు ముంచుకొచ్చేసింది. రెండు గ్రుడ్ల నిండా గిర్రున నీళ్లు తిరిగాయి.

"ఏమిటి నాన్నా !....ఎబ్బే....ఏమిటి ?.... ఎందుకు ?—"

బిగ్గరగా ఏడిచేశాను—

"నాన్నా ! ఊరుకోవూ ? ...అలా ఏడవ

కూడదమ్మా!. అలా నేను తినగూడదూ... మా నాన్నగాదూ ... అలానైతే నీ జబ్బు ఉండదు. " అన్నది

ఏడుపు మింగేశాను. ముఖంచిట్లెమంత చేసుకుని, ఆ రెండు బూరెముక్కలూ పుచ్చుకొని పడమటింటి గుమ్మంలోకి వచ్చి వాటిని అక్కడ కూర్చున్న మాఅమ్మముందు గిరవాటు బెట్టాను. బిక్కముఖంబెట్టి, గోళ్ళు గిల్లుకుంటూ, ఆ గుమ్మానికి ఆనుకొని నిలుచున్నాను. అదిచూసి, మా అమ్మ

"ఏం? దాహముడు చాల్లేదా:"—అని కసిరింది.

నేను మాట్లాడలేదు గోళ్ళు గిల్లుకుంటు నిలుచున్నాను.

"బెల్లంకొట్టిన రాయిలా మాటకూడా పడిపోయిందేం?"—

మాట్లాడలేదు. . గోళ్ళు గిల్లుకుంట న్నాను. ఇంకో బూరెముక్కవాటికి జతజేసి ఊ! ఈగో!. వెళ్ళు ' అంటూ న చేతిలో బెట్టొచ్చింది. నేను పుచ్చుకోలేదు రెండు గ్రుడ్లనిండా నీళ్ళు తిరిగాయి. మా అమ్మకేమీ అర్ధంకాలేదు. "ఏమిటీ నాయనా!" అంటూ ఆదుర్దాగా, దగ్గిరికి తీసికోబోయింది. బిగ్గిరిగా యెక్కెక్కి యేడ్చేశాను అంతా చుట్టూ మూగారు ఎందుకేడుస్తున్నానో ఎవ్వరికీ తెలియలేదు." "చీమకుట్టింద"న్నారు కొందరు. "తేలేమో" నన్నారు మరికొందరు 'పిల్లినిజూచి భయపడి వుంటాడు' అని నిర్ధారణ చేశారు ఇంకా తెలివిగలవాళ్లు. అక్కడున్న ఒక మహాయోగి ఒక్క క్షణం కళ్ళుమూసేసి, మళ్ళా తెరిచి, చిటికవేస్తూ, ఆవులించి... 'ఇస్సా రంగా!... సరే! నాకంతా తెలిసి పోయిందిలెండి; మరేం ఫరవాలేదు కొంచెం వీభూదీ, సాంబ్రాణి, ఒక కొబ్బరికాయ, పంచెవన్నెల నూలూ తెప్పించండి ఇప్పుడే పని చేసేసేద్దాం'—అంటున్నాడు.

ఈ రాద్ధాంతమంతా వింటుంటే నాకు మరింత యేడుపు ముంచుకొచ్చేస్తోంది. అసలు అదేమిటో నాకు అయోమయమయి పోతోంది. ఇక ఆ యేడుపు స్వాధీనం తప్పి పోతోంది. ఆపుకుందామని యెంతో ప్రయత్నించాను. ఆపుకోలేక పోయాను.

నేను ఎక్కెక్కి యేడవటం దొడ్లోకి వినిపించి సుబ్బలక్ష్మి నడవాలోకి వచ్చింది దూరంగా నిల్చుని నావంక అదోలా - ఒక చూపు చూసింది. దానిఅర్ధం నాకు తెలుసు. 'నీవలా యేడవటం నాకు యిష్టంలేదు - నీవు వెంటనే మాను'—అని ఆ చూపుకు అర్ధం. అదినాకుతెలుసు. ఆపుకోవాలని ప్రయత్నించుతూనే వున్నాను. ప్రయత్నించినకొద్దీ, వెల్లువలా దుఃఖం నన్ను ముంచిపారేస్తోంది.

ఆపాదమస్తకం కంపిల్లిపోతూ, ఒణికి పోతున్న గొంతును అలాఅలా స్వాధీనానికి తెచ్చుకుని బలవంతాన పైకి పెగుల్చుకుని....

'నాన్నా!' అని దీనంగా అర్చింది.

నిండి తొణికిసలాడుతున్న అక్కడున్న నీళ్ళగంగాళం కంగారై, గజిబిజిగా ఏమిటో కళవళించి పోయింది అయోమయంగా. 'జివ్వు' మంటూ ఈ దుఃఖ గీతిక అసావది అంతా వ్యాపించి, 'జిమ్మ' మని ముసురు వేసిపోయినట్లయింది ఆ అనాహతరావం ఇప్పటికీ నా రక్తనాళాల్లో మారుమ్రోగు తూనేవుంది.

నా మేధస్సులోవున్న సర్వనాడులూ, స్తంభించి దిమ్మెక్కిపోవటం తప్ప ఆ ఆర్త సంఘోషణానికి అర్ధమేమిటో నాకు అప్పుడిక బోధపడలేదు. ఇప్పుడిప్పుడు ప్రపంచాన్ని అర్ధంచేసుకోగా చేసుకోగా, నా కళ్ళయెదుట ఒక శోకమూర్తిగా విచ్చులుకుని కనుపించుతోంది. ఈ దీనారావంలో మానవ హృదయ గుహాకుహరంలో ఘూర్ణిల్లుతున్న ఆ విషాద గాధంతా నెలయేళ్ళ శోకనినాదంలాగు నిరంతరం నా రక్తనాళాల్లో మారుమ్రోగుతూ నన్ను కలవర పరుస్తూనేవుంది. ఆ పిలుపు నాకుకాదు నాలో యుగయుగాలుగా చివికి చివికి నిర్జీవమై నశించి పోతున్న నా మానవత్వానికే.

ఆ పిలుపు విని, మా అమ్మ ఆ మూర్తి వంకదీనంగాచూసి, "సుబ్బలక్ష్మీ !....పిల్లడూ ... ఇదేమిటీ ?" అని బెంబేలు పడ్డది

"ఏమీ లేదు ; కలవర పడకండి ; ఇలా ఇవ్వండి"—

మా అమ్మనన్ను సుబ్బలక్ష్మి చేతుల్లోకి అందించింది నన్ను భుజాన వేసుకొని దొడ్లోకి తీసుకువెడుతూ 'మీరిలా రండీ' అని మా అమ్మను పిలిచి వెంట తీసుకు వచ్చింది. సుబ్బలక్ష్మి పటమటింటి మొత్త చాటుకు వచ్చి ఆగి, నన్నుచూసి, "తింటాను మరి.... యేడవకేక"—అంది. మా అమ్మ వంక తిరిగి .."అబూరెముక్కలిలా తెండి. ...నాక్కూడా ఒకటి తెండి" అనేసింది బలవంతాన పెగుల్చుకొని నాకోసం ఆ తల్లి తన అభిమాన హృదయాన్ని చివుక్కున రెండుగా చీరుకుంది. ఆ బాధంతా గజ గజా ఒణికి కంపిల్లిపోయిన ఆ పెదవుల్లో నుంచి విద్యుత్తరంగంలా దూసుకువచ్చి నా హృదయానికి కొట్టుకోనే కొట్టుకుంది.

మా అమ్మ లోపలికిపోయి బుట్టా బుట్టా తెచ్చి అక్కడ పడేసి, "ఈగో సుబ్బలక్ష్మీ ! ... తనకెన్ని కావాలో అన్ని తీసుకోమను" —అంది.

ఎన్నో అక్కర్లేదు—రెండుచాలు. ..ఇలా యివ్వండి అని రెండు ముక్కలు తీసికొని "ఇదిగో ! నేనూ తింటున్నాను. తీసుకో !. ఏడవకు మరి"—

వర్షంచటుక్కున ఆగిపోయి, మబ్బుతునక ప్రక్కకుతప్పుకోగానే, తెరదించినట్టుచరాల్న నీరెండ వ్యాపిస్తుంది. కన్నీటి పొరజాలులో మునిగిపోయిన నా కనుకొలకులలో, కాంతి రేఖలు మిలమిలా బూరె మునిపంట కొరికాను..... యెక్కిళ్ళు ఒకటొక్కటే తగిపోతున్నాయి

ఏదో ఒకటిచెప్పి వాళ్ళనందర్నీ అవతలికి పంపించి వెయ్యండి.... పిల్లడి చేత మారాం చేయించి ఇంట్లోనుంచి అవీ యివీ తెప్పించుకు తింటుందనుకుంటారేమో ? ...సిగ్గుబొట్ల పనీ"—అన్నది సుబ్బలక్ష్మి—అవమానంతో అటమటించి పోతూ—

★

ఆంధ్ర సాహిత్య పాఠశాల

"ఒకే ఆదర్శంకోసం వచ్చిన వారందరు ఒకచోటికి చేరి విషయచర్చ గావించటం వలన చాలా విషయాలు సేకరించగలిగాను.- నా ఆదర్శాలకు పునాది చేకూరింది."

కొట్టగడ్డ నరసయ్య,
(కాశీ విశ్వవిద్యాలయం విద్యార్థి.)

★

"పాఠశాల - నిర్మాణ కార్యక్రమమునందేమి, విద్యార్థుల, ఉపాధ్యాయుల పరస్పర సాహచర్యమునందేమి, నిర్మాణ కార్యక్రమమును తు. చ తప్పకుండ నెరవేర్చుటయందేమి- నన్నెంతో ముగ్ధుని జేసినది.

"ప్రతి విద్యార్థి తమ తమ రంగములలో అభ్యుదయ సాహిత్యమును గూర్చి ప్రచారముచేసి మూల మూలలకు పల్లె పల్లెలకు ఈ సందేశము గొనిపోయి నూతన భారత నిర్మాణమునకు పునాది వేసెదరని కోరుచున్నాను "

పొందూరి సత్యనారాయణ,
(హెడ్మాష్టర్, హిందూ ప్రాథమికపాఠశాల, పొందూరు.)

ఆంధ్రసాహిత్య పాఠశాలపై ★ ★ విద్యార్థుల అభిప్రాయాలు

"ఈ పాఠశాల పాక్షిక భేదములకు దావులేనట్టిది. దేశకాల పరిస్థితులను బట్టి ప్రస్తుత మిట్టివాని వలన నెంతయేని ఫలితము కలదు. ఉన్నది ఇరువది రోజులు. నాలో క్రొత్తమార్గముల కెన్నిటికి బీజములు నాటుకొన్నవి! వీనిని భవిష్యజ్జీవితములో బెట్టి యనంతమైన పరిశ్రమ జేసినగాని తగిన ఫలితము కలుగదని నా విశ్వాసము."

—విద్వాన్, చదలవాడ వెంకటరామయ్య.

★

"ఈ పాఠశాలకు వచ్చిన తరవాత నాలో నూతన చైతన్యం కలిగింది. సాహిత్యంలో అభ్యుదయ రీతులను తెలుసుకోవడానికి ఈ పాఠశాల ఎంతో బాగా సహాయపడింది."

— **వి. వాలయ్యపంతులు,**

(బి. ఏ. ఆనర్సు విద్యార్థి, ఆంధ్ర విశ్వవిద్యాలయం)

★

"అభ్యుదయ కాములగు విద్యార్థులతో కలిసిమెలసి ఈనెలరోజులు కాలము గడిపి, ఎంతో అనుభవం సంపాదించగలిగాను కవితలల్లేవారు, చిన్నకథలువ్రాసే వారు, బొమ్మలుగీసేవారు, ఏమూలచూచినా కనులపండువుగా కనిపించారు. దేశాన్నీ, భాషనూ ముందుకు తీసుకుపోవాలని యువకుల లేఖకుల హృదయాలు ఎంత తహతహ పడుతున్నవో తెలుసుకున్నాను. ముందుకు పోవాలనే నాకోరికకు ఎంతో బలంచిక్కింది.

"మొదటినుంచీ పాఠశాలా కార్యక్రమంలో విద్యార్థిగా పాల్గొన్నాను. అనేక విషయాలు నేర్చుకున్నాను. ఆంధ్రుల వాఙ్మయము, నాగరికత, సంస్కృతి ఎంత పురాతనమైనదో పండితులు చాలా బాగా నచ్చచెప్పారు. ఆంధ్రవాఙ్మయాభి వృద్ధికి మా యువకులమీద ఎంత బాధ్యతవుందో అర్థంచేసుకున్నాను.

సుంకర సత్యనారాయణ

("ముందడుగు," "అపనింద" నాటక రచయితల్లో ఒకరు.)

జయ్‌హింద్

శ్రీ సహజానంద

కల్పనాసీమలో వెన్నెల తలుపులు తెరచుకొన్నయ్.

రంగు రంగుల పెద్ద అద్దం అతని ముందు తళ తళలాడుతోంది. ఆ అద్దంలో ఎన్ని ప్రతిబింబాలు ? ఎన్ని నీడలు తాచుపాములవలె బుసలుకొట్టి, పడగ విప్పుతయ్ ? పరాధీనమైన ఈ నీడల్లోనే మూలం యొక్క మర్మం దాగి, దాని వికృతం బహిర్గత మవుతుంది.

ఈ అద్దంలో నెమళ్ళు పింఛాలెత్తి నృత్యం చేస్తయ్ !

కోకిలల సంగీతం, ఛాయా నిశ్శబ్దంలో మూగవడిపోతుంది.

మనుష్యుడు, అతని అనాది నెచ్చెలి దుఃఖం . . ఇద్దరు నల్లని మేఘాల్లా .. జీవాన్ని చిచ్చులోకి ఈడ్చుకు వెళ్తున్న దుఃఖం భయంకర సర్పంలా ... మనుష్యుడొక కాటుతిన్న ఎలుకపిల్లలా.

* * *

కాల్పనిక జగత్తుకు రెండు ద్వారాలు.

ఒకటి స్వర్గం,

ఒకటి నరకం రెంటికి మృత్యువు ప్రాంగణం.

కాని కాని వాస్తవిక జగత్తుకు జీవం . జీవితం ... ప్రాణం. ఇదే సింహద్వారం.... ఇక్కడ నిలబడి విను.

అది సామవేదం !

ఇక్కడ నిలబడి చూడు !

అది కురుక్షేత్రం ! !

ఇక్కడ నువ్వు వ్రాసేదే భగవద్గీత!
ఇక్కడ నువ్వు పాడేదే అధ్యాత్మం ! . .

* * *

రచయిత కాల్పనిక జగత్తు నుండి మరలి, వాస్తవికజగత్తుయొక్క సింహద్వారం వద్ద నిలబడ్డాడు. నిబిడమైన నిశిరాత్రి తెల్లవారబోతోంది. మహోదయం కాబోతోంది....

తూర్పున.... తూర్పున శూన్యంలో నెత్తురు చిందింది ! వెలుగు నెత్తురుతో మెరుస్తోంది ? ఎవరు? సూర్యబింబమా? కాలం గాయపడిన గుండెతో, ప్రాగ్దిశా గవాక్షంపై నిలబడ్డది....

ఏమది?

అది ... ఏమిటి ?

కాగితాలకింద ఒత్తుపెట్టుకున్న పుస్తకము జారి గచ్చుపై పడ్డది.... ఎర్ర సిరా మరకల్లో మెరుస్తోంది-

'August 9'

అహో ! అవును.... అది '42.... అది ఆగస్టు . అది 9...

చరిత్ర ఫాలతలంపై జ్యోతి లా వెలుగుతోంది !

తుపాకుల గుళ్ళు రంయ్‌మని దూసుకుపోయినయ్ !

తుపాకిగుళ్ళతో తూట్లుపడిన ఆపర్వ దినం నవభారతానికి జన్మదినం!

వందలకు వందలు యువకులు, వృద్ధులు ఆ మహా ..ఉషస్సుకు పూజ చేస్తున్నారు.

*　　*　　*

రచయిత తేరిపార చూచాడు . . అదొక మహానాటకం! మందిరమంతా జనసముద్రంతో ఉప్పొంగుతోంది! రంగంపై నిలబడిన వాళ్ళకు కిరీటాలు లేవు కత్తులు లేవు ... సీసపద్యాలు పాడటంలేదు వాళ్లు సామాన్యులు! ఉరి తాళ్ళవెంట పోయినవారు పోవగా మిగిలినవారు! ప్రతిఘటనాభారంతో వారి నడుములు వంగినయ్ . . ఒకప్పుడు భుజంగాలు పగడలు విప్పిన ఆభుజాలు. కిందకు వంగినయ్! వారిరెప్పల మధ్య మట్టుకు చిరుతపులి కన్ను తెరచింది! పెద్ద తుపాకుల నీడలు రంగస్థలాన్ని కమ్మివేసినయ్!

రచయిత కల్లోలపడ్డాడు. సెలయేళ్లు ఉద్యానవనాలు విడిచిపెట్టి వచ్చాడు. అభిసారికలతని పాటకోసం నిరీక్షిస్తున్నారు. అటువంటి 'స్వర్గసీమ'ను విడిచిఈయజ్ఞ వేదిక దగ్గరకువచ్చాడు. అతనికి తోచ లేదు. నాటకం మంచి పట్టులోవుంది . . ప్రేక్షకులకళ్ళు రెప్పలు వాల్చటంలేదు. అశ్రువులు హృదయాగ్నిని చల్లార్చు కుంటున్నయ్ .

రచయిత బైటికివచ్చాడు. అది మహోదయంకాదు. అమావాస్య....నిశిరాత్రి దారి అగపడటంలేదు.

ఎవ్వరిదో అడుగుల అలికిడి అయింది ఏదో నీడ చటాలున చరచరా రాసుకుపోయింది. రచయిత కంగారు పడ్డాడు...

తెగిపడ్డది సంకెల...చీకట్లో భయాన్ని మోగించింది! నిలబడ్డాడు నిశాచరుడు! చినిగిన చొక్కా . మసక మసకగా కనబడుతోంది.... జుట్టు ఎండిన దుబ్బులావుంది.. కళ్ళు తోడేలు కళ్ళలా ...

రచయిత గుండె దడదడ కొట్టుకుంటోంది. కొంచెం దూరంలో ఇల్లు ఉంది. చక్కని డాబా ...చుట్టూ పూల మొక్కలు నాలుగు అంగలు వేస్తే

నిశాచరుడు రచయితకు నమస్కరించాడు. రచయిత ఆశ్చర్యపోయాడు. కబంధుడా?

"నేను ఖైదీని 150 ఏళ్ళనుంచి ఈ కారా గృహంలో .... కోట గోడల్లో ప్రాణం పోక దేకుతున్నాను... నాకు పునర్జన్మ....ఆగస్టు9 మళ్ళీనానాళాల్లో రక్తం హోరెత్తింది. కోటగోడలు నా కాళ్ళముందు పిట్టగోడలైనయ్....వెనుక తుపాకులు పేలినయ్ వాటి ఆశీస్సు తోనే బైటపడ్డాను... వళ్ళంతా గాయపడ్డది . .ఇక ఖైదీగా నే ఉండలేను . . ఈ జైలును పునాదులతో పెల్లగించి... సముద్రంలోకి విసరి పారవేసిననాడే నాకు స్వేచ్ఛ! నేను చనిపోయానని మీరంతా అనుకొని వుంటే అనుకొని వుండవచ్చు. అది పొరబాటు.. నేను బతికి వున్నాను. నేను చనిపోలేదు, చనిపోను ... ఈ సంకెల తెగిపడ్డచోట

సింహాసనాన్ని స్థాపించాలి.. మీరంతా.. ముఖ్యంగా నువ్వు. ఈ భారం వహించాలి. .

నీ కలంలోంచి నిప్పు కురిపించు... నీ మాటలు గాండీవంలా మోగాలి.... నే వెళ్తున్నాను.. అదిగో . మహా నాటకం"

నిశాచరుడు చీకట్లో కలసిపోయాడు. తెగిన సంకెల మిణుగురు పురుగులా తళుక్కు మన్నది ఆ మెరుపులో ఖైదీ రక్తం పృధ్వీమాత ఒళ్ళో ఘోష పెట్టుతోంది.

'స్వాతంత్ర్యం' అని.

రచయిత హృదయంలో పిడుగులు ప్రతిధ్వనించినయ్ !

అతని కళ్ళముందు కోటానుకోట్లు కటకటాలు ఆకాశమెత్తునా లేచినయ్. పర్వతాలన్నీ దుమ్ము దులుపుకొని; కోటగోడల్లా లేచినయ్. భయంకరమైన శబ్దంతో అడవి సర్పంలా పడగెత్తింది. ఇనపతాచు- సంకెల . . 40 కోట్ల జీవ రాశిని ఉరితాడులా నొక్కుతోంది ... ఆ శృంఖలా సర్పం !

భూగర్భంలోంచి చీల్చుకొని పైకి లేచిన ఉరిస్తంభాలు మెడలు విరిగిన శవాల బరువుతో విరిగినయ్ !

రచయిత దహనమైపోతున్నాడు. ప్రతి అశ్రువు ఒకఅగ్నికణంలా దహించివేస్తోంది....

రచయితహృదయం ఘోషపెట్టింది.

"స్వాతంత్ర్యం"

నలుదిశలు ప్రతిధ్వనించినయ్. ప్రజలు పాంచజన్యం పూరించారు !

విరోధికి విధి దూరాన 'గోరీ' తవ్వుతోంది.

జయ్‌హింద్

★

ఆంధ్ర సాహిత్య పాఠశాల

"నేను విద్వాన్ పరీక్షయందు ఉత్తీర్ణుడనైనను సమగ్రమైన విజ్ఞానవంతుడను కాలేకపోయాను,"

"నేడు ప్రజా సాహిత్యముయొక్క అభ్యుదయ రీతులను గూర్చి ఉపన్యసించిన పండితులందరున్నూ తమ తమ ప్రాచీన వాఙ్మయానుభవములను విశదముగా ఉపన్యసించినారు ... ఈ ఉపన్యాసములు వినుటవలన నేను అభ్యుదయ రచనలు ప్రారంభించుటకు చాలా ఉత్సాహినైతిని. ఇందుమూలమున ఈ పాఠశాలా నిర్వహణము ధన్యమైనదని నేను భావించుచున్నాను."

విద్వాన్, వెల్లంకి బ్రహ్మయ్యచౌదరి.

ఆంధ్రసాహిత్యపాఠశాల

"భారత చరిత్రలో అపూర్వమైన ఈపాఠశాల ఇక్కడ అంకురించిందంటే ఈ పౌరులంతా ధన్యులయినారని చెప్పవలసిఉన్నది. యూనివర్సిటీల్లో సంవత్సరాలు చెప్పేవిషయాన్ని ఇక్కడ ఒక్కనెలరోజుల్లో విడమర్చి చెప్పారు. మొదట నేనిక్కడకు వచ్చినప్పటికంటె ఇప్పుడు పాఠశాలా సాఫల్యంమీద నాకెక్కువ నమ్మకం కలిగింది.

"ఇక్కడి విద్యార్థుల ఔత్సుక్యం, నిర్వాహకుల సమర్థత ఆశ్చర్యకరమైనది. నేనెంతో ఆనందించాను ఈప్రయత్నం ప్రశంసార్హమైనది.

కోరాడ రామకృష్ణయ్య

★

"మనస్సు నిండుగావుంది. ఇలాంటి సంస్థలంటే నాకెంతో సానుభూతి వుంది. మిమ్మల్నిచూస్తే నాకు తెలిసిందంతా చెప్పాలన్న ఆదుర్దా ఎక్కువయింది.

"ఈ విద్యాలయం అభివృద్ధిచెంది తీరుతుంది. ఇది రెండు మూడేళ్ళలోనే ప్రజా విశ్వకళా పరిషత్తుగా పెంపొందుతుందన్నదాంట్లో సందేహం లేదు.

"ఇది ఒక గురుకులం. అయితే, ప్రాచీన గురుకులానికీ దీనికీ ఎంతో తేడా వున్నది. ఇది వాటికంటే ఉత్తమమైనది. ఎందుకంటే, అప్పుడు గురువులకెదురు చెప్పేందుకే వీలులేదు. కాని ఇప్పుడో మనం పరస్పరం దిద్దుకుంటున్నాం. మనకు సంస్థయే ప్రధానం! మనం ముందుకు నడుద్దాం!"

మల్లంపల్లి సోమశేఖరశర్మ
(ప్రిన్సిపాల్, ఆంధ్ర సాహిత్యపాఠశాల.)

★

"ప్రాచీన సాహిత్యాన్ని కళలను విద్యార్థులకు తెలియజెప్పి ఆంధ్రజాతీయ జీవితాన్ని సముద్ధరించగల సమర్థులను తయారు చేయడమే ఈ పాఠశాల యొక్క ఉద్దేశం. ఈ పాఠశాలా చరిత్ర బంగారు నీటితో వ్రాయదగినట్టిది.

"ఈ పాఠశాలలోని విద్యార్థులూ, అధ్యాపకులూ ఒక కుటుంబంలా కలిసిపోయారు. విద్యార్థులందరూ వివిధ కళల్లోను పరిశ్రమ చేసిన వారు; అధ్యాపకులందరూ దేశప్రసిద్ధి పొందినవారు.

"ఇలాంటి విద్యార్థులు మరెక్కడా లభించరు. ఇలాంటి పాఠశాల మరెక్కడా లేదు. ఇది ఆ చంద్రార్కంగా వుండేటట్లు చేయవలసిన బాధ్యత అందరిమీదా వుంది."

నిడదవోలు వెంకటరావు
(ప్రొఫెసర్, మదరాసు ప్రెసిడెన్సీ కాలేజి)

ఆత్మహత్య ★

'కొత్తపాళీ'

రంగాచారి గడపలో అడుగుపెట్టి నివ్వెరపోయాడు ఇంటి ముందున్న అరుగుమీద అనాధులిద్దరు. భార్యభర్త లేమో, కౌగలించుకొని పడుకుని వున్నారు. పట్టపగలు, పదిగంటలవేళ. రోడ్డుమీద నడిచే బండ్లు, ప్రజలు. అప్పుడప్పుడు గాలి విసురుకు ఎగబడేదుమ్ము. ఎండ మిడిసిపడుతున్నది. రంగాచారి కళ్ళుచెదిరి, గుండెల్లో ఏదో సుడిగుండం తిరుగుతున్నట్లనిపించింది. తలుపు మరింత బలంగా గుద్ది "భానూ! విన్నేరా...." అని కేకవేసి, రహస్యంగా జాగ్రతగా మళ్ళీ అరుగువంక పక్క చూపులు చూచాడు.

ఆమె నడుము చేతిలో ఇముడ్చుకుని గుండ్రని రొమ్ముల మీద తలవాల్చి అతను నిద్రపోతున్నాడు. ఆమె జుత్తు నారపీచులాగ అతుక్కొని, అరుగుమీది నుంచి వేళ్ళాడుతోంది. ఆమె రొమ్ము మీద నల్లని మచ్చ. పగిలిన పెదవులు. కృశించిన శరీరం చూచి రంగాచారి వొళ్ళు జలదరించింది. అతని పక్కటెముకలమీద ఎండవాలి పదునుగా మెరుస్తోంది. వారి కాళ్ళవద్ద కూచున్న శిశువు లోకంవంక తేరిచూస్తోంది. పుసికళ్ళు తుడుచుకుంటోంది.

భానూ ఆలస్యంగా తలుపు తెరిస్తే బాగుండుననిపించింది రంగాచారికి. ఎవరైనా చూస్తారేమోననే భయంకూడ. ఆఫీసునుగురించి ఆలోచించటానికి ప్రయత్నించాడు ప్రతిఏడూ పదిరోజులు నిద్రాహారాలు మాని అంకెలు పేర్చవలసిందే. ఐతే ఇన్స్పెక్టరెప్పుడొస్తాడో! వీళ్ళకి ఇల్లులేదుగామాలు! పాపం. ఐతే సిగ్గన్నా ఉండక్కర్లా - పాపం!

చొక్కావిప్పి పడుకోబోతుంటే భార్యవచ్చి, "లేవరేం - మిమ్మల్నే - అమ్మాయి నీళ్ళతోడి ఎదురుచూస్తున్నది. తువాలిదిగో - లేవమంటే" అని గట్టిగా నిర్లక్ష్యంగా అన్నది.

ఒకసారి తలయెత్తిచూచాడు. భార్య మీద ఎన్నడూ లేని అసహ్యం కలిగింది "నీ అబ్బసొమ్మేం మునిగిందే? అక్కడ వాడు - ఇక్కడ నువ్వు - జీతగాళ్ళకంటె హీనం - పద - నోర్ముయ్యమంటే" అని గదిమాడు

మొట్టమొదటిసారి అదే గదమటం భార్యను. ఆశ్చర్యంతోనో, అలిసివున్నాడనో భార్య వెళ్ళిపోయింది.

లలిత అన్నం వడ్డిస్తోంటే భార్యవచ్చి లలిత పెళ్ళినిగుర్చి చెప్పటం మొదలెట్టింది" చక్కని పిల్లాడు - చదువుకుంటున్నాడు - మనపిల్ల కేమీ భయం లేదు - అత్తగారు మహాభక్తిపరురాలట- 'తినటానికి లేనివాడికి నాపిల్లని కట్టానా?' అన్నారు - ఇప్పుడీ సంబంధంమాట ఎత్తుకోరేం" జవాబు అక్కరలేనట్లు తనే ఏకరువు పెడుతున్నది.

లలిత పనివున్నట్టు పక్క గదిలోకి తప్పుకున్నది. టెన్నిస్ రాకెట్ బాగు చేసుకుంటున్న భాను ఎదురై "ఏమిటే అరుచుకుంటున్నారు? నాన్న పెద్దగా మాట్లాడుతున్నాడేవిటేయ్!" అన్నాడు లలిత సిగ్గుతో వెళ్ళి తండ్రికి పక్క వేస్తోంటే లోపలనుంచి తండ్రి కేకలు విన్పించాయి.

"లోకంలో మీకు నచ్చినవాణ్ణెన్నడైనా చూశానా—ఆశ—ఆశ—తక్కువ వాళ్ళని తలుచుకోముగద-పైవాళ్ళు బుద్ధి లేనివాళ్ళు మనతో కలుపుకోటానికి-ఇక మనలో మనం ఎవరినైనా మెచ్చుకున్నామా? వెధవ పిల్ల పుట్టకపోయినా బాగుండేది-అడుక్కుతిన మను-అడుక్కుతినేవాళ్ల.... వాళ్ల...." అంటూమాట్లాడలేక చరచరలేచివచ్చాడు

జాలిగా చూస్తూ తువాలుతో ఎదురైంది లలిత. రంగాచారి సరాసరి బైటి గడపవద్దకువెళ్ళి అరుగువంక చూశాడు. అనాధులెప్పుడో వెళ్ళిపోయారు. తెల్లని గోడమీద "స్వర్గసీమ-ఆంధ్రులు గర్వించవలసిన చిత్రం" అని వ్యాపారం ప్రచారము చేస్తోంది. "పసుపుపెట్టెలో ఓటు స్వాతంత్ర్యానికి బాట" అని కాంగ్రెసు ప్రబోధిస్తోంది ఎర్రని ఎండలో కుంపటి మీది నుసిగాలిలాగ దుమ్ము మడిధోవతి మీదికెగబడింది. తండ్రిజేబులో రు 5 ల నోటు గప్‌చుప్‌గా కాజేసి వెడుతున్న భాను దూరంగా టెన్నిస్ రాకెట్‌తో కన్పించాడు. రంగాచారి చెయ్యెత్తి "అరే భానూ! భానూ-అరేయ్" అని బిగ్గరగా కేకవేశాడు.

భానూ తిరిగిచూచి త్వర త్వరగా అంగలువేసి వెళ్ళాడు.

ఇంట్లోకి తిరిగివస్తోంటే భార్య, విసుక్కుంటూ గొణుక్కుంటూ గ్లాసులు విసిరికొడుతున్న గల్లంతు విన్పించింది.

కళ్ళు మూసుకుపోతున్నాయి, కాని ఆ దృశ్యం ఆలోచనను ప్రేరేపిస్తోంది. గదిలో గాలి బరువెక్కి గుండెమీద కూచున్నట్లనిపించింది, బ్రతుకంతా — ఒకవైపు భార్యయాజమాన్యాన, మరొకవైపు అధికారి దర్పంకింద నిశ్చింతగా వెళ్ళబుచ్చుకుంటున్న రంగాచారిని హఠాత్తుగా బలవంతంగా నిద్ర మేల్కొలిపి నువ్వు అడవిమృగాలలో బ్రతుకుతున్నావని తెలియజెప్పినట్లుంది సర్వాబద్ధం-అబద్ధమంటే నీ బ్రతుకు అని మనస్సు కేకలు పెడుతున్నది. నిశ్శబ్దంగావున్న గదిలో అతనిగుండె దడదడమ్రోగుతూ గదినిండా ప్రతిధ్వనిస్తున్నట్లనిపించింది,

పక్కగోడతో—భానూ తప, తప, తపమని టెన్నిస్ ఆడుతున్నాడు. కలత నిద్ర మాని, పక్కమీద పొర్లి లేచి "ఎవరే ఇక్కడ—ఉన్నారా? చచ్చారా" అని పెద్దగా "భానూ—" అని పిలవగానే అతను దొడ్డిలోకి పారిపోయాడు.

ఒకనాటి మధ్యాహ్నం బాంకి మానేజరు కులాసాలడిగితే తటపటాయించాడు రంగాచారి మేనేజరు తన సహజధోరణిలో "నువ్వు మిల్కు తీసుకోవాలోయ్ — రంగాచారీ — మనవాళ్లకి మైండ్ అండ్ బాడీ ఏకబిగిన నడిపించడం తెలీదు—"

"అవునండీ—నిన్న...."

"అనవసరమైనవన్నీ నెత్తిన వేసు

కుంటారు—లుక్ ఎట్ మి—ఇంట్లో, ఆఫీసులో అంతా ఆర్డర్ మైంటైన్ చెయ్యడం నాడ్యూటీ — ఏమిటి? come, come ఏం జరిగింది?"

"ఇద్దరు అడుక్కునేవాళ్ళు - మా అరుగుమీద - పడుకుని - పగలు పది గంటలకి - నిద్రపోతూ - పట్టపగలు - పాపం! - మా బెడ్రూం పక్కనేనండి - అరుగు" రంగాచారి వేళ్ళమధ్య పేజీలు వణికాయి.

"పూలిష్-మిష్టర్ రంగాచారి-పూలిష్-కస్రపుచ్చుకుని బుద్ధి చెప్పాలి! దీజ్ బెగ్గర్స్ - యు సీ" అని అసహ్యంతో మాటలు వొత్తివొత్తి పలికాడు "ఇటీజ్ నథింగ్ - మీ అరుగు కాకపోకతే ఇంకోటి - వైషుడ్ యు టెల్ మీ - వండ్రఫుల్ - Come Come - లెడ్జర్స్ ఏవీ?"

నోట్లు లెక్కపెడుతున్న తోటి గుమాస్తా రంగాచారి ఎర్రని ముహం చూసి పక్కున నవ్వాడు. ఉద్వేగంతో కంపిస్తూ, రంగాచారి ఏదో అనబోయి వూరుకున్నాడు

ఊరంతా అనవసరంగా తిరిగి, అలిసిపోయి ఇంటికివచ్చిన రంగాచారి గదిలో కూచుని యోచించుకుంటున్నాడు: అడుక్కునే వాళ్ళకు వయస్సు తెలుసుకోవటం ఎంత కష్టం! పాతికేళ్ళ కుర్రాడు, వొళ్ళుచూస్తే తోలుతిత్తి లాగుందనుకుని వ్యధపడుతున్నాడు.

వసారాలో భార్య పొరుగమ్మతో రహస్యంగా, "నాగుండెపగిలిపోతుందే తల్లి - పూర్వం ఎట్లా అజమాయిషీ చేశానో ఏమో నాకర్మకాలి - ఇప్పుడనుభవిస్తున్నా! - ఎన్నడూ ఒకమాట ఎదురాడేవాలా! - ఇప్పుడింట్లోకొస్తారా- పరాయి ఇల్లు, అంతా పరాయివాళ్ళం - తనేంచేస్తున్నారో ఏం చెపుతున్నారో ఆయనకే తెలియదే - కర్మమమ్మా - పిల్ల దిగులుపడింది-నాకేదిక్కు తోచటంలా" అని చెంగు ముఖానికడ్డం పెట్టుకున్నది.

పొరుగమ్మ ఓదార్పుగా, "ఏఇంట్లో సరిగ్గావుంది చచ్చిందే - మా బావమరిది లక్షాధికారమ్మా - మా గడపతొక్కి ఎరుగడు - అంటే అంటావుగదా - మీరు బీద సంబంధం చేసుకున్నారా ఏవిటి? మనకుటుంబాలిల్లాగే నాశనమౌతున్నయ్-వల్లకాదు - అన్నదమ్ములకీ, భార్యాభర్తలకీ మధ్య పోరు - ఎవడుసంపాదిస్తే వాడిదే లోకం" అంటూ జాలివటిస్తున్నది. ఎంత ఖరానాగా బ్రతుకుతున్నారోనని ఇంట్లోసామాన్లవంక కలయజూస్తున్నది.

"ఇన్నాళ్ళూ తిండిలేని ముండాకొడుకులకిచ్చి నా పిల్లని నాశం చెయ్యమంటారా? అంటివి - బాగా ఉన్నవాళ్ళ సంబంధం వొచ్చిందని మా తమ్ముడు చెపితే ఏడిశారులేవోయ్, అంతాదొంగలు పచ్చిదొంగలు. అని వాణ్ణి గదిమె "

పిడుగులాగు రంగాచారి కేక వచ్చిపడింది. "సిగోణుగుడు కట్టిపెట్టు— పిల్లని పిల్చుకురా చెపుతా-ముండాకోరులకి డబ్బుకోసం పిల్ల నమ్ముకుంటావా- నిన్నేనే! బైట ఎవడో బిచ్చంకోసం ఏడుస్తున్నాడు-పో-వెయ్యి-నిన్నే-లే"

పొరుగమ్మ పిల్లిలాగు జారుకున్నది. భార్యలేచి తనలో ఇక బిచ్చగాళ్లే మిగిలాము అని ఈసడించుకుంటూ, బైటికి వెళ్ళి "దొంగలమ్మికొడకా-పొద్దుటినుంచీ

చంపుతున్నావు!, నీతాత మేస్మావన్నా దాచి పెట్టావురా!" తనకోపమంతా అతని మీద పెళ్ళగక్కుతూ "భానూ! వీడికి బుద్ధిచెప్పరా మరీ గడపదాటొచ్చాడు - ఇంతవరకు పూజ మొదలెట్టలేదు-అప్పుడే వీడు" అని చీవాట్లు పెడుతున్నది.

స్కూల్ ఫైనల్ పుస్తకాల చెర తప్పిందింతే చాలని, దూకుతూ బైటికి వచ్చాడు భానూ.

రంగాచారి నిశ్చలంగా గదిలో నిలిచి వింటున్నాడు రెండు నిముసాల్లో, "అయ్యో బాబో-దణ్ణం పెడతాబాబో-వన్నొదులు బాబో-రాను, రాను బాబో-" అని రోదనవిన్పించింది. ముకుపుటాలు, పెదవి కొసలు అదురుతున్నా, రంగాచారి ఊపిరిబిగబట్టి తెల్లవిగోడవంక చూస్తున్నాడు. వెంటనే "ఏమయ్యా-నీకుంచే నువ్వేతింటావ్; చంపుతావా ఏమయ్యా-కొట్టు చూస్తా-ఏం మొనగాడివయ్యా-బైటికి రా చూస్తా-రామరి" అని రోషం పట్టలేక తెగించి అడుగుతున్న మాటలు విన్పించాయి.

రంగాచారి ఒళ్ళు గగుర్పొడిచింది. ఎందుకోగాని సంతోషంగా వుంది. సాయంత్రపు ఎండ వంట గది పొగ బారిన కిటికీలోనుంచి లోపలికి ప్రవహించి సాలిగూళ్ళలో తళ తళ లాడుతున్నది. సాలీడు చచ్చినట్లుపడుకున్నది. భానూతల్లికి నోట మాటరాలేదు. రంగాచారి ధటాలున చొక్కా-తీసుకుని తొడుక్కో-కుండానే పెద్ద అంగలు వేస్తూ గుమ్మంలోకి వచ్చాడు. బిచ్చగాడు, నల్లని పెదవిసందుల్లోంచి కారుతున్న ఎర్రని నెత్తుటిబొట్లు లోపలికి పీల్చుకుంటూ, వేలితో తుడుచుకుంటూ నిలబడ్డాడు.

"నాతో రా-లోపలికి-వీళ్ళేం చేస్తారో చూద్దాం - వీళ్ళెవర్రా నిన్ను కొట్టడానికి-రారా - రావేం" భుజంమీద చెయివేసి లోపలికి లాక్కు-ని వచ్చాడు రంగాచారి.

గదిలో లలిత విని, పెద్దగా ఏడ్వబోయి గొంతు బిగబట్టుకున్నట్లు విన్పించింది. భార్య భానూ నిశ్చేష్టులై చూస్తున్నారు.

"ఎందుకే ఏడుపు - మా కన్నతల్లి - ఏడుస్తుంది - ఏడుస్తుంది" అని, కసితీరిన శత్రువు తృప్తితో అన్నట్లు "నువ్వు పోయి అరుగుమీద పడుకుంటావా - ఎవరితో నైనా పడుకుంటావా - పాపం సొమ్ములు కావాలా ?—మీ దిక్కు-న్నవాడి దగ్గరికి పోండి - వీడెపుడూ సుఖంగా నిద్రపోయెరగడు - మీరు పుడుతూ తెచ్చుకున్నారా ఇల్లు" అని వడివడిగా మాట్లాడాడు. తన మాటలకు తనే భయపడ్డాడు.

"ఒరే భానూ! రా ఇక్క-డికి-అన్నం పెట్టు వాడికి" అని కేకవేశాడు,

బిచ్చగాడు భయంతో, సంభ్రమంతో ముందు వెనకలు చూస్తున్నాడు. కిటికీ వెనుకనుంచి దొంగచాటుగా చూస్తున్న భానూ, ముందుకివచ్చి అన్నంకోసం గదిలోకి వెళ్ళిపోయాడు.

రంగాచారి, పడకగదిలోకి వెళ్ళి చొక్కా- వొంకెను తగిలించి, పడుకున్నాడు. తననేదో ఆవేశించింది దేహం చెమటపట్టి చల్లబగింది. ఆయాసం హెచ్చుతున్నది.

కొంతసేపటికి మెల్లగా భానూను పిలిచి-

"కర్రతో కొట్టావుగదూ ?"

తల వూపాడు.

"నువ్వెవరు ? నువ్వెవర్రా కొట్ట టానికి ?"

మాటలేదు,

"వాడికి మంచిచొక్కా ఇయ్య — నీళ్ళియ్య—నువ్వు చేసింది తప్పైనా ? వాడు నీకంటె పెద్దేగదు ? నీ తండ్రి వంటి బ్రాహ్మడు వాడికిలేక, అడుక్కొం టున్నాడు."

భానూ ఒకసారి తలయెత్తి ఆశ్చ ర్యంగా చూసి దించుకున్నాడు

"వాడిపని చూడు—"

"అమ్మ - -" అని మెల్లగా చప్ప రించాడు భాను.

"నోరు మూసుకొని పడుకోమను" అని గట్టిగా అన్నాడు.

భార్య అలిగి, లలిత పెళ్ళివిగురించి తమ్మునితో సంప్రదించే సాకుతో పుట్టిం టికి బయలుదేరింది లలితమాత్రం దిగు లుతో, పెళ్ళిని గురించి దుస్వప్నాలతో అన్నం ముట్టుకోవడం మానేసింది

భానూ స్కూలుమాని బిచ్చగాడితో కాలం గడుపుతున్నాడు. చెన్నిస్వామి అతను చెప్పేకథలు వింటున్నందుకు లలిత ఆశ్చర్యపోయి, తండ్రి పట్నం నుంచి 'రాగానే పీడిపని పట్టిస్తా' నను కున్నది.

తలుపువద్ద చెవియొగ్గివిన్నది.

"సినిమాదగ్గర సత్రంలేదూ-అక్కడ రెండో ఆట సాగించారు - మావాళ్ళంతా అందులో పడుకుంటారులెండి,"

"సత్రంలో ఏముంది ?"

"మహానుభావు డొకాయన కట్టిం చాడు - ఆయన కొడుకు - ధాన్యం విలవ బోశాడులెండి - తాళాలేసుంటయ్ - అబ్బ! రాత్రింబగళ్ళు ముక్కిపోయిన వాసనతో చస్తుండాం."

"ఈరోజుల్లో దాచిపెట్టాడా-ఆవరండా లోనే నా పిల్లచచ్చిపోయింది - అన్నం లేక అని చెపితిపే"

"దాన్దేముందిలెండి — చస్తుంటారు గాని-" అని నిర్లక్ష్యంగా పలికి "ఆయ నొచ్చి రోడ్డుమీదినుంచి మాకేసి చూస్తా వుండాడు-భయంగా అటూ ఇటూ పార చూసేవారు - మావక్కనే కూచుని, మేమంతా చా తాగుతుంటే, అర్ధణాపెట్టి కొని ఒకగుక్కెడు తాగి వూసిపారేశాడు"

"నాన్నా? ఎందుకు వుమిశాడు"

"డబ్బాటీ లేండి- అలవాటులేనోళ్ళకి బాగుండదు. వుగాకేసుకుని తాగుతే తెలియదుగాని"

"మొన్న నిన్ను గుర్తుపట్టాడా?"

"మీరుకొట్టిన నాడా?"

"అలాఅనొద్దు వెంకడూ — నాకు కష్టంగా వుంటుంది"

"దాన్దేముందిలెండి-నాఒళ్ళుబొప్పుల కట్టింది-వీపుచూడండి"

లలితకు, పెద్దగా వెకిలినవ్వు విన్పిం చింది. నువ్వు వెళ్ళొద్దు, నాన్న వచ్చే వరకు వుండమని భానూ పట్టుబట్టడము, బిచ్చగాడు వెళ్ళిపోతానుండలేనని నొక్కి చెప్పడము విన్నది. ఖంగారుగా గది లోకి పరుగెత్తింది. ఇల్లు దయ్యాల కొంపలాగ భయంపుట్టిస్తున్నది ఇల్లు, ఆఫీసుతప్ప ఇతరం ఎరుగని తండ్రి

పిచ్చివాడిలాగ వీధులంట తిరిగాడా ఈ నెలరోజులు? భానూకేం మతిపోయింది? స్కూలులేదు. పూర్వంలాగ యింట్లో డబ్బు ఎగేసుకు పోవడంలేదు. వాడి తత్వమేమారింది. అమ్మెప్పుడొస్తుందో, అమ్మెప్పుడొస్తుందో - ఆవూళ్ళో పెళ్ళి కాని అమ్మాయి పురిపోసుకుందటగా— అని తలపోస్తూ ఏడ్చి ఏడ్చి బడలికతో నిద్రపోయింది.

హెడ్ ఆఫీసులో లెక్కల పుస్తకాలు తనిఖీ చేయించి తండ్రి తిరిగివచ్చాడు. అధికారులు మెచ్చుకున్నారని గుమాస్తాలు అసూయపడ్డారు. ఇరవైయేళ్ళ సర్వీసు నిష్ప్రయోజనం కాదులే అని అధికారులు ఊరడించారు. రంగాచారి ఏసగించుకున్నాడు.

భానూ ఎక్కడున్నాడని లలిత నడిగితే, టెన్నిస్ రాకెట్ అమ్మేశాడని, రాత్రింబగళ్ళు పుస్తకాలు, పేపర్లు చదువుతుంటాడని, ఎప్పుడూ ఎవరో స్నేహితులు వెంటాడుతుంటారని చెప్పుతున్నది. పిలిస్తే జవాబుగూడా యివ్వక పరధ్యానంగా వుంటాడని, ఒంటరిగా ఉండటం భయమేస్తోందని, భానూను మళ్ళీ ఏమీ అడుగవద్దని విన్నవించింది.

మరునాటి సాయంత్రం భానూను పిలిచి "తెల్లకాగితం అందుకో—జవాబు వ్రాయాలి—మీ అమ్మ ఉత్తరంవ్రాసింది" అన్నాడు రంగాచారి. లలితకు ఏదో పనిఛెప్పి గదిబైటికి పంపాడు.

"—సంగతులు తెలిసినవి—ఆస్థిపరుల యింటితో వియ్యమందుటకు నాకే మాత్రం ఇష్టముగా లేదు. మన కుటుంబాలలో దుర్బుద్ధులు లేనివాళ్ళు, పనిచేసి న్యాయంగా బ్రతికేవాళ్ళు లేరు—మీవుత్తరం చదివి నన్ను పిచ్చివాడికింద లెఖ్ఖ కట్టినట్లు తేల్చుకున్నాను— నా మనస్సు మారిందో లేదో నాకు తెలియదు—— మొత్తంమీద నాకేమీ బాగాలేదు—— నా దుఃఖం చెప్పుకోటాని కెవరూ లేరు. ఉద్యోగం మానివెయ్యా లనుకుంటున్నాను ఈ కారు కుర్రవాళ్ళంతా చెడిపోయిన రకం——భానూ నడవడిచూస్తే ఈ సంగతి - -"

తండ్రి వాక్యాలకు సంతోషిస్తూ వుత్తరం వ్రాస్తున్న భానూ, చటాలున తలయెత్తి నిశ్చితంగా "నేను చెడిపోలేదు నాన్నా!" అన్నాడు.

వాక్యంఆలోచిస్తున్న తండ్రి కోపంగా "చీట్లపేక మంచిదేనా? ఆడుక్కునే వాళ్ళని కర్రతో బాదడం మంచిదేనా? చెప్పవేంరా!" అని ఉగ్రుడైనాడు.

భానూ ముహం పశ్చాత్తాపంతో ఎర్రబడింది. "కొట్టాలని కొట్టలేదునాన్నా - అతని చెయ్యి విరిగిందని పనిలోనుంచి తీసేశారంట - నిన్న మీటింగుకు వెళ్లా - వాళ్ళునాకు తెలుసునాన్నా."

"ఎవరురా?"

"కూలీలు"

"ఏ కూలీలురోయ్"

"మిల్లులో కూలీలు - వాడుబూటు కాలితో తన్ని బైటికి నెట్టాడు - అంతా మీటింగుపెట్టి వాణ్ణిచేర్చుకోవాలని తీర్మానం చేశారు."

చీకట్లో వెతుకుతున్న వస్తువేదో లభించినట్లు తండ్రి దీర్ఘనిశ్వాసం విడిచి త్వరత్వరగా అదేరా - అదే - అదే - పాపం అదే - నా కదే బాధగావుందిరా -

ఇంకా ఏం జరిగింది ? చెప్పు - చెప్పు - చెప్పవేంరా ! పంచదారమిల్లు కూలీని, నీ పిల్లలికి పంచదార తీసుకోవద్దంటే ఎంతకోపంగా వుంటుంది-ఐతే అబ్బాయ్-స్కూలు మానేస్తే ఎట్లా ? మనకు తగింది కాదురా - ఊరేగింపుల్లో తిరగడంలేదు గద ! వొద్దు" అని విరాలోచనతో కిటికీలో నుంచి బైటికి చూచాడు

సిగరెట్టు టిన్నులమీద వేళ్ల మీటుతూ కొందరు డబ్బుపెట్టి పేక ఆడుతున్నారు. ఒకమూల ఇనుపబొయ్యిమీద వంటవాడు కాఫీ కాచుతున్నాడు. చల్లని గౌరవర్ణపు ఎండ, వాళ్ళ కళ్ళద్దాలమీద కళకళలాడుతున్నది. ఆవిరి పొగ వుంగరాలుగా నీలంగా పైకిపాగి మాయమౌతున్నది. వంటవాడు వేళ్ళు కాలి, నోట్లో పెట్టుకుంటుంటే దీక్షగా చూస్తుంటే దీక్షగా చూస్తున్నాడు. భానూ. మెరిసే బంగారపు వుంగరాలవంక చూస్తున్నాడు, రంగాచారి

ఇన్స్పెక్టరు వచ్చాడనీ బాంకి గుమాస్తాలు రాత్రి గం. 9 ల వరకూ కుర్చీల్లో నలుగుతూనే వున్నారు. రంగాచారి ఇంటికి బయలుదేరుతున్నప్పుడు మానేజరు పిలిచి. "నన్ను హెడ్ఆఫీసుకు రమ్మన్నారు-భాన్సు కొట్టావులే - నువ్వు మానేజరవుతున్నావోయ్ — అయాం ఆల్వేస్ హోప్ఫుల్ - కంగ్రాచ్యులేషన్స్" అని, మెల్లగా "నా - కం.... కం.... నథింగ్ ఆఫ్ దట్ నాన్సెన్స్" అని హెచ్చరించాడు.

తలవంచుకుని రోడ్డున నడుస్తూ, కలలు గంటూ, భానూతో తను కూలీల మీటింగుకు వస్తానని చెప్పిన మాట మరిచిపోయాడు.

మెల్లగా లలితను పిలిచి, తప్పు ఒప్పుకున్నట్లు "ఇకో రూ 50 లు ఎక్కువొస్తాయే అమ్మాయ్ మానేజరు చేశారు నన్ను" అన్నాడు కలతపడుతూనే, ఇంటివెనుక స్థలంకొని కలపుకోవాలని ఆలోచిస్తూనే నిద్రపోయాడు.

'ఉత్తరంలో వ్రాసినట్లు రేపే చెప్పిపారేస్తాను రాజీనామా రేపే రాసిపారేస్తాను. రాజీనామా ఇచ్చి ? వాళ్ళతోనా - అమ్మో కష్టమే–ఐనా రాసిపారేస్తాను' అనుకుంటూ పదిరోజులు సక్రమంగా ఆఫీసుకు హాజరైనాడు.

ఇంతలో భార్య బావమరిదితోసహా వచ్చి దిగింది.

వచ్చి వారం గడుస్తున్నా, పెండ్లి మాట ఎత్తకపోవటం గమనించి, భానూతో "మీ మామ ఏమంటున్నాడ్రా-ఏమి చెప్పడూ అతనూ అదీ గుసగుసలాడుకుంటారు— లలిత నేదో అడుగుతున్నట్టుందే" అన్నాడు

భానూ తల్లి,విని దగ్గరగావచ్చి "వాళ్ల మనిషిని పంపాను - మీతో అనలేక తమ్ముడు కిందుమీదౌతున్నాడు" అని నిర్లక్ష్యంగా అని, ఆప్యాయంగా "లలిత మనస్సు కష్టపెట్టి, నన్నూ మావాళ్ళని అడిపోసి మీరేం పుణ్యంకట్టుకున్నారండీ! నాకు మనసు మనసులోలేదు మిమ్మల్ని చూస్తే-నాకర్మ - మేనేజరు ఉద్యోగమైందని పెళ్ళాంతో అనని భర్తవుంటాడా?" అని ముహం చిన్నది చేసుకున్నది.

"నువ్వింట్రా - కూచో చెప్తా - భానూ, వెళ్ళి మీమామతో చెప్పు - ఎల్లుండి

తెలవు - ఆయన్ను తీసుకురమ్మను" అని పంపించాడు.

భార్య పక్కకొచ్చి, 'ఏళ్ళు ముదిరే కొద్దీ మరీ పసిపిల్ల లౌతున్నారు' అని ముద్దుగా పలుకుతూ గడ్డం పట్టుకుని "మీ సంతోషం నా సంతోషం కదూ - ఎందుకు చెప్పలే?" దని చిరునవ్వు నవ్వింది.

రంగాచారి నవ్వురాక ఆరాటపడుతూ "అందులో ఏముంది? ఉత్తరంలో రాశానుగా - నాకేం తోచడంలేదు, నన్ను చంపకండి" అని విసుగ్గా లేచినిలబడ్డాడు. అతని భుజాలు భార్య గట్టిగా, పట్టుకుని "పోనీ ఒకసారి నవ్వండి - మిమ్మల్నే" అంటూ మెల్లగా ముందుకు లాక్కుపోయి పక్కమీద వాల్చింది. తలుపులు, కిటికీలు మూసివచ్చి ప్రక్కనే అదుముకుని పడుకుని, "నా కర్మ - ఇన్నాళ్ళూ ఇంటి పెత్తనం చేశానని నన్నిట్లా శిక్షిస్తారా! నాకు తగిన శిక్షే-బుద్ధివచ్చిందిగా చెంపలు వేసుకున్నాగా - మీ మతి మారిందని హడిలిపొయ్యాం - తమ్ముడు రూ. 30 లు పెట్టి అభిషేకం చేయించాడు. ఒకరోజు సంతర్పణ చెయ్యాలంటున్నాడు - మీరు నాకు దక్కితే చాలు" అని వలవల ఏడ్చింది.

రంగాచారి గుండె రాయిలాగ బరువెక్కింది. ఏమి మనుషులురా భగవంతుడా- ఏం సంసారంరా-ఒక సంసారం మీద ఇంకొకటి కత్తినూరని లోకాన్నెందుకు సృష్టించవురా తని తపించాడు. పైటికి మాత్రం ఒసే—నాబాధ నీకేం తెలుసే-ఐనా-ఐనా- నేను బ్రతికున్నంత కాలం మీకు తక్కువ చేస్తానంటే - ఏం మాటలే" అని ఊరడిస్తూ దగ్గరగా లాక్కుని ముద్దుపెట్టుకున్నాడు.

పెండ్లివారు విడిదిలో వచ్చిదిగారు. పందిరి మధ్య తోరణాలు కట్టిస్తూ రంగాచారికి తీరికేలేదు లలితకు ఉత్సాహం వల్ల సిగ్గు అపరిమితమయింది. భార్య ఆడబంధువుల గుంపుతో మేళతాళాలతో ఇంటింటికీ తిరిగి పేరంటానికి పిలుస్తున్నది. శిల్కుచీరలు, ఎదువు సొమ్ములతో ముచ్చట పడుతున్నారు ఆడవాళ్లు.

ఊళ్ళో పెద్దల్ని ఆహ్వానించటానికి భానును పంపమని రంగాచారికి బావమరిది సలహా ఇస్తున్నాడు. పక్కగా చరచర వెళిపోతున్న భానూ, "రేపు ప్రొద్దునొస్తా పనుంది-పక్కవూరికెళ్లాలి" అని జవాబుకోసం ఎదురుచూడలేదు.

రంగాచారి నిస్తబ్ధుడై లోపలికివెళ్ళి జడ అల్లుకుంటున్న లలితతో" చూడూ! భానూ ఎక్కడా కనబడదేం-ఇంతహడావుడిగా వుంటే - నన్నొక్కణ్ణేసతమతమై చావమంటారా - పొద్దున రూ. 5 లు కావాలని తీసుకున్నాడు - ఎందుకో - నా కొక్కడికే పట్టిందా ఏమిటి" అన్నాడు.

లలిత సిగ్గుతో కంపిస్తూ, అన్నది, నోట్లో నాలిక లేనట్లు "విన్నేనే-మంచి మొగుణ్ణిసంపాదించారేయ్-మద్రాసులో క్లబ్బుల్లోడబ్బు తగలేస్తాట్టలే-జమీందారు బిడ్డట-ను వ్వేడవాల్సిన పనిలేదేయ్-ఎంత మందిని కనాలనుకుంటున్నావ్ - అని ఏడిపించాడు నాన్నా. చెవులు పట్టుకుని సాగదీశాడు - ముసలోడు కొత్తచీరలు కొన్నాడా అన్నాడు"

రంగాచారి ముహం వికృతమై, కనుబొమ లెగురవేస్తూ, "నేనా - నేనేనా -

మునలోణ్ణి కుర్రకుంక - ఇప్పుడు తెలి వొచ్చిందేం తనకి" అంటూ రుసరుస లాడుతూ తిరిగి వెళ్ళాడు.

"వాణ్ణేమనబోకు నాన్నా" అని లలిత ప్రాధేయపడింది.

రంగురంగుల విద్యుద్దీపాల తోర ణాల మధ్య, పెండ్లి బంధువుల కోలా హలంలో వాద్యగాండ్రు పీకలువూది సరిచూస్తున్నారు. పందిరిలో తాంబూ లాలు సేవిస్తున్న బంధువుల్లో గుస గుసలు బయలుదేరి "పిళ్ళబ్బాయి - వొట్టి తుంటరి వెధవటండీ - మనకు తెలియే తెలియదు చూశారా" అని ఒకరు.

"వొట్టి తిరుగుమోతు గాగుంది - మొన్న జండాలు పట్టుకుని పోతున్నా డండీ" అని మరొకరు

ఈ కాలపు కుర్రాళ్ళు నమ్మిడీ సంపా రించలేరుగదా, దేవుడు లేడంటారు" అని ఒక వృద్ధు విచారం వెలిబుచ్చారు.

రంగాచారి బావమరిది ఏమీ వినసట్లు కూచుని "కుర్రవాడంటే వాడండీ— అఫిషియల్ క్లబ్బులో వాడు మెంబరండీ! మా భానూ — ఆఫీసర్లంతా వాడి ఫ్రండ్సండీ" అని తన మాటలు తనే నమ్మినట్లు నిశ్శబ్దంగా లేచి రంగాచారి దగ్గరికి వచ్చాడు.

పెండ్లి కోలాహలం వివిధవాద్యాలు. విద్యుద్దీపాలు, చూచేందుకు గుమిగూడి బీదవాళ్ళు పందిరిచుట్టూ గుంపులుగా నిల బడ్డారు. వెళ్ళిపొమ్మని రంగాచారి కేకలు వేస్తున్నాడు బావమరిది ఏదో అంటే. ముఖంతిప్పి, "వాణ్ణి గురించి నన్నడగకండి—వాడున్నా పోయినా ఒకటే—దిక్కుమాలిన కొడుకు" అని ఈసడించుకున్నాడు "ఈ అలగాజనం ఇట్లా విరగబడుతుందేం. ఏం పొయ్యే కాలమొచ్చింది" అని ఇంకా చెప్పబో తున్నాడు.

భానూ, కర్రలచివర అతికించిన అట్టలమీద ఎర్రని పెద్దక్షరాలు వ్రాసి పట్టుకుని, పెళ్ళి బంధువులమధ్య గా వెళ్ళి జనంముందు ఆగి, "ఏం చూస్తారోయ్- ఏమిటి చూచేది— మీ కేం - భోజనాలు లేవు—ఇంటివెనుక భూమి అమ్మింది మీరేగా, పదండి-మైదానంలో బియ్యాన్ని గురించి మీటింగుంది—రండి" అని చర చర వెళ్ళిపోయాడు.

పెండ్లిబంధువులు తృప్తిగా నవ్వు కున్నారు.

భార్య రంగాచారి పక్కకువచ్చి, చెవిలో "చూడండి—వాడు—వాణ్ణి పట్ట డము మనశక్యంకాదు" అని చెంగు ముఖాని కడ్డంపెట్టుకున్నది

రంగాచారి నిశ్చేష్టితుడై విగ్రహం లాగ నిలబడ్డాడు.

★

"అధ్యాపకులందరూ విద్యార్థులతో కలసి మెలసి తమ విషయాలు చక్కగా బోధించారు. తమ దృక్పథాలనూ సిద్ధాంతాలనూ ఎంతో ఓర్పుతో వివరించారు.

"వచ్చిన రచయితలందరికీ అంతో ఇంతో ఉపయోగం కలిగి తీరింది...."

—భాషాప్రవీణ, కొత్తపల్లి రంగారావు.

హారు

శ్రీ కంచర్ల వెంకటప్పయ్య

ఈ లోకంలో
నాదేదో వుందని
ఏదో వస్తుందని
ఆకలి ఒక జ్వాలలాగ
నాలుకలే చాచింది,
వా విడిచే,
అన్నమన్న మని అరిచాను
నావారెవరో ఉన్నారని,
ఆర్చెదరని తీర్చెదరని
ఆశాలత మింటికొసల
నల్లుకోను సాగింది.
తెల్లవాళ్ళు నాకడుపున
పెట్టిన చిచ్చార్పుకొనగ
మంచినీళ్ళు కావాలని
మరి మరి యెలుగెత్తాను-
కాని,
ఆకలితో కాకలతో
అగ్గయి బుగ్గయిపోయే
నాహృదయంలోనాటుకొంది
పోలీసు తుపాకిగుండు.
నాకు వరా లివటానికి
ఆకాశం దిగివచ్చిన
దేవతలా ? కారువీరు -
యములవాళ్ళు కసాయీలు
నిలువున చర్మం వొలిచీ,
వినోదించే రాక్షసులు
నావారే ఈనాటికి
ఈరూపున వచ్చారా !
పరప్రభుత్వపు
మరతిరగలిలో
నలిగి నలిగి విరిగిన నా
కంకాళం పైమలబార్
పోలీసుల లాఠీ
నటియించిందా ?
చీకటి నడిరేయిని
కొడిగట్టిన దీపంలో
క్రొత్త క్రొత్త లోకాలకు
క్రొత్తదారి వెతకాలని
నా రక్తం నూనియగా
నాకన్నులు జోతులుగా
వెతకివెతకి చూచానే-న న్నీ
నరక కూపమున ద్రోచారే!
ఈ నైరుంకుశ్యపు వల్లకాట
నే భేతాళపు టాకలితో
రక్తం ఘాంసము పిడిచీ,
మేధస్తంత్రులు త్రెంచీ,
నరనరమ్ము కదిలించీ,
ప్రకృతిపై కత్తిగట్టి
విద్యుత్తుల నెత్తితినే !
ఈనాచేసిన త్యాగానికి,
ఫలితార్థమిదేనా ?
పోలీసు తుపాకిగుండు,
అంతేనోయ్, అంతే,
ఓక్షుధాభగ్నహృదయులారా!
వ్యథామగ్న జీవులారా !
మనకీ రాజ్యంలో
అపరరామ రాజ్యంలో
గడ్డికరచి, గాలిత్రాగి
బ్రతకటమే, నీతిట
అంతేనోయ్, అంతే

ఈ సామ్రాజ్యపు సంకెళ్ళను
బదాబదలు చేయుటకై
జీవజగద్రాజ్యానికి
రాచబాటవేయుటకై
అల్లదుగో,
అది గదిగో -
వస్తున్నది వస్తున్నది
ఉరుములతో, మెరుపులతో
మెరుపులతో ఉరుములతో
హోరుమంటు వస్తున్నది.
దిక్కుల దిక్తీరాలను
ఒరుసుకొంటు వస్తున్నది
మ్రోతలతో మోసులెత్తి
విలయకాల వేగంతో
విప్లవ ఝుం ఝూ....
రానీయండీ!
రా రా నీ యండీ -

ఆ శ్రుతిలో శ్రుతిగలిపీ,
లయలో లయగలిపీ,
సంధ్యాశివ తాండవమ్ము
సాధిస్తాలోకంలో,
ఆబెడ గొండల్లో
మెరిసే మెరుపై
ఉరిమే ఉరుమై
ధనిక వాద కీలల్లో
దగ్ధమయే జగత్తునకు
కుంభవృష్టి గురిపిస్తా
క్రొత్తమోసులెత్తిస్తా
రానీయండీ !
రా రా నీయండీ ! -
విలయకాల వేగంతో
విప్లవ ఝుం ఝూ
ఉరుములతో మెరుపులతో
హోరుమంటు వస్తున్నది.

★

ఆంధ్ర సాహిత్య పాఠశాల

"ఈ అభ్యుదయ పాఠశాలవలన అనేక విషయములు అవగతమైనవి. దీనికి ముందున్న నా సాహిత్యజ్ఞానమునకు, ఈ పాఠశాలవలన నేర్చుకున్న దానికి హస్తిమశకాంతరము."

— లింగుట్ల కోనేటప్ప,
(అనంతపురం జిల్లా)

★

"ఆంధ్ర సాహిత్య పాఠశాలను పట్టణానికి దూరంగా మా పల్లెటూళ్లో పెట్టినందుకు మీకు ధన్యవాదాలు. మీలో మీరు కలిసి మెలసి, అన్యోన్యంగా కృషి చేయడం ఎంతైనా ప్రశంసార్హం."

— చదలవాడ కుటుంబరాయుడు.
(సాహిత్య పాఠశాల ఉపయోగార్థం తన గృహాన్ని అవర ణనూ ఇచ్చి పాఠశాలా నిర్వహణకు తోడ్పడినపెద్దరైతు)

సుప్రసిద్ధాంధ్రకవిశేఖరులు



శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు

'నా ప్రేయసి'

రచన:
ఎల్. సోబలేవ్

అనుకృతి:
ఏల్చూరి సుబ్రహ్మణ్యం

'ల్యూబా' ఆస్పత్రికి వస్తే మా ప్రాణాలు కుదటబడేవి. ఆమె వార్డులో అడుగుపెడ్తే, మమ్మల్ని వెంటాడుతున్న దయ్యాలు కొంచెం దూరంగా పోయ్యేవి. అసలు అమె ఎంతత్వరగా నడిచినా చప్పుడుకాదు, తెల్లటి దుస్తులు వేసుకొని ఆమెనడుస్తున్నప్పుడు, కాంతి కిరణం కదుల్తున్నట్టుగా వుంటుంది. తడి తడిగావున్న ఆమె గులాబి రంగుబుగ్గల మీద పడినమంచు, ముత్యాలలాగా మెరిసేది. బాధతో మూల్గే రోగులను చూస్తున్నప్పుడు, చీకటింట్లో పెట్టిన దీపం మాదిరిగా మెరిసేవి ఆమె కళ్ళు.

మావార్డులో చిట్టచివర పక్కమీద 'మేజర్' పడుకునేవాడు. అతనికి యుద్ధములో కాలువిరిగింది. 'ల్యూబా' కనిపించగానే యవ్వనంలోవున్న ఆడవాళ్ల బుగ్గలు రోజాపూలకంటే ఎక్కువగా మెరుస్తాయి అనేవాడు 'ల్యూబా' చిరునవ్వునవ్వేది మేజరు కొంచెం ఆగి, 'ల్యూబా! మేము బ్రతికి బయట పడతామా?' అని, నొసలు ప్రశ్నార్ధకంలాగా చిట్లించేవాడు. 'తప్పక బ్రతుకుతావు' అని ఆమె జవాబు స్పష్టంగా చెప్పేది. గొంతుక వినసొంపుగా వుండేది. ఆసుపత్రి అన్నిదిక్కులూ 'బ్రతుకుతావు.... బ్రతుకుతావు' అని ప్రతిధ్వనించేది పాలిపోయిన శరీరాల్లో కొత్త నెత్తురు పెట్టినట్టు ఆమెమాటలు కొత్త కొత్తఊహాలు కల్పించేవి

చలికి కొంకర్లు పోతున్న ఆమె చేతి వేళ్ళను, నల్లగావున్న ఆ పెద్ద పొయ్యి దగ్గర నిల్చుని కాచుకునేది మంటలు కక్కుతున్న ఆ పొయ్యిదగ్గర నిల్చుని అనేక సంగతులు చెప్తుండేది. పని ఎంత త్వరగా చేసుకపొయ్యేదో మాటలు అంత త్వరగా మాట్లాడేది. ఆ కొద్ది మాటల్లోనే యుద్ధవార్తలూ, రోగుల ఆహారమూ, బజార్లో ధరలూ, నిన్న రాత్రి ఆమె చూచిన సినిమాలను గురించి చెప్పేది. అంతకు పూర్వం నరాలు తీసుకుంటున్న రోగులు సైతం ప్రాణం, శక్తివచ్చినట్టు కదిలేవారు. ఉత్సాహంతో కళ్ళు తెరిచేవారు. ఆమె పొయ్యిదగ్గర నిల్చుని వార్డు మొత్తం కలయచూచేది. దినచర్య నిర్ణయించుకుని క్షణంలో ఒక రోగిదగ్గర్నుంచి మరొక రోగిదగ్గరకు వచ్చేది తెల్లటి దుప్పట్లు మడతపడకుండా కప్పేది డాక్టరు అవసరం అనుకున్న రోగుల దగ్గరకు డాక్టర్ను పిల్చుకొచ్చేది. రోగుల జుట్టు సవరించేటప్పుడూ, ముఖాలు

కుట్రం చేసేటప్పుడూ ఒక్క బొట్టు నీరైనా దిండుమీద చిందకుండా చేసేది. ఉత్తరాలు రాసుకోలేని వాళ్ళకు ఉత్తరాలు రాసిపెట్టేది. మృత్యువుతో క్షణక్షణమూ సమరం సాగిస్తున్న మాకు, అలసటా, బాధా యెంతో వుంటుంది. గాయపడిన మాకు యెంతో సున్నితంగా ధైర్యంచెప్పి ప్రాణం పోసేది. మెత్తటి ఆమె అరిచేతులతో బాధను తీసేసేది శాంతంగా అందరికీ నిద్రపట్టేదాకా ఆమె పనిచేసేది

మాకు ఆమె అంటే ప్రాణంగా వుండేది. పూలపాన్పులాంటి ఆమె హృదయంలో మా అందరికీ చోటు యిచ్చేది. మాలో ఒకరొకరికి అసూయ లేదు. కత్తులబోనులాంటి మృత్యువు. కరకు హస్తాలలో చిక్కుపడ్డ మేము యెవర్నిచూచి అసూయపడతాము?

ఆమె ఎవరిపక్కమీదనన్నా ఎక్కువ సేపు కూర్చుని మాట్లాడిందంటే, ఆరోజు అతను మరీ కుంగిపోయినా డన్నమాట అతనికి ఆమె ప్రాణం పోస్తున్నదను కోవాలి

ఇవ్వాళ ఆమె నామంచంమీద వచ్చి కూర్చుంది. రాత్రి అంతా నాకు నిద్రపట్ట లేదు ఈ కథకు సంబంధించని విషయాలు యెన్నో నన్ను బాధించాయి. ఉదయం ఆమె నన్నుచూచి నవ్వగానే, ఎక్కడో లేనినవ్వు, అతికష్టంమీద తెచ్చుకుని ఆమెకు స్వాగతమిచ్చాను. ఇంత చిన్నతనంలోనే ఆమెకు పక్కవాడి బాధ తెలుసుకోగలిగిన శక్తి ఎక్కడ నుంచి వచ్చిందా అని ఆశ్చర్యంకలిగేది. ఆమె నాదగ్గరకు వచ్చేటప్పుడు యెన్నో జాబులు పట్టుకొచ్చింది. చాలాసేపు నాతో ఉత్సాహంగానే మాట్లాడింది.

కానీ, ఆమె రోజూ నవ్వినట్టు నవ్వలేదు ఆమె నీలికళ్ళల్లో దైన్యం అలముకొన్నది. ఆమె ఎంతో పెద్దదైనట్టు యివ్వాళ కనిపించింది ఆమె జాబులు తెల్లటి బల్లమీద దుఃఖకరంగాపడివున్నై. ఆమెబాధ యేమిటని మాలో గుసగుసలు బయల్దేరినై.

ఆమె భర్త టాంకుదళాల్లో పనిచేసేవాడట. అతని సాహస కృత్యాలకు వాటి రెండు పతకాలుకూడా వచ్చాయిట అయితే - యిప్పుడాయన ఒక నెలనుంచీ కనిపించటంలేదు. ఈ నెల అంతా ఆమె బాధను దిగమింగి, మాకు ఉత్సాహాన్ని ఇస్తూనేఉంది. యెంత అప్రమత్తతతో ఆమె పనిచేస్తున్నా, ఆమె కళ్ళల్లో, ముఖంలో దైన్యం తాండవిస్తున్నది రాత్రిళ్ళు ఆమె బాధతో ఏడ్చేది. స్నేహితులను లేపి మాట్లాడేది కాదు. యివ్వాళ ఆమె సాయంత్రం సెలవు తీసుకున్నది. టాంకుదళాలలో పనిచేస్తున్న ఒక ఉన్నతోద్యోగి (ఆమె భర్త స్నేహితుడి) దగ్గరకు వెళ్ళింది.

ఆ అధికారి ఆమె చేతులు పట్టుకుని ఓదార్చాడు. నేను నిజం చెప్తున్నాను. 'పావెల్' శత్రువులకు చిక్కివుంటాడు. అందరూ తప్పించుకుని వచ్చారు, పావెల్ యింకా రాలేదు

అగ్నిపర్వతం పగుల్తున్నట్టు ఆమె గుండెలు దడదడ లాడుతున్నై ముఖం కొయ్యబారి ఆమె ప్రతిమలాగా నిలుచున్నది. అధికారి 'నువ్వు యిట్లా అధైర్యపడకూడదు, పావెల్ తప్పక వస్తాడు.

ఎప్పుడు వస్తాడో అందాకా నువ్వు నిరీక్షిస్తుండాలి. ఇట్లా ఎదురుచూస్తూ వుండటం కష్టమే. ఓర్పు వహించాలి. నువ్వు యెప్పుడు ఎదురుచూస్తూ వుండనక్కర్లేదో నేను చెప్తాను' అన్నాడు.

బాధతో కుంగిన ఆమెను చూచేసరికి నా బాధ మరచిపోయాను పురుషుణ్ణి కావటంవల్లా, నా గుండెల్లో మెత్తటి మాటలు లేకపోవటంవల్లా ఆమెకు ఉపశమనం కలిగించేటట్లు మాట్లాడలేక పూరుకున్నాను. నిరాశలో సైతం ఆమె మాకు యెన్ని ఆశలు కల్పించేది.

కాళ్ళు కండెలు కట్టి మేజర్ బాధతో గుంజుకుంటున్నాడు. నీళ్ళల్లో రాయి వేస్తే వలయాలు వలయాలుగా రాతి చుట్టూ నీళ్ళు తిరుగుతై అట్లాగే విరిగిన కాలుదగ్గర ఆరంభమైన నొప్పితో మేజర్ ఉంగరాలు తిరుగుతున్నాడు? తన్నుకుంటున్న మేజర్ని చూచేసరికి, ఆమెబాధ యెటుపోయిందో? ఆ చిన్నతనంలోనే ఆమె పడుతున్న కష్టాన్ని మేము ఊహించుకోలేక పోయినాము. అంతశక్తిమాకులేదు!

తర్వాత నన్ను యింకో వార్డులోకి మార్చారు వారం గడిచింది. వారం గడిచాక, మళ్ళీ నావార్డులోకి వచ్చాను పాతస్నేహితులు ఎవరూలేరు. కొత్తగా గాయపడ్డవాళ్ళు వచ్చారు,

నామంచం పక్కనే కదలికలేకుండా వొళ్ళంతా కట్లతో పడివున్న మనిషి కనిపించాడు. అంతా గాజుగుడ్డతో చేసిన బొమ్మలాగా వున్నాడు ఆకట్లమనిషి!

ఇతను, టాంకు దళాలలో పనిచేసే సైనికుడు, రొమ్ము, ముఖమూ, అంతా కాలిపోయింది జుట్టూ, కనుబొమలూ, నొసలూ-అంతేకాదు. మానవ శరీరం మీద కాలిపొయ్యేది యేదివుందో అదంతా కాలిపోయింది. అతని కళ్ళకు మాత్రం అదృష్టవశాత్తు నల్లటికళ్ళ జోడువుంది. అది రెప్పలనూ, గుడ్లనూ రక్షిస్తూ, కట్లనూ అతన్ని వేరుచేస్తున్నది. తెల్లటి కట్టూ, ఉబికినట్లున్న అనల్లటికళ్ళద్దాలూ చూస్తే, కాలిచల్లారినకొండలాగావుంది.

కళ్ళద్దాలక్రిందిగా కట్టుకు ఒక చిన్న చిల్లి ఉంది ఈ చిల్లిలోనించి మాటలు వినిపిస్తున్నై. ఆ కాలినమనిషికీ ప్రపంచానికీ యిదే సంబంధం. సైనికుడి వొళ్ళంతా సూదులతో పొడిచినట్టుంది. నరనరంలో మంటలు యింకా మండుతూనేవున్నై. కట్లు మార్చినప్పుడల్లా ఆయన నరకయాతన పడాలి. ఈ బాధ అతను భరిస్తున్నాడు. అతనికి బ్రతకాలని కోరికవుంది. బ్రతికి మళ్ళీ శత్రువులను చెండాడుతాడట ఈ కోర్కెతో అతను బ్రతికి బాధపడుతున్నాడు. కట్టుకట్టినా నాలుకమాట్లాడుతున్నది. అతనికి మాట్లాడాలని ఎంతో వుంది. మంటలమధ్య అతను సృష్టించుకున్న ప్రపంచంలో నుంచి అతని మాటలు 'యెవరు వింటారా' అని చూస్తున్నాడు. కట్లలోనుంచి వస్తున్న మాటలు, అస్పష్టంగా చిత్రంగా వున్నై. గాయపడినవారి వాక్యాలు తెగిపోయిన గొలుసుల లాగావుంటై. ధైర్యం, ద్వేషం చావుల సంరంభాలను అవిప్రతిధ్వనిస్తై. అబ్బా! ...ఇరవైరెండోయేడైనా నిండని యువకుడు, తన కలల్ని కట్లలోనుంచి చెప్పాలని పోరాడుతున్నాడు. ఈ రాత్రి

మా యిద్దర్నీ ఒకచోటికి తెచ్చింది. జబ్బులూ, యుద్ధాలు........ త్వరగా స్నేహం కలుపుతాయేమో !

తెలతెలవారకముందే నేను నిద్ర లేచాను. వార్డులో గాలి వెచ్చగా వుంది. రోగుల.... పురుషుల ఉఛ్వాసనిశ్వాసాలతో వేడెక్కిన గాలి ఘాటుగావుంది. ఈ శబ్దాన్ని కోస్తున్నట్టు మధ్య మధ్య మూలుగు వినిపిస్తున్నది. ఆ మూలుగు వినవస్తున్నవైపు. 'తెల్లటి మనిషి' యెవరూ పోకపోవడంవల్ల యింకా 'ల్యూబా' రాలేదనుకున్నా. ఆమె రానట్టుంది. 'ఫెన్యా' వుందేమో వార్డులో. ఆమె నడివయస్సులో వుంది. త్వరగా అలసిపొయ్యేది రాత్రిళ్ళుపొయ్యేముందు వేసివున్న కుర్చీలో నిద్ర పోతుంది. నేను బయటికి వెళ్ళి సిగరెట్ కాల్చుకుందామనుకున్నాను ఇంతలో టాంకు సైనికుడు 'దాహం' అన్నాడు. 'ఫెన్యాను' లేపుదామనుకున్నాను

అతను : 'వద్దు, మీరివ్వండి ఫరవాలేదు '

నేను జాగ్రత్తగా మంచినీళ్లుపోశాను. యెంతో జాగ్రత్తగా పోసినప్పటికీ కట్టుమీదపడ్డై. నామనస్సు నొచ్చుకుంది, క్షమించమన్నాను. 'దీనికేనా?—' అతను నవ్వాడు. మాటమాటకూ మధ్యవచ్చిన వ్యవధి నవ్వు అనుకోవాలి. 'ఆమె మంచినీళ్లు పోసినట్లైయితే మనం తాగినట్టే వుంటుంది' అన్నాడు.

నేను : 'ఆమె ఎవరు ?'

అతను : 'నా ప్రేయసి—'

మనస్సు విప్పి నాకు అతని ప్రేమ గాథ చెప్పటం మొదలుపెట్టాడు ఆయన యిదివరలో చూడని, ముందు చూడటానికి వీల్లేని స్త్రీనిగురించి మాట్లాడుతున్నాడు ప్రతివాక్యమూ 'నాప్రేయసి' అనటంతో ఆరంభిస్తున్నాడు. సున్నితంగా ఆమె అతని చెయ్యి పట్టుకున్నప్పుడే అతను ప్రేమించాడట' అతను పేరు చెప్పలేదు. పైగా కొన్ని మాటలు పలకలేదు. నేను 'ల్యూబా' అనుకున్నాను; ఆమె సంగతిచెప్తున్నప్పుడల్లా వీరుడిలాగా గర్వంగా మాట్లాడేవాడు ఉద్వేగంవల్ల కొంత చెప్పలేక బాధ పడుతున్నాడు.

ఆమె కళ్ళు, కొనతేరి చెక్కినట్టున్న ముక్కు, పట్టులాగావున్న ముంగురులను వర్ణించాడు రాత్రి ఆమె థర్మామీటరు వెతుకుతున్నప్పుడు, చేత్తో నిమిరి చూచాడట ఆమె చెయ్యి, వేళ్లు మెత్తగావున్నాయట స్పర్శవల్లనే ఆమె యెంతో జాగ్రత్త గలిగిన వ్యక్తి అని నిర్ణయించుకున్నాడు. యుద్ధాల్లోమంటల్లో నుంచి వచ్చిన ఆయోధుడికి ముందు ముందు ఆమె ఆధారమట.

ఆమె అతన్ని యెట్లా ఓదార్చిందీ, యేమేమి చెప్పిందీ పూసగుచ్చినట్టు వరసగా చెప్పాడు. యింత సుఖం యివ్వగలిగిన వ్యక్తి 'ల్యూబా' కాకపోతే మరెవరు?

ఆయన పేరుచెప్పడు. తిన్నగా రేపు డాక్టరు నాకళ్ళకు జోడు తీస్తాడు. నేను ఆమెను చూస్తాను. నేను రేపు ఆమెను చూస్తానని, ఆమెకు చెప్పలేదు. అయినా ఆమెను నేను చూడక్కర్లేదు కూడా.

ఆమె అందగత్తె ఆమె కళ్ళల్లో ప్రేమ తొణికిసలాడుతుంది' అన్నాడు.

రేపు ఆమె అతనికి ఒక శస్త్ర చికిత్స చేయించే విషయం కనుక్కొని చెప్తానందిట దాన్తో కనుబొమలూ, ఇదివరకటి చర్మం, రంగూ అన్నీవస్తాయిట. దీనికోసం ఎంత బాధనైనా ఓర్చుకుంటాడట. ఇదంతా 'ప్రేయసికోసం' అన్నాడు 'నాప్రేయసి' అని గర్వంగా చేతులు రొమ్ముమీద పెట్టుకోబోయినాడు కట్లవల్ల ఆప్రయత్నం విఫలమైంది.

ఇంకా ఆమెసంగతిచెప్తూనేవున్నాడు. తనకు యుద్ధంలో ముఖం పోయిందట. ఆమెకుప్రియుడుపోయినాడట దీర్ఘంగా గడచిన రాత్రి వాళ్ళు ఒకర్నొకరు అర్థం చేసుకుని మాట్లాడుకున్నారట. మృత్యువు శాసించే యీ ఆస్పత్రి ఆవరణలో, ప్రేమ తన అమృత హస్తం చాచింది వెన్నెల విరిసి, కనుల పండువుగా కురిసినట్టుంది.

అనేకసార్లు సైనికుడు తన్నుతానే కాల్చుకోవాలనుకున్నాడట ఇకముందు అతనికి అలాంటి దుర్దశ రాదట. యెంత వికారంగావున్నా శత్రువులను ఓడించి, ప్రేయసితో సుఖమయ జీవితం గడుపుతాడట, ఎట్లాగో ?—యిప్పుడు కాలి, కాలుస్తున్న బాధ యెట్లావున్నా అతను కొత్తగా వున్నాడు. భవిష్యత్తు ఆశాజనకంగా, ఇంద్రధనుస్సులాగా అతని మనోవీధులలో వంపులు తిరిగింది.

'నీ ముఖం, అందం యెట్లావున్నా పరవాలేదు. నీకోసం నిన్ను ప్రేమిస్తున్నాను. ముందు ప్రేమిస్తాను' అని చెప్పిందట ప్రియురాలు-

కొంచెంసేపు యేమీ మాట్లాడలేదు. ఏడుస్తున్నాడు ఏడుపుకాదు. అతను పొంగుతున్న సంతోషాన్ని పట్టలేకుండా వున్నాడు. అతని హృదయం చెలియలికట్టను తెంచుకుని పొర్లిన ఏరులేవుంది

అతన్ని పడుకోమని, నేనువచ్చి పడుకున్నాను నా మనస్సు 'ల్యూబా' సంగతి ఆలోచించటం మొదలుపెట్టింది చిత్రంగా ఆమె జీవితంలో వస్తున్న మార్పును ఊహించలేకుండా ఉన్నాను. ప్రేమా ?—యిది జాలివల్ల బాధితునికి చేస్తున్న పరోపకారమా ? లేక అతని దుఃఖాన్ని ఆమె పంచుకుంటున్నదేమో! తన ప్రియుడివంటి మరొక సైనికునికి, ఒక వీరుడికి సాయం చేస్తున్నదేమో! బాగా తెల్లవారిన తర్వాత ఆమె రాగానే యెట్లావుంటుందో. ఆమె కళ్ళల్లో యీ ప్రశ్నలకు కాదు - సంశయాలకు సమాధానం దొరుకుతుందేమో వెతకాలనిపించింది.

నాకు భారంగా నిద్రపట్టింది. ఎండ ఎక్కిన తర్వాత మెలకువ వచ్చింది. నర్సులు మారినట్టున్నారు. 'ల్యూబా' రాలేదు. టాంకు సైనికుడి దగ్గర కెళ్ళి ఆమె రాలేదన్నాను

'మంచిది........ ఆమె నావిషయం నా కట్టు విషయం కనుక్కోటానికి వెళ్ళింది. ఇవ్వాళ ఆమెను నేనుచూస్తాను కదూ !' అన్నాడు

అతను మాట్లాడుతున్నదాన్ని బట్టి నేను చిరునవ్వు నవ్వుతున్నాడనుకున్నాను.

'నిజంగా అందగత్తెఅంటే....ఆమె కదూ !—నీకు తెలియదూ ?' అన్నాడు.

'నిజంగా ఆమె చాలా చక్కనిది!' నేను జవాబు చెప్పాను.

యివ్వాళ ఆమెను తను యెట్లా చూడగలుగుతాడో చెప్తూ మధ్యలో మాట్లాడటం మానేశాడు. కట్లు చెవులకు అడ్డంగా వున్నా మెత్తటి అడుగుల చప్పుడు వింటున్నాడు.

'ఆమె వస్తున్నది.. నా ప్రేయసి!' అన్నాడు.

నేను తలయెత్తిచూచాను. 'ల్యూబా' కాదు. 'ఫెన్యా వస్తున్నది. అతను పొరపడుతున్నాడని తెలుసుకునే టందుకు వస్తున్న 'ఫెన్యాను' పిలిచి స్వాగతం చెప్పాను. అక్కడినుంచి పొయ్యి దగ్గరవున్న ఫెన్యాదగ్గరకెళ్ళి 'ల్యూబా' సంగతి అడిగాను.

ఫెన్యా: 'ల్యూబా యివ్వాళరాదు. ఆమె భర్త యుద్ధంలో గాయపడి తిరిగి వచ్చాడట. అక్కడికి వెళ్ళింది'

నేను: 'ల్యూబా భర్తవచ్చాడా?'

ఫెన్యా: 'అవును'

పొయ్యిదగ్గిర్నుంచి ఫెన్యావెళ్ళి సైనికుడి మంచం మీద కూర్చుంది సైనికుణ్ణి సంబోధిస్తూ 'కోల్యా! నువ్వు ధైర్యంగా వుండాలి. నీకు మళ్ళీ కట్టు కట్టాలి' అని చెప్పింది.

వణకుతూ అతను చెయ్యి అందించాడు. మృత్యువునూ, శత్రువునూ ధిక్కరించిన ఆ వీరుడి చెయ్యి ఫెన్యా పట్టుకుంది. ఆమె కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. నల్లటి కళ్ళద్దాల వెనుక జ్యోతులలాగా వున్న అతని కళ్ళల్లోకి చూచింది. తన కన్నీళ్ళు అతనిమీద పడకుండా ముఖం అటువైపు తిప్పుకుంది రోజూ చూసే ఫెన్యాను ఇవ్వాళ చూచాను. కొత్తగావుంది. వయస్సు మీరినా ఆమె ముఖంలో యవ్వనం కళ-కళలాడు తున్నది ఆశ జాలి ఆమె కళ్ళల్లో గూడుకట్టుకున్నట్టున్నై.

'నా.. ? యేమిటి మందు వేసినట్టున్నావు?' అన్నాడు అతను. ఫెన్యా అతనికి ధైర్యంచెప్పి, ఇంకా పనిఉందన్నది. ఆమె కళ్ళు అతని బాధను చూడలేకుండా వున్నై. అతన్ని పక్కనేవున్న రబ్బరు గాళ్ళ బండిమీద పడుకోబెట్టి ప్రత్యేక చికిత్సకు తీసుకెళ్తున్నారు. ఫెన్యా అతని చేయపట్టుకుని వెళ్తున్నది ఫెన్యాలో మాతృత్వం పెల్లుబికినట్టుంది. నేనుకూడా ఆమెతోపాటు కట్టుకట్టే గది దగ్గరకు వెళ్ళాను.

ఆమె గది వాకిలిదాకా వచ్చి ఆగిపోయింది. ఆమె వాలిన తీగలాగా గది తలుపువైపు ముఖం తిప్పి ఏడుస్తున్నది. ఆమె అతని బాధను ఊహించుకుంది దుర్భరంగా.

నేను ఆమె భుజంమీద చెయ్యివేసి 'భయపడవద్దు' అన్నాను.

ఆమె 'డాక్టరుచెప్పాడు. .డాక్టరు...' అంటూ ఏడుస్తూ మాట్లాడలేకపోయింది

నేను: 'నాకు తెలుసు. నువ్వు ఊహించుకున్న బాధ నాకు తెలుసు ధైర్యంగావుండు. అతన్నిబ్రతికించాలి,

ఆమె బాధతో తలవూపింది. కళ్ళు నీళ్ళతోనిండి వొత్తులలాగా వున్నై.

'ఇవ్వాళఆయననన్నుచూస్తాడు. నేను ఆయనఅనుకున్నంత అందంగాఉంటానా

అంత అందంగా....నేనా? అతని ప్రేయసి అందగత్తె!' అంటూ ఏడుస్తున్నది. ఫెన్నీ ముఖం తలుపుకు ఆనించి చేతులు అడ్డం పెట్టుకున్నది

లోపలినుంచి డాక్టరు మాటలు వినిపిస్తున్నై. సైనికుడితో 'ఒకవారం రోజులు నువ్వు ఇంకా యీకళ్ళజోడు పెట్టుకోవాలి నీకు నయమై పోతుంది' అన్నాడు.

యీ మాటలు వింటున్న ఫెన్నీ ముఖం వివర్ణమై పోయింది ఎండు టాకులాగా ఆమె మనస్సు కొట్టుకలాడింది. ఆమె అప్పుడే మెట్లు దిగి పోయింది.

మళ్ళీ ఆమెను ఆస్పత్రిలో యెవరూ చూడలేదు. అతని కోసం అతన్ని ప్రేమించి బ్రతికించిన సుందరికీ, అతని స్వప్నసౌధాలకూ భంగం కలిగించకుండా వుండటానికని-పాపం, ఫెన్నీ ఉద్యోగం వదలుకుని స్వగ్రామంలో వుంటున్నదట!

★

తెలుగుదనం మూర్తీభవించిన సాహిత్యవేత్త



శ్రీ నిడదవోలు వెంకటరావుగారు

నాకు తెలీదు

శ్రీ కొడవటిగంటి కుటుంబరావు

వాడి సంగతులన్నీ నన్నెందుకడుగుతారో? నాతో ఎందుకు చెబుతారో? వాడి జోక్యం నాకస లవసరంలేదు. నేనసలు వాణ్ణి సరిగా ఎరగను.

“వాడు నీబంధువేటగా?” అంటారు- నా బంధువులందర్నీ నే నెరిగినట్టు. కస్త్వం భ్రాతః? మొన్న ఈమధ్య ఒక అతను మాయింటికొస్తే మర్యాదగా కూచోబెట్టి “ఏం పనిమీద వచ్చారు? ఏవూరు?” అని అడిగాను. నేనంత మర్యాదగా మాట్లాడించినా, అతను మొహం మటమటలాడించుకొని, ఏదో గొణుక్కొని లేచి వెళ్ళిపోయినాడు. మొహం ఎక్కడో చూచినట్టుందే అని అనుకున్నానుగాని, ఎంత సేపటికీ తట్టలేదు. ఆఖరుకు మా చెల్లెలిమొగుడి మొహమల్లే ఉందని జ్ఞాపకం వచ్చింది అతనేనా అన్నంత అనుమానం కూడా కలిగింది. చెప్పొద్దూ! కాని అతనయితే ఎందుకు వెళ్ళిపోతాడూ? పాపం. ఏం చూచుకుని అతనికింత అహంకారం ఉంటుందీ? బొత్తిగా లేనివాడు. నా బోటిగాడినుంచి అంతో ఇంతో సహకారం అపేక్షించదగినవాడు. అటువంటి వాడు మాటా, పలుకు లేకుండా లేచి వెళ్ళిపోతాడా?”....కాని అంత పోలిక ఉండటం—ఉంటారు మనిషిని పోలిన మనుషులు!....

ఈ సీతాపతి - వీడి సంగతి అట్లా కాదే. వీడి మొహం ఎరుగుదును. కనపడితే మర్యాదకు పలకరిస్తాను. వీడూ నేనూ చిన్నతనంలో పదేళ్ళు కలిసి చదువుకున్నాం కూడానూ. అయితే వాడి సంగతేమీ నాకు తెలీదు. నాకు వాడితో పెద్ద పరిచయం ఏమీలేదు. వాడు నన్నెరుగుదునని చెప్పుకుంటే నేనందుకు బాధ్యుణ్ణా? ఎవరెవరో వచ్చి, “నేను నీమేనత్త మొగుణ్ణిరా, నాయనా!” “నేను మీ పెద్దక్క బావగార్నోయ్!” “నేను మీ పినతల్లిమామగార్నబ్బాయీ” “నేను నీ ఫోర్తుఫారం క్లాసు టీచర్ని” “నేను నీ మేనమామ కొడుకునురా!” “నేను నీ పెత్తల్లి కొడుకును!”అంటూ చెప్పుకుంటారు. మొహాలు చూడబోతే అన్నీ కొత్తగా ఉంటై.

పోనీ నేను మొహాలు గుర్తించలేని వాణ్ణా? చదలవాడ కుమార్రాజాగార్ని నేనెప్పుడూ చూడలేదు. ఫొటోకూడా చూచినట్టు జ్ఞాపకంలేదు; కనక చూడ లేదనే చెప్పాలి. మరి ఆయన్ని చూడగానే పోల్చుకో గలిగానా?

ఆమధ్య గిరిగారు ఫలానిటాకీ బహిరంగ ప్రదర్శనానికి వస్తారంటే ఆహ్వా

నమే తెప్పించుకు మరీ వెళ్ళా. గిరిగార్ని నేనెప్పుడూ చూడలేదు. ఆయన పరిచయభాగ్యం కోసరమే వెళ్లానుకూడాను. ఆయన ఫొటో చూడలేదని ఎట్లా చెప్పనూ ? చూశాను. కాని గిరిగారికీ ఫొటోకీ ఏమీ సంబంధంలేదు. ఆయన పొట్టిగా సన్నగా ఉంటారు. తలపాగా చుట్టుకుంటారు. వయసు అరవై పై చిల్లర ఉంటై. ఫొటో చూసినవారెవరూ ఆయన్ని చూసి గుర్తించలేరని ఖండితంగా చెప్పగలను. అయినా నేనాయన్ని వెంటనే పోల్చాను. .. ఎవరో దేశద్రోహులు ఆ వచ్చినది గిరిగారు కాదనీ, మరొకరనీ అనుకుంటుంటే విన్నాను. తమ నాయకుల్నే గుర్తించలేని ఈ జనసామాన్యమంటే నాకు మంట. కాదూ మరీ ?....

అందుచేత నేను మొహాలు గుర్తుపట్టలేననటానికి వీల్లేదు. గాంధీజీని ఎప్పుడో 1924 లో చూశానా, ఇవాళ ఆయన్నిచూసి క్షణంలోగుర్తించగలను.

ఈ సీతాపతి నన్ను ఆర్నెల్లు పోషించానని అందరితోటీ చెప్పుకుంటున్నట్టు విన్నాను. ఇదినేను సహించను. వాడికెప్పుడో గట్టిగా బుద్ధిచెబుతాను. ఈ బికారీవెధవ నన్ను పోషించడమేమిటి? నా వ్యాపారంమీద ఒక గంటలోవచ్చే లాభమంత లేదు వాడి నెలఖర్చు. వాడి జన్మలో ఎన్నడైనా బీడీ తప్ప కాల్చి ఎరుగునా ? నన్నువీడు పోషించటమేమిటీ ? ఎవడైనా వింటే నవ్విపోతాడు !

పోనీ నేనేమైనా ఇటువంటి విషయాలు మరిచే మనిషినా ? ఎప్పుడో నేనింటరు చదువుతున్న రోజుల్లో శేషాచలానికి ఒక పావలా బదులిచ్చాను. అది అతను తిరిగి ఇచ్చేసినట్టే చెప్పాడు తరవాత అడగ్గా. ఇచ్చేసే ఉంటాడు కూడాను. చెప్పొచ్చిందేమంటే నాది చెడ్డ జ్ఞాపకశక్తి. చచ్చినా మరవను. అటువంటిది ఈ సీతాపతిగాడు నన్నారు నెల్లు పోషిస్తే నాకు జ్ఞాపకం ఉండదా?

అసలు మేమిద్దరము కలిసిఉన్న దెప్పుడూ ? ఎక్కడా ? 1936 లో ఒక గది తీసుకుని వాడు జార్జి టవును సందుల్లోఉండేవాడు. అప్పుడు మద్రాసు నాకు కొత్తగనక, బ్రాడ్వేలో నేను కనిపిస్తే, నన్ను వాడు, "ఎక్కడ ఉంటున్నా"వని అడిగితే, సామాను సత్రంలో పెట్టుకుని గదికోసం వెతుకుతున్నాననీ, ఉద్యోగంకోసం మద్రాసు వచ్చాననీ నేనుచెప్పితే, వాడు నన్ను గదిదొరికేదాకా తనగదిలోనే ఉండమని అంటే, పోనీ వాడికీ తోడుగా ఉంటుందిగదా అని సరేనన్నా. దగ్గిరగదా అని వాడు తినే హోటలుకే నేనూ వెళ్ళేవాణ్ణి. సినిమాలకు వాటికీ కలిసి వెళ్ళేవాళ్ళం.

సీతాపతిది నక్క తెలివని ఒప్పుకుంటాను. వాడికెంతముందాలోచనో! నాకు హోటలు టిక్కెట్లు కొనిపెట్టేవాడు. తాను బీడీలుకొన్నా నాకు సిగిరెట్టుపెట్టె కొనిపెట్టేవాడు, తన డబ్బుతో నన్ను సినిమాకు తీసుకెళ్ళేవాడు. నన్ను పోషించానని చెప్పుకునేటందు కివన్నీ చేస్తున్నాడని నాకేం తెలుసూ ? పైగా ఆరునెల్లని చెబుతాడా ? ఫిబ్రవరీలో నేను పట్నంవస్తే

ఆగస్టుకల్లా నాకు ఉద్యోగం దొరకనే దొరికిందిగద !....

ఈ సీతాపతి ఎవడో నాకు తెలీదు. వీడి ఊసెత్తకుండానే నా జీవితం హాయిగా వెళ్ళిపోతుంది. వీణ్ణిగురించి అర క్షణంకూడా వేదనపడవలిసిన అవసరం నాకులేదు. అయినా పోనీగదా, కష్టంలో ఉన్నాడుగదా, చెడుసావాసాలు చేస్తున్నాడుగదా, పంచిదారిని పెడదామనీ, ఆదుకుందామనీ, ఇంత రాబడి ఏర్పాటుచేద్దామనీ, నేను ప్రయత్నించిన మాట నిజమే. నేనల్లా కోరిందేమంటే- అదయినావాడిమంచికోరేగాని,-నాకేమో ఒరుగుతుందని కాదు - ఆదేశద్రోహుల సావాసం మానమన్నా. "నీకీ కూలి వాళ్ళసంఘాలెందుకు? దొంగమార్కెటు వాళ్లెట్లాపోతే నీకేం? జమీందార్లమీద కత్తికట్టేపాటివాడివా? ఎంతగొప్పవాడివైనా అణకువ తెచ్చిపెట్టుకో. గాంధీకీ, సర్దారు పటేలుకూ, నెహ్రూకూ తెలీని రాజకీయాలు నీకుతెలుసునంటే ఎవరన్నా నవ్విపోతారు. నిన్నుచూసి అంతాఎంత నవ్వుతున్నారో నీకు తెలుసునా?.... ఇవన్నీ వొదిలేసుకుని నాదగ్గిరకిరా, నీకు, ఉద్యోగం ఇస్తా." అన్నాను.

రోగికి పథ్యం ఎక్కడన్నా రుచిస్తుందా? నన్ను నానామాటలూఅన్నాడు. నేను నా కూలీలరక్తం పీలుస్తున్నానుట. వాళ్ళడొక్క కొడుతున్నానుట. వాళ్లు తనమాట వింటారుట. వాళ్ళచేత సమ్మె చేయించి నేను తినేదంతా కక్కిస్తాట్ట. నావంటి వాళ్ళలో విశ్వాసం ఉంచబట్టే కాంగ్రెసునాయకుల రాజకీయాలు అడివిదారి పట్టినాయిట! తాను పనివాళ్ళ పక్షం ఉండబట్టే తనని కొనెయ్యాలని నేను చూస్తున్నానుట. తనలోసహం చదువులేనివాడికి నా ఫ్యాక్టరీలో చీఫ్ ఫోర్మన్ ఉద్యోగంయిచ్చి రు 350 లు జీతం ఇస్తున్నాను అతనికి, పాపం, పనివాళ్ళంటే ఏమీ అపేక్షలేదు. ఎంతో స్వామిభక్తిపరాయణుడు. కూలీవెధవల్ని వెనకేసుకొచ్చిన వాళ్ళందరికీ ఉద్యోగాలిస్తే నేనుఅడుక్కు తినవలసిందే!

అడ్డమైన వాళ్ళతోటీ తిరిగి ఇటువంటి త్రాష్టులు "దొంగ వ్యాపారం, దొంగవ్యాపారం" అంటే నా వొళ్ళు మండిపోతుంది. దొంగవ్యాపారం అనగా ఏది? ఆర్థికశాస్త్రంబట్టి లేని వస్తువులకి ధర హెచ్చటం ధర్మం. ధరలు ఇష్టమై ఇవ్వగలవాళ్ళే కొంటారు. ధరలు ఇవ్వగలవాళ్ళనుబట్టే హెచ్చుతై. కొనుక్కోలేనివాళ్ళకోసం వ్యాపారం చేస్తామా? కొనుక్కోలేనివాళ్ళు ఎప్పుడూ ఉంటారు. ఏ ధరలకి వ్యాపారంచేసినా, దొంగవ్యాపారమే. పరప్రభుత్వం ఉండబట్టే ఈ కంట్రోళ్ళన్నీ వచ్చినై.

నేను దొంగవ్యాపారం చేసి లక్షలు చేసుకున్నానని ఈ సీతాపతి - నా ముక్కు మొగమూ ఎరుగని ఈ దరిద్రనాయకుడు- నా మీద ప్రచారం చేస్తున్నాడు. అవును, వ్యాపారం చేసుకున్నాను. సంపాయించాను. తనకు చాతయితే సంపాయించలేకపోయినాడా? నామీద పడి ఏడవటం దేనికి? నేను లక్షలు సంపాదిస్తే కట్టుకుపోయినానా? పరిశ్రమ సాగిస్తున్నాను. నలుగురికి భుక్తి ఏర్పాటు చేస్తున్నాను. వాళ్ళు

తిండి తినిపోతున్నారే అని ఏడుపు తనమా: వాళ్ళచేత సమ్మెలు చేయిస్తారట, కూలివాళ్ళు ఆ కాస్త తిండి తిని పోతున్నారని వీడి ఏడుపు. ఓర్చలేనమ్మ తనుపెట్టదు, అడుక్కు తిన నివ్వదు. అందర్నీ దొంగవ్యాపార్లనీ. ప్రజాద్రోహులనీ తిట్టే ఈ మూక నెప్పుడైనా చూడండి - వీళ్ళు ఒక ఈగకి పని చూపించలేరు. పని చేసేవాళ్ళని ఇంత తిననివ్వరు. సంఘాలంటారు. సమ్మెలంటారు.

వాళ్ళనని తప్పేమిల్లే? ఈ కూలి వెధవలు కూడా వాళ్ళనే నమ్ముతారు. పెట్టేచెయ్యే కరిచే కుక్కలు వాళ్ళు. వాళ్ళకి చదువా, సంధ్యా? వాళ్ళకు మన మాటలెందుకు నచ్చుతయ్? ఈ సీతాపతి వంటివాళ్ళే వాళ్ళకు నచ్చుతారు.

లేదు - నాకీ సీతాపతి ఎవరో తెలీదు. తెలియవలసిన అవసరం కూడా నాకు లేదు. వాడు నన్నెరుగుదునని చెప్పుకుంటే నేనందుకు బాధ్యుణ్ని కాను. అట్లా గొప్పగా ఉంటుందని చెప్పుకుంటే చెప్పుకోనివ్వండి. నన్నెరుగుదు నని చెప్పుకునే వాళ్లెంతమందిలేరు గనక?

★

ఆంధ్ర సాహిత్య పాఠశాల
నా అనుభవాలు

శ్రీ గొర్రెపాటి వెంకటసుబ్బయ్య

ఆంధ్రసాహిత్య పాఠశాల గుంటూరు జిల్లా తెనాలి తాలూకా పెదపూడిలో ఆంధ్ర అభ్యుదయ రచయితల సంఘ ఆధ్వర్యాన ఒక నెలరోజులు జరిగింది. 57 గురు విద్యార్థులు వచ్చారు 19గురు ఉపాధ్యాయులు బోధచేశారు. ప్రతిరోజూ కార్యక్రమం 7 గంటలు నడిచింది.

రచయితలూ, గాయకులూ, నటకులూ విద్యార్థులుగా వచ్చారు. వీ రిది వరకే సాహిత్యంలో కొంత ప్రవేశం కలిగి రచనలుచేస్తూ, ఇంకా పెంపొందాలనే అభిప్రాయంతో వచ్చిన అభివృద్ధి కాములు.

విద్యార్థులందరినీ ఇలా వర్గీకరణ చెయ్యవచ్చు. (1) సంస్కృత విద్యార్థులు, వీరు సంస్కృత పాఠశాలలలో పెద్ద పరీక్షలకు చదువుతున్నవారు. సాహిత్యజ్ఞానం కలవారు. వీరిలో కొందరు రచనలు చేయడానికికూడా ప్రయత్నిస్తున్నవారున్నారు కాని వీరికి చొరవ తక్కువ; లోకానుభవం, ప్రపంచజ్ఞానం కూడా తక్కువే. (2) అంగ్ల విద్యార్థులు; వీరికి విషయ పరిజ్ఞానము బోధ ఉన్నది, కాని భాషాజ్ఞానం తక్కువ.

విద్యార్థుల్లో కొందరినిగూర్చి రెండు మాటలు చెబుతాను. నార్ల చిరంజీవి ఇది వరకే గేయకవిగా గణన గాంచాడు. 'విప్లవాత్మ' అనే గేయసంపుటి వ్రాశాడు. కవితాహృదయం కలవాడు. ఆవేశం ఆత్మ పరిశోధన వున్నది.

సుంకర సత్యనారాయణ, వాసిరెడ్డి భాస్కరరావులు జంటగాను వేర్వేరుగాను గ్రంధాలు వ్రాసారు. 'ముందడుగు' నాటకం వీరిదే. సత్యనారాయణకు సాహిత్యంలో ప్రవేశం తక్కువ. ఆయన అచ్చంగా గేయకవి. వీరేశలింగం బుర్ర కధేగాక, అనేక గేయకావ్యాలు వ్రాశాడు. ఆయన కవిత్వంలో జీవం వుంటుంది. సూటిగా హృదయానికి తగులుతుంది. భాస్కరరావు సంస్కృతాంధ్ర అంగ్ల హిందీ భాషల్లో ఆరితేరినవాడు. ఈయనలో హృదయంకంటె మేధస్సు అధికం. ఈయన 'వంగభూమి' ఉత్తమ కావ్యం. మనిషి మంచిగడసరి. లోకం పోకడ బాగా తెలుసు.

కోగంటి గోపాలకృష్ణయ్య మంచి చొరవ, చురుకు గలవాడు. ఇంటర్‌మీడియేట్‌దాకా చదివాడు. జానపదగేయ రచనలో పెట్టింది పేరు. హిట్లరు భాగ

వతం ఈయనదే. మంచి హాస్యప్రకృతి గల మనిషి.

మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి — స్నేహపాత్రుడు, ఉత్సాహవంతుడు: బాగా పాడుతాడు, గొప్పనటుడు. మాచినేని వెంకటేశ్వరరావు బాగా పాడగలడు కథలు గేయాలు వ్రాయగలడు. కోసూరి పున్నయ్య బుర్రకథలు చెప్పడంలోను నాటకాల్లోనుగూడా నాణెగాడే బుర్రకథలు, హరికథలు వ్రాశాడు. ఎందులోకి పోయినా రాణించ గలడు.

కొట్రగడ్డ నరసయ్య-అసలు కొట్రగడ్డ వారి కుటుంబం కాకలుదీరిన కుటుంబం. ఈయన బి. ఎస్. సి. విద్యార్థి చురుకైనవాడు. విమర్శనాదృష్టి అధికం, గట్టి పట్టుదలగలవాడు.

వెల్లంకి బ్రహ్మయ్య చౌదరి—మనిషి అమాయకుడుగా కనపడతాడు. కాని అమాయకుడు కాదు. చాలా పెద్దమనిషి. విద్వాన్ ప్యాసయినాడు.

గొర్రెపాటి వెంకటసుబ్బయ్య - ఆంధ్రాంగ్ల హిందీ బెంగాలీ భాషల్లో ఇంతో అంతో ప్రవేశమున్నది. కాని ఎందులోను అధిక అభినివేశం లేదు. సాహిత్యరంగములన్నిట ప్రవేశమున్నది. అనుభవం అధికం, వచ్చినవారందరిలోకి పెద్దవయస్సు. 'మన జమీందారీలు' మొదలగు గ్రంధాలురాసి లోకందృష్టిలో పడ్డాడు. వచనరచయిత. సహృదయుడు. విమర్శకుడు.

పి. లక్ష్మీకాంత మోహనరావుకు ఆంగ్లంలో ప్రవేశం అధికం. కథలు రాయటంలో నేర్పరి మంచి గొంతుక, బుర్రకథలు చెప్పగలడు. కథానికలంటే కడుయిష్టం.

నాజర్ మహామ్మదీయుడు. రెండు మూడేళ్ళ క్రితంవరకు పేరులేని బీద కార్మికుడు. స్వయంకృషి చేతాడు — పైకివచ్చాడు బుర్రకథలు చెప్పడంలో ప్రసిద్ధుడు. నాజర్‌కథ అంటే జనం విరగబడుతుంది. మద్రాసులో సహృదయులు ఈయన బెంగాలు కరువు కథచే ద్రవీభూతులైనారు. నేడు కథలుకూడ రాస్తున్నాడు సాహిత్యజ్ఞానం ఇంకా సంపాదించుకొంటే బాగుంటుంది.

ముక్కామల పురుషోత్తం బాగా పాడతాడు. బుర్రకథల వ్యాఖ్యానకర్త. విషయప్రవేశంతక్కువ, అయినా వున్నదంతా ఉపకరించుకోగల ప్రజ్ఞావంతుడు. కథలుకూడ చెప్పగలడు.

రామకోటి బుర్రకథల్లో హాస్యగాడు. ఈయన హాస్యంలో వికృతి చమత్కృతి కూడ వుంటుంది. కథల్లో సమయస్ఫూర్తి మాటలు అతికించడంలో అందెవేసినచెయ్యి గోఖలేగారిచలవవల్ల స్కూలుకు వచ్చిన తరువాత చిత్రలేఖనలోకూడ ఉన్నాననిపించుకున్నాడు.

కంచర్ల వెంకటప్పయ్య అచ్చంగా రైతు. స్వయంకృషిచే సాహిత్యజ్ఞానం సంపాదించాడు. కవితకూడ చెప్పగలడు. ఆశవున్నది కాని యీయనకు అవకాశం తక్కువ.

బి గోపాలం మంచి పాటకుడు. పలనాడుపాటల్లో పేరుమోగాడు. ఫిడేల్ వాయించడంలో ప్రఖ్యాతుడు. గేయాలు కూడ రాస్తాడు. భాషాప్రవేశం తక్కువ.

భుజంగరాయశర్మ బి ఏ. (ఆనర్సు) విద్యార్థి. మంచి వినయ విధేయతలు కలవాడు. సాహిత్యపాఠశాలకు వచ్చిన తర్వాత పద్యాలుకూడ రాయసాగాడు. నటకుడు.

గుమ్మడి సీతారామయ్య సంస్కృత విద్యార్థి. సంస్కృతాంధ్రాలు బాగావచ్చు. అనేకపద్యాలు కంఠతః వచ్చు మంచి గొంతుక. గ్రాంధికశైలిని బాగా రాయ గలడు

కొత్తపల్లి రంగారావు — హిందీ సంస్కృతాంధ్రాలు బాగా చదివాడు గేయాలు రాస్తాడు

జి వెంకట్రామయ్య — ఆంగ్ల. హిందీలు వచ్చు. హిందీభాషాభిమాని. హిందీలో బాగారాయగలడు. కథాసాహిత్యమును గురించి "విశాలభారత్"లో రాసినవ్యాసం బాగున్నది. మన తెలుగు వెలుగు హిందీలో బాగా ప్రకాశింపచేస్తే బాగుంటుంది. రాహుల్‌జీ పుస్తకాలన్నీ చదివాడు.

బొల్లిముంత శివరామకృష్ణ. గద్యం, పద్యం, గేయం రాయగలడు అన్నిట ఆరితేరినవాడు.

ప్రకాశరావు. నటరాజన్—వీరిద్దరు కాఫీహోటలు సర్వర్లు. తెనాలిలో హోటల్‌పని మానుకొని ప్రత్యేకమైన పట్టుదలతో వచ్చారు.

కొల్లిపర భాస్కరరావు బి కాం. చదివాడు, వయస్సు తక్కువైనను వచ్చిన వారిలో అధిక ఆంగ్లవిద్యావంతుడాయనే. తెలివితేటలు కలవాడు, వక్త. పాటలు కూడ రాస్తాడు....కష్టపడి పనిచేస్తాడు. స్కూలు మేనేజ్‌మెంటు యీయనే చేశాడు. అందరికి తలలో నాలుకవలె సంచరించాడు. వర్ధిష్ణువు.

శాస్త్రి - అందరిలోకి చిన్నవాడు: సంస్కృతవిద్యార్థి. అయనవేసే ప్రశ్నలు ఆయన తృష్ణను వయస్సును తెలుపుతూ వుండేవి ప్రతిదీ రాసుకోవటమే.

జాస్తి సీతారామదాసు. బి. ఏ. విద్యార్థి. రాజకీయాలు బాగా తెలుసు. మంచి చొరవ ఆవేశం వున్నవి బాగా మాట్లాడగలడు. గీతాలుకూడా కొన్ని రాశాడు స్నేహపాత్రుడు. అన్నామలై విశ్వవిద్యాలయంలో ఆంధ్ర సంఘం, అభ్యుదయ రచయితల సంఘాల్లో పని చేస్తున్నాడు.

సింహా — చురుకైనవాడేగాని బద్ధకస్తుడు. హాస్యప్రకృతి విమర్శకుడు. కథలు వ్రాయగలడు హాస్యరచనలు చేయగలడు.

ఎం. ఆర్. బి. నరసింహారావు ఆంగ్ల విద్యార్థి. విచిత్రవ్యక్తి ఆయన్ని అందరు అర్థం చేసుకోలేరు. తెలివితేటలు కలవాడు. దిట్టంగా వాదించగలడు.

సత్యవతీదేవి : ఈ బాలికలో తళుకు బెళుకులు ఏమీలేవు. మేలిమి బంగరు మెలత. పకపక మనటంగాని, పన్నెత్తి మాట్లాడడంగాని ఎరుగదు. మంచితెలివి తేటలుగలదే. ఆమెకు ఎంత అభిరుచి లేక పోతే ఏకాకినిగా ఈపాఠశాలకు వస్తుంది: ఉపాధ్యాయుల ప్రశంసను, విద్యార్థుల మన్ననలనుగాంచిన మగువ-స్త్రీ సహజమైన ఓర్మి, పేర్మి, అణకువ, ఆదరము అభిమానము ఆమెలో అధికంగా అలరారు తున్నవి. పన్నెత్తి పలకరించని పసుచు, ఆఖరురోజున ఆపుకోలేక అడిగి

అంగరి ఎడ్రసులు రాసుకొంంది. అంద రికి అచ్చంగా ఆమె తోబుట్టువే. అట్టి అక్కచెల్లెండ్రు కావాలని అందరూ అభిలషిస్తారు.

పూలకుంట్ల సంజీవులు. హృదయం గలవాడు, ఇదివరకు ప్రవేశం లేక పోయినా ఇక్కడకు వచ్చిన తరువాత గేయరచన చేయసాగాడు.

లింగుట్ల కోనేటప్ప. బహు మేధకుడుగా కన్పడుతాడు. ఆయన వంశ రత్నాకరము తెలుగు సర్వస్వము వ్రాశాడు. ఆయన శ్రమ స్పేరరితనం చూచి పండితులంతా ప్రశంసించారు.

ఇక ఉపాధ్యాయులు, 19గురిని కూడ ముత్తెరగుల భాగించవచ్చును. పండితులు, వీరు అన్నిట నిధులు. మొదటితరానికి చెందినవారు. కాని శాఖాచంక్రమణ చేశారు. ఇది వారి దోషం. ఆ సంగతి వారికికూడ అనుభవం అయింది.

ఉపాధ్యాయులు - పాఠశాలల్లోను, రాజకీయాలలోను ఆరితేరినవారు. ఆంగ్ల భాషకూడబాగావచ్చు. ప్రాచీనసాహిత్యం లోను, నవ్యసాహిత్యంలోను నిష్ణాతులే. మంచి బోధనాశక్తి వున్నది.

ఆధునికరచయితలు - వీరికి ప్రాచీన సాహిత్యములో ప్రవేశములేదు. ఆధునిక సాహిత్యంలోను అంతే. ఆంగ్లభాషా ప్రోద్బలమే వీరి రచనలకు ఆధారము. మంచి భావసంపద వున్నది. శబ్దపటిమ తక్కువ భావాల్ని స్ఫుటంగాచెప్పశక్తి లేదు. అలవాటుకూడా లేదు. చెప్పాలని ప్రయత్నించారు. కాని చెప్పలేక పోయారు.

1. పండితులు: పంచాగ్నుల ఆది నారాయణశాస్త్రి గారు ఆంధ్రలోకానికి సుపరిచితులు అఖండపండితులు ఆయనకుతెలియని విషయమంటూలేదు మంచి విమర్శకుడు. ఆయన పాఠాలకన్న అందరతో కలిసి మెలిసి తిరగటం, కాలక్షేపం చేయడం, పిల్లలను ప్రేమతో చూడటం, హాస్యసంభాషణలు అధికంగా ఆకర్షించాయి. ఆయన అందరిలోకి పెద్దేకాదు, పితృతుల్యుడు.

కోరాడ రామకృష్ణయ్యగారు - భాషా తత్వ శాస్త్రంలో ఆయన అద్వితీయుడు. భాషా తత్వాన్ని గురించి విద్యార్థులకు వినసొంపుగా చెప్పాడు. పరిణతి చెందిన ఆ పండితుడు విద్యార్థుల్లో లీనమగుట విస్మయం కలిగించింది. ఆయనకు ఇదివరకు ఈ పాఠశాలయందున్న అభిప్రాయం పూర్తిగా మారింది. సనాతన పంథాను అనుసరించి వేరుగావున్నా భావైక్యత కుదిరింది

చిలుకూరి నారాయణరావుగారు-గిడుగు వారి ప్రియ శిష్యుడు ఆ పంతులు పట్టుదల. పరిశ్రమ ఈ శిష్యునిలో మూర్తీభవించినవి. ఆయన చెప్పింది ఆకర్షణగా వుండదు, కాని అందులో ఆణిముత్యాలు వుండకపోవు రాయలసీమ, విజయనగర చరిత్రలను గురించి కని విననిసంగతులెన్నో చెప్పి కనువిప్పు కలిగించాడు. గొప్పవీరుడు. వీర రసము కలుగుతుంది ఆయన మాటల్లో.

ఉపాధ్యాయులు - అ. నరసింహ శర్మగారు. ఆయన పాఠాలు అందరిని ఆకర్షించాయి. ఎలాచెప్పాలో ఎంత వరకు చెప్పాలో ఆయనకే తెలుసు

అనిపించింది. విద్యార్థులందరి ప్రేమకు పాత్రుడయ్యాడు పాఠాలవల్ల ప్రవర్తన వల్ల కూడ.

నిడదవోలు వెంకట్రావుగారు గొప్ప పరిశోధకుడు. ఏకసంతగ్రాహి. ఆయన ఆంధ్రంలోచదవని గ్రంధంవున్నట్లు కన్పదదు. ఆయనకురాని పద్యము లేనేలేదు. ఏదడిగినా, ఎక్కడ అడిగినా ఏమరపాటు లేకుండా చెప్పగల దిట్ట. విద్యార్థులకు చదువు చెప్పాలనే ఉత్సాహం ఈయన కున్నంత మరిఎవరికీ ఉన్నట్లు కన్పించ లేదు. విసుగు విరామంలేదు రాత్రిం బవళ్ళులేవు ఆయనకు. ఆయనవల్ల అధికంగా తెలుసుకున్నారు విద్యార్థులు. బహుబోళావాడు. ఆయనకు చెవియిస్తే లక్షలు యిచ్చినట్లు వుప్పొంగిపోయాడు.

శ్రీపాద గోపాలకృష్ణమూర్తిగారు - ఈ ఫిజిక్సు ప్రొఫెసరుకు ఆంధ్రభాష యందభిమాన మెలాకలిగిందోతెలియదు. ఆయనకు అన్ని విషయాలు తెలుసునని అనిపించింది ఆ య న బోధవల్ల. ఆయనబోధ మూడుపూటలైనా ముఖ్యమైనది. నిర్మొహమాటంగా విమర్శించగల సహృదయుడు. ఎన్నో సందేహాలను విడగొట్టి విమర్శనాజ్ఞానం వృద్ధిచేశాడు. అందరిని ఆకర్షించాడు. విస్మితులను గావించాడు. విద్యార్థులను ప్రేమించాడు. విద్యార్థులు యినుమడించా రిందులో.

దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు అచ్చంగా కృష్ణుడు గొప్పవక్త. ప్రాచీనసాహిత్యం తెలుసు. ఆధునిక సాహిత్యం అడగ నక్కరలేదు. ఆయన ఒకనాడల్లా అనర్గళంగా ఉపన్యాసం చేశాడు. ఆయన అధ్యయనము, అభిరుచి, అనుభవము అందరికి అందిచ్చాడు. అది నెమరుకు తెచ్చుకొంటే రచయితలు రాణించగలరు "ప్రాచీన సాహిత్యంలో ప్రవేశముండాలి. ప్రజలతో సంబంధముండాలి రచయితకు" అని ఆయన అన్నమాట పరమసత్యము

మద్దుకూరి చంద్రశేఖరరావుగారు— ఆధునిక సాహిత్యంలో అభ్యుదయరీతులను గురించి తనకు తెలిసిందంతా తేట తెల్లంగా ఎనాలసిస్ చేసి యెంతో ఎన్‌లైటెన్ (Enlighten) చేశాడు. అందరూ ఆమాదిరిగాచెప్తే బాగుంటుంది. కార్య కారణ సంబంధం తెలిపాడు. మార్కిస్టు దృక్పధంతో బాగానడిచింది ఆయనధోరణి.

జమ్మలమడక మాధవరామశర్మగారు అలంకార శాస్త్రములో అద్వితీయుడన్న సంగతి అందరికి తెలిసిందే. ఆయన ఎంతో ఉదాత్తంగాను వేగంగాను చెప్పాడు ఆయన ప్రతిభాశాలి అనిఅందరికీ తెలిసింది. కాని ఆయన బోధ అంటినట్లు అగుపించదు.

మల్లంపల్లి సోమశేఖరశర్మగారు— ఆయనఆంధ్రదేశానికిచిరపరిచితుడేగదా! మొదటి రోజున, కడపటిదినాన ఆయన కాచుకున్నాడు ఆయనది విందు హృదయం. అధిక ఆవేశపరుడు. చరిత్రచెప్పటంలో ఆయన పేరు తర్వాతనే, మరొకరిపేరు చెప్పాలని అనిపిస్తుంది. ఆయన ఒకరోజులో భారత దేశ చరిత్రంతా సమగ్రంగాను సంగ్రహంగాను ఎన్నో నూతన విషయాలతో చెప్పి ఉత్తేజం కలిగించాడు ఆయన వాక్కు హృదయానికి హత్తుకొని పోతుంది.

విశ్వవిద్యాలయాల డిగ్రీలను మించిన పండితుడు. ఆయనకు ఏ డిగ్రీలేకపోవటమే ఆయన అద్వితీయతకు కారణమనుకుంటాను.

నూతన రచయితలు: కొండముది గోపాలరాయశర్మ. పత్రికలలో నాటకాలనుగురించి ఆయన విమర్శనలు వ్రాయటంమూలంగా పదిమందికి పరిచయుడు. నాటకాలను గురించి ఆయన ఎంతో చెప్పుతాడని అనుకొన్నారు ఆ అపేక్ష నెరవేరలేదు. ఆయన చదివినది జీర్ణం చేసుకొని సమన్వయపరచి చెప్తే బాగుండేది. ఆంధ్రనాటకరంగంలో కొందరిని గురించి బాగానే విమర్శించాడు.

దర్శి చెంచయ్యగారు— ఆయన రచయితకాదు. ఆయన తన అనుభవాలను గురించి చెప్పిన మాటలు అందరిని ఆకర్షించినవి. అసలు పుస్తకాల సంగతి కాదు మనకి కావలసింది. అనుభవాలే. ఆయనచెప్పినమాటలు ఎంతో వికాసం కలిగించాయి. మంచి హృదయం కలవాడు అమెరికా వెళ్ళివచ్చిన ఆయన, వటాటోపంలేకుండా పదిమందితో కలిసివుండటం, మంచి సుఖంకోరటం మెచ్చుకోతగినదే. ఆయనమంచి ఆవేశపరుడు. ఆయన వీరగాథలు విద్యార్థులను విస్మితులను చేసినవి.

కొడవటిగంటి కుటుంబరావుగారు - ఆయన గొప్పకథకుడన్నమాట అందరు అంగీకరించేదే. ఆయన పేరుకుతగిన ప్రతిభ వున్నా ప్రకటించేశక్తి తక్కువైంది. ఎప్పుడూ చదవటం, ఆలోచించటం, రాయటమే గాని, పదిమందికి తెలిసేపద్ధతిలో చెప్పటం ఆయనకు కొత్త. అందుచేత అలా అయింది. మంచి హుందాకల మనిషి. ఆయనలోకి మనం పోవలసిందేగాని ఆయన మనలోకి రాడు వచ్చినవారిని సమాన ప్రతిపత్తితో చూడగలడు.

మాధవపెద్ది గోఖలేగారు - ఈయన చిత్రకారుడుగాను, కథకుడుగాను పరిచితుడే మంచి హృదయం గలవాడు. అరమర ఏమీ లేదు.

శ్రీరంగం శ్రీనివాసరావుగారు—ఆధునిక కవులలో నవయుగ ప్రవర్తకుడు. కథలు, గేయాలు వ్రాసినా, ఆయన కథకుడుగా గణనగాంచలేదు అభ్యుదయ కవిగా ఆయనకు అందరు సాగిలపడవలసిందే ఆయన చెప్పదలచింది చాలా వుంది. చెప్పింది తక్కువ. అలవాటు లేదు. అందరిలోను కలిసిపోతాడు. ఆయన నిజంగా ప్రజాకవి. ఆయన హృదయం అతివిశాలం. ఆయన చెప్పినవి నాలుగు ముక్కలైనా సూత్రప్రాయంగా వున్నవి గురజాడ వారసుడు ఈయనే.

ఆంధ్ర సాహిత్య పరిషత్తుప్రాచీన గ్రంథాలు అచ్చువేయటంతోనే సరిపెట్టుకొన్నది. నవ్యసాహిత్యపరిషత్తు కొంత నూతన వాఙ్మయాన్ని సృష్టించింది. అభ్యుదయ రచయితల సంఘం నూతన రచయితలనే సృష్టించుతున్నది. అభివృద్ధి పంథా కదా ఇది!

విద్యార్థులు, గురువులు ఎంతో అన్యోన్యంగా సంచరించారు, విద్యార్థులశ్రద్ధ, వినయవిధేయతలు చూచి, ఉపాధ్యాయులు ఉప్పొంగిపోయారు. ఎట్టి ప్రతిఫలాపేక్ష లేక ఈ మండువేసంగిలో అనేక కష్టా

లకు గురిఅయివచ్చి. అత్యధిక శ్రద్ధాభిమానాలతో విసుగు విరామం లేకుండా ఉపాధ్యాయులచేసే బోధలుచూచి విద్యార్థులు విస్మితులయ్యారు. ఈ పాఠశాల నుండి ఉపాధ్యాయులు వెళ్ళిపోవటం, ఆఖరుకు విద్యార్థులు విడివడిపోవటం ఎంతో బాధకలిగించింది. అందరకు స్వగృహం విడిచి అత్తవారింటికి వెళ్ళే ఆడపడుచులలాగా అందరికళ్ళు చెమ్మగిల్లాయి.

ఇది ప్రథమప్రయత్నం కదా! ప్రథమ ప్రయత్నం ఎప్పుడూ ప్రథమప్రయత్నమే.

ఈ సాహిత్య పాఠశాలను ఏటేట తప్పక జరిపి సాహిత్యసేవకులను ఇతోధికంగా సృష్టిచేయవలసిన అవసరాన్ని గూర్చి వేరే విప్పి చెప్పనక్కరలేదు

✶

త్వరలో వస్తున్నది !　　　　త్వరలో వస్తున్నది !!

'సరస్వతీ పిక్చర్ ప్యాలెస్'లో దర్శించండి!

' నూర్జహాన్ ' నటించిన ' ఈస్టర్న్ పిక్చర్స్ ' వారి

జీనత్

కథ : గొప్పసంప్రదాయం గల కుటుంబంలో పుట్టినప్పటికీ, 'జీనత్' దురదృష్ట వశాత్తూ అనేక కష్టాలకు లోను గావలసి వచ్చింది. కన్న తల్లి చనిపోయింది. జీనత్‌సవతితల్లిచేతిలో నానా అవస్థలకు పాల్పడింది.

తాను హృదయపూర్వకంగా ప్రేమించిన భర్తను వివాహ మాడింది. కాని, పెండ్లినాడే అతను ఒక ప్రమాదానికి లోనయినాడు ఆమె నష్ట జాతకురాలుకావడమేఅందుకు కారణమన్నారు. దీనికి తోడు, ఆభర్త కాస్తా మర్నాడే పోయాడు.

ఆమె గర్భిణి - బావగారికి అనుమానం - ఇక ఆయింట్లో జీవింవలేకపోయింది పుట్టింట తలదాచుకుందామని వెళ్ళింది. సవతితల్లి చేరనీయలేదు.

చంటి బిడ్డతో బజారున పడింది. ఇక బ్రతుకు దుర్భరం. భర్త సమాధిమీద బిడ్డను వదిలి, ఆత్మహత్య చేసుకోవాలని ప్రయత్నించింది. కాని, బిడ్డఏడ్పు....

బిడ్డను ఏంచేస్తుంది ? ఆత్మహత్య....తగదు ! బిడ్డను బ్రతికించుకోవాలి, బిడ్డ కోసం తాను జీవించాలి

తాను తల్లినని తన బిడ్డకు చెప్పుకోలేదు: పతివ్రతనని ప్రపంచానికి చెప్పుకోలేదు....

బిడ్డయొక్క భవిష్యత్తు కోసమూ, తన మీద వచ్చిన అపనిందను తొలగించుకొనెందు కోసమూ, జీనత్ మళ్ళీ జీవించింది. హృదయాన్ని కదలించే ఈ గాథను కళ్ళారా చూడండి!

యాకూబ్, బిబ్బో, దీక్షిత్, మజీద్, నజీర్ కాశ్మీర్, అమీర్ ఆలీ, షానవాజ్ మొదలైన సుప్రసిద్ధ తారాగణం నటించారు.

డైరెక్టరు : సయ్యద్ షౌకత్ హుస్సేను రిజ్వీ

ఆంధ్ర సాహిత్య పాఠశాల

— అధ్యాపకులు —

1. శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మగారు, ఆంధ్రదేశ చరిత్ర.
2. శ్రీ పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రిగార, ప్రాకృతభాషావాదము - ఆంధ్రవాఙ్మయచరిత్ర
3. శ్రీ నిడదవోలు వెంకటరావుగారు, ఆంధ్రసాహిత్య చరిత్ర.
4. శ్రీ కోరాడ రామకృష్ణయ్యగారు, భాషాతత్వశాస్త్రం.
5. శ్రీ చిలుకూరి నారాయణరావుగారు, ప్రాచీనాంధ్ర వైయాకరణుల భాషాదృష్టి, నవ్యసాహిత్య చరిత్ర, తెలుగు నుడికారం - సామెతలు
6. శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు, ఆధునికాంధ్ర కవిత్వరచన - క్రొత్తపోకడలు.
7. శ్రీ శ్రీపాద గోపాలకృష్ణమూర్తిగారు, తెలుగు ఏకాంకిక.
8. శ్రీ అయల సోమయాజుల నరసింహశర్మగారు, రూపకములు.
9. శ్రీ కొడవటిగంటి కుటుంబరావుగారు. చిన్నకథా - నవలా.
10. శ్రీ శ్రీరంగం శ్రీనివాసరావుగారు, కావ్యవిమర్శ.
11. శ్రీ మాధవపెద్ది గోపాలకృష్ణ గోఖలేగారు, చిత్రకళ.
12. శ్రీ కొండముది గోపాలరాయశర్మగారు, నాటకాలు.
13. శ్రీ జమ్ములమడక మాధవరామశర్మగారు, ప్రాచ్యసాహిత్యం - అలంకారాలు.
14. శ్రీ మద్దుకూరి చంద్రశేఖరరావుగారు. ఆంధ్రసాహిత్యంలో క్రొత్తపోకడలు

— విద్యార్థులు —

1. శ్రీ వి. వాలయ్యపంతులు, 4 వ తరగతి బి. ఏ. (ఆనర్సు), ఆంధ్ర విశ్వవిద్యాలయం.
2. శ్రీ శ్రీరాం వేంకట భుజంగరాయశర్మ. బి. ఏ. (ఆనర్సు), ఆంధ్రవిశ్వవిద్యాలయం.
3. విద్వాన్. శ్రీ వెల్లంకి బ్రహ్మయ్యచౌదరి, కలవపాముల.
4. శ్రీ ఎన్. హెచ్. శాస్త్రి, భాషాప్రవీణ విద్యార్థి, తెనాలి - సంస్కృత కళాశాల.
5. శ్రీ ఎం. వెంకటరత్నం. భాషాప్రవీణ విద్యార్థి. చిట్టిగూడూరు - సంస్కృత కళాశాల.
6. శ్రీ పూలకుంట సంజీవులు, గేయకవి, అనంతపురంజిల్లా,
7. శ్రీ తక్కెలపాటి తిప్పన్న, మైసూరు.
8. శ్రీ వారణాసి కోటేశ్వరశర్మ, తెనాలి - సంస్కృత కళాశాల.
9. శ్రీ ఆర్. ఎన్. సింహా. కథకుడు, ఏలూరు.
10. హిందీ విశారద, శ్రీ వాసిరెడ్డి భాస్కరరావు. బెజవాడ.
11. శ్రీ నార్ల చిరంజీవి. కవి - కాటూరు.
12. శ్రీ గుమ్మడి సీతారామయ్య, భాషాప్రవీణ విద్యార్థి - రేపల్లె.
13. శ్రీ కె. వెంకటేశ్వరరావు, పశ్చిమగోదావరి.
14. శ్రీ వింతా వెంకటరెడ్డి, తేలప్రోలు.

15. శ్రీ ఎం. ఆర్. బి. నరసింహారావు, ఇంటర్ 2 వ సం॥, పశ్చిమగోదావరి.
16. శ్రీ గొర్రెపాటి వెంకట సుబ్బయ్య, సుప్రసిద్ధ రచయిత - ఘంటసాల.
17. శ్రీ వంగపాటి ఉమామహేశ్వరరెడ్డి, ఇంటర్ 2 సం॥, జనార్దనపురం.
18. శ్రీ లింగుట్ల కోనేటప్ప, పరిశోధకుడు - ఛాయాపురం. (గుంటకల్)
19. శ్రీ గుత్తికొండ సీతారామయ్య, విద్వాన్ ఫైనల్ - యలవర్రు. (తెనాలి)
20. శ్రీ పోకా వెంకటేశ్వరరావు. కొవ్వూరు-సంస్కృత కళాశాల.
21. శ్రీ శ్రీరామకవచం వెంకటేశ్వరశాస్త్రి, తెనాలి-సంస్కృత కళాశాల
22 శ్రీ రావిపాటి శ్రీరాములు, టీచర్ - పోతవరం, (ఒంగోలు)
23. హిందీ విశారద, శ్రీజి. వెంకటరామయ్య, యడ్లపల్లి (తెనాలి)
24. శ్రీ కంచర్ల వెంకటప్పయ్య. విద్వాన్ ఫైనల్, కొలకలూరు (తెనాలి)
25. శ్రీ మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి, ఆంధ్రప్రజానాట్యమండలి, బెజవాడ.
26. శ్రీ కాట్రగడ్డ నరసయ్య, బి. ఎస్. సి. విద్యార్థి, కాశీ విశ్వవిద్యాలయం.
27. శ్రీ ముక్కామల పురుషోత్తమరావు, ఆంధ్ర ప్రజా నాట్యమండలి.
28. శ్రీ షేక్ నాజర్, 'బెంగాల్‌కరువు, పల్నాటియుద్ధం' రచయిత-పొన్నెకల్లు, గుంటూరు
29. శ్రీ ఆలూరు సూర్యప్రకాశరావు, తెనాలి.
30. సాహిత్య శిరోమణి, శ్రీ కొత్తపల్లి రంగారావు, అమృతలూరు, (తెనాలి)
31. శ్రీ కోగంటి గోపాలకృష్ణయ్య. గేయకవి, ఆంధ్ర ప్రజా నాట్యమండలి.
32. శ్రీ మాచినేని వెంకటేశ్వరరావు, కథకుడు, ఆంధ్ర ప్రజా నాట్యమండలి.
33. శ్రీ సుంకర సత్యనారాయణ, 'ముందడుగు' నాటక కర్తలలో ఒకరు, బెజవాడ.
34. శ్రీ దేవాభక్తుని రంగారావు, చిట్టిగూడూరు-సంస్కృత కళాశాల.
35 శ్రీ దేవాభక్తుని పున్నారావు, గురజాల బోర్డు హైస్కూలు పండితుడు
36. శ్రీ కె. చంద్రయ్య, పోతవరం, (ఒంగోలు)
37. శ్రీ నటరాజన్, తెనాలి.
38 శ్రీ కోసూరి పున్నయ్య, గేయకవి, కొత్తపాలెం.
39. శ్రీ యేపూరి రామకోటి, ఆంధ్ర ప్రజా నాట్యమండలి.
40. శ్రీ కె. ఆర్. కృష్ణ, ఇంటర్ సీనియర్ - బాపట్ల.
41 శ్రీ బొల్లిముంత శివరామకృష్ణ, కథకుడు, తెనాలి.
42. సాహిత్య శిరోమణి శ్రీ దివి వీరభద్రాచార్యులు, పునాదిపాడు పండితుడు, (కృష్ణా)
43. శ్రీ జాస్తి సూర్యనారాయణ, చిట్టిగూడూరు సంస్కృత కళాశాల.
44. విద్వాన్. శ్రీ చదలవాడ వెంకటరామయ్య, పెడన - హైస్కూలు పండితుడు.
45. శ్రీ చదలవాడ బాపయ్య, పాంచాలవరం, (తెనాలి)
46. శ్రీ పొందూరి సత్యనారాయణ, హెడ్మాస్టర్, పొందూరు-ప్రాథమికపాఠశాల (ఒంగోలు)
47. శ్రీ జాస్తి సీతారామదాసు, బి. ఇ. విద్యార్థి, అన్నామలై విశ్వవిద్యాలయం.
48. భాషాప్రవీణ, శ్రీమతి పసల సత్యవతీదేవి, నిడదవోలు

Editor, Printer, & Publisher C Pitchayya, Secretary,
Andhra Progressive Writers' Association, Governorpet, Bezwada.
Printed at Prajasakti Press. Q. H. No K. 3 A.

25-అక్టోబరు 1946న ఆంధ్ర తమిళనాడులయందు విడుదల!



నాగయ్య నటించు

త్యాగయ్య

డైరక్షన్ - నాగయ్య

SRI RENUKA FILMS MADRAS

తారాగణం: జయమ్మ, సరిత, లింగమూర్తి, హేమలత, రాయప్రోలు.
నారసాము, స్వాతి, రాఘవన్, ప్రయాగ.

సంగీత యోగంలో నాదబ్రహ్మాన్ని సాధించిన గాయకశిఖామణి దివ్యగాథ.

WRAPPER PAGE PRINTED AT THE B. N. K. PRESS, MADRAS